# సుపరిపాలన

## భవిష్యత్ భారతం - 3

(ఈనాడు వార్తాపత్రికలో ప్రచురితమైన వ్యాసాలు)

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా

# సుపరిపాలన

## భవిష్యత్ భారతం - 3

మొదటి ముద్రణ : డిసెంబర్, 2013
ప్రతులు : 1000

**వెల : రూ. 75/-**

*ప్రచురణ :* **Foundation for Democratic Reforms (FDR)**

*ముద్రణ :* Kalajyothi Process Pvt. Ltd., RTC "X" Road, Hyderabad

---

*ప్రతులకు*

**Foundation for Democratic Reforms (FDR)**

ఫ్లాట్ నెం. 801 & 806, శ్రీనివాస టవర్స్,
ఐటిసి కాకతీయ హోటల్ ప్రక్కన,
బేగంపేట్, హైదరాబాద్ - 500 016.
ఫ్యాక్స్ : 040 - 23419948, ఫోన్ : 23419949
E-mail : info@fdrindia.org, www.fdrindia.org

# విషయసూచిక


వ్యాసాలు — పేజీ నెం.

1. జాతీయ రథం దారితప్పిన వైనం (జూన్ 27, 2005) ....... 15
2. అధికారానికి అర్థం - పరమార్థం (జూన్ 13, 2005) ....... 20
3. మన రిపబ్లిక్ - వెలుగునీడలు (జనవరి 24, 2005) ....... 26
4. గాంధీ మార్గం ఇదేనా...? (అక్టోబర్ 18, 2004) ....... 32
5. విలువలకు నీళ్లు... 'జాతి నిర్మాతలు' వీళ్లు...! (జూలై 26, 2004) ....... 38
6. ప్రజాసేవకే.. ప్రభుత్వమైనా, ఉద్యోగులైనా! (ఆగస్టు 4, 2003) ....... 42
7. జాతి హితం పట్టని రాజకీయ చదరంగం (ఏప్రిల్ 5, 1999) ....... 47
8. పార్టీ రాజకీయాలకు అతీతమైతేనే పెద్దరికం (మార్చి 29, 1999) ....... 52
9. ప్రగతి సాధానికి ప్రజాస్వామ్యమే పునాది (జూన్ 06, 2005) ....... 57
10. అసమానతలే అసలైన అడ్డుగోడలు (జూలై 25, 2005) ....... 63
11. సమైక్యత సాధనతోనే దేశ భద్రతకు భరోసా (ఏప్రిల్ 14, 2003) ....... 68
12. చరిత్ర చెప్పిన పాఠాలు చెవినబెడితేనే ప్రగతి (నవంబరు 29,1999) ....... 72
13. సంస్కరణల సేద్యానికి ఇదో సదవకాశం (జూలై 12, 2004) ....... 77
14. నిర్దుష్ట వ్యవస్థ రూపొందిననాడే నిజమైన పర్వదినం (డిశంబర్ 27,1999) ....... 82
15. సమగ్ర సంస్కరణలే సంక్షోభానికి పరిష్కారం (ఆగస్టు 18, 1997) ....... 87
16. పాలకుల స్వార్థంకోసమా - ప్రజా శ్రేయం కోసమా (అధికారుల బదిలీలు) (మార్చి 22, 1999) ....... 94
17. ప్రధాని ప్రతిపాదన అసంబద్ధం (ఆగస్టు 30, 2004) ....... 100
18. రూపు మారితేనే 'మండలి'కి సార్థకత! (జూలై 19, 2004) ....... 104
19. సంస్థాగత సంస్కరణలే - ప్రగతికి సోపానాలు (ఆగస్టు 18, 2003) ....... 108
20. సుపరిపాలనకు పటిష్ఠ పౌర సమాజమే పునాది (జూలై 30, 2000) ....... 113

21. పటిష్ఠ చట్టంతోనే ప్రజలకు సమాచార హక్కు (సెప్టెంబర్ 3, 2000).................118

22. అవ్యవస్థలను చక్కదిద్దుకోలేమా? (నవంబర్ 21,2005)..................................123

23. ఖర్చులేని సంస్కరణల్తో మంచిపాలనకు శ్రీకారం (జనవరి 18, 1999)..............128

24. జేపీ స్మతి కరదీపికగా మరో స్వాతంత్ర్య పోరాటం (డిశంబర్ 28,1998)...........133

25. భ్రష్ట రాజకీయ చరిత్రలో సరికొత్త పుటలు (మార్చి 14, 2005).........................138

26. ఎమర్జెన్సీకి ముప్పయేళ్లు ...అవే నీడలు... అవే జాడలు (జూన్ 20,2005)...........143

27. రాష్ట్రాల పునర్విభజన కత్తిమీద సాము తొందరపాటు జాతికి అనర్థం (అక్టోబర్ 12, 1998)....148

28. విభజన' వాయిదా సముచితం, సమయోచితం (ఫిబ్రవరి 21, 2000)...............154

29. కొత్త రాష్ట్రాలు ప్రజల కోసమా, పదవుల కోసమా? (నవంబర్ 6, 2000).............159

30. పరిణతి చెందుతున్న ఫెడరల్ వ్యవస్థ (మే 19, 2003).......................................164

31. పరిమాణం కుదించినంత మాత్రాన పద్ధతులు మారవు (మే 12, 2003)...........168

32. అనర్హతకు ఇవీ గీటురాళ్లు (మార్చి 20, 2006)................................................172

33. అసంఘటిత కార్మికులను ఆదుకొనేదెలా? (ఏప్రిల్ 11, 1998)..........................176

34. నేతల చేతుల్లో రాజ్యాంగమూ రాజకీయ పాచికే! (సెప్టెంబర్ 25, 2000)...........182

35. లొసుగు లేని జనస్వామ్యం ఏదీ? ఎక్కడ? (నవంబర్ 13, 2000)........................187

36. కేంద్రం తాబేదార్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లు (ఏప్రిల్ 13, 1998)...................192

37. జాతి భవితవ్యాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు (మార్చి 1, 1999)...........................197

38. సుపరిపాలన కోసం రెండో స్వాతంత్ర్య పోరాటం (ఆగస్టు 11, 1997)..............202

# పీఠిక

'సుపరిపాలన పౌరహక్కు - సురాజ్యం మన జన్మహక్కు' నినాదంతో పార్టీలకతీతంగా జరిగిన సురాజ్య తొలిదశ ఉద్యమంలో భాగంగా 2012, డిసెంబర్ 5,6,7 తేదీలలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నేను నిరాహారదీక్ష చేశాను. నా డిమాండ్లను ఒప్పుకోకపోతే శారీరక త్యాగం చేస్తానని బెదిరించటం కోసమో లేక సంచలనం కోసమో నేను ఆ దీక్ష చేయలేదు. కేవలం సురాజ్య డిమాండ్లపై ప్రజలను చైతన్యపరిచేందుకు మాత్రమే నేను తొలిసారిగా చేసిన ఆ దీక్షను ఒక అవకాశంగా వినియోగించుకున్నాను.

సురాజ్య ఉద్యమ ప్రాథమిక డిమాండ్లు ఇవి: 1) రాష్ట్రంలో, దేశంలో అవినీతిని అంతం చేసేందుకు బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల చట్టవ్యవస్థల్ని ఏర్పాటుచేయాలి. కేంద్రంలో బలమైన లోక్‌పాల్‌ను, అదేరీతిలో రాష్ట్రంలో లోకాయుక్తను ఏరీతిలో ఏర్పాటుచేయాలో ఇప్పటికే లోక్‌సత్తా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు అందించింది 2) ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్లు, మంచినీటి కనెక్షన్లు తదితర ప్రభుత్వ సేవల కోసం ప్రజలు దేబిరించాల్సిన అవసరం లేకుండా ఒక పౌరహక్కుగా వాటిని నిర్ణీత గడువులో అందించేందుకు సిటిజన్ ఛార్టర్స్‌ను అమలు చేయాలి. చెప్పిన గడువులోగా పౌరులకు ఆ సేవలను అందించలేకపోతే రోజుకు రూ.250-300 పరిహారం చెల్లించాలి. ఆ తప్పుకు బాధ్యులైన అధికారులకు జరిమానా విధించాలి. ఈ చట్టాన్ని కూడా లోక్‌సత్తా తయారుచేసి రాష్ట్ర ముఖ్యమంత్రికి అందించింది. 3) అధికారాన్ని వికేంద్రీకరించి, రాష్ట్ర బడ్జెట్ నుంచి నేరుగా 10శాతం స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వాల ద్వారా ప్రజలకు కేటాయించాలి. వారు విద్య, ఆరోగ్యం, రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు వంటి సమస్యలను తమంతటతాము పరిష్కరించుకునే అవకాశం కల్పించాలి. 4) తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతికేలా అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేందుకు ఆ రంగాలను సమూలంగా ప్రక్షాళన చేయాలి. 5) ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల రెండు ఓట్లు కోసం కోట్లు ఖర్చు పెట్టి తిరిగి ఆ డబ్బుకు అనేక రెట్లు దండుకునేందుకు అధికారులతో కలిసి

రాజకీయ నేతలు భారీఅవినీతికి పాల్పడుతున్నారు. సామాన్య ప్రజలు రాజకీయాలలోకి రాలేకపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, నిజాయతీపరులు, సమర్థులు తిరిగి రాజకీయాలలోకి వచ్చేందుకు ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చి, ప్రతి ఓటుకు విలువ ఉండేలా, ఓట్ల శాతానికి తగ్గ సీట్లు లభించేలా భారతదేశానికి తగ్గ దామాషా ఎన్నికల వ్యవస్థను తీసుకురావాలి. (ఈ ఐదు ప్రధాన డిమాండ్లకు తోడు, ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక తీర్మానాన్ని (యు.ఎన్.సి.ఎ.సి) భారతదేశం ధృవీకరించింది కాబట్టి, మహిళా దినోత్సవం, అక్షరాస్యతా దినంలాగానే అవినీతి వ్యతిరేక దినాన్ని (డిసెంబర్ 9) కూడా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, రాష్ట్రంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వంలోనివారంతా ఈ అవినీతి వ్యతిరేక చైతన్యాన్ని పెంచే, ప్రచారం చేసే కార్యక్రమాలలో పాల్గనేలా చేయాలని, సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 4.1 (బి) ప్రకారం, ప్రజాసమాచారాన్ని పాలనావ్యవస్థ తప్పనిసరిగా, సానుకూల ధోరణితో వెల్లడించాలి అనే డిమాండ్లను కూడా సురాజ్య ఉద్యమం ప్రజలలోకి తీసుకెళ్లింది).

వాస్తవానికి స్వరాజ్యం రావటం అంటేనే సురాజ్యం రావటం అని అర్థం. వ్యవస్థ సురాజ్యమవుతుంది కాబట్టే స్వరాజ్యం కోసం అంతగట్టిగా స్వాతంత్ర్య పోరాటం చేయాల్సి వచ్చింది. కానీ స్వరాజ్యం వచ్చి ఇన్ని దశాబ్దాలు గడిచినా సురాజ్యం రాకపోగా, స్వరాజ్యం స్వాహారాజ్యంగా, సారారాజ్యంగా మారిపోయింది కాబట్టే, సురాజ్యం కోసం రెండో స్వాతంత్ర్య పోరాటాన్ని చేయాల్సి వస్తోంది. ఒక ఉద్యమాన్ని నిర్మించాల్సి వచ్చింది. సురాజ్య ఉద్యమ తొలిదశ డిమాండ్లుగా ఉన్న ఐదు అంశాలూ కూడా అవినీతిని నిర్మూలించి, ప్రజల సాధికారతను పెంచేలా జనం చేతికి అధికారాన్నిచ్చి, అన్నివర్గాలకూ ప్రాతినిధ్యం కల్పించే మార్పుల దిశగా చేపట్టాల్సిన సంస్కరణలకు సంబంధించినవి. విధానాలపరంగా పార్టీల మధ్య ఎన్ని విభేదాలైనా ఉండవచ్చు, కానీ దేశభవిష్యత్తుకు, ప్రజాస్వామ్య పరిపుష్టతకు సంబంధించిన అంశాలలో పార్టీలన్నీ ఒకేతాటి మీద ఉంటేనే ఆశించినరీతిలో జాతినిర్మాణం సాధ్యమవుతుంది. అందుకే అన్ని పార్టీలనూ ఈ సురాజ్య ఉద్యమంలో భాగస్వాముల్ని చేసి పై సంస్కరణలకు సంబంధించి స్థూల ఏకాభిప్రాయాన్ని సాధించాం. ఇందులో పౌరసమాజాన్ని, వివిధ కళాశాలల విద్యార్థుల్ని కూడా భాగస్వాముల్ని చేశాం. గతంలోనే ఈ సంస్కరణలపై ప్రజలలో అవగాహన ఉండి, ఓటు వేసే సమయంలో, ఇతరత్రా

సందర్భాలలో వాటి కోసం పార్టీలను డిమాండ్ చేసే పరిస్థితి ఉంటే ఈ దేశ భవిష్యత్తు చాలా భిన్నంగా ఉండేది. కానీ అలాంటి చైతన్యం ఇప్పటిదాకా రాకపోవటానికి బీజాలు మనకు స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలోనే పడ్డాయి.

ప్రపంచానికే స్ఫూర్తినిచ్చిన అమెరికన్ రాజ్యాంగం కంటే భారత రాజ్యాంగం ఎంతో విప్లవాత్మకమైనది. బేషరతుగా ప్రజలందరికీ ఓటు సహా అన్ని హక్కులనూ ప్రసాదించిన విశిష్ట రాజ్యాంగం మనది. కానీ దీనివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే సంస్థాగత ఏర్పాట్లు, దార్శనికత మాత్రం ఆనాటి జాతీయోద్యమ నేతలకు కొరవడింది. వారు కేవలం వ్యక్తిగత నిజాయతీ మీద ఆధారపడి జాతినిర్మాణం చేయగలమని నమ్మారు. కానీ నిజాయతీ అనేది రాజకీయాలలో కనీస అర్హత మాత్రమే అవుతుంది అని గుర్తించలేకపోయారు. అవిద్య, పేదరికం, వాటికితోడు సంక్లిష్ట వైవిధ్యం, భిన్నత్వం ఉన్న దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన అంశాలే ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తాయని వారు ఊహించలేకపోయారు. ఫలితంగానే ఈవేళ ఓట్ల కొనుగోలు, అవినీతి, వారసత్వ రాజకీయాలు రాజకీయ వ్యవస్థలో వేళ్లూనుకుపోయి భారతదేశాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టాయి. ఈ ప్రమాదకర పరిస్థితుల్ని చక్కదిద్దుకునేందుకు స్పష్టతతో వ్యవహరించటం అవసరం.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యవస్థల్ని పరిశీలించి మనం ఓ అద్భుత పత్రంగా తయారుచేసుకున్న రాజ్యాంగం భారతీయ పరిస్థితులకనుగుణంగా సమర్థవంతంగా పనిచేసేందుకు, రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ప్రతి భారతీయ బిడ్డకూ వివక్షలేకుండా ఎదిగే అవకాశం కల్పించేందుకు కొన్ని మౌలికసంస్కరణల్ని తెచ్చుకోవటం అవసరమని మొదట మనందరం స్పష్టంగా గుర్తించాలి. అవి ప్రధానంగా రాజకీయ, ఆర్థిక, పాలనా, ఎన్నికల వ్యవస్థలకు సంబంధించినవి. సంస్కరణలు చేపట్టటం, వాటిలో భాగంగా చట్టాల్ని రూపొందించుకోవటం/ సవరించుకోవటం నిరంతర ప్రక్రియే అయినప్పటికీ, అందుకోసం బలమైన ప్రజాస్వామ్య, రాజకీయ వ్యవస్థ ఉండాలంటే మాత్రం కొన్ని మౌలిక సంస్కరణల్ని మాత్రం మనం సమగ్ర ప్రక్షాళనలో భాగంగా తెచ్చుకోవాలి. ప్రజలలో మార్పు వస్తే చాలు కదా అసలు సంస్కరణలు, చట్టాలు వంటివి అవసరమా? అని కొందరు చిత్తశుద్ధిగల పెద్దలు కూడా ప్రశ్నించటం మనకు చాలా సందర్భాలలో కనిపిస్తుంది. ప్రత్యేకించి రాజ్యాంగం కూడా అక్కర్లేదనే వైరాగ్యం వారి మాటల్లో ధ్వనిస్తుంది. అంతిమంగా ప్రజలే ప్రభువులు, ప్రజలు తల్చుకుంటేనే

మార్పు సాధ్యం అనటంలో సందేహం లేదు. కానీ ప్రజలు ఒక లక్ష్యం దిశగా, మార్పు దిశగా స్పందించటానికి, కార్యాచరణతో కదలటానికి కొన్ని చట్రాలు, నిర్మాణాలు కావాలి. అవి లేకుండా ప్రజల్ని రోజూ ఉద్యమాలు చేయండి, రోడ్లెక్కండి అని చెబితే, అజ్ఞానంతోనో, ప్రమాదకరధోరణితోనే ప్రజల్ని బానిసలుగా మార్చేసే నియంతృత్వ, రాచరిక వ్యవస్థలను మనం ప్రోత్సహిస్తున్నట్టే అవుతుంది.

సంస్కరణలతో వచ్చేవి అరకొర మార్పులే, వ్యవస్థ మారాలంటే ఉన్న వ్యవస్థలన్నిటినీ కూల్చిపారేయాలి, అడ్డువచ్చిన వారిని ఏరిపారేయాలి అనే వాదనలు కూడా మనకు వినిపిస్తుంటాయి. సామూహిక అత్యాచారం వంటి ఏదైనా ఒక సంచలన ఘటన జరిగినప్పుడు సాధారణ ప్రజల నుంచి కూడా ఇలాంటి ప్రతిస్పందనలే వెలువడుతుంటాయి. రాజకీయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఓటు వేయటానికి కూడా దూరంగా ఉండే మధ్యతరగతివారైతే రోజుకోసారైనా ఒక మంచి నియంత వచ్చి మనల్ని పాలిస్తే బాగుండును, వ్యవస్థల్ని రాత్రికి రాత్రి సమూలంగా మార్చేస్తే బాగుండును అనుకుంటుంటారు. కానీ ఆ స్పందనలు, భావాలన్నీ నిరాశానిస్పృహల నుంచి వచ్చేవే తప్ప వాస్తవం కావు. సృజనాత్మక విధ్వంసం చేసే స్థాయి గొప్పవిప్లవం తర్వాత సైతం ఉన్న వ్యవస్థలకు కొనసాగింపుగానే, ఉన్న మనుషులతోనే కొత్త వ్యవస్థల నిర్మాణం జరుగుతుంది తప్ప గాలిలో నుంచి అవి ఊడిపడవు, కొత్తగా మనుషులు ఎక్కడ్నుంచో దిగిరారు. అందుచేత, ఏదోకరోజు దానంతటది అద్భుతం జరుగుతుందని ఆశించకుండా, మనకున్న ఓటుహక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, రాజ్యాంగం కల్పించిన ఇతర మార్గాలను తగిన సంస్కరణల దిశగా వినియోగించుకుని ఉన్నవ్యవస్థల్ని మార్చాలి.

ఈవేళ మనం కలలుగంటున్న సమున్నత భారతదేశ నిర్మాణానికి కావలసిన మౌలిక సంస్కరణల్లో కొన్నిటిని ప్రాథమికంగా సురాజ్య ఉద్యమం తన లక్ష్యాలలో పేర్కొంది. అలాంటి మౌలిక సంస్కరణలన్నీ చోటుచేసుకుంటే, సురాజ్యానికి బలమైన పునాది ఏర్పడుతుంది. అప్పుడు ప్రజలు నిరంతర చైతన్యంతో, జాగరూకతతో ఆ సురాజ్యాన్ని పరిరక్షించుకునేందుకు, పెంపొందించుకునేందుకు అవసరమైన కాలానుగుణమైన సంస్కరణల్ని నిరంతర ప్రక్రియగా తెచ్చుకునే అవకాశం ఏర్పడుతుంది.

చరిత్రను, ప్రపంచదేశాల అనుభవాలను, భారతదేశ వాస్తవాలను, స్థానిక

అవసరాలను సమన్వయం చేస్తూ మనదేశంలో ఏయే మౌలిక సంస్కరణలను చేపట్టాలో పరిశీలించేముందు మనకున్న వ్యవస్థీకృత సమస్యల్ని కాస్త లోతుగా అవగాహన చేసుకోవటం అవసరం.

మనకు ప్రతినిధులుగా వ్యవహరిస్తూ, మన పన్నుల డబ్బుతో మనకు రక్షణ కల్పిస్తూ, మన స్వల్పకాలిక, దీర్ఘకాలిక అవసరాల్ని తీర్చేలా పాలనను నిర్వహించాలంటూ తాత్కాలికంగా మనం అధికారాన్ని అప్పచెప్పే రాజకీయ పార్టీల నిర్మాణం గురించి మనకు తెలియదు. పార్టీల్ని మనం పట్టించుకోకుండా కొన్ని కుటుంబాలకు అప్పచెప్పేశాం. అలాగే ఓటుకు–పన్నుల డబ్బుకు ఉన్న సంబంధాన్ని లెక్కేసుకోకుండా అసలు ఓటు వేయకపోవటమో, ఓటును తప్పుడు అభ్యర్థులకు/ పార్టీలకు వేయటమో చేస్తుంటాం. పార్టీలు, రౌడీమూకలు ఆందోళనల పేరుతో బంద్‌లకు, రాస్తారోకోలకు, హింసాత్మక దాడులకు పాల్పడుతూ పౌరహక్కుల్ని హరిస్తుంటే మన హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో తెలియక భయంతో ముడుచుకుపోయి బతుకుతుంటాం. వాక్స్వాతంత్ర్యం పేరుతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ సమస్యల్ని వక్రీకరిస్తుంటే, బహిరంగ చర్చ ప్రమాణాల్ని ఎలా పెంచాలో ఆలోచించం. దేశ రక్షణ పేరుతో సైన్యానికి లక్షల కోట్లు ఖర్చుచేస్తూ లెక్కాపత్రం లేకుండా ఖర్చు చేస్తుంటే సైనికవ్యయం, ఇతరత్రా రక్షణ శాఖ సాధారణ వ్యవహారాల గురించి ఎలా తెలుసుకోవాలో అర్థం కాదు. మన సమస్యల్ని చర్చించాల్సిన చట్టసభలు రోజూ స్తంభిస్తూ వాయిదాల మీద వాయిదాలు పడుతుంటే, సభ్యులు చిన్నపిల్లల్లా అరుచుకుంటూ కొట్టుకుంటుంటే, కోట్లు ఖర్చు పెట్టి కొందరు వ్యాపారవేత్తలు రాజ్యసభలోకి ఎన్నికవుతుంటే, డబ్బులిచ్చినవారి ప్రశ్నల్ని మాత్రమే చట్టసభలలో అడుగుతుంటే ఆ పరిస్థితిని ఎలా మార్చాలో తెలియక ఆవేదన చెందుతుంటాం. ఎన్నికలలో ఓట్ల కొనుగోలుకు కోట్లు ఖర్చుపెడుతూ, కండబలాన్ని ప్రదర్శిస్తూ గెలిచి భారీ అవినీతికి పాల్పడుతున్నవారితో పోటీపడలేక సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాలకు దూరంగా వెళ్తుంటే, మనం రాజకీయాల్ని బాగుచేసే ఎన్నికలు, ఇతర సంస్కరణల గురించి ఆలోచించకుండా రాజకీయాల్ని ద్వేషిస్తూ ఇంకాఇంకా సమస్యలో కూరుకుపోతుంటాం. నిష్పాక్షికంగా, ప్రజాప్రయోజనాల్ని పరిరక్షించాల్సిన మీడియా కొన్ని పార్టీలలకు బాకాలుగా మారిపోయి ఎన్నికలలో చెల్లింపు వార్తల్ని ప్రచురిస్తూ, ప్రసారం చేస్తుంటే దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయాం. మా కులానికి, మతానికి,

ప్రాంతానికి, భాషకు ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌తో ప్రజాస్వామ్యాన్ని, నీడనిచ్చిన రాజ్యాంగాన్ని కాలరాసే రీతిలో వ్యవహరిస్తుంటే, ఆ అసంతృప్తిని ఆసరాగా చేసుకుని రాజకీయ పార్టీలు వారి మధ్య చిచ్చుపెట్టి ఓట్లు కొల్లగొడుతుంటే ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో, ఎవరి ద్వారా పరిష్కరించాలో తెలియక సతమతమవుతుంటాం. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరిగేదాకా కాకుండా మధ్యలో రాజకీయ నేతల్ని, ప్రజాప్రతినిధుల్ని ఎలా కట్టడి చేయాలో అర్థంకాక నలిగిపోతుంటాం. మనకు రోజువారీ జీవితంలో అవసరమైన 70శాతం సమస్యల్ని పరిష్కరించే స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇవ్వాలని ఎప్పుడో 1990లలోనే 73,74 రాజ్యాంగ సవరణలు వచ్చినా ఇప్పటిదాకా అవి ఎందుకు అమలు కాలేదు? ఏం చేయాలి? అని గందరగోళపడుతుంటాం. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల పెత్తనం లేకుండా కేవలం ప్రజల ఆస్తులుగా ఉండాల్సిన సహకార సంఘాలను తమ సొంత అడ్డాలుగా మార్చుకుని రాజకీయ పార్టీలు కబ్జా చేస్తున్నా అడ్డుకోలేకపోతున్నాం. ఇతర దేశాలలో తమ ఉత్పత్తులకు లాభాలు వచ్చే అవకాశం ఉన్నా అమ్ముకోనీయకుండా రైతులపై ఆంక్షలు విధిస్తూ వ్యవసాయాన్ని, గ్రామీణ ప్రాంతాలను సంక్షోభంలో ముంచుతున్న ప్రభుత్వాల్ని ఎలా ఒత్తిడిచేయాలో, వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి ఎలాంటి మార్పుల్ని తీసుకురావాలో మనకు ఇంకా తెలియదు. మనం ఎంతో విలువైనవిగా భావించే విద్య, ఆరోగ్యంలో మనకు ఎందుకు నాణ్యమైన సేవలు అందటం లేదు, మన ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఎందుకు మంచి ఉద్యోగాలు రావటం లేదు? అని తెలుసుకుని పరిష్కరించుకోలేకపోతున్నాం. వేలకోట్ల అవినీతికి పాల్పడినట్టు పలువురు రాజకీయ నేతల మీద నిర్దిష్టమైన ఆరోపణలు వస్తున్నా, వారే ఎన్నికలలో గెలుస్తున్నా, ఆ దుష్టరాజకీయంలో భాగంకాకుండా మంచి రాజకీయాన్ని ఎలా సాధించుకోవాలో అని స్పష్టంగా ఆలోచించి, ఆ పరిష్కారంలో భాగం కాలేకపోతున్నాం. పాలనలో ఉదాసీనత, ఉన్నతాధికారుల అవినీతి, కులవివక్ష, అసంఘటిత కార్మికుల సమస్య, పర్యావరణ కాలుష్యం, మత్తుపదార్థాల అక్రమ వినియోగం, రాష్ట్రాల పునర్విభజన, గవర్నర్ల భ్రష్టత్వం, శాంతిభద్రతలు, చట్టబద్ధపాలన, సత్వర న్యాయం, చట్టసభలలో సభ్యుల ప్రవర్తన, జిల్లాలలో ఎమ్మెల్యేల పెత్తనం ఇలా అనేక సమస్యలు మనల్ని పట్టిపీడిస్తున్నాయి. పైన పేర్కొన్న అనేకానేక సమస్యల్ని పరిష్కరించటానికి ఒక్క సింగిల్ ఫార్ములా ఉందా అని అడగటం నిరాశావాదుల, పిరికిపందల లక్షణం. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించటానికి ఏంచేయాలి అని

అడగటం పౌరసత్వం, నాయకత్వం ఉన్నవారి లక్షణం. బహుముఖ మౌలిక సంస్కరణలతో ఈ సమస్యలన్నిటినీ ఒక కొలిక్కి తేవచ్చు, పరిష్కరించవచ్చు అని మాత్రం నిస్సందేహంగా చెప్పొచ్చు.

ఇలాంటి అనేక కీలక సంస్కరణల దిశగా లోక్‌సత్తా సుదీర్ఘకాలంగా కృషి చేస్తోంది. అందులో భాగంగానే పాలనాసమాచార హక్కు చట్టం, రాజకీయ పార్టీల నిధుల సేకరణ చట్టం, ఎన్నికలలో పోటీ చేసే నేరచరితుల వివరాలు బైటపెట్టే చట్టం, గ్రామన్యాయాలయాల చట్టం, మంత్రివర్గ సంఖ్య కుదింపు, సహకారసంఘాలకు స్వయంప్రతిపత్తికి రాజ్యాంగసవరణ వంటి పలు కీలక విజయాల్ని సాధించింది. అవినీతి నిరోధానికి జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటు కోసం, ప్రభుత్వ సేవల్ని పౌరులకు విధిగా అందించేలా పౌరసేవల హక్కు చట్టం, న్యాయవ్యవస్థ ప్రక్షాళనకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్, అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు, పోలీసు సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, దామాషా ఎన్నికల వ్యవస్థ, విద్య, ఆరోగ్యరంగాల ప్రక్షాళన వంటి వాటికోసం ఇప్పుడు గట్టిగా కృషి చేస్తోంది. ఇవన్నీ దాదాపు సాకారమయ్యే దిశగా సాగుతున్నాయి.

అలాగే దుష్పరిణామాలు, కొత్త సమస్యలు తలెత్తేలా సంస్కరణల్ని అరకొరగా, అపరిపక్వంగా చేపట్టటం, చిన్నచిన్న చర్యల్ని చేపట్టి గొప్ప సంస్కరణలుగా చాటుకోవటం వంటి వాటిని సైతం లోక్‌సత్తా గట్టిగా వ్యతిరేకించింది. ఇటీవల తీవ్ర వివాదాస్పదమైన రిటైల్‌రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) అంశాన్నే తీసుకుంటే, ఎఫ్‌డీఐలను అనుమతించే విధాననిర్ణయాన్ని లోక్‌సత్తా నిర్ద్వంద్వంగా సమర్థించింది. రైతుల మార్కెట్ అవసరాలలో కీలకమైన గోదాముల నిర్మాణం సహా వివిధ మౌలికవసతుల నిర్మాణానికి వ్యవసాయరంగంలోకి ప్రత్యక్ష పెట్టుబడులు అవసరమని, స్వదేశంలో ఈ పెట్టుబడులు లభించనప్పుడు విదేశాల నుంచి వచ్చినా స్వాగతించాల్సిందేనని లోక్‌సత్తా స్పష్టంచేసింది. రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐల వల్ల స్వదేశీ రైతులతోపాటు వినియోగదారులకు కూడా మేలు జరుగుతుందని సాధికారికంగా వివరించింది. దేశవ్యాప్తంగా అనేక రాజకీయపార్టీలు, చివరికి మీడియా వ్యతిరేకించినా లోక్‌సత్తా దేశ ప్రయోజనాల కోసం ఎఫ్‌డీఐల విషయంలో రాజీలేకుండా నిలబడింది. అదేసమయంలో, ఎఫ్‌డీఐలే మౌలిక సంస్కరణ అన్నట్టు యూపీయే ప్రభుత్వం ప్రచారం చేసుకోవటాన్ని గర్హించింది. ఇదో చిన్న చర్య మాత్రమేనని,

దేశంలో ప్రతి బిడ్డా ఎదిగేందుకు వీలుగా, ప్రతి వ్యక్తీ అభివృద్ధి చెందేందుకు వీలుగా విద్య, ఆరోగ్యం, అధికార వికేంద్రీకరణ వంటి అంశాలలో విప్లవాత్మక చర్యల్ని చేపట్టటం, పారిశ్రామికరంగంలోలాగా వ్యవసాయరంగంలో కూడా స్వేచ్ఛావాణిజ్యాన్ని ప్రవేశపెట్టటం, గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఏర్పాట్లు చేయటం వంటివాటిని మాత్రమే మౌలిక సంస్కరణలు అంటారని స్పష్టంచేసింది.

సంస్కరణలు చేపట్టేందుకు ముందు మనకో పెద్ద కలలాంటి విజన్ (దార్శనికత) ఉండాలి. ఆ విజన్‌ను సాకారం చేసుకోవటం కోసం చిన్నచిన్న కలలు కనటం, ఆ కలల్ని సాధించుకోవాలన్న పట్టుదలను, వాటిని నెరవేర్చుకోవటం కోసం ఏంచేయాలో తెలుసుకోవాలన్న జిజ్ఞాసను కలిగివుండటం, పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఒక క్రమపద్ధతిలో ఆ లక్ష్యసాధనకు పనిచేయటం అలవాటు చేసుకోవాలి. అలాకాకుండా కొందరు వ్యక్తులను గెలిపించటమో, ఓడించటమో చేస్తే వ్యవస్థ మారిపోతుందనుకుంటే తరాలు మారుతుంటాయిగానీ మన జీవితాలు మారవు. మనం ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంటాం తప్ప ఎప్పటికీ అభివృద్ధిచెందిన దేశం కాలేము. 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పోరాడినప్పుడు ప్రజలంతా గొప్ప మార్పును ఆశించారు. 1977లో జనతాపార్టీ అధికారంలోకి రావటంతో ఇంకేముంది వ్యవస్థ మారిపోయిందని సంబరాలు చేసుకున్నారు. కానీ ఎమర్జెన్సీ సమస్యంతా కేవలం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చుట్టూనే తిరగటం, ఇందిరను వ్యతిరేకించటమే, ఆమెను గద్దెదించటమే, అవినీతిని అంతం చేయటమే వ్యవస్థలో మార్పు అన్నట్టు ప్రచారం జరగటంతో పరిమితఫలితాలు మాత్రమే వచ్చాయి. జనతా పార్టీ ప్రభంజనం నీరుగారిపోయింది. వ్యక్తి చుట్టూ, పరిమితమైన అంశాల చుట్టూ కాకుండా వ్యవస్థలో మార్పు దిశగా ఆనాడు జె.పి ఉద్యమంగనక సాగివుంటే, ఈవేళ మనదేశం దశ, దిశ మరోలా ఉండేవి. మనం మరింత మెరుగైన అంశాల కోసం సృజనాత్మక ఒత్తిడి వంటి మార్గాలలో మరింత నాగరికంగా కార్యక్రమాల్ని, పోరాటాల్ని చేపడుతూ ఉండేవాళ్లం.

ఏ సంస్కరణకైనా గీటురాయి ఒకటే కావాలి– ప్రజలకు సాధికారతనివ్వటం! ఈ దిశగా మెరుగైన ఫలితాలను సాధించటానికి వీలుగా, తగిన సంస్కరణలు చేపట్టాక వాటి అమలులో ప్రజల భాగస్వామ్యం పెంపొందించేందుకు వీలుగా పాలనను తీర్చిదిద్దాలి. ప్రజలు ఒక క్రమపద్ధతి ప్రకారం సమష్టిగా పనిచేయగలిగేలా, మంచిని

ప్రోత్సహించి చెడును నిరుత్సాహ పరిచేలా వ్యవస్థను నిర్మిస్తే ఈదేశంలో అద్భుతాలు జరుగుతాయి. ఇందుకు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఎప్పుడో 1980లలో సాగునీటి రంగంలో నేను సాధించిన విజయమే తిరుగులేని నిదర్శనం. కేవలం రూ. 42 కోట్లతో 2 లక్షల ఎకరాలకు ఆరోజున నేను చిన్న ఎత్తిపోతల పథకాలతో సాగునీటిని అందించగలిగాను. దానివల్ల దాదాపు 1లక్ష కుటుంబాలు పేదరికం నుంచి శాశ్వతంగా బైటపడ్డాయి. ఇందులో నేను ప్రత్యేకించి వ్యక్తిగతం చేసిందేమీ లేదు. కావలసిన ఏర్పాట్లు చేసి ఎటువంటి అవరోధాలు లేకుండా రక్షణ కల్పించి రైతుల్ని ప్రోత్సహించాను. తెల్లారుజామున మూడుగంటలకు నిద్రలేచి చద్దన్నం మూటగట్టుకుని లాంతర్లు పట్టుకుని రైతులు శ్రమించి అద్భుతాలు సృష్టించారు. దాదాపు 150 ఏళ్ల క్రితం నాటి సర్ ఆర్థర్ కాటన్ కృషి తర్వాత అంత తక్కువ ఖర్చుతో సాగునీరు అందించిన దాఖలా మనదేశ చరిత్రలో ఇప్పటి వరకూ లేదు. లోక్‌సత్తా తరుపున శాసనసభ్యునిగా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా మంచినీటి సరఫరా నుంచి పాఠశాల, ఆరోగ్యకేంద్రాల పటిష్టీకరణ వరకూ ఇలాగే ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాల్ని నిర్వహిస్తూ మంచి ఫలితాల్ని సాధిస్తున్నాం. అయితే ఈ గొప్ప ఫలితాలన్నీ కూడా సాధించాల్సినదాంట్లో కేవలం 20-30శాతం మాత్రమే. రాజకీయ, పాలనావ్యవస్థల్ని తగిన సంస్కరణలతో సమూలంగా మార్చుకోగలిగితే చిత్తశుద్ధి, సామర్థ్యం కలిగినవారు ఇదే ప్రజల భాగస్వామ్యంతో 80-90శాతం ఫలితాల్ని సాధించగలుగుతారు.

గత తరంకంటే ఈతరం ఎప్పుడూ తెలివితేటల్లో మిన్నగానే ఉంటుంది. పాతతరం భుజాల మీద నిలబడి ఉంటుంది కాబట్టి. కానీ తగిన అవగాహన, ముందుచూపు కలిగిన నాయకత్వ లక్షణాలు లేకపోతే మాత్రం పాతతరం కంటే కూడా వెనకబడిపోతుంది. ఈవేళ మనకు జనాభాలో మూడొంతుల యువశక్తి ఉంది. వారంతా ఏం చేయాలి, ఎలా వ్యవహరించాలి అని తెలుసుకుని ఒక క్రమపద్ధతిలో కార్యాచరణను చేపడితేనే మార్పు సాధ్యమవుతుంది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల రోజున గాంధీ, అంబేద్కర్‌లకు పూలదండలతో నివాళులర్పించటానికి పరిమితంకాకుండా, భిన్నధృవాలైన వారిద్దరినీ కలిపి ఈవేళ రెండో స్వాతంత్ర్యపోరాటంలో భాగంగా కులవివక్షలేని గ్రామస్వరాజ్యాన్ని ఎలా సాధించాలో అవగతం చేసుకోవాలి. హింసాత్మక ఆందోళనలకు, అల్లర్లకు, అరకొర విద్యాబోధనలకు

కేంద్రాలుగా మారుతున్న విశ్వవిద్యాలయాలను దేశరాజకీయాలకు దిక్సూచిగా వ్యవహరించే అంతర్జాతీయ స్థాయి కేంద్రాలుగా ఎలా తీర్చిదిద్దాలో తెలుసుకోవాలి. సమర్థత, నిబద్ధత కలవారు ఎక్కడికక్కడ రాజకీయాలలో పెద్దసంఖ్యలో చురుగ్గా పాల్గనేందుకు ఎలాంటి ఎన్నికల, రాజకీయ సంస్కరణలు తేవాలో ఆకళింపు చేసుకోవాలి. ఒక నిరంతర ప్రక్రియగా మన అంతరంగాలలో, ఈ దేశంలో రావలసిన సంస్థాగత సంస్కరణలను అర్థం చేసుకుని ప్రజలు, ముఖ్యంగా యువత సానుకూల దృక్పథంతో నిర్మాణాత్మకంగా, సృజనాత్మకంగా, నాయకత్వ లక్షణాలతో హుందాగా ముందుకు సాగితే ఖచ్చితంగా భారతదేశం ప్రపంచానికి మకుటాయమానంగా నిలుస్తుంది. విశ్వమానవులకు నిలయంగా విలసిల్లుతుంది.

ఈ భవిష్యత్ భారతం పుస్తకంలో ఉన్నవన్నీ పదునైన భావాలు. వాటికి మీరు చైతన్యంతో స్పందిస్తే, మనదేశంలో గొప్ప మార్పులు వెల్లువెత్తకుండా, మోహరించిన సైన్యాలు కూడా ఆపలేవు.

**డా॥ జయప్రకాష్ నారాయణ్,**

జాతీయ అధ్యక్షులు, లోక్‌సత్తా పార్టీ

2013 – డిసెంబర్

* * *

# జాతీయ రథం దారితప్పిన వైనం...

## ఈదేశ చరిత్ర మనకు చెబుతున్నదేమిటి?

జూన్ 27, 2005

చారిత్రక విశ్లేషణ అనేది ఎప్పుడూ సమస్యాత్మకంగా ఉంటుంది. సంక్షుభిత సంఘటనల్లో ఎందరో నేతలు కీలకపాత్ర పోషించారు. అటువంటి సంఘటనల్లో వారి ప్రమేయంపై నిష్పక్షపాతంగా తీర్పు చెప్పడం అంత తేలికైన పనికాదు. సంఘటన జరిగిన కొన్ని దశాబ్దాల తరవాత దానిని విశ్లేషించడం మరింత కష్టసాధ్యమైన పని. కొన్ని సందర్భాలలో అది ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది. అయినప్పటికీ చరిత్రను అధ్యయనం చేసి, గతించిన సంఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. జాతినేతలు అప్పట్లో సాధించిన విజయాలు, వారి వైఫల్యాలు, వారు తీసుకున్న అద్భుతమైన నిర్ణయాలు, వారు చేసిన ఘోర తప్పిదాలు- అన్నీ మనకు పాఠాలు నేర్పేవే.

పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నాపై ఎల్.కె అద్వానీ చేసిన వ్యాఖ్యలు దేశ విభజనపైన, జాతీయోద్యమంపైన తీవ్రస్థాయిలో చర్చను రేకెత్తించాయి. రాజనీతిజ్ఞులు సాధించిన విజయాలకు కాలగతిలో మరిన్ని హంగులు తోడవడం సహజమే అయినా మానవ తప్పిదాలపై చరిత్ర తీర్పు మాత్రం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది. అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆధునిక భావాలను ఒంటబట్టించుకోనందుకు ప్రత్యర్థులు ఆయనను విమర్శించేవారు. సమకాలికులు ఎద్దేవా చేసేవారు. అంతర్యుద్ధం మొదలైన మొదటి మూడేళ్లలోనూ- సరైన నిర్ణయాలు తీసుకోలేని అసమర్థుడైన అధ్యక్షుడిగా లింకన్ ఎన్నో విమర్శలకు లోనయ్యారు. కానీ, ఇప్పుడోసారి వెనక్కు తిరిగి చూస్తే ఆయన సాధించిన విజయాల ముందు ఈ లోపాలేవీ కనబడవు. విజయాలే కాదు, నాయకుల హ్రస్వదృష్టితో చేసే ఘోర తప్పిదాలు కూడా కాలం గడచిన కొద్దీ మరింత స్పష్టంగా గోచరిస్తాయి.

### నిష్పాక్షిక విశ్లేషణ ముఖ్యం

చారిత్రక విశ్లేషణ అనేది ఎప్పుడూ సమస్యాత్మకంగానే ఉంటుంది. సంక్షుభిత సంఘటనల్లో ఎందరో నేతలు కీలకపాత్ర పోషించారు. అటువంటి సంఘటనల్లో

వారి ప్రమేయంపై నిష్పక్షపాతంగా తీర్పు చెప్పటం అంత తేలికైన పనికాదు. సంఘటన జరిగిన కొన్ని దశాబ్దాల తరవాత దానిని విశ్లేషించడం మరింత కష్టసాధ్యమైన పని. కొన్ని సందర్భాలలో అది ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది. అయినప్పటికీ చరిత్రను అధ్యయనం చేసి, గతించిన సంఘటనలనుంచి పాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉంది. జాతినేతలు అప్పట్లో సాధించిన విజయాలు, వారి వైఫల్యాలు, వారు తీసుకున్న అద్భుతమైన నిర్ణయాలు, వారు చేసిన ఘోర తప్పిదాలు– అన్నీ మనకు పాఠాలు నేర్పేవే. వాటిని పక్షపాతరహితంగా విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో అటువంటి తప్పిదాలు, వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడే వీలు ఉంటుంది. దేశ విభజన, దానికి కారణమైన సంఘటనల ఇటువంటివే. అఖండ భారతం విభజనకు దారితీసిన ఆనాటి పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కారణాలేవైతేనేం, జిన్నా, ఇతర ముస్లింలీగ్ నాయకులు దేశ విభజనను కోరుకున్నారు. అనుకున్నది సాధించుకున్నారు. వాళ్లను తప్పు పట్టినంత మాత్రాన చరిత్రను తిరగరాయలేమన్న సంగతి సుస్పష్టం. మహాత్మాగాంధీ, వల్లభాయ్‌పటేల్, జవహర్‌లాల్‌నెహ్రూ, మౌలానా ఆజాద్ వంటి మహామహులనదగిన నేతలు అప్పట్లో ఎంతగా ప్రయత్నించినా దేశ విభజనను అడ్డుకోలేకపోయారు. అలా ఎందుకు జరిగింది? వారి నిర్లక్ష్య వైఖరి కారణంగానే తప్పిదాలు జరిగాయా? వారు తీసుకున్న చర్యలు దేశవిభజన మరింత సులువుగా జరిగేందుకే దోహదం చేశాయా? – ఈ రకమైన ప్రశ్నలకు సమాధానాలు వెతికే పక్రియలో అప్పటి మన నాయకుల ప్రవర్తన, దానివెనుక వారికి గల ఉద్దేశాల గురించి విశ్లేషించడంవల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండబోదు. అప్పటి పరిస్థితులను బట్టి సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు కూడా దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలను కలగజేసే అవకాశం ఉంది. అందువల్ల మన విశ్లేషణ అప్పటి మన నాయకులు తీసుకున్న చర్యలు, వాటి పర్యవసానాలకు మాత్రమే పరిమితం కావాలి. అప్పుడే గతం నుంచి పాఠాలను నేర్చుకోగలుగుతాం. వాటి ఆధారంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలుగుతాం.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ఒకమారు సింహావలోకనం చేసుకుంటే మన జాతీయవాద నాయకులు చేసిన ఐదు తప్పిదాలు దేశ విభజనకు మార్గాన్ని సుగమం చేశాయని తెలుస్తుంది. వాటిలో మొదటిది తొలి ప్రపంచయుద్ధం చివర్లో చోటుచేసుకుంది. ఈ యుద్ధం కారణంగా టర్కీలో నాటకీయమైన పరిణామాలు

సంభవించాయి. టర్కీలో అప్పటివరకూ అత్యున్నత స్థానమైన ఖలీఫా పదవి రద్దయింది. కమల్ అటా టర్క్ అధికారంలోకి వచ్చాడు. అతను సిసలైన లౌకికవాది. ఆధునిక భావాలు గలవాడు. ఈ పరిణామాలు టర్కీ దేశస్థులపై అంతగా ప్రభావం చూపలేదు. ఖలీఫా పదవి పునరుద్ధరణకోసం వారు ఆందోళనలు కూడా చేపట్టలేదు. కానీ, దూరంగా ఉన్న ఇండియాలో మాత్రం టర్కీ పరిణామాలపట్ల ప్రకంపనలు మొదలయ్యాయి. ఆ దేశంలో రద్దయిన ఖలీఫా పదవిని పునరుద్ధరించాలంటూ మన జాతీయోద్యమ నాయకులు ఇక్కడ ఖిలాఫత్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఉధృతంగా సాగుతున్న స్వాతంత్ర్యోద్యమం ఒక్కసారిగా మతం రంగును పులుముకున్నట్లయింది. ఆ తరవాత రాజకీయాలు కూడా క్రమంగా మతం ఉచ్చులో చిక్కుకున్నాయి. తదనంతర కాలంలో మతతత్వ రాజకీయాలే దేశ విభజనకు బీజం వేశాయి.

విభజనకు దారితీసిన మరో తప్పిదం 1937లో జరిగింది. ఆ ఏడాది రాష్ట్రాల చట్టసభలకు ఎన్నికలు జరిగాయి. ఊహించినట్టుగానే దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. అయితే ఐక్య రాష్ట్రాల (యునైటెడ్ ప్రావిన్సెస్) విషయం వచ్చేసరికి ముస్లిం లీగ్‌కు, కాంగ్రెస్‌కు మధ్య వివాదం తలెత్తింది. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నది కాంగ్రెస్సే అయినా, అధికారంలో ముస్లింలీగ్ కూడా వాటా కోరింది. రెండు కేబినెట్ పదవులు ఇవ్వాలని ముస్లింలీగ్ పట్టుబట్టింది. ఒక్క పదవే ఇస్తానని కాంగ్రెస్ భీష్మించింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. మెజారిటీ తమకే లభించింది కాబట్టి ముస్లింలీగ్ డిమాండును ఆమోదించవలసిన అవసరం లేదన్న కాంగ్రెస్ వాదన హేతుబద్ధమే కావచ్చు కానీ రాజకీయంగా సరైనదికాదు. సమాజంలో ఒక పెద్ద వర్గంగా ఉన్న ముస్లింల మనోభావాలను కాంగ్రెస్ సరిగ్గా అర్థం చేసుకోలేకపోయింది. ఐక్య రాష్ట్రాలపై చర్చల వైఫల్యమే జిన్నా వైఖరిలో మార్పునకు కారణమైందని చరిత్రకారులు చెబుతారు. అప్పటివరకూ జాతీయవాద నాయకుల్లో ముందు వరుసలో ఉన్న జిన్నా, ఈ సంఘటన అనంతరం కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగాను, అటుపిమ్మట వేర్పాటువాదిగానూ మారారు.

హిట్లర్ నాయకత్వంలో జర్మనీ సేనలు 1939లో పోలాండ్‌ను ఆక్రమించడంతో రెండో ప్రపంచ యుద్ధానికి తెరలేచింది. జర్మనీ యుద్ధకాంక్ష కారణంగా ప్రపంచశాంతి

ప్రమాదంలో పడిన రోజులవి. అప్పటికి అమెరికా ఇంకా యుద్ధరంగంలోకి అడుగు పెట్టలేదు. బ్రిటన్‌కు తనను తాను రక్షించుకోవడమే తలకు మించిన భారంగా పరిణమించింది. మన జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వంతో తలపడేందుకు సరిగ్గా అదే సమయాన్ని ఎంచుకొన్నారు. భారత నాయకులను సంప్రదించకుండా బ్రిటిష్ వైస్‌రాయ్ ఏకపక్షంగా జర్మనీపై యుద్ధానికి పిలుపు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆందోళన లేవదీశారు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారాన్ని త్యజించాయి. నిజానికి ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో చక్కగా పనిచేస్తున్నాయి. పాలనపరంగా అనుభవాన్ని గడిస్తున్నాయి. అటువంటి కీలకమైన సమయంలో పాలనపరంగా తనదైన ముద్రవేయగలిగే అవకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. ఈ అవకాశాన్ని జిన్నా ప్రభృతులు తమకు అనుకూలంగా మలచుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రాజీనామాలు చేసిన రోజును 'విమోచన దినం'గా గుర్తిస్తూ ముస్లింలీగ్ పండుగ జరుపుకుంది.

1942లో నాలుగవ తప్పిదం జరిగింది. గాంధీజీ ఇచ్చిన 'విజయమో, వీరస్వర్గమో' (డూ ఆర్ డై) పిలుపు దేశ భక్తులలో చైతన్యం రగిల్చింది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వేలాదిమంది సమరయోధులు స్వచ్ఛందంగా అరెస్టయి జైళ్లకు వెళ్లారు. మరెంతోమంది పోలీసు తూటాలకు నేలకొరిగారు. ఇలా ఉద్యమానికి అద్భుతమైన స్పందన లభించిన మాట నిజమే అయినా, అప్పటి పరిస్థితుల్నిబట్టి చూస్తే ఉద్యమం లేవదీయడానికి అది తగిన సందర్భంకాదు. ప్రచండమైన రీతిలో సాగిన ఆ ఉద్యమం భారత్‌పట్ల బ్రిటిష్ ప్రభుత్వం మరింత కఠిన వైఖరి అవలంభించేందుకు దోహదపడింది. ఆ సమయానికి అమెరికా కూడా యుద్ధరంగంలోకి దిగింది. దరిమిలా మిత్రపక్షాల విజయావకాశాలు మెరుగుపడ్డాయి. యుద్ధానంతరం భారత్‌కు స్వాతంత్ర్యం లభించే అవకాశాలు కూడా ప్రస్ఫుటంగా కనబడసాగాయి. అటువంటి పరిస్థితుల్లో ఉద్యమం లేవదీయడంలో బ్రిటన్ ఆగ్రహం అవధులు దాటింది. కాంగ్రెస్ నాయకులను ఎక్కడివారిని అక్కడ అరెస్టు చేసి, జైళ్లలోకి నెట్టింది. దీంతో ఒక్కసారిగా రాజకీయ శూన్యత ఏర్పడింది. కాంగ్రెస్ నాయకులంతా నిర్బంధంలో ఉండటంతో రాజకీయంగా బలపడేందుకు ముస్లింలీగ్‌కు అవకాశం లభించింది. లీగ్ నాయకులు దానిని చక్కగా ఉపయోగించుకున్నారు. 1937 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ముస్లిలీగ్, 1946 ఎన్నికలలో ముస్లింల ప్రాబల్యం అధికంగా గల ప్రాంతాలన్నింటిలోనూ జయకేతనం ఎగురవేయగలిగింది.

## అప్రమత్తత కీలకం

బ్రిటిష్ ప్రభుత్వం 1946లో ప్రతిపాదించిన కేబినెట్ మిషన్ ప్లాన్‌ను ఆమోదించడంలో విఫలం కావడం మన నేతలు చేసిన అయిదో తప్పిదం. దేశాన్ని విభజించాలనే డిమాండు బలం పుంజుకున్నా, దానిని నివారించే అవకాశాలు అప్పటికి ఇంకా చేజారిపోలేదు. భాష, మతం, ప్రాంతం వంటి అనేక అంశాలలో భారతదేశానికి గల భిన్నత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, దేశ విభజనకు ఏమాత్రం తావులేని విధంగా కేబినెట్ మిషన్ ప్లాన్ రూపొందింది. ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు ఈ ప్రణాళికకు మద్దతు తెలిపినా, ఈ విషయలో ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు జాతీయ నాయకులు కృష చేయలేదు. తొలత ఈ ప్రణాళికకు అందరి ఆమోదం లభించేటట్లే కనిపించినా చివరకు తిరస్కరణకు గురైంది. దీంతో దేశ విభజన అనివార్యమైంది. అఖండ భారతదేశం అవిభాజ్యంఆనే ఉండాలన్నది స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి నాయకుల ఆశ. ఆ దిశగా వారు ఎంతో శ్రమించారు. కానీ, పైన చెప్పిన తప్పిదాల వల్ల తాము కన్న కలలను వారు సాకారం చేసుకోలేకపోయారు.

గతాన్ని మార్చడం మనకు ఎలాగూ సాధ్యంకాదు. భవిష్యత్తులోనైనా అటువంటి పొరబాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించడం ఎంతైనా అవసరం. అప్పుడే లోపరహితమైన సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

* * *

# అధికారానికి అర్థం - పరమార్థం

**జూన్ 13, 2005**

**మనదేశంలో నాయకత్వం, ప్రభుత్వాలు చాలా శక్తిమంతంగా కనిపిస్తున్నాయి. ధనిక దేశాల్లో ప్రభుత్వాలు తద్భిన్నంగా బలహీనమనిపిస్తున్నాయి. ఏమిటీ విచిత్రం...? ఎందుకీ వైవిధ్యం? ఈ ప్రశ్నలకు సమాధానం రెండు అంశాల మీద ఆధారపడి ఉంది. మొదటిది - ఆయాదేశాల్లో నేతలు, ప్రభుత్వాలు చేస్తున్నదేమిటి..? రెండోది- ఆయా సమాజాల్లో అధికారం అంటే ఉన్న అర్థమేమిటి?..**

ప్రపంచంలో అనేక ప్రజాస్వామ్య దేశాలున్నాయి. వాటిని పరిశీలిస్తే వింతగొలిపే వైవిధ్యాలు కనిపిస్తాయి. స్వేచ్ఛాయుతమైన ఈ దేశాలలో కొన్ని ధనికదేశాలు, కొన్ని పేద దేశాలు. ధనిక దేశాల్లో పారిశ్రామికరంగం ఎంతో ముందంజ వేసింది. తులనాత్మకంగా చూస్తే ఆదేశాల్లో తలసరి ఆదాయం కూడా చాలా ఎక్కువే. ఆర్థిక సౌష్టవం రీత్యా ఆ దేశాలకు అంతర్జాతీయంగా మంచి పలుకుబడి ఉంది. ధనిక దేశాల్లో మౌలిక సదుపాయాలు మిగతా దేశాలు అసూయపడేటంతగా అభివృద్ధి చెందాయి. న్యాయపరిపాలన, జనజీవన క్రమబద్ధీకరణ వంటి అంశాల్లోనూ ఆదేశాల్లో సువ్యవస్థ నెలకొందనే చెప్పాలి. ఈ పెద్ద రాజ్యాలు సైనిక బలం, బలం విషయంలోనూ శక్తిసంపన్నతలు కలిగి ఉన్నాయి. అభివృద్ధి చెందిన రాజ్యాల్లో పౌరులు ఉన్నత విద్యావంతులు. అక్కడి జనాభాలో అత్యధిక శాతానికి సరైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ గుణాలన్నింటిని బట్టి చూస్తే అక్కడి ప్రభుత్వాలూ ఎంతో శక్తిమంతమైనవనుకొనే అవకాశం ఉంది. వాస్తవానికి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రభుత్వాలు అధికారంపరంగా బలహీనంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకు అమెరికా చూడండి...

## అమెరికా అధ్యక్షుడికీ పరిమితులు

అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ (జూనియర్)కు 2004 ఎన్నికల్లో ఘనవిజయం లభించింది. (2000 ఎనికల్ల ఫలితాలకు భిన్నంగా). అమెరికన్ 'కాంగ్రెస్'లోని రెండు సభల్లోనూ రిపబ్లికన్లదే మెజారిటీ. అమెరికా ఆర్థిక వ్యవస్థకూడా గతంతో పోలిస్తే కాస్తంత కుదురుగానే ఉంది. సైనిక శక్తి విషయంలో అమెరికాకు పోటీయే లేదు. అయినా, అంశాలవారీగా పరిశీలిస్తే అమెరికా అధ్యక్షుడు బలహీనుడే. అమెరికన్

కాంగ్రెస్, ప్రజాభిప్రాయం అనే రెండు శక్తులు అతడి నిర్ణయాధికారానికి గిరి గీస్తాయి. బుష్ సిఫారసు చేసిన ముగ్గురు ఫెడరల్ న్యాయమూర్తిల్ని పదవుల్లో నియమించడానికి మూడేళ్లు పట్టింది. బుష్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీయే అమెరికన్ సెనేట్‌లో మెజారిటీ కలిగి ఉన్నా, ఆయన సిఫారసు చేసిన మరో నలుగురు జడ్జీల నియామకం ఇంకా ఆమోదం పొందలేదు. 'అణు' అధికారాలను జాగుచేయకుండా సెనేట్ ఆమోదించాలని బుష్ ప్రభుత్వం కోరింది. దానికి 'ఫిలిబస్టర్' ప్రధాన ఆటంకం (అమెరికా చట్టసభల్లో 'ఫిలిబస్టర్' పద్ధతి ఉంది. ఫిలిబస్టర్ అంటే చర్చ సందర్భంగా గౌరవసభ్యుడు సుదీర్ఘ సమయం ప్రసంగిస్తూ ఆ బిల్లు ఆమోదాన్ని కొంత సమయంపాటు అడ్డుకోవడం. సభ్యులు ఏ విషయంమీదైనా మాట్లాడవచ్చు. చివరికి టెలిఫోన్ డైరీలో పేర్లన్నీ చదువుతూ కూర్చోవచ్చు. ఇలా పౌరహక్కుల బిల్లు ఆమోదాన్ని నిరోధించడానికి సెనేటర్‌గా స్ట్రామ్ థర్మాండ్ 1957లో 24 గంటల 18 నిమిషాల ప్రసంగించారు. అదో రికార్డు. ఆ బిల్లు ఆమోదం పొందిందన్నది వేరే విషయం). బుష్ అభ్యర్థనకు వ్యతిరేకంగా, ఆ బిల్లును నిలుపుచేసే కార్యక్రమంలో ఆయన పార్టీకి చెందిన ఏడుగురు, విపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన మరో ఏడుగురు సెనేటర్లు జతకలిశారు. ఆమోదయోగ్యులు కాని వారిని అధ్యక్షుడు సిఫారసు చేసినప్పుడు, వారి నియామకాలు జరగకుండా ఆపడంలో ఫిలిబస్టర్ విధానం సెనేట్‌లో విస్తృతంగా అమలవుతోంది. కాబట్టి, విపక్షం సహాయ నిరాకరణకు నిర్ణయించుకుంటే... సభలో ఓటింగుకు కూడా అవకాశం లభించదు. ఈ నేపథ్యంలో – ఉభయసభల్లోనూ తన పార్టీకే మెజారిటీ కలిగిన అంతటి అమెరికా అధ్యక్షుడు కూడా... తాను సిఫారసు చేసిన వారిని పదవుల్లో కూర్చోపెట్టలేడు. కాబట్టే సామాజిక భద్రత, స్టెమ్ సెల్స్ పరిశోధనలు, స్వలింగ వివాహాలు వంటి అంశాలలో బుష్ అభిప్రాయాలు, అభ్యంతరాల ప్రాతిపదికన నిర్ణయాలు అమలు కావడం లేదు. ఇలా చెప్పుకొంటూ పోతే... బుష్‌కు ఉన్న పరిమితులకు ఉదాహరణలు అనేకం. దీన్నే కొందరు అమెరికా వ్యవస్థలో ఉన్న నిరోధాలు, సమతౌల్యాల విధానంగా పేర్కొంటారు. ఈ విధానంలో చట్టసభలమీద అధ్యక్షుడికి పెత్తనం ఉండదు. అయితే, ఇది అమెరికన్ అధ్యక్ష ప్రజాస్వామ్యం గొప్పదనమే అని చెప్పడానికీ వీలులేదు. వెస్ట్ మినిస్టర్ విధానం (మన దేశంలో అనుసరిస్తున్న పార్లమెంటరీ విధానానికి మాతృక) అమలులో ఉన్న బ్రిటన్‌నే చూడండి...

## బ్రిటిష్ ప్రధానికి ఆటంకాలు

అక్కడ ప్రధానమంత్రికీ – మనదేశంలో ప్రధానమంత్రికి గల అధికారాలు

దాదాపుగా ఒక్కటే. బ్రిటిష్ ప్రధాని టోనీబ్లెయిర్‌కు మెండుగా ప్రజాదరణ ఉంది. రాజనీతికి సంబంధించీ అనేక మెలకువలు తెలిసిన నేతగా పేరుంది. ప్రధానిగా మూడో పర్యాయం ఎన్నికైన తొలి 'లేబర్' నాయకుడాయన. సొంతపార్టీ స్వరూపాన్ని సొంతం తీర్చిదిద్దిన 'నవ లేబర్' నిర్మాతగా బ్లెయిర్ ప్రసిద్ధుడు. ఆయన నేతృత్వంలోని బ్రిటన్‌లో సుసంపన్నతకు, శాంతిభద్రతలకు, ఆర్థికాభివృద్ధికి ఏ ఢోకా లేదు. అయినా, తాను తీసుకురాదలచిన మార్పులకు చట్టరూపాన్ని ఇచ్చే విషయంలో బ్లెయిర్ అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నారు. విశ్వవిద్యాలయాల్లో వసూలు చేసే రుసుముకు సంబంధించి ఆయన ప్రతిపాదించిన మార్పు చేర్పులు అత్యంత కష్టం మీద ఎలాగోలా గట్టెక్కాయి. ఐరోపా సమాఖ్య ఏకీకరణ విధానాన్ని గట్టిగా సమర్థించే బ్లెయిర్, ఆ అజెండా అమలు విషయంలో విజయం సాధించలేకపోయారు. బ్లెయిర్‌కు ఎంత ప్రజాదరణ ఉన్నా, క్యాబినెట్‌లో ఆయన తరువాతి స్థానంలో ఉన్న వ్యక్తి అభిప్రాయాలనూ ఆయన తిరస్కరించగల పరిస్థితి లేదు. బ్రిటిష్ ఆర్థికమంత్రి (చాన్సెలర్ ఆఫ్ ద ఎక్స్‌చెకర్) అభిమతాన్ని పట్టించుకోకుండా బ్లెయిర్ ముందడుగు వేయలేరు. విద్య, ఆరోగ్య రంగాల్లో బ్లెయిర్ తీసుకురాదలచిన మార్పుల పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇక, అందరికీ తెలిసిన 'ఇరాక్ కథ'లో బ్లెయిర్ ఎంతగా అప్రతిష్ఠపాలయ్యారో వివరించనక్కరలేదు.

## ఫ్రాన్స్, జర్మనీలలో ఎదురుదెబ్బలు

ఫ్రాన్స్‌లో ప్రభుత్వ స్వరూపం భిన్నమైనది. అధికారాలను పోల్చాల్సివస్తే, ఫ్రాన్స్ అధ్యక్షుడు అమెరికా అధ్యక్షుడికన్నా శక్తిమంతుడు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ప్రధానిగా ఉన్న వ్యక్తిని తొలగించగలడు. తన అభీష్టానికి అనుగుణంగా వేరొకర్ని ప్రధానిని చేయగలడు. రెండో ప్రపంచయుద్ధానంతరం– 'ఐరోపా ఏకీకరణ' అన్నది ఫ్రాన్స్ విదేశాంగ విధానంలో అత్యంత కీలకాంశం. అయితే, ఐరోపా ఉమ్మడి రాజ్యాంగంపై ఇటీవల ఫ్రాన్స్ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో– అధ్యక్షుడు షిరాక్ విధానానికి అనూహ్యమైన ఘోర పరాజయం ఎదురైంది. జర్మన్ ఛాన్సెలర్ ఎర్హార్డ్ ష్రోడర్‌కు చెందిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆ దేశంలో పెద్ద రాష్ట్రాలలో ఒకటైన ఉత్తర రైన్ వెస్ట్ ఫేలియాలో ఓడిపోయింది. ఆ ఓటమి నేపథ్యంలో ష్రోడర్ ఏకంగా పార్లమెంటును రద్దుచేసి, జాతీయ ఎన్నికలను ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడుతున్నప్పుడే పలువురు పరిశీలకులు సోషల్ డెమోక్రాట్ల ఓటమి తథ్యమని స్పష్టంచేశారు. విపక్ష క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ గెలుపు ఖాయమనీ అందరు ఊహించారు. ఈ విషయాలన్నీ తెలిసినా,

తాను అధికారంలో ఉండీ ఏమీ చేయలేకపోతున్నానని భావించిన డ్రోడర్– తన పదవీకాలం ముగియడానికి ఏడాదికి ముందే అధికారం అప్పగించడం సరైనదేనన్న నిర్ణయానికి వచ్చారు.

దీన్ని బట్టిచూస్తే– ఆదాయాలు అధికంగా ఉన్న దేశాలలో ప్రభుత్వాధినేతకు– మిగతా ప్రభుత్వ వ్యవస్థలకు మధ్య ఉత్పన్నమయ్యే సంఘటర్షణ ప్రభుత్వాధినేత అధికారాలను పరిమితం చేస్తోంది. అయినా, ఆ దేశాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగగలుగుతున్నాయి.

## మరి మన నేతలు...?

మరి మనదేశాన్ని చూడండి... కనీసం ఒక్క శాతం ఓటర్లు కూడా కోరుకోని, అతుకుల బొంతలాంటి సంకీర్ణానికి నాయకత్వం వహిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి ధరమ్‌సింగ్‌కు అధికారాలు చలాయించే విషయంలో ఎలాంటి అడ్డూ లేదు. అధికార శిఖరాలకు చేరుకున్న వారిని– సామాన్యులేకాక, మేధావులూ కలుసుకోవడానికి వీలు లేకుండా ఎన్నో అడ్డు తెరలున్నాయి. ఇన్ని అధికారాలు మన నేతలు, ప్రభుత్వాలు చలాయిస్తున్నా... అనేక అంశాల్లో వైఫల్యాలే వెక్కిరిస్తున్నాయి. హత్యలు చేసినవారు యథేచ్ఛగా సంచరిస్తూ చట్టసభలకు ఎన్నిక కాగలరు. వారు మంత్రులైపోగలరు. మన విద్యావ్యవస్థ ఓ మహా సంక్షోభంలో కూరుకొని ఉంది. కాబట్టే యువత తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకునే అవకాశమే దక్కడంలేదు. ఆరోగ్యసంరక్షణ వ్యవస్థల అస్తిత్వమే ప్రశ్నార్థకమైన సమాజంలో, రోగాలూ రొష్టులూ పేదల్ని నిరుపేదలుగా మారుస్తున్నాయి. మన ట్రాఫిక్ వ్యవస్థ మొత్తంగా భ్రష్టుపట్టబట్టే, భారతదేశంలో వాహనం నడపగలవారు ప్రపంచంలో మరే దేశంలో అయినా సురక్షితంగా వాహనం నడపగలరనే నానుడి పుట్టింది. మన దేశంలో మౌలిక వ్యవస్థల పరిస్థితే చూడండి... రోడ్లు, మంచినీరు, మురుగు నీటిపారుదల, విద్యుత్తు, రవాణా– అన్నింటా దుస్థితే కనిపిస్తుంది. కాబట్టే, వాటలో ఏ కొద్దిపాటి మెరుగుదల కనిపించినా బోలెడంత సంతోషపడిపోతాం. నిరుద్యోగం భయానకస్థాయిలో పెరిగింది. వ్యవసాయ రంగం కూడా దశాబ్దాలుగా సంక్షోభాన్నెదుర్కొంటోంది. సదుపాయాల కల్పనలో నగరాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. అవినీతి ఎంతగా పెరిగిపోయిందంటే... అవినీతిపరుడుకాని అధికారి ఎవరైనా మనకు తెలిస్తే.... 'ఈయన నిజాయతీపరుడు' అని మిగతావారికి పరిచయం చేసేటంతగా. అయినా, మనదేశంలో నాయకత్వం,

ప్రభుత్వాలు చాలా శక్తిమంతంగా కనిపిస్తున్నాయి. ధనిక దేశాల్లో ప్రభుత్వాలు తద్భిన్నంగా బలహీనమనిపిస్తున్నాయి. ఏమిటీ విచిత్రం...? ఎందుకీ వైవిధ్యం?

ఈ ప్రశ్నలకు సమాధానం రెండు అంశాల మీద ఆధారపడి ఉంది. మొదటిది– ఆయాదేశాల్లో నేతలు, ప్రభుత్వాలు చేస్తున్నదేమిటి...? రెండోది– ఆయా సమాజాల్లో అధికారం అంటే ఉన్న అర్థమేమిటి? చాలామటుకు ధనిక దేశాల్లో– ప్రభుత్వాల లక్ష్యం ప్రజల స్థితిగతులను మెరుగుపరచడం. అక్కడ ప్రతి నేతా సమాధానం చెప్పాల్సిన అంశం– తాను అధికారంలో ఉండాలని ఎందుకు కోరుకుంటున్నాడన్నది. ప్రజల శ్రేయాన్ని పెంపొందించడానికి అధికారం ఓ సాధనం. కాబట్టి, అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో నాయకులు తమకు లభించిన అధికారాన్ని ప్రజాసంక్షేమం కోసమే ఉపయోగిస్తారు. ప్రజాశ్రేయానికి మెరుగులు దిద్దే క్రమంలో వారికి అనేక అవరోధాలూ ఎదురవుతాయి. ఆశించిన స్థాయిలో పరిస్థితుల్లో మార్పు తీసుకురాలేని నేతలు తమ వైఫల్యాన్ని ఒప్పుకొంటారు. అలా విఫలమైన నేతలు అధికారంలో ఉన్నా అధికార హీనులుగా, బలహీన నేతలుగా కనిపిస్తారు. వారేం చెప్పి అధికారంలోకి వచ్చారు– అధికారంలోకి వచ్చి ఏం చేశారన్నదే అక్కడ నేతలను అంచనా వేయడానికి ప్రాతిపదిక.

## ఆలోచనే మారాలి

దురదృష్టవశాత్తు, మనదేశంలో అధికారం ప్రైవేటు ప్రాపర్టీకి మారుపేరు. ఇక్కడ– అధికారం ఎందుకు కోరుకుంటున్నారనే ప్రశ్నకు నాయకులు ఏనాడూ సరైన సమాధానం ఇవ్వాల్సిన అవసరమే లేదు. అవకాశం, 'అదృష్టం' కలిసివస్తే ఇక్కడ ఎవరైనా అధికారాన్ని కోరవచ్చు! మనదేశంలో అధికారమన్నది డాబూ దర్పాలను ప్రదర్శించేందుకు, చేతనైనంతగా సొమ్ము చేసుకునేందుకు ఓ మార్గం. కాబట్టే మనదేశంలో అధికారం ఓ ప్రత్యేక సౌకర్యంగా, ఆశ్రిత పక్షపాతానికి అవకాశంగా, నిరంకుశత్వానికి సాధనంగా, యథేచ్ఛగా వర్తించడానికి మార్గంగా కనిపిస్తోంది. అందువల్లే మనదేశంలో ఓ సాదాసీదా రాజకీయ నాయకుడు కూడా 'పవర్‌ఫుల్' అనిపించుకోగలుగుతున్నాడు. తద్వారా మనమీద అహేతుకమైన జులుం చలాయించగలుగుతున్నాడు. కాబట్టి, భారతదేశంలో అధికారానికి, అధికారంగల వారికి మనం ఇస్తున్న అర్థాన్ని మార్చనంతకాలం ప్రజలు బలహీనులుగా, నాయకులు విశేషాధికారాలుగల వారిగా చలామణి అవుతూనే ఉంటారు. వైఫల్యమనేది రాజకీయ

నాయకుడి మనసును క్షోభింపచేయాలంటే, ఆ నాయకుడు నిర్దిష్టమైన మంచి మార్పు కోసం సరైన కృషి చేసి ఉండాలి. అలాంటి సందర్భంలో– లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమైన నాయకుడిని బలహీనుడిగా పరిగణించవచ్చు. కానీ మనదేశంలో– పదవుల్లో కొనసాగగలగడమనేదే నాయకుల విజయానికి గీటురాయిగా కనిపిస్తోంది. మనం మన ప్రభుత్వాలను– అవి సాధించిన అభివృద్ధి లేదా అభివృద్ధి రాహిత్యం వంటి ప్రమాణాల ఆధారంగా, నాయకులు తీసుకువచ్చిన మార్పుల ప్రాతిపదికన అంచనా వేయడం లేదు. ఇప్పుడు మనం చేయాల్సింది ఈ ప్రాతిపదికల్ని హేతుబద్ధంగా మార్చి రాజకీయాలకు, అధికారానికి సరైన భాష్యం చెప్పడం. చొరవ, సాహసంగల నేతలు ఆవిర్భవిస్తేనే అలాంటి మార్పు సాధ్యమవుతుంది. అలాంటి నేతలు అంకితభావానికి, దార్శనిక దృక్పథానికి ప్రతీకలుగా నిలువగలుగుతారు. వారు జాతిని సంఘటితంచేసి అనేక మంచి మార్పులను సాకారం చేయగలుగుతారు. అది జరిగిననాడే మన ప్రజాస్వామ్యం– ఈ దేశంలో ప్రజలకు వ్యతిరేకంగా కాక, అనుకూలంగా పనిచేయడం ఆరంభమవుతుంది.

* * *

# మన రిపబ్లిక్ - వెలుగునీడలు

**జనవరి 24, 2005**

రెండో ప్రపంచ యుద్ధం తరువాత వలసవాద సంకెళ్ల నుంచి విముక్తిపొంది, రిపబ్లిక్‌గా అవతరించడంతో పాటు ప్రజాస్వామ్యం, సార్వత్రిక వయోజన ఓటుహక్కు, చట్టబద్ధపాలన, రాజ్యాంగబద్ధ వ్యవస్థ, లౌకికవాదం, పీడితులకు రక్షణ వంటి విశిష్టతలతో ముందడుగువేసిన మొట్టమొదటి గొప్పదేశం ఇండియానే. ప్రతి ఏటా జనవరి 26న మనం ఎంతో ఆనందోత్సాహాలతో పండగ చేసుకోవాలనడంలో సందేహం లేదు. భారత రాజ్యాంగం మానవతకు, స్వేచ్ఛకు, వివేకానికి ప్రతీక!

మన రాజ్యాంగం మనకు బాగానే ఉపయోగపడిందా అని అనుమానించే వారు ఎందరో ఉన్నారు. మన రాజ్యాంగం మన ప్రజాస్వామ్యం బాగా పనిచేశాయనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు...

భారత రిపబ్లిక్ యాభై అయిదో వార్షికోత్సవాన్ని ఎల్లుండి జరుపుకోబోతున్నాం. ఈ పవిత్ర సందర్భం ఆత్మశోధనకు మనకు మంచి అవకాశం కల్పిస్తుంది. రాజ్యాంగసభ సభ్యులు ఎన్నో ఆశలు, ఆశయాలతో 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించారు. 1950 జనవరి 26న కొత్త రాజ్యాంగం కింద రిపబ్లిక్ ఆవిర్భవించింది. ఏ ప్రమాణాల ప్రకారం చూసినా అదో అసాధారణ సన్నివేశం. ఆధునిక ప్రపంచంలో తొలి రిపబ్లిక్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు. ప్రముఖ తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు థామస్ జఫర్సన్ 1776లో రూపొందించిన ముసాయిదా ప్రకారం స్వాతంత్ర్య ప్రకటన విడుదలైంది. ఫిలడెల్ఫియాలో జరిగిన కాంటినెంటల్ కాంగ్రెస్ దానిని ఆమోదించింది. దాంతో పదమూడు అమెరికా వలస ప్రాంతాలు బ్రిటిష్ పాలనను తోసిపుచ్చినట్లయింది. ఆ తరవాత అమెరికా విప్లవంలోను, స్వాతంత్ర్య పోరాటంలోను అమెరికా దళాలు విజయం సాధించాయి. పదమూడు స్వతంత్ర రాజ్యాలను ఏకీకృతం చేసి, గట్టి ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే పనిమాత్రం మిగిలిపోయింది. 1787లో కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశమై, భవిష్యత్ రాజ్యాంగంపై సమాలోచనలు ప్రారంభించింది. రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రాలు సర్వసత్తాక, సార్వభౌమాధికారాలు కలిగి ఉండాలని రిపబ్లికన్లు అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలను సమైక్యపరచి, నియంత్రించే పటిష్ఠమైన ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని

ఫెడరలిస్టులు సూచించారు. చివరికి రాజీ కుదిరింది. 1789లో అమెరికా రాజ్యాంగానికి ఆమోదం లభించింది. స్వాతంత్ర్య యుద్ధ యోధుడు జార్జి వాషింగ్టన్ అమెరికాకు తొలి అధ్యక్షుడయ్యారు. ఎనిమిదేళ్లపాటు అధికారంలో ఉన్న ఆయన, వైరివర్గాలను ఒక్కతాటిపై నిలపగలిగారు. 1797లో స్వచ్ఛందంగా పదవిని త్యాగం చేయడంద్వారా ఆయన మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఆధునిక ప్రపంచపు తొలి రిపబ్లిక్‌గా అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించింది.

అమెరికా రాజ్యాంగం తొలి లిఖిత రాజ్యాంగంగా చరిత్రకెక్కింది. కానీ తొలి సంవత్సరాల్లో అమెరికా రిపబ్లిక్ తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. జఫర్‌సన్, మాడిసన్‌ల సారథ్యంలోని రిపబ్లికన్ గ్రూపు; హమిల్టన్, ఆడమ్స్ నాయకత్వంలోని ఫెడరలిస్టు వర్గానికి మధ్య దాదాపు దశాబ్దకాలంపాటు అమీతుమీ కొనసాగింది. పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని ఫెడరలిస్టులు, రాష్ట్రాలు గట్టిగా ఉండి పరిమిత సమన్వయ అధికారాలు కలిగిన ఫెడరల్ ప్రభుత్వం ఉండాలని రిపబ్లికన్లు పట్టుపట్టారు. శాంతిసాధనకు, దక్షిణాది రాష్ట్రాల మద్దతు పొందేందుకు బానిసత్వ సమస్యను తొలుత కావాలనే పక్కన పెట్టారు. చివరికి 1800లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జఫర్సన్ అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో ఫెడరలిస్టులపై రిపబ్లికన్లదే పైచేయి అయింది. రిపబ్లికన్లు రాష్ట్రాల హక్కులను పరిరక్షిస్తూనే కొంతవరకు ఫెడరలిస్టు సిద్ధాంతాన్నీ అనుసరించారు. బానిసత్వ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. 1861 నుంచి 1865 వరకు జరిగిన అంతర్యుద్ధం, వివేకవంతమైన అబ్రహం లింకన్ నాయకత్వం పుణ్యమా అని చివరికి సంక్షోభం పరిష్కారమైంది. ఆఫ్రో-అమెరికా బానిసలు విముక్తులయ్యారు. అయినా, అనేక దశాబ్దాల పాటు మహిళలకు, నల్లవారికి నిజమైన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అందని మావిపళ్లుగానే మిగిలిపోయాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చాక 140 ఏళ్ల తరవాత, 1920లలో మాత్రమే మహిళలకు ఓటుహక్కు లభించింది. నల్లజాతి పురుషులకు ఓటువేసే హక్కును అంతర్యుద్ధం తరవాతే కల్పించినప్పటికీ, 1960లలో పౌరహక్కుల ఉద్యమంలో మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ స్ఫూర్తిదాయక నాయకత్వం తరవాతే దక్షిణాది రాష్ట్రాలలోని ఆఫ్రో-అమెరికన్ జనాభాకు ఆ హక్కు సాకారమైంది. టెలివిజన్ కారణంగా అత్యంత వేగవంతంగా వ్యాప్తి చెందిన మొట్టమొదటి గొప్ప ఉద్యమమది. వాషింగ్టన్‌లోని లింకన్ మెమోరియల్‌కు మిలియన్ మార్చ్ వంటి ఆనాటి శక్తివంతమైన ఉద్యమాలు, ఉద్విగ్న సన్నివేశాలెన్నింటినో ముందు తరాల వారికోసం కెమెరాల్లో భద్రం చేసి ఉంచారు.

## విప్లవాత్మకం

అమెరికాలో స్వాతంత్ర్య ప్రకటన సమయంలోను, మొట్టమొదటి రిపబ్లిక్ రాజ్యాంగ నిర్మాణ సందర్భంగాను ఇచ్చిన హామీలు నెరవేరడానికి 180 ఏళ్లు పట్టింది. చాలా నిదానంగా చోటుచేసుకున్న పరిణామ క్రమమది. దాంతో పోలిస్తే భారత రాజ్యాంగం ఎంతో విప్లవాత్మకమైనది. మహిళలు, దళితులు సహా పౌరులందరికీ ఒక్కసారిగా ఇది ఓటు హక్కు ప్రసాదించింది. మన స్వాతంత్ర్యయోధులు గొప్ప ఆదర్శవాదాన్ని, మన ప్రజానీకం పట్ల ఆపార విశ్వాసాన్ని ప్రదర్శించి వయోజన ఓటుహక్కు కల్పించారు. రిపబ్లిక్ సూత్రాలను అనుసరించారు. ఆనాడు మన దేశాధినేతగా ఉన్న గవర్నర్ జనరల్, రాజ్యాంగాన్ని స్వయంగా ఆమోదించలేదు. రాజ్యాంగ సభ సభ్యులు విశిష్టమైన, ఆలోచనయుతమైన నిర్ణయం తీసుకొని కొత్త రాజ్యాంగంపై సంతకాలు చేశారు. రాజ్యాంగపత్రం ప్రజలకు ఎవరో ఇచ్చిన బహుమతి కాదు. “మేము, ప్రజలము”– అంటూ రాజ్యాంగ పీఠిక నిర్ద్వంద్వంగా ప్రకటించడాన్ని బట్టే రాజ్యాంగం మనదని స్పష్టమవుతోంది. రాజ్యాంగసభ, గొప్ప దార్శనికుడైన బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పాటైన రాజ్యాంగ రచన సంఘం మనకు స్వయం పాలనకు సంబంధించి విశిష్టమైన డాక్యుమెంటును అందజేశాయి. ఉక్కుమనిషి సర్దార్ పటేల్ 500కు పైగా సంస్థానాలను భారతయూనియన్‌లో విలీనం చేయడం మరో గొప్ప పరిణామం. ఒక్క బుల్లెట్ పేల్చకుండానే, ఒక్క నెత్తుటి చుక్క రాల్చకుండానే సంస్థానాలు విలీనం కావడం మహాద్భుతమే. మన ప్రత్యేక చరిత్ర నేపథ్యంలో రాష్ట్రాల హక్కుల గురించి తీవ్రస్థాయి చర్చ ఎన్నడూ జరగలేదు. దేశవిభజన అనంతరం పటిష్టమైన యూనియన్ ప్రభుత్వాన్ని రాజ్యాంగసభ ఏర్పరచింది. వికేంద్రిత, రాష్ట్రాలకే ప్రాముఖ్యంగల రిపబ్లిక్ ఏర్పడితే బాగుంటుందని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. కానీ దేశ విభజన రగిలించిన గాయాలు, రేకెత్తించిన భయాందోళనలు దాదాపు ఫెడరల్ స్థాయిలో పటిష్టమైన కేంద్రం ఏర్పాటుకు దారితీశాయి.

శతాబ్దాలుగా మన సమాజాన్ని కుల వ్యవస్థ గుల్లబారుస్తోంది. కులాన్ని బట్టి మనిషికి ప్రాధాన్యం లభిస్తుండటం – తీవ్ర అసమానతలకు దారితీస్తోంది. ఈ రుగ్మతను తొలగించేందుకు ప్రయత్నించడం మన రాజ్యాంగ నిర్మాతలు చేపట్టిన మహత్కార్యం. అంటరానితనాన్ని నిషేదించారు. సమానత్వం, చట్టపర, న్యాయబద్ధ పాలన మన రాజ్యాంగంలో కీలకాంశాలయ్యాయి. కులం, మతం, ప్రాంతం, భాష, లింగ భేదాలకు అతీతంగా పౌరులంతా చట్టంముందు సమానులయ్యారు. మన రిపబ్లిక్‌లో

ఆవిర్భవించిన నాయకులు మరో అడుగు ముందుకు వేశారు. శతాబ్దాల తరబడి విచక్షణకు గురైన అడుగు, బడుగు వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించారు. విద్య, ఉపాధి, ఇతర ప్రభుత్వ విధానాలు, పథకాల్లో వారికి ప్రాధాన్యం ఇచ్చారు. మైనారిటీలకు ప్రత్యేక హక్కులు ఇవ్వడం, చట్టం ముందు వారినీ సమానులను చేయడం మరింత గణనీయమైన పరిణామం. మధ్య యుగాల్లో భారతదేశ చరిత్ర అంతా అలజడులు, అల్లకల్లోలాల మయమే. దేశ విభజన సందర్భంగా అనూహ్యమైన, అసాధారణమైన స్థాయిలో హింసాకాండ చెలరేగి నెత్తురు పారింది. అయినప్పటికీ లౌకికవాదానికి గట్టిగా కట్టుబడి, అల్పసంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక హక్కులు కల్పించడమంటే మానవత్వానికి హారతి పట్టడమే. మత దురభిమానాన్ని, మతపరమైన అసహనాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడమే.

రెండో ప్రపంచయుద్ధం తరవాత వలసవాద సంకెళ్ల నుంచి విముక్తిపొంది, రిపబ్లిక్‌గా అవతరించడంతో పాటు ప్రజాస్వామ్యం, సార్వత్రిక వయోజన ఓటుహక్కు, చట్టబద్ధపాలన, రాజ్యాంగబద్ధ వ్యవస్థ, లౌకికవాదం, పీడితులకు రక్షణ వంటి విశిష్టతలతో ముందడుగువేసిన మొట్టమొదటి గొప్పదేశం ఇండియానే. ప్రతి ఏటా జనవరి 26న మనం ఎంతో ఆనందోత్సాహాలతో పండగ చేసుకోవాలనడంలో సందేహం లేదు. భారత రాజ్యాంగం మానవతకు, స్వేచ్ఛకు, వివేకానికి ప్రతీక! మన రాజ్యాంగం మనకు బాగానే ఉపయోగపడిందా అని అనుమానించే వారు ఎందరో ఉన్నారు. మన రాజ్యాంగం, మన ప్రజాస్వామ్యం బాగా పనిచేశాయనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. మనం నాలుగు గొప్ప విజయాలు సాధించాం. అందులో మొదటిది క్రమంతప్పకుండా ఎన్నికలు జరపడం, శాంతియుతంగా అధికారాల బదిలీ; భారత్ గత 55 ఏళ్లుగా ఈ పంథాలో సాగుతోంది. మన వ్యవస్థలు మనుగడ సాగించగలడం రెండో విజయం. వాటిలో అనేకం మన ఆశలను నెరవేర్చలేకపోయి ఉండవచ్చు. కానీ మన రాజ్యాంగం మౌలిక స్వరూప – స్వభావాలు, మన పాలన నిర్వహణ సంస్థల్లో చాలాభాగం చెక్కు చెదరలేదు. సునామీ విసిరిన సవాలును భారత్ ఎదుర్కొన్న తీరు మన పాలన నిర్వహణ సంస్థల మౌలిక శక్తి సంపన్నతకు నిలువుటద్దం. దేశంలో ఏళ్ల తరబడి రాజకీయపరమైన శాంతియుత వాతావరణం నెలకొనేలా చేయడంలో మన పార్టీలు, రాజకీయవాదులు సఫలం కావడం మూడో విజయం. రాజకీయ నాయకులు అనేక విషయాల్లో మన నమ్మకాన్ని వమ్ముచేసి ఉండవచ్చు. కానీ రాజకీయ ప్రక్రియలో అందరినీ కలుపుకొని పోవడంలో,

ప్రజాస్వామిక సంవిధానంలో అన్నివర్గాల ప్రజలకు భాగస్వామ్యం కల్పించడంలో వారు అనుసరించిన ధృడమైన, సమతుల్యమైన, వివేకవంతమైన వైఖరిని మనం గుర్తించాలి. గౌరవించాలి. మన రాజకీయ వ్యవస్థలో అనేక లొసుగులు, లోటుపాట్లు ఉండవచ్చు. కానీ మొత్తంమీద ప్రజాస్వామ్యం మరింతగా విస్తరిస్తోంది. చొచ్చుకుపోతుంది.

దేశ విభజన తాలూకు చేదు జ్ఞాపకాలు క్రమేపీ మరుగున పడుతుండటంతో ఇండియా ఫెడరల్ తరహా ప్రజాస్వామ్యం నుంచి నిజమైన ఫెడరల్ వ్యవస్థగా రూపుదాల్చడం నాలుగో విజయం. దశాబ్దాల తరబడి వాదోపవాదాలు, పోరాటాల దరిమిలా ఇది సాధ్యపడింది. ఇందుకు మూడు అంశాలు దోహదపడ్డాయి. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పు తరువాత 356వ అధికరణకు దాదాపు ఆయువు తీరింది. ప్రభుత్వ రంగ పెట్టుబడుల ద్వారా లేనిపోని దాతృత్వాన్ని ప్రదర్శించుకొనే విచక్షణాధికారం ఒకప్పుడు కేంద్రానికి ఉండేది. ఆర్థిక సరళీకరణ వల్ల ఇప్పుడు దాని అవసరం తీరింది. సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి కావడంతో రాష్ట్రాలపై కేంద్రం స్వారీ చేయడం అసాధ్యమైపోయింది. ఇందుకు అదనంగా ఆర్థిక సంఘం ద్వారా న్యాయబద్ధంగా, సజావుగా నిధులు కేటాయించడం వల్ల మన ఫెడరలిజం మరింత బలపడింది.

## గొప్ప అవకాశం

మన ప్రజాస్వామ్యంలో, రాజకీయాల్లో అనేక లోపాలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో రాజ్యాంగం పనితీరునే మార్చాల్సి వచ్చింది. రాజ్యాంగానికి వంద సవరణలు చేశామంటే, దాన్ని మనం ఎంతగా దుర్వినియోగపరిచామో అర్థమవుతుంది. మన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకురావలసిన సమయమిదే. అవినీతి, నేరగ్రస్థత మన రాజకీయాలను మహమ్మారిలా పట్టిపీడిస్తున్నాయి. శక్తి సామర్థ్యాలను రుజువు చేసుకొనే అవకాశాలు లభించక పేదలు, అణగారిన వర్గాల వారు మరింతగా కుంగిపోతున్నారు. ప్రజాస్వామిక ప్రక్రియ చట్టబద్ధత క్షీణిస్తుండటంతో తరచు హింసాకాండ తలెత్తుతోంది. మన రాజకీయాల్లో, పాలన వ్యవస్థలో మౌలికమైన సంస్కరణలు తీసుకురావలసిన అవసరం ఎంతైన ఉంది. మన వ్యవస్థ రోగగ్రస్థమైపోయింది. దీనికి తక్షణ చికిత్స అవసరం. కానీ, మహోన్నతమైన, మానవతా విలువలు కలిగిన రాజ్యాంగం మనకు ఉన్నదని, అది సంతృప్తికరంగా

పనిచేస్తోందని మనం గుర్తించాలి. సంక్షోభాన్ని తిప్పికొట్టే సామర్థ్యం గల ప్రజాస్వామిక వ్యవస్థ మనకు ఉంది. ముందుచూపు కలిగిన నాయకత్వం మనకిప్పుడు కావాలి. సొంత, సృజనాత్మక ఆలోచనలను మనం అమలు చేయాలి. తమ ప్రయత్నాల ద్వారానే నిజమైన పరివర్తన సాధ్యమని ప్రజలు గుర్తించడం అంతకన్నా ముఖ్యం. అదే సమయంలో మనకు సార్వభౌమత్వాన్ని, మన రిపబ్లిక్‌ను పునరుత్తేజితం చేసే అవకాశాన్ని కల్పిస్తున్న మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసుకోవాలి. మనం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే మన రిపబ్లిక్ 60వ వార్షికోత్సవానికి ముందే మన ప్రభుత్వ సంస్థలను, మన రాజకీయాలను, పరిపాలన వ్యవస్థలను సంస్కరించుకోగలం. ఇది మన ముందున్న గొప్ప అవకాశం.

* * *

# గాంధీ మార్గం ఇదేనా...?

**అక్టోబర్ 18, 2004**

హైదరాబాద్‌లోని ఒక బోధనాసుపత్రిలో పక్షం రోజుల క్రితం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు మెడికోలకు మధ్య జరిగిన ముష్టి యుద్ధం, పోట్లాటలు – మన వ్యవస్థలో, రాజకీయాల్లో, పరిపాలన విధానంలో గల లోపాలకు సూచికలు, వార్తాపత్రికల కథనం ప్రకారం– ఒక ఇంజినీరింగ్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సాయంత్రం ఆసుపత్రికి తీసుకొచ్చారు. కానీ మూడుగంటల పాటు ఎవరూ పట్టించుకోనే లేదు. చివరకు ఆ యువకుడు మరుసటిరోజు కన్నుమూశాడు. దాంతో ఇంజినీరింగ్ విద్యార్థులు రెచ్చిపోయారు. మెడికోలపై దాడి చేశారు. ఆసుపత్రికి నష్టం కలిగించారు. మెడికోలు తిరగబడ్డారు. హింసకు పూనుకొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులను చితకబాదారు. వారి బస్సులను ధ్వంసం చేశారు. ఈ మేరకు మీడియాలో వచ్చిన వార్తలు విన్నా పూర్తి వాస్తవాలు మనకు తెలియవు. నిజాయతీగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపితేనే నిజం బయట పడుతుంది.

ఏ సభ్య సమాజంలోనైనా సజావుగా పనిచేయాల్సిన సాధారణ వ్యవస్థలు ఇక్కడ విఫలమయ్యాయనేందుకు ఇంతకుమించిన ఉదాహరణ లేదు. బాధ్యతాయుతమైన ఏ సమాజమైనా తీసుకోండి. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చిన మరుక్షణం డాక్టర్లు చికిత్స ప్రారంభిస్తారు. ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తారు. అయినా డాక్టర్లు దేవుళ్లు కాదుగదా! గాయాలు చాలా తీవ్రమైనవి అయినప్పుడు, బయటకు కనిపించని, లేదా చికిత్సకు లొంగని సమస్యలు తలెత్తినప్పుడు వారు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం ఉండదు. కానీ, ప్రశ్నలు వేసే బదులు ప్రాణాలు కాపాడేందుకు వారు ముందుకు ప్రయత్నించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు అత్యుత్తమ స్థాయిలో చికిత్స చేసినప్పటికీ రోగి ప్రాణాలను కాపాడలేక పోవచ్చు. అలాంటి సందర్భాల్లో డాక్టర్లకు ఉన్న పరిమితులను మృతుడి కుటుంబ సభ్యులు, మిత్రులు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు పోయాయని మృతుడి కుటుంబ సభ్యులు ఒక్కోసారి అనుమానించవచ్చు. అలాంటప్పుడు ఆఫిర్యాదుపై తక్షణం స్పందించేందుకు నిజాయతీగల, చురుకైన

యంత్రాంగం వివేకవంతమైన ఏ వ్యవస్థలోనైనా ఉంటుంది. పోయిన ప్రాణాల్ని ఎలాగూ తీసుకురాలేం. కానీ తప్పు చేసిన వారిని శిక్షించాల్సిందే. భవిష్యత్తులోనైనా రోగులకు ఎలాంటి ఆపాయం జరగకుండా విధి-విధానాలను, వ్యవస్థలను మెరుగుపరచాల్సి ఉంటుంది. మృతుల కుటుంబీకులకు భారీగా నష్టపరిహారం ఇప్పించాల్సి ఉంటుంది. ప్రాణం పోయినందువల్ల ఏర్పడిన లోటును వీటితో పూడ్చలేకపోయినా, తప్పును సరిదిద్దుకోవడానికి, న్యాయం చేయడానికి, న్యాయం జరిగేలా చూడటానికి కనీసం మానవ సాధ్యమైన కృషి చేయాలి కదా! దానివల్ల, ఆవేదనే ఆవేశంగా మారి హింసకు దారి తీయకుండా నివారించినట్లవుతుంది. బంధువులు ఆవేశపడిపోయి అకారణంగా, అన్యాయంగా డాక్టర్లపై దాడికి పాల్పడినట్లయితే, అలాంటి వారిని తక్షణం అదుపు చేసి, డాక్టర్లను రక్షించడానికి నేరగాళ్ళను శిక్షించడానికి తగిన యంత్రాంగాలు ఉండాలి. దానివల్ల మరో తప్పును సరిదిద్దినట్లవుతుంది. ప్రజల విశాల ప్రయోజనాల దృష్ట్యా వ్యవస్థ సజావుగా పని చేయడానికి వీలు కలుగుతుంది.

హైదరాబాద్ సంఘటన విషయంలో ఇలాంటివేమీ జరగలేదు. ఘోర నిర్లక్ష్యం కారణంగా ఒక పేషెంట్ మృతిచెందాడు. అతని మిత్రులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని డాక్టర్లపై దాడికి పాల్పడ్డారు. బదులుగా డాక్టర్లూ వీధి పోరాటానికి దిగి, హింసకు పూనుకొన్నాడు. అన్నింటికి మించి, రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లంతా విధులు బహిష్కరించడంతో అనేక మంది ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. రోగులకు సహాయపడి, ప్రాణాలు కాపాడేందుకు తామున్నామన్న విషయాన్ని డాక్టర్లు మరిచిపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకొన్న మీదటనే వారు తిరిగి విధులకు హాజరయ్యారు. మన సమాజంలో తగవులకు, వివాదాలకు హింస ఒక్కటే పరిష్కారంగా మారిందనడానికి ఇంతకుమించిన ఉదాహరణ ఇంకేం కావాలి? వృత్తికళాశాలల్లో చదువుకుంటున్న చురుకైన యువకులు మామూలు వీధిరౌడిల్లా ప్రవర్తించారంటే- విద్య వారిని ఏవిధంగా మరింత మానవతావాదులుగా, ఆలోచన పరులుగా, విజ్ఞులుగా తీర్చిదిద్దినట్లు?

ఈ వ్యవహారంలో తప్పునంతా రెండువైపులా ఉన్న యువకుల మీదే తోసివేయడం మాత్రం ధర్మం కాదు. దశాబ్దాలుగా మన సమాజంలో వేళ్లూనుకుపోయిన పద్ధతులనే వారు అనుసరించారు. అంతే రాయలసీమ లేదా ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు చెందిన హింసాత్మక ముఠాల నాయకులనే తీసుకోండి. ప్రత్యర్థులను యథేచ్ఛగా

చంపుకున్నప్పటికీ వారికేమీ కావడం లేదు. చట్టం నిస్సహాయంగా మారిపోవడమేకాదు, చట్టాన్ని అమలుపర్చాల్సిన వారే అలాంటి హత్యాకాండలను ప్రోత్సహిస్తున్నారు. వైరి వర్గాలకు చెందిన అమాయకులెందరో ముఠాకక్షలకు బలి అవుతున్నారు. ప్రత్యర్థులను పాశవికంగా మట్టుపెట్టడం రోజువారీ కార్యక్రమంగా మారిపోయింది. ముఠాల నాయకులు సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో నేరగాళ్ళ ముఠాలు, మాఫియాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మాఫియాబాస్‌లు ఎలాంటి పనినైనా సునాయాసంగా చక్కబెట్టగలుగుతున్నారు. నిస్సహాయులైన పౌరులకు, పోలీసు అధికారులకు, సినిమా తారలకు, వివిధ రంగాల ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులకు సైతం వారి ఆజ్ఞలే శిరోధార్యం, వాస్తవంలో మాఫియాలు కోర్టులకు ప్రత్యామ్నాయంగా మారిపోయారు. కోరినంత డబ్బిస్తే చాలు వివాదాల్లో తలదూర్చడం, తమదైన తరహాలో కర్కశమైన తీర్పులు వెలువరించడం మాఫియాలకు మామూలైపోయింది. అలాంటి కేసుల్లో మాఫియా నాయకుల ఆయుధాలు – హింస లేదా బలప్రయోగానికి పాల్పడాల్సి వస్తుందన్న బెదిరింపులు, దాసోహమనడం తప్ప బాధితుడి ముందు మరో మార్గం ఉండదు. చట్టం, పోలీసుల నిస్సహాయత కళ్ళకు కడుతుంటుంది. చట్టాన్ని చించి పోగులుపెట్టినవాడే, శాసనకర్త అయినప్పుడు అమాయకులైన ప్రజలకు కానీ, ప్రత్యర్థులకు కానీ రక్షణేముంటుంది? బలాన్ని మరింత బలంతోనే ఎదిరించాల్సి ఉంటుంది కానీ అన్యాయంగా, అక్రమంగా బలాన్ని ప్రయోగించడం మాత్రం చట్టబద్ధం కాబోదు.

విచక్షణరహితంగా బలప్రయోగానికి పాల్పడటం ద్వారానే చట్టాన్ని అమలుపరచగలమని మన పోలీసులు కూడా భావిస్తుంటారు. నిరంకుశ అధికారమే నిర్ణేతగా మారిపోయింది. రోజువారీ లావాదేవీల సందర్భంగా సైతం ఏదైనా విషయాన్ని గట్టిగా చెప్పడానికి పరుషపదజాలాన్ని ఉపయోగిస్తుంటాం. చెయ్యిచేసుకుంటాం, క్యూ కట్టడం మొదలుకొని సిటీ బస్సులో చోటుసంపాదించడం వరకు, బహిరంగస్థలంలో పొగతాగడం మొదలుకొని రోడ్డుమీద ఉమ్మేయడం వరకు, ఒక విషయంపై వివాదం మొదలుకొని సమస్యను పరిష్కరించుకోవడం వరకు అన్నింటా హింసా ప్రవృత్తే. శాంతికి ఎక్కడా చోటే లేదు. హింసకు గురైన వ్యక్తి మరింత హింసతో తిరగబడతాడు, లేదా తనకు జరిగిన అన్యాయాన్ని మౌనంగా భరిస్తాడు. ఏదైనా ఒక వివాదం తలెత్తినప్పుడు – దాన్ని శాంతియుతంగా, న్యాయబద్ధంగా, గౌరవప్రదంగా పరిష్కరించే అవకాశాన్నే మనం కల్పించడంలేదు.

వివాదాలను, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి రాజకీయాలు ఒక మార్గం తర్కసామర్థ్యం, వాస్తవాల ద్వారా నచ్చుజెప్పడం; నాయకత్వ నైతిక శక్తి, మెజారిటీ అభిప్రాయానికి అనుగుణ్యత అనే పద్ధతుల ద్వారా దీనిని సాధించవచ్చు ప్రజాస్వామ్యంలో – మెజారిటీ అభిప్రాయం రాజ్యాంగానికి, చట్టానికి అనుగుణంగా ఉన్నంతవరకు, మైనారిటీ దానిని ఆమోదించాల్సిందే. తరవాత మైనారిటీ అభిప్రాయానికే విస్తృత జనామోదం లభించవచ్చు. అదే మెజారిటీ అభిప్రాయంగా మారవచ్చు లేదా మెజారిటీలో ఉన్నవారు మద్దతు కోల్పోయి, ఒకప్పుడు మైనారిటీలో ఉన్నవారికి అధికారం అప్పగించాల్సి రావచ్చు. విభిన్న సమస్యలకు ఇలాంటి శాంతియుత పరిష్కారమే ప్రజాస్వామ్యం అంతస్సూత్రం.

మన రాజకీయాల్లో అలాంటి సహనశీలత, హుందాతనం, తర్కం ద్వారా లేదా నైతికశక్తి ద్వారా ఇతరులకు నచ్చుజెప్పే సామర్థ్యం అరుదైపోవడం విచారకరం. మన చట్టసభల్లో రాజకీయవాదులెన్నడూ తార్కికంగా, వాస్తవాల ఆధారంగా తమవాదన వినిపించరు. వారు కేవలం ప్రత్యర్థుల నోరు నొక్కేస్తుంటారు. సభ మధ్యలోకి చేరి అల్లరి చేస్తుంటారు. సభా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తారు. దుర్భాషలాడుతారు. ముష్టి యుద్ధాలకు, హింసకు సైతం పాల్పడతారు. చట్టసభలకు ఎన్నికైన మన రాజకీయ నాయకులే ఇలాంటి ప్రమాణాలు నెలకొల్పినప్పుడు, మెడికోలు, ఇంజినీర్లు నాగరికత గల మానవమాత్రులుగా ఎలా ప్రవర్తించగలుగుతారు?

రెండు విద్యార్థి వర్గాల అనాగరికత ప్రవర్తన, హింసాత్మక వైఖరి మన సమాజంలో, రాజకీయాల్లో, సంస్థల్లో లోపాలకు అద్దం పడుతున్నాయి. కానీ మన సమస్యలకు సమాధానం హింసకాదు. పైగా దానివల్ల సమస్యలు మరింత సంక్లిష్టమవుతాయి. పరిష్కారం మరింత కష్టమైపోతుంది. ఉభయవర్గాలూ యథేచ్ఛగా హింసకు పాల్పడ్డాయి. తమకు అన్యాయం జరిగిందని భావించాయి. తమ ప్రవర్తనను సమర్థించుకొన్నాయి. తమవాదనే సరైనదని, అవతలివర్గం వాదన తప్పు అని అన్నాయి. తమ వైఖరే సరైనదనే ఇలాంటి తప్పుడు అభిప్రాయంవల్ల సమస్యను పరిష్కరించడం కష్టం. కుటుంబాల్లో కూడా ఇలాంటి వివాదాలు చూస్తుంటాం. హింసాద్వేషాలు పెరిగాయంటే చాలు కన్నూమిన్నూ గానని పరిస్థితి ఏర్పడుతుంది. మనుషులు అడవిలోని జంతువుల్లా మారిపోతారు. బలమే నిర్ణయాత్మకమైపోతుంది. హింస ప్రబలినప్పుడు అమాయకులు, బలహీనులే అత్యధికంగా నష్టపోతారు. సహేతుకమైన

చర్చ వాదన స్థానే బల ప్రయోగం చోటు చేసుకొంటే- ప్రజా ప్రయోజనం కొరగానిదైపోతుంది. మరి పరిస్థితులను చక్కదిద్దడం ఎలా?

ఒక సమాజంగా సమస్యను మనం గుర్తించాలి. వివాదాల పరిష్కారానికి హింస మార్గం కావడాన్ని ఖండించాలి. ఏది సహేతుకమో, ఏది నిర్హేతుకమో ఆలోచించే జ్ఞానం, భాష ద్వారా తమ అభిప్రాయాలను బలంగా వినిపించగలిగే సామర్థ్యం మనషులకు మాత్రమే ఉన్నాయి. పాశవిక బలాన్ని ఉపయోగించడం పశులక్షణం. మనుషులుగా మనం ఉత్కృష్టస్థాయిలో విభేదాలు పరిష్కరించుకోగలం. శాంతియుత పద్ధతుల ద్వారా న్యాయం పొందగలం. హింస ఏ రూపంలో ఉన్నా, దానిని మనం ఖండించాలి. హింస అనేక విధాలు, మహిళల పట్ల వివక్షణ, పిల్లల చేత వెట్టిచాకిరి చేయించడం, యువతులను వ్యభిచారం ఊబిలోకి లాగడం, కులం పేరుతో అవమానించడం, శ్రమశక్తిని దోచుకోవడం, ఎదిగే అవకాశాలు ఇవ్వకపోవడం- ఇవన్నీ హింసలో భాగమే. బయటకు కనబడే హింస కన్నా ఈ హింసే ప్రమాదకరమైనది. నిజమైన శాంతికాముక సమాజమే న్యాయబద్ధమైన సమాజం కాగలదు. న్యాయబద్ధమైన సమాజంలోనే నిజమైన శాంతి నెలకొనగలదు. సమాజంలో అందరికీ పూర్తి న్యాయం చేకూర్చడం సాధ్యపడకపోవచ్చు కానీ న్యాయాన్ని, నిజాయతీని ఆవిష్కరించే దిశలో ముందంజ వేయలేకపోతే, హింసను ప్రేరేపించినవారమవుదాం.

న్యాయ పరిరక్షణకు, అమలుకు తోడ్పడే సాధనమే చట్టం. చట్టం దుర్బలమైనప్పుడు న్యాయం జరగడంతో ఆలస్యమైనప్పుడు లేదా అసలు న్యాయమే దక్కనప్పుడు బాధితుల ముందు మిగిలేమార్గం హింస ఒక్కటే. ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి తక్షణం చికిత్స చేసి ఉంటే, లేదా అతని సహచర విద్యార్థుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి తగు చర్య తీసుకొని ఉంటే హింసే జరిగేది కాదు. చట్టం విఫలమైనప్పుడు హింసే రాజ్యమేలుతుంది. హింసను సమర్థంగా ఎదుర్కోవాలంటే ఈ సత్యాన్ని మనం గుర్తించాలి. మాఫియా ముఠాల హింసాకాండ ఆచారకత్వానికి దారితీస్తున్న మాట నిజమే. హింస చెలరేగడానికి, మాఫియాలు పేట్రేగడానికి చట్టం విఫలం కావడమే కారణమన్నది మరింత సత్యం. ఏది కారణమో, ఏది పర్యవసానమో అర్థం కానంతగా ఆ రెండూ కలిసిపోయాయి. ఒకదాన్ని మరొకటి ప్రోది చేస్తున్నాయి. అందువల్ల చట్టాన్ని పునరుజ్జీవింపజేయాలి. హింస, అరాచకాల విషవలయాన్ని ఛేదించాలంటే న్యాయబద్ధమైన సమస్యలపై తక్షణం దృష్టిసారించి, ప్రజల వినతులపై

వెంటనే స్పందించగల వ్యవస్థ కావాలి. మన మధ్య ఎంత తీవ్రస్థాయి విభేదాలైనా ఉండవచ్చు. నాగరిక, శాంతియుత పద్ధతుల్లో వాటిని పరిష్కరించుకోవాలి. ప్రజల బాగోగుల కన్నా డబ్బు, అధికారాలే రాజకీయ నాయకులకు ప్రధానమైపోయినప్పుడు హింస అనివార్య పర్యవసానమే. సమాజం ఏ దిశగా సాగాలో నిర్ణయించేది పార్టీలు, రాజకీయ నాయకులే. వారు మనసా, వాచా, కర్మణా హింసను విడనాడవలసి ఉంటుంది. నీతి, నిజాయతీలతో కూడుకొన్న, న్యాయబద్ధమైన రాజకీయ, ఎన్నికల వ్యవస్థను ఆవిష్కరించవలసి ఉంటుంది. లేకపోతే భస్మాసురుడిలా తాము సృష్టించిన హింసాత్మక శక్తుల చేతిలో తామే అంతమైపోతారు.

* * *

# విలువలకు నీళ్లు... 'జాతి నిర్మాతలు' వీళ్లు...!

జూలై 26, 2004

ఈ వారం మనదేశ రాజకీయాల్లో కొన్ని అసాధారణ సంఘటనలు చోటుచేసుకొన్నాయి. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారందరినీ శిబూసొరెన్ ఉదంతం, పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన, మన రాష్ట్రంలో కడప పార్లమెంటు సీటు విషయంలో తలెత్తిన వివాదం ఆవేదనకు గురిచేస్తాయి. ప్రజాజీవినంలో కనీస ప్రమాణాలు పాటించకుండా ప్రజాస్వామ్యాన్ని నడపటం అసాధ్యం. ఎన్నికలలో జయాపజయాలతోనే పాలన నడవదు. ఎన్నికలయిన ప్రభుత్వంపట్ల, చట్టసభల పట్ల ప్రజలలో ఉన్న విశ్వాసమే మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షిస్తుంది. ఈ విషయాన్ని మన ప్రధాన పార్టీలు, ప్రభుత్వాలు విస్మరిస్తున్న వైనం గతవారం సంఘటనలతో ప్రస్ఫుటమైంది.

## మంత్రి పలాయన మంత్రం

శిబూ సొరెన్ సామాన్య పౌరుడు కాదు. ఆయన సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వంలో ఓ కీలకశాఖకు సారథ్యం వహిస్తున్న కేబినెట్ మంత్రి. దశాబ్దాల పర్యంతం జార్ఖండ్ ముక్తిమోర్చాకు ఆయన నాయకుడుగా వ్యవహరించారు. అలాంటి వ్యక్తి 30 ఏళ్ల క్రితం జార్ఖండ్‌లోని చిరూదియాలో సామూహిక హత్యాకాండకు నాయకత్వం వహించారని, ఆ దారుణంలో ప్రధాన నిందితుడని వార్తలొచ్చాయి. ఓ న్యాయస్థానం 30 ఏళ్లు గడిచాక ఆయనపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ఇదేదో సామాన్యమయిన వ్యవహారం కాదు. హత్యాకాండను మించిన నేరం మరొకటి లేదు. అలాగే మరో హత్యానేరంలో కూడా శిబూసొరెన్ ముద్దాయి అని వార్తలొస్తున్నాయి. అలాంటి తీవ్ర నేరాలకు పాల్పడ్డ వ్యక్తులు దేశ రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత ఉన్న చట్టసభలలో ఉండటం మహాపచారం. రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవిస్తానని శపథం చేసి మంత్రి పదవిని చేపట్టిన సొరెన్, తనపై వారెంటు జారీ కాగానే రాజీనామా చేయవలసింది. కాని అలాంటి విచక్షణను, విజ్ఞతను మన రాజకీయ నాయకులలో చాలామంది ఏనాడో కోల్పోయారు. నిస్సిగ్గుగా, జుగుప్సాకరంగా తమ అధికారాన్ని, అక్రమార్జనను,

ఆడంబరాన్ని ప్రదర్శించుకోవటం వారికి అలవాటయింది. అందుకే శిబూసొరెన్ వెంటనే రాజీనామా చేయకపోగా, యూనియన్ మంత్రిగా ఉంటూ ఎవరికీ దొరకకుండా పలాయన మంత్రం పఠించారు! ఇది హాస్యాస్పదమే కాదు; మన ప్రజాస్వామ్యానికి అత్యంత విషాదకరం. సాక్షాత్తు ఓ యూనియన్ మంత్రి చట్టానికి దొరకకుండా ఉండటం కోసం పారిపోవలసిన పరిస్థితి వచ్చిందంటే మన రాజ్య వ్యవస్థ ప్రపంచమంతటా ఎంతగా నగుబాటవుతుందో వేరే వివరించనక్కరలేదు. చిరూదియా కేసులోను, ఇతర హత్యానేరాల విషయంలోను, ముద్దాయిలను అరెస్టు చేయటానికి మూడు దశాబ్దాలు పట్టిందంటే నేర న్యాయ వ్యవస్థ ఎంతగా నత్తనడక నడుస్తోందో అర్థమవుతుంది. ఇందులో న్యాయస్థానాలే కాదు; నేరపరిశోధక యంత్రాంగం కూడా ఎంతగా విఫలమయిందో స్పష్టమవుతోంది. అందుకే మన ప్రజాస్వామ్యాన్ని మళ్ళీ సరయిన బాటమీద పెట్టాలంటే సమూల ప్రక్షాళన అవసరం. ఇక పార్లమెంటులో పాలక, ప్రతిపక్షాల పాత్రను తిలకిస్తే మన వ్యవస్థలో బహిరంగ చర్చలో ప్రమాణాలు ఎంతగా దిగజారాయో తెలుస్తోంది. నేరచరితులను, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొనేవారిని కనీసం మంత్రివర్గం నుంచి తొలగించాలని ఆందోళన చేయటం సబబే. అయితే అందుకు పార్లమెంటును స్తంభింపజేయటం సమర్ధనీయం కాదు. ఏ పార్టీ, లేదా కూటమి అధికారంలో ఉన్నా ప్రతిపక్షాలు బాధ్యతతో వ్యవహరించటం అవసరం. ప్రజాస్వామ్య రథానికి పాలక పక్షం, ప్రతిపక్షం ఇరు చక్రాలు. సభలో ఉన్నవారంతా ఎన్నికయింది ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరించి జనహితాన్ని పెంపొందించడానికే తప్ప ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటంకోసం కాదు. అధికారంలో ఉన్న పక్షాలు తప్పుచేస్తే నిలదీసే బాధ్యత, ప్రజలను సమీకరించే హక్కు ప్రతిపక్షాలకున్నాయి. కానీ అసలు సభా కార్యకలాపాలే నడవకుండా చేయటం ప్రజలకు, ఎన్నికలకు, రాజకీయాలకు హాని చేస్తుంది. అయితే ఏదో ఒక వంకన యాగీ చేయటమే ప్రతిపక్షాల పాత్రగా భావించటం జరుగుతోంది. తహల్కా ఉదంతంలో ఏ నేరమూ రుజువు కాకపోయినా అప్పటి రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్‌ను సభలో బహిష్కరించి ఆనాటి ప్రతిపక్ష పార్టీలు ఓ దుస్సంప్రదాయానికి నాంది పలికాయి. ప్రస్తుత ప్రతిపక్షాలు మరో అడుగు ముందుకువేసి అసలు సభను నడవకుండా చేస్తున్నాయి. మన సార్వభౌమత్వానికి ప్రతీక అయిన పార్లమెంటు ఔన్నత్యాన్ని దిగజార్చటంలో ఇలా ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు. సహేతుకమయిన విమర్శలు, ప్రతి విమర్శలు అవసరం. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమయిన చర్చ

హేతుబద్ధమయిన వాదనలు కీలకం. కాని అసలు చర్చకు, వాదనకు అవకాశమే లేని రీతిలో అన్ని పక్షాలు వ్యవహరించటం దేశ ప్రయోజనాలను, రాజ్యాంగబద్ధ పాలనను, ప్రజాస్వామ్యాన్ని కుంగదీస్తోంది.

ఇప్పటికయినా పార్లమెంటు కళ్లు తెరిచి దేశానికి సమర్థ నాయకత్వాన్నివ్వాలి. పిల్లలు అల్లరి చేస్తుంటే, చట్టసభలలో లాగా ప్రవర్తించవద్దని వ్యాఖ్యానించే పరిస్థితిని పోగొట్టాలి. తీవ్ర నేరాలకు పాల్పడ్డట్టు స్పష్టమయిన ఆధారాలున్న వారందరినీ పార్టీతో నిమిత్తం లేకుండా గుర్తించాలి. అలాంటి వారందరినీ మంత్రి పదవుల నుంచి తొలగించటమే కాదు, పార్లమెంటు నుంచి బహిష్కరించాలి. గతంలో హత్య, మానభంగం, ఉగ్రవాదం, దేశద్రోహంలాంటి తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటూ, న్యాయస్థానంలో నేరారోపణ జరిగిన వారిని చట్టసభలకు అనర్హులుగా చెయ్యాలనే ప్రతిపాదనలు వచ్చాయి. 2002లో అభ్యర్థులు తమ వివరాలను ప్రకటించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో రూపొందించిన ఆర్డినెన్సులో అలాంటి ఎనిమిది నేరాలను పేర్కొన్నారు. రాజకీయంగా పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవటం, అలాంటి నేరారోపణలను న్యాయస్థానంలో ఎదుర్కొంటున్నవారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పరిగణించాలని చేసిన ప్రతిపాదన ఆనాడు వీగిపోయింది. ఇప్పటికయినా అన్ని పార్టీలు కళ్లు తెరిచి పార్లమెంటులో ఉన్న 'నేరస్తుల'ను సభనుంచి బహిష్కరించాలి.

## రాజ్యవ్యవస్థ అనైతికత

ఇక మనరాష్ట్రంలో పక్షం రోజులుగా కడప పార్లమెంటు స్థానం గురించి వచ్చిన ఊహాగానాలకు తెరపడటం సంతోషకరం. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన ఆ లోక్‌సభ స్థానం నుంచి ఆయన సోదరుడు వివేకానందరెడ్డి ప్రస్తుత లోక్‌సభ సభ్యులు. అయితే స్వయానా సోదరుడితో రాజీనామా చేయించి, ఆ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో తన కుమారుడిని నిలబెట్టించి గెలిపించాలని రాజశేఖరరెడ్డి ఆలోచిస్తున్నారని, అందుకు పావులు కదుపుతున్నారని వార్తలొచ్చాయి. అలాంటి ఆలోచనలేదని, తన సోదరుడు లోక్‌సభ సభ్యులుగా కొనసాగుతారని వై.ఎస్. ప్రకటించటం విజ్ఞతతో కూడుకున్న నిర్ణయం. నియోజకవర్గాలు కుటుంబ ఆస్తులుగాను, సొంత ఎస్టేట్లుగానూ మారిపోతున్నాయి. రాజకీయం ప్రజాసేవ కోసం కాక లాభసాటి వ్యాపారంగా రూపాంతరం చెందింది. దాంతో ఆధునిక జమీందారీలు దేశంలో అన్ని ప్రాంతాలలోను వెలిశాయి. మన ప్రజాస్వామ్యానికి ఇది ఓ భయంకర

సమస్య. ప్రజల విశ్వసనీయత ఉండాలంటే, రాజ్యాంగ విలువలను రక్షించాలంటే, రాజకీయాన్ని మళ్ళీ జనహితాన్ని పెంచే పవిత్ర వ్యాసంగంగా ప్రతిష్ఠించాలి. అలాకాక వారసత్వ రాజకీయాలను నడుపుతూ, పదవులను ఆస్తులలాగా పంచాలని చూడటం, జాతి ప్రయోజనాలకన్నా, కుటుంబ ప్రయోజనాలను మిన్నగా భావించటం అత్యంత ప్రమాదకరం. వామపక్షాలను మినహాయిస్తే అన్ని ప్రధాన పార్టీలలోను ఈ ధోరణులు ప్రబలిపోయాయి. అందుకే ఎన్నికల వ్యవస్థను మార్చటం, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పటం నేటి జాతీయ అవసరం.

ఏవ్యవస్థ అయినా కేవలం చట్టాలవల్ల, ఎన్నికల వల్ల, అధికారంలో ఉన్న వాళ్ల పటాటోపంవల్ల నడవదు, ప్రజలకు ఆ వ్యవస్థ పట్ల ఉన్న విశ్వాసమే ప్రజాస్వామ్యానికి ఊపిరి. అలాకాక రాజ్య వ్యవస్థలో అనైతికత, అదర్శం చోటుచేసుకున్నాయన్న భావన ప్రనజలలో బలపడితే, ఆ నిరాశా నిస్పృహల నుంచి అశాంతి, హింస ఏదో ఒక రూపంలో పుడతాయి. వివిధ రూపాలలో ఉన్న నక్సలైటు ఉద్యమాల హింస, దేశంలోని వివిధ ప్రాంతాలలో కుల, మతాల పేరిట జరుగుతున్న హింస, ఉగ్రవాద ఉద్యమాలు, వేర్పాటు వాదాలు– ఇవన్నీ రాజ్య వ్యవస్థ నైతికత సడలిన కారణంగానే ఉద్భవించాయి. ఇటీవలి నాటకీయ పరిణామాలు మన రాజ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. ఈ సంక్షోభానికి చక్కని పరిష్కారాలున్నాయి. అయితే వాటిని అమలు చేయాలంటే రాజకీయ పార్టీలు ముందుకు రావాలి. అధికార క్రీడలో మైమరచిపోతున్న రాజకీయ నాయకులు ఒక్కసారి కళ్లు తెరిచి, నిజమైన సమస్యల మీద దృష్టిని సారించాలి. దేశంకోసం కాకపోయినా, కనీసం తమ రాజకీయ ఉనికి కోసమయినా పార్టీలు, రాజకీయ నాయకులు మేల్కోవటం అవసరం. లేదంటే తమవేళ్లతో తమ కళ్లనే పొడుచుకోవటంతోపాటు, జాతి చరిత్రలో నిరర్థకులుగా ఈతరం రాజకీయ నాయకులు నిలిచిపోతారు.

* * *

# ప్రజాసేవకే.. ప్రభుత్వమైనా, ఉద్యోగులైనా!

**ఆగస్టు 4, 2003**

తమిళనాడులో ఇటీవల జరిగిన ప్రభుత్వోద్యుగల సమ్మె. దాన్ని జయలలిత సర్కారు ఎదుర్కొన్న తీరు. ఆ అంశంపైన వచ్చిన కోర్టు తీర్పులు. చివరికి ప్రభుత్వోద్యోగులు విధి నిర్వహణలో చేరటం. ఇవన్నీ బహుశా మనదేశ పాలన వ్యవస్థలో కీలక ఘట్టాలుగా నిలిచిపోతాయి. మనదేశంలో ప్రభుత్వోద్యోగులకు అమితమైన ఆదరణ, గౌరవం. ఆ ఉద్యోగాలకు అలవిమాలిన గిరాకీ ఉండటానికి కారణాలు ముఖ్యంగా మూడు. 104 కోట్ల జనాభాలో కేవలం రెండుకోట్ల ఎనభై లక్షల మంది మాత్రమే ప్రతి నెల జీతం పుచ్చుకునే సురక్షిత ఉద్యోగాలలో– సంఘటిత రంగంలో ఉన్నారు. మిగిలినవారంతా అసంఘటిత రంగంలో పనిచేస్తున్నవారే. మనలాంటి బీద సమాజంలో ప్రభుత్వోద్యోగం జీవనపర్యంతం. భద్రతను, ఆర్థిక పరపుష్టిని ఇవ్వటంతో ప్రభుత్వోద్యోగం అంటే సహజంగానే గిరాకీ, గౌరవం ఎక్కువ. ఇది మొదటి కారణం. వలసపాలన ఫలితంగా ప్రభుత్వం అనగానే అమితమయిన భయభక్తులు సమాజంలో జీర్ణించుకుపోయాయి. ప్రభుత్వోద్యోగుల పట్ల గౌరవం శ్రుతిమించింది. స్వతంత్ర్యం వచ్చాక ప్రభుత్వ ప్రాధాన్యం బాగా పెరిగింది. ప్రభుత్వ తాను చేపట్టవలసిన కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసి, చేయకూడని పనులలో నిమగ్నమైంది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలు, నేరన్యాయ వ్యవస్థ, పౌరన్యాయం ఇవన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయి. కానీ లైసెన్సు– పర్మిట్ కోటా రాజ్యాన్ని ఏర్పాటు చేయటంతో సామాన్యుల జీవనంలో ప్రతి చిన్న అవసరానికి ప్రభుత్వం ఆసరా, అండ తప్పనిసరి అయ్యాయి. ఓ చిన్న వ్యాపారం చెయ్యాలన్నా, పరిశ్రమ పెట్టాలన్నా, ఇల్లు కట్టుకోవటానికి సిమెంటు కావాలన్నా టెలిఫోను ఏర్పాటు చేసుకోవాలన్నా, రైల్వే రిజర్వేషను కావాలన్నా, ప్రతి నెలా పంచదార, కిరోసిన్ కొనుక్కోవాలన్నా– ఇలా నిత్యజీవితంలో చిన్న, పెద్ద పనులన్నింటికీ ప్రభుత్వమే ఆసరా అయింది. మన స్వేచ్ఛను హరించివేసి, ప్రతి చిన్న విషయాన్ని ప్రభుత్వం నియంత్రించటంతో ఉద్యోగుల అధికారం పెరిగింది. ఆపైన బీదరిక నిర్మూలన కోసం

ఎన్నో సబ్సిడీ పథకాలను అమలు చేయడంతో ప్రభుత్వోద్యోగిది ఇచ్చే చెయ్యి, పౌరులది పుచ్చుకునే చెయ్యి అయింది. దీంతో సార్వభౌములు కావలసిన ప్రజలు చేయి చాచి యాచించే దీనులుగా, అర్థుకులుగా మారిపోయారు. ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజాసేవకులుగా ఉండాల్సిందిపోయి ప్రజలకు యజమానులుగా అవతారమెత్తారు. ఇది రెండో కారణం. ఇక మూడో కారణం మనది 'ఆదిపత్యధోరణి ప్రబలంగా ఉన్న సమాజం కావడం. ఓ కుటుంబంలోనో, ఓ సంస్థలోనో, దేశం మొత్తంలోనో సామర్థ్యం, సామరస్యం, సహజీవనం, సమష్టి కృషి కీలకమయినవిగా భావించే సమాజం కాదు మనది; పెత్తనం, అధికారం అహంకారం, ఆడంబరం మన సమాజంలో అన్ని స్థాయిలలో తరతరాలుగా కీలకపాత్ర వహిస్తున్నాయి. మన కులవ్యవస్థ, లింగవివక్ష అందుకు సజీవసాక్ష్యాలు. ఆధిపత్య ధోరణి ప్రబలంగా ఉన్న సమాజంలో సహజంగానే ప్రభుత్వ ఉద్యోగమంటే ఆకర్షణ ఉండటంతో ఆశ్చర్యం ఏమీలేదు.

## రాజకీయ నాయకుల ఆశక్తత

ప్రభుత్వోద్యోగం అంటే గౌరవం, భక్తి, భయం పెరిగిపోగా, స్వతంత్రం వచ్చాక కాలక్రమేణా రాజకీయాలపట్ల జుగుప్స పెరిగింది. అసలు రాజకీయం చేయడమంటేనే చెడుచేయడమనే విపరీతార్థం ప్రచారంలోకి వచ్చింది. చివరికి రాజకీయ నాయకులు కూడా తమ ప్రత్యర్థులను "ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారు" అని విమర్శించే స్థితికి రాజకీయం చేరి మన సమాజంలో పలచనైపోయింది. చాలామంది నిజాయతీపరులు, సమర్థులయిన పౌరులు రాజకీయాలు మంచివాళ్లకు పనికిరావనే నిర్ధారణకు వచ్చారు. ఎన్నికయిన ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయాన్ని తిరస్కరించటం, సంయమనం లేని నిందలకు పాల్పడటం, నిర్హేతుకమయిన విమర్శలకు పూనుకోవడం సర్వసాధారణమయ్యాయి. రాజకీయాల్లోనే ఉన్నవారు తమ ప్రత్యర్థులపై పరుష పదజాలం ఉపయోగించడం, తిట్లు, శాపనార్థాలే బహిరంగ చర్చ కావడం 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అనే సంస్కృతి ప్రబలడం– ఇవన్నీ రాజకీయాల ప్రతిష్ఠను మరింతగా దిగజార్చాయి. నిజానికి మనం పక్కవాళ్లను నొప్పించకుండా, నిరంతరం లౌక్యంగా వ్యవహరిస్తూ ఏ ఎండకా గొడుగు పడుతూ బతికేయొచ్చు కానీ రాజకీయాల్లో ఉన్న వాళ్లు వివిధ విషయాలపైన ఓ నిర్ధారణకు వచ్చి స్పష్టమయిన నిర్ణయాలు తీసుకోవాలి. అన్నింటా తాత్సారం చేయకూడదు. ఎన్నో కృత్రిమ అడ్డుగోడలతో

ముక్కలైన మన సమాజంలో ఈ మాత్రమయినా సామరస్యం, సాంఘిక న్యాయం ఉన్నాయంటే అందులో రాజకీయనాయకుల కృషి ఉంది. అయినా రాజకీయ నాయకులు ఓ విషవలయంలో చిక్కుకున్న బాధితులని గుర్తించక, వారిని పరుషంగా నిందించటం; ఉద్యోగులను, అధికారులను మంచివాళ్లుగా, నిజాయతీపరులుగా, రాజకీయ నాయకులు అక్రమాలను ఎదిరిస్తున్న ధీరోదాత్తులుగా చిత్రించడం- ఈ రెండు ధోరణులు మన సమాజంలో ప్రబలిపోయాయి. అలా అని రాజకీయ నాయకులు చేస్తున్నదంతా మంచి అని వాదించటం హాస్యాస్పదమవుతుంది. మన రాజకీయ వ్యవస్థలో నిజాయతీతో దీర్ఘకాలం అధికారంలో మనగలగటం అసాధ్యమనే విషయాన్ని గుర్తించక, కేవలం రాజకీయనాయకులు దుర్మార్గులు కావటంవల్లనే అన్ని అన్యాయాలు జరుగుతున్నాయని వాపోవడం అజ్ఞానానికి నిదర్శనం. ఉద్యోగులకు తమ మనుగడ గురించి భయంలేదు. ఏ చిన్న పనికయినా ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే మనలో అత్యధికులకు ఎదురయ్యేవి అవమానం. అలస్యం, అవినీతి, అహంకారం. కానీ ఉద్యోగులు సాధారణంగా మనలాగే మధ్యతరగతి విద్యావంతులు కాబట్టి ఉద్యోగవర్గాన్ని సమర్థించడం, రాజకీయ నాయకులను నిందించడం సులభమయింది. 'ప్రభుత్వం ఉంది ఎందుకు? అని ప్రశ్నిస్తే 'పన్నులు వసూలుచేసి ఉద్యోగులకు జీతభత్యాలు ఇచ్చేందుకు' అని సమాధానం చెప్పే పరిస్థితి వచ్చింది. ఓ ప్రభుత్వం జీతాలు బట్వాడా చేస్తే అది బాగానే నడుస్తున్నట్లు. ఆ జీతాలు ఆగిపోతే అన్నిరకాలుగా పతనమయినట్లు మన భావన. నిజానికి పరిణతి చెందిన ప్రనజాస్వామ్యాలలో పరిస్థితి దీనికి విరుద్ధం. 1961లో అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ అమెరికన్ కాంగ్రెస్ ప్రతిపాదించిన బడ్జెట్‌ను తిరస్కరించటంతో ప్రజాధనాన్ని వెచ్చించటం సాధ్యంకాలేదు. దాంతో కొంతకాలంపాటు ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలను ఆపేశారు. కొన్ని అత్యవసర సర్వీసులు తప్ప మిగిలిన కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. 1995లో బిల్‌క్లింటన్ రెండుసార్లు బడ్జెట్ ప్రతిపాదనలను తిరస్కరించటంతో జీతభత్యాల బట్వాడా ఆగిపోయింది. అయినా ఆ సందర్భాలలో ప్రభుత్వం నైతికంగా పతనమయినట్లుగా ఎవరూ భావించలేదు. నిజానికి ఆ ఇద్దరు అధ్యక్షులు ఆ ఉదంతాలవల్ల మరింత సమర్థులుగా, నిర్భీతితో ప్రజాసంక్షేమానికి కృషిచేసేవారుగా పేరుతెచ్చుకుని రాజకీయంగా బలం పెంచుకున్నారు. మన రాష్ట్రాలలో ప్రభుత్వోద్యోగులు ఏయే సేవలందిస్తున్నారో పరిశీలిస్తే కొన్ని విచిత్రాలు బయటపడతాయి. 50 శాతం మంది ప్రభుత్వోద్యోగులు గుమాస్తాలు, డ్రైవర్లు, ప్యూనులే. అధ్యాపకులకు, ఆరోగ్యరంగంలో

పనిచేసేవారికి, శాంతి భద్రతలందించే పోలీసులకు, న్యాయమూర్తులకు విపరీతమయిన కొరత ఉంది. ఒకవేళ ఉద్యోగులను ప్రజలకు సేవలందించే రంగంలోనే నియమించినా, అక్కడ జవాబుదారీతనం కానరాదు. తరచు ఆ ఉద్యోగులలో చాలామంది పౌరులకు అందుబాటులోనే ఉండరు. అయినా ఉద్యోగుల జీతభత్యాలు పెరుగుతూనే ఉంటాయి. పెన్షన్ల బట్వాడా త్వరలో జీతాలను మించిపోయే స్థితి వచ్చింది. ఈ పరిస్థితుల్లో కూడా గుజ్రాల్ మంత్రివర్గం ఐదవ వేతన సంఘం సిఫారసులను మాత్రం బుట్టదాఖలు చేశారు. ఆ నిర్ణయాన్ని తీసుకొన్న సందర్భంగా కొందరు మంత్రులు క్యాబినెట్ సమావేశం మధ్యనుంచి బయటికి వచ్చి పట్టు విడవవద్దని, డిమాండ్లకు ప్రభుత్వం దిగి వస్తుందని ఉద్యోగ సంఘాల వారికి సలహా ఇచ్చినట్లుగా వార్తలొచ్చాయి. ఇలా క్యాబినెట్ వ్యవస్థకన్నా, సమష్టి బాధ్యతకన్నా ఉద్యోగవర్గాలను సంతృప్తి పరచటమే మంత్రులకు, పార్టీలకు ముఖ్యమైపోయింది. ఉద్యోగులు సంఘటితంగా ఉండటం, ఎన్నికనాడు పోలింగ్ కేంద్రాలలో మోహరించేది ఉద్యోగులే కాబట్టి వారిని దూరంచేసుకుంటే ఓడిపోతామన్న భయం ప్రభుత్వాలను, రాజకీయ నాయకులను ఆశక్తుల్ని చేస్తున్నాయి. ఐదవ వేతన సంఘం సిఫారసులను అమలుచేస్తూ తీసుకున్న నిర్ణయం కారణంగా మనదేశంలో ప్రజలపై పడ్డ అదనపు భారం ఏటా రూ. 80,000 కోట్లు. ఆ ఒక్క నిర్ణయం కారణంగా మన ద్రవ్యలోటు విపరీతంగా పెరిగి, ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. స్వతంత్ర ఆలోచనా శక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో రాజ్యాంగంలోని 311వ అధికరణం ద్వారా ఉద్యోగులకు అమితమయిన రక్షణ కల్పించడం- అవి నీతిపరులకు, అసమర్థులకు అండగా, సమాజానికి గుదిబండగా మారింది.

## మారుతున్న ధోరణులు

ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. అవినీతిపైన, ఉద్యోగస్వామ్యంపైన ప్రజలలో అసంతృప్తి రగులుతోంది. గత సంవత్సరం కేరళలో ఉద్యోగులు సమ్మెకు పాల్పడ్డప్పుడు ఎ.కె. ఆంటోనీ ప్రభుత్వం నిర్భయంగా నిలిచి పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఇప్పుడు జయలలిత ప్రభుత్వం ఎన్నడూ ఊహించని కఠిన చర్యలను తీసుకుని సమ్మెలో ఉన్న ఉద్యోగులను దారిలో పెట్టగలిగింది. న్యాయస్థానాల తీరులో కూడా చాలా మార్పు వస్తోంది. ఉద్యోగుల రక్షణ కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమనే స్పృహ కోర్టు తీర్పులలో కానవస్తోంది. మారిన పరిస్థితుల్లో కాయకష్టంతో కడుపునింపుకొంటున్న కోట్లమంది సామాన్యుల ఓర్పు నశిస్తోంది. రాజకీయ

నాయకుల్లో ధైర్యం పెరుగుతోంది. ఇది కార్మికుల హక్కులకు సంబంధించిన విషయం కాదు. పారిశ్రామిక రంగంలోని కార్మికులు మున్నెన్నడూ లేనంత బాధ్యతతో, సంయమనంతో మెలుగుతున్నారు. పోటీ పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో తమ ఉత్పాదకత, నాణ్యత పెరిగితేనే పరిశ్రమలు నిలబడతాయనే స్పృహతో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వోద్యోగుల సమ్మెలకు, కార్మికుల హక్కులకు పొంతనలేదు. ఇది కేవలం పౌరసేవలకు, పన్నుల డబ్బుకు, జవాబుదారీతనానికి సంబంధించిన అంశం. అందుకే కేరళ, తమిళనాడు ఉదంతాలలో ప్రభుత్వాల ధృడవైఖరిని జనసామాన్యం సమర్థించింది.

ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని, మనపాలనా వ్యవస్థను సంస్కరించి, ప్రజాసంక్షేమాన్ని పెంచే బలమైన యంత్రాంగం మార్చడం అవసరం. అందుకు నాలుగు చర్యలను చేపట్టాలి. మొదటిది ప్రభుత్వ యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించి విద్య, ఆరోగ్యం, కీలక పౌరసేవలకు పెద్దపీట వేయాలి. అత్యధికులయిన ఉద్యోగులు ఈ రంగాలలో సేవలందించేలా మార్పులు తేవాలి. రెండోది జవాబుదారీతనాన్ని పెంచి, అసమర్థతను, అవినీతిని అంతమొందించేందుకు సత్వరం కఠిన చర్యలు తీసుకోవాలి. మూడోది ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్‌లకు చెందిన ఉన్నతాధికారవర్గం ఉద్యోగులకు ఆదర్శం కావాలి. ఉన్నతస్థాయిలో ఎన్నో అనవసరపు పదవులను, పదోన్నతులను కల్పిస్తున్నారు. ప్రజల సంక్షేమాన్ని కాకుండా అధికారుల లాభనష్టాలను బేరీజు వేస్తున్నారు. ప్రజలకు సమర్థసేవలందించడానికి బదులు అందరినీ ప్రజాధనంతో తృప్తిపరచటమనే సంస్కృతి నశించాలి. రాజకీయ నాయకులు పిరికితనాన్ని వీడనాడాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రక్రియ ప్రాధాన్యాన్ని గుర్తించి, గౌరవించడం నేర్చుకోవాలి. ఎన్నికయిన ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండటం, పారదర్శకతను పెంచడం, పౌరసేవల ప్రమాణాలను మెరుగుపరచడమనే సూత్రాలను ఉద్యోగవర్గం తు.చ. తప్పకుండా పాటించాలి. గత 56 ఏళ్ల ప్రజాస్వామ్యంలో ఎన్నో అపశ్రుతులు దొర్లాయి. సమాజ ప్రయోజనాలను విస్మరించి కొన్ని సంఘటిత వర్గాల సమిష్టి ప్రయోజనాలకసం మన రాజకీయాలను, ప్రమాణాలను తాకట్టుపెట్టారు. దీని వల్ల నష్టపోయింది కోట్లమంది అమాయక ప్రజలు. ఇప్పటికయినా మన పాలనలో, రాజకీయంలో సామాన్యుణ్ని కేంద్రబిందువుగా పునః ప్రతిష్టించడం అవసరం.

* * *

# జాతి హితం పట్టని రాజకీయ చదరంగం

**ఏప్రియల్ 5, 1999**

అడ్మిరల్ భగవత్ తొలగింపుపై తాజా ప్రకంపనలు కేంద్ర ప్రభుత్వంలోని రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేశాయి. స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారిగా రాష్ట్రపతి గత డిసెంబరు 30న నౌకాదళాధిపతి విష్ణుభగవత్‌ను పదవినుంచి తొలగించారు. మామూలుగా పదవీ విరమణ చేసిన అధికారులలాగే ఆయనకూ పెన్షను, ఇతర సౌకర్యాలు కల్పించారు. దాదాపు తొమ్మిదేళ్ల క్రితం తనకు ప్రమోషన్ ఇవ్వలేదని భగవత్ కోర్టుకెక్కారు. అప్పుడు తన పైవాళ్లమీద ఆరోపణలు చేశారు. ఆయన పదోన్నతికి ఆనాటి నౌకాదళాధిపతి అడ్డుపడ్డారు. భగవత్‌కు సైనిక దళాలలో పై పదవులకు తగిన సంయమనం, విజ్ఞత లేవని అభిప్రాయపడ్డారు. అసలు నౌకాదళాపతి మాటకు విలువలేదని, ఉన్నతస్థాయిలో నియామకాలను కేంద్ర మంత్రివర్గానికి చెందిన నియామకాల సంఘం చేయాలని భగవత్ బల్లగుద్ది మరీ వాదించారు. చివరికి పదోన్నతి పొందారు. ఆ తరవాత ఆయనమీద రహస్య నివేదికలో కొన్ని అభిశంసనలు వచ్చాయి. నౌకాదళాధిపతిగా ఉన్న అడ్మిరల్ నాదకర్ణి రహస్య నివేదికలో భగవత్ ఉన్నత పదవులకు పనికిరారని నిర్ధారించారు. అడ్మిరల్ నాదకర్ణితో వ్యక్తిగత పరిచయం ఉన్న ఎవరికయినా ఆయన ఎంతటి సౌమ్యుడో, నిరాడంబరుడో తెలుసు. నాదకర్ణి అనంతరం నౌకాదళాధిపతి అయిన అడ్మిరల్ రామదాస్ కొంతకాలంపాటు భగవత్ ప్రమోషన్‌ను వ్యతిరేకించారు. చివరకు ఏ కారణంవల్లనోకాని మనసు మార్చుకుని ప్రమోషన్‌కు సిఫారసు చేశారు. భగవత్ ఆ తరవాత తన వ్యక్తిగత రికార్డులలో వ్యతిరేకంగా ఉన్న అంశాలను తొలగించమని ఆర్జీపెట్టుకుని, ఎట్టకేలకు నౌకాదళాధిపతిగా నియమితులయ్యారు. అప్పుడాయన ఇష్టంవచ్చిన వాళ్ళకు పై పదవులిచ్చి తనకు నచ్చనివాళ్లను అణచివేశారని ఆరోపణలు వచ్చాయి. భగవత్ మాదిరే వైస్ అడ్మిరల్ హరీందర్‌సింగ్ కోర్టుకెక్కి నౌకాదళాధిపతి మతతత్వాన్ని ప్రదర్శిస్తున్నాడని, తాను పంజాబీ సిక్కు మతస్తుడయిన కారణంగా తనకు తగిన పదవినివ్వటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆ తరవాత హరీందర్‌సింగ్‌ను ఉపనౌకాదళాధిపతిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్మిరల్ భగవత్ ఆ ఉత్తర్వును ఖాతరు చేయలేదు. తన సమ్మతి లేకుండా ఆ నియామకం జరిగింది కాబట్టి దాన్ని అమలుచేయటం సాధ్యం కాదని వాదించారు. ప్రభుత్వం ఎంత కోరినా భగవత్ పట్టువీడలేదు. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా ఉన్న శరద్‌పవార్ జోక్యం చేసుకుని సంఘర్షణను నివారించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ అంశమే కాకుండా మరెన్నో విషయాలలో పెడసరంగా ప్రవర్తిస్తున్నారని, తన తోటి అధికారులతో సమన్వయం సాధించలేకపోతున్నారని, ఆయన కొనసాగటం ప్రజా ప్రయోజనాలకు, దేశ భద్రతకు శ్రేయస్కరం కాదని భావించి ప్రభుత్వ సిఫారసుపై రాష్ట్రపతి డిసెంబరు 30న భగవత్‌ను తొలగించారు. ఆయనను తొలగించటంతోపాటు ఆనాటి రక్షణ కార్యదర్శి అజిత్‌కుమార్‌ను బదిలీ చేశారు. అడ్మిరల్ సుశీల్‌కుమార్‌ను నూతన నౌకాదళాధిపతిగా నియమించారు. అసాధారణ పరిస్థితులలో నౌకాదళాధిపతిగా నియుక్తులయినా, అడ్మిరల్ సుశీల్‌కుమార్ హుందాగా, సంయమనంతో ప్రవర్తించారు. భగవత్‌ను పల్లెత్తుమాట అనలేదు. ఆయనకు పూర్తి గౌరవమిచ్చారు. లాంఛనాలను పూర్తిచేశారు. భగవత్ భార్య నిలోఫర్ భగవత్ మాత్రం ప్రభుత్వంమీద, రక్షణమంత్రి మీద బహిరంగంగా విరుచుకుపడ్డారు. పత్రికలకెక్కారు. పదవీచ్యుతి భగవత్‌కు జరిగితే, అదేదో కుటుంబ వ్యవహారంలాగా, రాజకీయంలాగా నిలోఫర్ భగవత్ వ్యవహరించారు. ఈలోగా రాష్ట్రపతి ఫిబ్రవరిలో హరీందర్‌సింగ్‌ను ఉప నౌకాదళాధిపతిగా నియమించారు.

## దేశద్రోహ ఆరోపణలా...?

ఫిబ్రవరి 22న పార్లమెంటు బడ్జెటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 21న భగవత్ ఢిల్లీలో ప్రెస్‌క్లబ్‌లో రక్షణమంత్రి ఫెర్నాండెజ్‌పైన, తన వారసుడు అడ్మిరల్ సుశీల్‌కుమార్‌పైనా, ప్రభుత్వంపైనా, హరీందర్‌సింగ్‌పైనా, మాజీ రక్షణ కార్యదర్శి అజిత్‌కుమార్‌పైనా తీవ్ర ఆరోపణలు చేశారు. పార్లమెంటు సభ్యులకు ఆ కాగితాలను అందించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి తన అభియోగాలను అందజేశారు. పార్లమెంటులో ఆవిషయమై దుమారం చెలరేగింది. అన్నింటిలోకి విచిత్రమయిన అభియోగాలను రక్షణమంత్రి జార్జిఫెర్నాండెజ్‌పైన మోపారు. రక్షణమంత్రి దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, టెర్రరిస్టులకు రక్షణ కల్పిస్తున్నారని, తీవ్రవాదులతో చేతులు కలిపారని ఒక అభియోగం. అందుకు ఏ చిన్న ఆధారాన్నీ చూపలేదు! రాజకీయ పరిజ్ఞానం గలవారికి జార్జి ఫెర్నాండెజ్

సోషలిస్టు నేపథ్యం గురించి తెలుసు. టిబెట్‌లో దలైలామా అనుచరులకు, బర్మాలో ఆంగ్‌సాన్ సూకీ నాయకత్వంలోని ప్రజాస్వామ్య ఉద్యమానికి కొంతమేరకు, పూర్వం నేపాల్‌లో రాజుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాస్వామ్య ఉద్యమానికి ఆయన బహిరంగంగా మద్దతునిచ్చారు. ఆమాటకొస్తే దలైలామాను, ఆయన తోటి టిబెటన్లను భారతదేశానికి 'గౌరవ అతిథులు'గా ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ణించారు. బర్మాలో ఆంగ్‌సాన్ సూకీ నేటి ప్రపంచంలో నెల్సన్‌మండేలా తరవాత అంతటి మహోన్నత వ్యక్తిత్వం, త్యాగనిరతి, ధైర్యం గల నేత. ఒక బ్రిటిష్ దేశస్తుడిని పెళ్లాడి ఇంగ్లాండులో స్థిరపడినా మాతృదేశం పట్ల మమకారాన్ని వదులుకోలేక బర్మాలో సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా దశాబ్దం పాటు పోరాడుతున్న వీరవనిత ఆంగ్‌సాన్ సూకీ. ప్రజల ఒత్తిడి మేరకు సైనిక పాలకులు జరిపిన ఎన్నికలలో ఆంగ్‌సాన్ సూకీ, ఆమె అనుయాయులు అఖండ విజయం సాధించారు. ఆమెకు అధికారం అప్పగించటానికి ఇష్టపడని సైనిక ప్రభుత్వం ఆ ఎన్నికలను రద్దుచేసి ఆమెను గృహనిర్బంధంలో ఉంచింది. ఎన్నికయిన పార్లమెంట్ సభ్యులను జైళ్లలో పెట్టింది. సామాన్య పౌరులను హింసించింది; విచక్షణారహితంగా నిర్బంధించింది. తన భర్త క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడయినా ఆంగ్‌సాన్ సూకీ బర్మా వదిలి ఇంగ్లాండు వెళ్లే సాహసం చేయలేదు. ఒకసారి దేశాన్ని వదిలితే మళ్లీ తనని తిరిగి రానివ్వరని ఆమె భయం! తన కుటుంబంతో, పిల్లలతో హాయిగా విదేశాలలో జీవించటంకన్నా, మాతృదేశంలో అష్టకష్టాలుపడుతూ అయినా గృహనిర్బంధంలో మగ్గుతూ తన ప్రజలతో మమేకమవటమే మిన్న అనుకున్న అసాధారణ నాయకురాలు ఆంగ్‌సాన్ సూకీ. ఇక నేపాల్ ఉద్యమం విషయానికి వస్తే మాజీ ప్రధాని చంద్రశేఖర్, మరెందరో దేశ నాయకులు నేపాల్‌లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని సమర్థించారు. ఇంతకీ ఫెర్నాండెజ్ చేసిన దేశద్రోహం ఏమంటే టిబెటన్లను, బర్మాలో ప్రజాస్వామ్యవాదులను సమర్థించటం! 1950 దశకంలో టిబెట్‌ను చైనా ఆక్రమించినప్పుడు భారత్ దూరదృష్టితో స్పందించలేదని ఇప్పటికీ చాలామంది అభిప్రాయం. మిగతా విషయాలు ఎలాగున్నా, భారత్‌కు, చైనాకు మధ్య స్వతంత్ర రాజ్యంగా టిబెట్ ఉంటే చైనాతో భారత్‌కు ప్రత్యక్షంగా సరిహద్దు తగాదా, సంఘర్షణ ఉండేవి కావు. బర్మాలో ఆంగ్‌సాన్ సూకీని, ప్రజాస్వామ్య పోరాటాన్ని సమర్థించకపోవటం భారత్ చేసిన పెద్ద తప్పు. 1956లో హంగరీలో 1968లో చెకొస్లోవియాలో సోవియట్ టాంకుల కింద ఆ రెండు దేశాల ప్రజలు నలిగినప్పుడు మిన్నకుండి భారత్ తన నైతిక శక్తిని కోల్పోయింది. 1979లో అఫ్ఘనిస్థాన్‌లో సోవియట్ సైన్యం ప్రవేశించినప్పుడు కూడా చొరవ

తీసుకోకపోవటంతో ఆసియాలో భారత్ పలుకుబడి క్షీణించింది. పొరుగునే ఉన్న బర్మాలో సైనిక నియంతలు ప్రజాస్వామ్య ఉద్యమాన్ని పశుబలంతో అణిచివేస్తుంటే ప్రేక్షకులమై మన ప్రజాస్వామ్య సంస్కృతిని అపహాస్యం చేశాం. ఫెర్నాండెజ్ ఇంట్లో టిబెటన్లకు, బర్మా ప్రజాస్వామ్యవాదులకు ప్రవేశం కల్పిస్తే అది దేశ ద్రోహమని, తీవ్రవాదులతో చేతులు కలపటమేనని ఇప్పుడు భగవత్ వాదిస్తున్నారు. ఏమాత్రం బాధ్యత లేకుండా, ఉచితానుచితాలు మరచి ప్రేలాపనలు చేయటం, నోటికి వచ్చిన ఆరోపణలు చేసి చేతికందిన బురద చల్లటం భారతదేశ ప్రజాజీవనంలో సర్వసాధారణమయిపోయింది. అధికారమనే జూదంలో ఏ పావును ఎలా వాడినా ఫరవాలేదనే సంస్కృతి పార్టీలకు బాగా అబ్బింది. అందుకే నిస్సిగ్గుగా ఒక నౌకాదళాధిపతి తొలగింపును గురించి బహిరంగంగా ఇంత రచ్చ చేస్తున్నారు. సైనిక దళాలలో నియామకాలు ధర్మంగా, న్యాయంగా, శక్తిసామర్థ్యాలు ప్రాతిపదికగా జరగాలి. ఆ నియామకాలతో తుది నిర్ణయం ఎన్నికయిన ప్రభుత్వానిదే కావాలి. కొరియా యుద్ధం నేపథ్యంలో ఆనాటి అమెరికన్ సైనిక దళాధిపతి జనరల్ మెకార్థర్ అధ్యక్షుడు ట్రూమన్ మాటను ఖాతరు చేయనప్పుడు వెంటనే మెకార్థర్‌ను ట్రూమన్ నిర్దాక్షిణ్యంగా తొలగించారు. అబ్రహాం లింకన్ అమెరికా అంతర్యుద్ధం మధ్యలోనే తన ఆదేశాలను ఖాతరు చేయని కారణంగా ఆనాటి సైన్యాధిపతి జనరల్ జార్జ్ మెక్‌లెల్లన్‌ని 1863లో తొలగించారు. 1864లో అదే జనరల్ మెక్‌లెల్లన్ లింకన్ మీద అధ్యక్ష పదవి కోసం పోటీచేసి ఓడిపోయారు. ప్రజాస్వామ్య సమాజంలో సైనిక దళాలు ఎన్నికయిన ప్రభుత్వం అదుపాజ్ఞలకు లోబడి ఉండటం అత్యంత మౌలికమైన సంప్రదాయం. దీన్ని ఉల్లంఘిస్తే సమాజంలో తుపాకి ఎవరి దగ్గర ఉంటే పెత్తనం వాళ్లదవుతుంది. ప్రభుత్వాధినేతలపైన కోపాన్ని ఇలాంటి అంశాలలో చూపి, సైనిక దళాలమీద ఎన్నికయిన ప్రభుత్వం అదుపును ప్రశ్నించటం ముఖంమీద కోపంతో ముక్కును కోసుకోవటం వంటిది.

## ప్రభుత్వ నియంత్రణ ఉండాల్సిందే

ఇప్పటివరకైతే కనీసం సైనిక దళాల నియామకాలలో పక్షపాత రాజకీయం పాత్ర అంతగా లేదు. ప్రభుత్వాధికారుల బదిలీలు, న్యాయమూర్తుల నియామకాలు ఎంతగా ఆటుపోట్లకు గురయినా, సైన్యంలో పరిస్థితి ఇంకా దిగజారలేదు. ములాయంసింగ్ యాదవ్ రక్షణమంత్రిగా ఉండగా మాత్రం సైనికాధికారుల ప్రమోషన్లను రాజకీయమయం చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఫెర్నాండెజ్‌లో ఎన్ని

లోపాలున్నా ఆయనకు కులతత్వం, మతతత్వం, ప్రాంతీయ తత్వం ఆపాదించటం అసాధ్యం. చైనా విషయంలో ఆయన వాస్తవాలే మాట్లాడినా, అంత సున్నితమయిన అంశంపైన బాధ్యతగల పదవిలో ఉన్న రక్షణమంత్రి ఆచితూచి మాట్లాడాలని మాత్రమే చాలామంది భావించారు. అంతేగాని ఫెర్నాండెజ్ దేశభక్తిని, చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేదు. ఇప్పుడు భగవత్ ఏ ఆధారాలు చూపకుండా ఫెర్నాండెజ్‌పైన పరుష భాషను వాడటంతోపాటు ఆయన దేశభక్తిని శంకిస్తున్నారు. అంతటితో ఆపకుండా ఆయన అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. అందుకు కించిత్తు కూడా సాక్ష్యంగాని, ఆధారంగాని చూపటంలేదు! అదే అలుసుగా చూసుకుని కాంగ్రెస్‌వారు అందుకు సంయుక్త పార్లమెంటు కమిటీ (జె.పి.సి.) కావాలంటున్నారు! అదేమంటే బోఫోర్సు కుంభకోణం మీద జె.పి.సి.కి ఈ జె.పి.సి చెల్లు అవుతుంది అంటున్నారు! ఒక అవినీతి కుంభకోణాన్ని జనం మరచిపోవాలంటే మరో కుంభకోణాన్ని సృష్టించాలనే ఈ మోటు వాదన మన రాజకీయంలో ఎంతగా కుళ్లు పేరుకున్నదో తెలుపుతుంది. అన్నాడియంకె నాయకురాలు జయలలిత ఏకంగా భగవత్‌ను మళ్లీ నియమించి ఫెర్నాండెజ్‌ను తొలగించాలని పట్టుబడుతున్నారు! దేశంలో పాలన అంటే బొమ్మలపెళ్లిలా కనిపిస్తోంది మన నాయకమ్మన్యులకి! దేశ రక్షణ తమ అధికార క్రీడలో ఒక వ్యూహం అనుకుంటున్నారు నేటి పార్టీల అధినేతలు! వాజపేయి ప్రభుత్వానికి పార్లమెంటులో మద్దతుపోతే ఆ ప్రభుత్వం కుప్పకూలుతుంది; కొత్త ప్రభుత్వమన్నా వస్తుంది, లేదా మళ్లీ ఎన్నికలు జరుగుతాయి. అందుకు మనమెవరం చింతించనక్కరలేదు. నేటి పరిస్థితులలో ఎన్నికలు ఎన్నిసార్లు వస్తే దేశ ప్రజలకు అంత మంచిది. కాని అధికార క్రీడలోనూ కొన్ని కనీస నియమాలను పాటించకుండా విశృంఖలంగా ప్రవర్తించటం జాతి భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరం. దేశ రక్షణ పేరుతో మద్దతు ఉపసంహరించుకుంటే తనమీద అవినీతి ఆరోపణలు సమసిపోతాయని జయలలిత, ఈ పేరుతో జె.పి.సి ఏర్పాటయితే భోఫోర్సు కుంభకోణం సమసిపోతుందని సోనియాగాంధీ భావించటం నేటి జుగుప్సాకర రాజకీయంలో విలువల రాహిత్యానికి పరాకాష్ట. రేపన్నది లేనట్లుగా నేతలు భావిస్తే చివరికి దేశ రక్షణ కూడా రాజకీయమయం అయిపోతుంది. భగవత్ వివాదం కేవలం రాజకీయ వినోద క్రీడ కాగూడదు. రక్షణ దళాల పాత్రను నిర్వహించే మౌలిక చర్చగా మారి ఆదర్శప్రాయ పాఠాలను అందివ్వాలి.

* * *

# పార్టీ రాజకీయాలకు అతీతమైతేనే పెద్దరికం

మార్చి 29, 1999

బీహార్‌లో రాష్ట్రపతి పాలన ప్రయత్నం బెడిసికొట్టింది. ఇందుకు కారణం ప్రభుత్వంలో ఉన్న బి.జె.పికి, దాని మిత్రపక్షాలకు రాజ్యసభలో తగిన సంఖ్యాబలం లేకపోవటమే. రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. ఇందులో కాంగ్రెస్‌కు 64, బి.జె.పికి 45, మిగతా పదిహేడు పార్టీలకు 104 మంది సభ్యులున్నారు. మిగిలిన 32 మందలో 14 మంది ఇండింపెండెంటు సభ్యులుగా చెలామణీ అవుతుండగా, వివిధ ఇతర చిన్న పార్టీలకు చెందినవారు పదిమంది. ఎనమండుగురు నామినేటెడ్ సభ్యులు. ఇలాంటి సభలో 123 మంది సభ్యుల మద్దతు సమీకరించడం ప్రస్తుత పరిస్థితులలో ఏ పార్టీకీ సాధ్యమయ్యే పని కాదు. రాజ్యాంగంలోని 107వ అధికరణం ప్రకారం– ఏ బిల్లు అయినా సరే చట్టం కావాలంటే ముందుగా పార్లమెంటు ఉభయసభలలో మెజారిటీ సభ్యుల ఆమోదం పొందాలి. దానిపై రాష్ట్రపతి సంతకం చేయాలి. 108వ అధికరణం ప్రకారం, ఒకవేళ రాజ్యసభ అంతకుముందే లోక్‌సభ ఆమోదించిన బిల్లును తిరస్కరిస్తే లేదా ఆరునెలల పాటు తాత్సారం చేస్తే రాష్ట్రపతి ఉభయ సభల సంయుక్త సమావేశం జరపాలని ఆదేశించవచ్చు. అప్పుడు అధిక సంఖ్యాకుల మద్దతు తెలిపితే బిల్లు పార్లమెంటు ఆమోదం పొందినట్లే. 109వ అధికరణం ప్రకారం ఒక్క ఆర్థిక అంశాల విషయంలో మాత్రం లోక్‌సభ అధికారం అప్రతిహతం. లోక్‌సభ ఆమోదం పొందిన ఆర్థిక బిల్లులు, పన్నుల బిల్లులు రాజ్యసభకు పంపాక 14 రోజులలోగా సభ ఆమోదం పొందకపోయినా ఆ బిల్లులు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందినట్లే లెక్క. అందువల్లనే వార్షిక బడ్జెటు, ఓట్ ఆన్ ఎకౌంట్, పన్నుల ప్రతిపాదనలు వగైరా అంశాలకు సంబంధించినంతవరకు లోక్‌సభలో మెజారిటీ మద్దతు ఉన్నంత కాలం ప్రభుత్వ నిర్ణయాలు చట్టమైపోతాయి. లోక్‌సభలో మెజారిటీ మద్దతు ఉంటేనే ప్రభుత్వం మనుగడ సాగిస్తుంది. కాబట్టి ఈ అంశాలలో ఏమీ ఇబ్బందిలేదు. ఒక ప్రభుత్వం పడిపోయినా, మళ్లీ అధిక సంఖ్యాకుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడితే చాలు.

## ఉభయ సభలకు సమానాధికారం

రాజ్యాంగాన్ని సమీక్షిస్తే తేలేదేమంటే ఒక్క ఆర్థిక సంబంధాల విషయం మినహాయిస్తే, మిగతా అన్ని చట్టాలకు పార్లమెంటులో ఉభయసభల ఆమోదం కావాల్సిందే. ఇక్కడే చిక్కొచ్చి పడింది. లోక్‌సభ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ప్రతినిధుల సభ. ఎన్నికల నాటి ప్రజా వాక్కును. పౌరుల అభిప్రాయాలను, జాతి నిర్ణయాన్ని ప్రతిబింబించే సభ. రాజ్యసభ పరోక్షంగా రాష్ట్ర శాసనసభ్యుల ద్వారా ఎన్నికయిన ఎగువసభ. రెండేళ్లకొకసారి మూడోవంతు స్థానాలకు ఎన్నిక జరిగే శాశ్వత సభ. దేశ ప్రజల మనోభావాలను, వివిధ పార్టీలకు ప్రజలలో ఉన్న మద్దతును ఏనాటికానాడు రాజ్యసభ ప్రతిఫలించదు. అలాంటి రాజ్యసభ వివిధ అంశాలమీద నిర్ణయాలను పార్టీలకు అతీతంగా, సభ్యుల విచక్షణ ప్రకారం తీసుకుంటే సబబే. అలాకాక పార్టీ నేతల అభిప్రాయానికి, నాయకత్వం జారీచేసిన విప్‌లకు తలొగ్గి సభలో ఓటు వేస్తే, అప్పుడు లోక్‌సభలో మద్దతు ఉన్న ప్రభుత్వం మాట చెల్లటం కష్టం. భారతదేశంలో 1977 వరకు కేంద్రంలోను, చాలామేరకు రాష్ట్రాలలోను కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేకపోయింది. పార్లమెంటు ఉభయ సభలలో ఆ పార్టీకి తిరుగులేని మెజారిటీ ఉండేది. 1969–71 మధ్య ఇందిరాగాంధీ మైనారిటీ ప్రభుత్వాన్ని నడిపినా, కమ్యూనిస్టుల మద్దతుతో గట్టెక్కగలిగారు. అప్పుడు (1970లో) రాజభరణాల రద్దు విషయంలో లోక్‌సభ ఆమోదించిన బిల్లును రాజ్యసభ తిరస్కరించింది. 1977 తరవాత పార్లమెంటు ఉభయ సభల మధ్య సామరస్య లోపం పెద్ద సమస్యగా తయారయింది. దేశంలో పలు ప్రాంతాలలో, ముఖ్యంగా ఉత్తరాదిన, పశ్చిమ రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. ఢిల్లీ నగరానికి కొన్ని వందల కిలోమీటర్ల పరిధిలో కాంగ్రెస్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ నియోజకవర్గంలో, రాజ్యాంగేతర శక్తిగా ఎదిగిన ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ అమేథీలో ఓడిపోయారు. జనతాపార్టీ ఘనవిజయం సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. రాజ్యసభలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉండటంతో ఎన్నో చట్టాల విషయంలో జనతా ప్రభుత్వం చాలా కష్టపడవలసి వచ్చింది. ఎమర్జెన్సీలో చేసిన 42వ రాజ్యాంగ సవరణను తొలగించే 44వ సవరనను మాత్రం పార్లమెంటు ఉభయ సభలు ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాయి. దేశమంతటా ఎమర్జెన్సీ పట్ల, నియంతృత్వం పట్ల పెల్లుబికిని ఆగ్రహం కారణంగా అది సాధ్యమయింది. అదే ఆనాడు రాజ్యసభలోని కాంగ్రెస్ సభ్యులు పట్టుపట్టి 44వ సవరణను తిరస్కరిస్తే,

నేటికీ ఎన్నో నియంతృత్వ ధోరణులు ప్రజాస్వామ్యంలో నిలిచిపోయేవి. ఇతర బిల్లుల విషయంలో రాజ్యసభ చాలాసార్లు అడ్డుపెట్టింది. ఇటీవలి కాలంలో ప్రసారభారతి బిల్లు లోక్‌సభ ఆమోదాన్ని పొందినా రాజ్యసభలో మెజారిటీ లేక పోవటంతో మళ్లీ ఆర్డినెన్సును పొడిగించాల్సి వచ్చింది. అదేవిధంగా కేంద్ర విజిలెన్సు కమిషన్ నియామకాన్ని నిర్దేశించే చట్టానికి రాజ్యసభ మద్దతు లేకపోవటంతో ఆ కమిషన్ చట్టబద్ధ ఉనికి ప్రశ్నార్థకమయింది. బీహార్‌లో 356వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి పాలన విధించినా, రాజ్యసభ ఆమోదం పొందటం అసాధ్యమని తేలటంతో ప్రభుత్వం రాష్ట్రపతి పాలనకు స్వస్తిచెప్పి మళ్లీ రబ్రీదేవి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టింది. ప్రపంచంలో పలు ప్రజాతంత్ర దేశాలలో రెండు చట్టసభలున్నాయి. అమెరికాలో రెండు సభలను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటున్నారు. ప్రతినిధుల సభ రెండేళ్లకొకసారి రద్దవుతుంది. ప్రజలు మళ్లీ సభ్యులను ఎన్నుకుంటారు. సెనేట్‌లో మాత్రం రెండేళ్లకోసారి మూడోవంతు సభ్యుల స్థానాలు ఖాళీ అయి, వాటికోసం ఎన్నిక జరుగుతుంది. ఇందువల్ల రెండు సభలలో పార్టీల బలాబలాలలో వ్యత్యాసం ఉండటం కద్దు. ఆదేశంలో కార్యనిర్వాహక వర్గానికి, చట్టసభలకు మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఉంది. చట్టసభలలో మద్దతు ఉన్నా లేకపోయినా అధ్యక్షుడు నిర్దిష్టకాలం పదవిలో ఉంటారు. అంతేకాదు రెండు సభలలోను పార్టీలు విప్ జారీ చేసే ప్రసక్తి లేదు. సభ్యులు తమ ముందుకు వచ్చిన చట్ట ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలించి, చాలావరకు పార్టీలకు అతీతంగా ఓటు వేస్తారు. అందువల్ల పార్టీల సంఖ్యాబలానికి అంత ప్రాధాన్యం ఉండదు. భారత పార్లమెంటరీ వ్యవస్థ చాలా వరకు బ్రిటీష్ సంప్రదాయాన్ని అనుకరించి ఏర్పడింది. అక్కడ ఎన్నిక కాని ఎగువసభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) ఉంది. ఆ సభలో వంశపారంపర్యంగా సభ్యులయిన వాళ్లు 800 మంది కాగా, 26 మంది బిషప్పులు, 9 మంది న్యాయమూర్తులు, 371 మంది జీవిత సభ్యత్వం పొందినవారు ఉన్నారు. 1958లో హౌస్ ఆఫ్ లార్డ్స్‌ని కొంతమేరకు సంస్కరించి, వంశపారంపర్య సభ్యులతోపాటు జీవిత సభ్యులు ఉండేలా ఏర్పాటు చేశారు. పార్టీపరంగా చూస్తే, 1990లో 423 మంది కన్సర్వేటివ్ పార్టీ సభ్యులు కాగా, 108 మంది లేబర్ పార్టీ సభ్యులు. ఇప్పటివరకు ఎప్పుడూ కన్సర్వేటివ్ పార్టీ సభ్యులే ఎక్కువ. అయినా ఎన్నో సందర్భాలలో అధికారంలో ఉన్న కన్సర్వేటవ్ పార్టీ ప్రతిపాదించిన బిల్లులను హౌస్ ఆఫ్ లార్డ్స్ తిరస్కరించింది. అలాగే లేబర్ పార్టీ ప్రతిపాదించిన బిల్లులను ఎన్నింటినో ఎగువసభ ఆమోదించింది. అంటే ఎగువసభలో

సభ్యులు పార్టీలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవటానికి అలవాటు పడ్డారు. ఉదాహరణకు 1979 నుంచి 1997 వరకు కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉన్నా ఎగువసభలో దాదాపు 150 సార్లు ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఓటు చేశారు. ఆకాలం అంతటిలోను ఆ సభలో కన్సర్వేటివ్‌లకే అధిక సంఖ్యాబలం ఉ ంది! ఎగువసభ సభ్యుల విజ్ఞత మీద మాత్రమే ఆధారపడితే చాలదని బ్రిటన్‌లో పార్టీలు, ప్రజలు గుర్తించారు. అందువల్లనే 1649లో దాన్ని రద్దు చేశారు. మళ్లీ 1660లో ఆ సభ ఏర్పాటయింది. ఈ శతాబ్దంలో 1911లోను, 1949లోను 'పార్లమెంటు చట్టాల' ద్వారా హౌస్ ఆఫ్ లార్డ్స్ అధికారాలను బాగా కుదించారు. ప్రస్తుతం ఎగువసభ ఏదైనా బిల్లులో సవరణలు తెస్తే దిగువసభ (హస్ ఆఫ్ కామన్స్) వాటిని ఆమోదించవచ్చు. సవరించవచ్చు లేదా తిరస్కరించి మళ్లీ ఎగువసభకు పంపవచ్చు. అప్పుడు ఎగువసభ మళ్లీ వాటిని పరిశీలించి నిర్ణయించాలి. ఇలా వాదోపవాదాల  తరువాత రెండుసభల మధ్య అంగీకారం కుదురుతుంది. ఎన్నో సందర్భాలలో ఎగువసభ చేసిన మంచి ప్రతిపాదనలను దిగువసభ అంగీరించటం లేదా దిగువసభలో వ్యక్తమైన బలమైన అభిప్రాయాలను ఎగువసభ పరిగణలోకి తీసుకోవటం జరిగింది. రెండు సభలు ఒక బిల్లును చట్టం చేసే ముందు కూలంకషంగా చర్చిస్తే మంచి చట్టాలు వస్తాయన్న విశ్వాసం బ్రిటిష్ ప్రజలలో ఉంది. ఒకవేళ రెండు సభల మధ్య సయోధ్య కుదరకపోతే, కామన్స్ సభ అంగీకారం పొందిన బిల్లు ఒక సంవత్సరం ఆగాక చట్టం అవుతుంది. ఆర్థిక బిల్లుల విషయంలో మాత్రం లార్డ్స్‌కు ఏ అధికారమూ లేదు. 1977లో ఒక్క విమానాలు, ఓడల నిర్మాణం బిల్లు విషయంలో మాత్రం కామన్స్‌సభ తన అధికారాలను వినియోగించి, లార్డ్స్ ఆమోదం లేకుండానే బిల్లును చట్టంగా మార్చడం కోసం బ్రిటిష్ రాణి అనుమతి కోసం పంపింది. రాణి సంతకంతో అది చట్టమయింది.

## సంస్కరణలు తప్పనిసరి

ప్రపంచంలో చాలా దేశాలలో రెండు చట్టసభలు లేవు. స్వీడన్‌లో 1971లో ఎగువసభను రద్దుచేశారు. అమెరికా, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియాలలో రెండు సభలు ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో దిగువసభ మద్దతు ఉన్నంతకాలం ప్రభుత్వం మనుగడ సాగిస్తుంది. అలాంటప్పుడు ఎగువసభ, ప్రజల అభిప్రాయాన్ని మన్నించకుండా పార్టీ ఆదేశాల (విప్) ప్రకారం వ్యవహరిస్తే, ఇక ఆర్థిక బిల్లులు తప్ప మరే చట్టం చేయటం సాధ్యం కాదు. మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగి ఒకవేళ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాజ్యసభలో బిల్లుల ఆమోదం పొందే మెజారిటీ ఉండదు. నేటి రాజకీయ పరిస్థితులలో ఉభయ సభలలోను ఒకే పార్టీకి అధిక సంఖ్యాబలం ఉండటం దాదాపు అసాధ్యం. అంటే చట్టసభలు తమ మౌలిక విధుల నిర్వహణలో విఫలంకావటం ఖాయం. అందువల్లనే రాజ్యసభ విషయంలో మౌలిక సంస్కరణలు చేపట్టాలి. ఎగువసభలో పార్టీ విప్‌ను రద్దుచేయటం అవసరం. ఆమాటకొస్తే ఒక్క ప్రభుత్వ బలపరీక్షలో తప్ప మిగిలిన సందర్భాలలో లోక్‌సభలో కూడా విప్‌ను రద్దుచేయాలి. రాజ్యసభ రాష్ట్రాల సభ కాబట్టి, రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో దానికి పెద్దపీట వేసి, ఎగువసభ తిరస్కరిస్తే చట్టం కాకుండా చేయాలి. ఉదాహరణకు 356వ అధికరణాన్ని ఉపయోగించటం, రాష్ట్రపతి పాలన విధించటం రాష్ట్రాల అధికారాలకు సంబంధించింది. ఆవిషయాలలో రాజ్యసభ నిర్ణయం శిరోధార్యం కావాలి. అలాగే రాజ్యాంగ సవరణలలో రెండు సభలకు సమాన అధికారం ఉండాలి. ఇతర చట్టాల విషయంలో మాత్రం లోక్‌సభదే పైచేయిగా ఉండాలి. రాజ్యసభకు నిర్దిష్ట కాలం ఒక బిల్లును ఆపే అధికారం ఉండవచ్చు. కాని ఆ బిల్లును రాజ్యసభ ఆమోదించకపోయినా కొంత కాలం పరిమితి తరువాత– అది మూడునెలల కావచ్చు. ఆరునెలల కావచ్చు. సంవత్సరం కావచ్చు– రాష్ట్రపతి ఆమోదంతో చట్టం అయ్యే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలి. ఇలాంటి చర్యల ద్వారా ఉభయ సభల మధ్య సయోధ్య సాధించి చట్టాల ఆమోదానికి మార్గం సుగమం చేయాలి. లేనట్లయితే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిరర్థకమయిపోతుంది. కనీసం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం కోసం కావలసిన చట్టాలు రూపొందించి పార్లమెంటు ఆమోదం పొందే అవకాశం కలిగించాలి. రాజకీయ సంక్షోభ పరిష్కారానికి ఇది అవసరం. ఇది జరగకపోతే, చట్టసభల పేరుతో పైరవీలు, అధికార క్రీడలు కొనసాగటం తప్ప పరిపాలన నడవటం అసాధ్యం.

* * *

# ప్రగతి సాధానికి ప్రజాస్వామ్యమే పునాది

జూన్ 06, 2005

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇక ఇండియా, చైనా శాసిస్తాయని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇటీవల ఉద్ఘాటించిన నేపథ్యంలో - ఇరు దేశాల అభివృద్ధిని తులనాత్మకంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. ప్రగతిపథంలో చైనా దూసుకెళ్తున్న తీరునుబట్టి- ఆర్థిక రంగంలో తదుపరి ప్రబలశక్తిగా ఆవిర్భవించబోయేది ఆ దేశమేనన్నది నిపుణుల అభిప్రాయం. మరోవైపు వార్షిక వృద్ధి రేటు విషయంలో చైనా తరవాతి స్థానంలో ఉన్న ఇండియా- అభివృద్ధిపరంగా ఆదేశంతో సరితూగగలదా అనే సందేహం వ్యక్తమవుతోంది. విద్య, ఆరోగ్య పరిరక్షణ, చట్టబద్ధపాలన, పన్ను విభాగాలు- ఈ నాలుగు రంగాల మెరుగుదలకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటే వృద్ధిరేటు విషయంలో భారత్ అద్భుత ప్రగతి సాధించవచ్చునని, తద్వారా అది చైనాకు దీటుగా రాణించవచ్చునని విశ్లేషిస్తున్న వ్యాసమిది...**

వార్షిక వృద్ధిరేటు విషయంలో చైనా తరవాతి స్థానం ఇండియాదే. రాజకీయ పరిస్థితులు గందరగోళంగా ఉన్నా, పాలకులు తాత్కాలిక లబ్ధి చేకూర్చే జనాకర్షక విధానాలకే పెద్దపీట వేస్తున్నా దాదాపు ఏడు శాతం వృద్ధిరేటుతో మనదేశం– పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల్లో ఒకటైన చైనా తరవాతి స్థానంలో నిలవటం విశేషం. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు అంతర్గతంగా గల బలానికి ఇది నిదర్శనం. భారత్, చైనాల విస్తీర్ణం, చరిత్ర, సంస్కృతి, రెండో ప్రపంచ యుద్ధం తరువాత సమాంతరంగా ఈ రెండు దేశాలు సాధించిన అభివృద్ధి దృష్ట్యా– వాటి ప్రగతిని పోల్చి చూడటం అవసరమే. చైనాలో దేశవ్యాప్తంగా భారీయెత్తున మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్న తీరును, ఉత్పాదకతకు దోహదపడేలా షాంఘై లోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్దసంఖ్యలో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వైనాన్ని గమనిస్తే– ఆర్థికరంగంలో తదుపరి ప్రబలశక్తిగా చైనా అవతరించబోతోందని ఇట్టే చెప్పవచ్చు. ఇండియా విషయానికొస్తే అటువంటి ఆశలకు ఆస్కారం తక్కువే. ఇక్కడి పాలకులు

అస్తవ్యస్త విధానాలను అనుసరిస్తుండటం, పట్టణాలు అభివృద్ధికి నోచుకోకపోవడం, అసంఖ్యాక యువజనులకు ఉపాధి అవకాశాలు లేకపోవడం, మౌలిక సౌకర్యాలు కొరవడటం అందుకు ప్రధాన కారణాలు.

## పంథా మారాకే చైనాకు మహర్దశ

ప్రజాస్వామిక పద్ధతులను అనుసరిస్తుండటం వల్ల మనం వెనుకబడ్డామని, చైనా అభివృద్ధి సాధించిందంటే అందుకు కారణం అది నియంతృత్వ విధానాలను అవలంభించడమేనని చాలామంది అంటుంటారు. అయితే వీరి వాదనలో నిజమెంత? వాస్తవిక పరిస్థితులను నిశితంగా అధ్యయనం చేస్తే- చైనా అనుసరించిన నియంతృత్వ పంథాయే దశాబ్దాల తరబడి ఆదేశ అభివృద్ధికి అడ్డంకిగా మారిందని తేటతెల్లమవుతుంది. 'గ్రేట్ లీప్ ఫార్వర్డ్' (ప్రగతి దిశగా ప్రస్థానం) పేరిట 1950లలో చైనా అనుసరించిన విధానాలు ఆ దేశానికి అరిష్టాన్నే తెచ్చిపెట్టాయి. ఆ విధానాల కారణంగా ఆకలిదప్పులకు తాళలేక రెండుకోట్ల మందికిపైగా ప్రజలు మృత్యువాతపడ్డారు. ఇక 'సాంస్కృతిక విప్లవం' చైనాలో అరచకానికే దారితీసి, ఆదేశానికి గల ఘనతరమైన సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేసింది. విద్య, మేధో సంపదల పరంగా చైనాకు గల పునాదుల్నీ అది పెళ్ళగించింది. మావో హయాములో ప్రజలకు పాఠశాల విద్యావకాశాలు, వైద్య-ఆరోగ్య సేవలు, గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయన్నది నిజమే. అయితే- సద్వివేచనతో, పకడ్బందీగా రూపొందించిన విధానాలే ఆ సత్ఫలితాలు ఒనగూడటానికి కారనం. అంతేతప్ప వాటికి, చైనా అనుసరించిన నియంతృత్వం కారణం కాదు. ఆర్థిక సరళీకృత విధానాలను, మరింత ప్రజాస్వామిక పంథాలను అనుసరించడమే డెంగ్ హయాములో చైనా విజయాలు సాధించడానికి దోహదం చేసింది. ఆర్థిక రంగంలో ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కల్పించడంతో పాటు పోటీతత్వాన్నీ చైనా ప్రోత్సహించింది. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను పెద్దయెత్తున వికేంద్రీకరించింది. స్థానిక సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించేందుకు వీలుగా వాటికి స్వయం ప్రతిపత్తిని కల్పించింది. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా, నిరంకుశంగా వ్యవహరించకుండా- చాలావరకు ప్రజాస్వామ్య పంథానే చైనా అనుసరిస్తోందనడానికి ఇవన్నీ సూచనలే. అందువల్ల- భారత్- చైనాల వృద్ధిరేట్లు, వాటి ప్రస్తుత స్థూల దేశీయోత్పత్తి (జి.డి.పి) స్థాయిలు మధ్య తేడాకు కారణం భారత్ ప్రజాస్వామ్య విధానాలను, చైనా నియంతృత్వ పంథాను అనుసరించడమేననడం సబబు కాదు.

ఆర్థిక రంగంలో విజయాలను సాధించడానికి దోహదం చేసే రెండు కీలక అంశాలు ఏమిటంటే– విధానాలను చక్కగా రూపొందించడం, మరింత స్వేచ్ఛకు అవకాశం కల్పించడం. ఇండియాలో ప్రజాస్వామిక వ్యవస్థ ఉన్నప్పటికీ– ఇక్కడ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ కేంద్రీకృతమైంది.

టెలికమ్యూనికేషన్ల రంగంలో చైనా సాధించిన అద్భుత ప్రగతిని చూసి ఒకప్పుడు సంభ్రమాశ్చర్యాలకు లోనైన యావత్ ప్రపంచం ఆదేశాన్ని ప్రశంసల్లో ముంచెత్తింది. టెలికమ్యూనికేషన్ల రంగంలో ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛతో పాటు పోటీని అనుమతించాలని, సాంకేతిక పరిజ్ఞాన విస్తృతికి, పెట్టుబడులు పెట్టడానికి వీలు కల్పించాలని మనదేశ విధాన నిర్ణేతలు నిర్ణయించిన దరిమిలా ఇప్పుడు మనం కూడా ఆరంగంలో చైనా ప్రగతితో పోల్చదగిన స్థాయిలో అభివృద్ధిని సాధించగలిగాం. టెలికమ్యూనికేషన్ల రంగంలో అభివృద్ధి విషయంలో ఇరుదేశాల మధ్య తేడాకు ప్రధాన కారణం ఇండియా సరళీకృత విధానాలను ఆలస్యంగా అనుసరించడమే. డెంగ్ హయాములో 1978లోనే చైనా ఈ విషయంలో తన మార్గాన్ని మార్చుకోగా, 1991లో సంక్షోభం తలెత్తే వరకు ఇండియా మిన్నకుంది.

1980ల నుంచి చైనా సగటున తొమ్మిది శాతం వృద్ధిరేటును సాధిస్తుండగా, భారతదేశ వృద్ధిరేటు సగటున ఆరు శాతమే ఉంది. ఈ నేపథ్యంలో– అభివృద్ధి విషయంలో చైనాతో ఇండియా సరితూగగలదా... ఆ దేశాన్ని అధిగమించగలదా.. అనే సందేహాలు ఉత్పన్నం కావడం సహజమే. ఈ సందర్భంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ), ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక రంగంలో సరళీకృత విధానాలు– ఈ మూడు అంశాలూ ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. ప్రస్తుతం దేశంలోని రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రైవేటీకరణ, కార్మిక రంగంలో సంస్కరణలు సాధ్యం కావన్నది నిజమే. ఎఫ్.డి.ఐలు ఉన్నపళంగా పెరగబోవన్నదీ వాస్తవమే. విత్తపరమైన టోలు మనల్ని నిరంతరం వెన్నాడుతూనే ఉంది. మౌలిక సదుపాయాల కల్పన రంగంలో పెట్టుబడులు పెట్టలేకపోవడంతో పాటు, విద్యుత్ రంగాన్నీ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించలేకపోతోంది. ఇవన్నీ దేశాభివృద్ధికి ప్రతిబంధకాలుగా పరిణమించాయి.

విత్తపరంగా, రాజకీయంగా ఇలా అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ తక్కువ ఖర్చుతో, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేసేందుకు

తగు మార్గాలు లేకపోలేదు. కనీసం నాలుగు రంగాల్లో మెరుగుదలను సాధిస్తే– అది వృద్ధిరేటు విషయంలో అద్భుత ప్రగతి సాధించడానికి దోహదం చేస్తుంది. ఈ పరిష్కార మార్గాలన్నీ రాజకీయంగా సాధ్యమైనవే. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు లోబడి అమలుచేయడానికి వీలున్నవే. వృద్ధిరేటు పెరుగుదలకు ఉపకరించడానికి వీలుగా మెరుగుపడాల్సిన నాలుగు రంగాలు ఇవి: విద్య, ఆరోగ్య రవాణ, చట్టబద్ధ పాలన, పన్ను విభాగాలు.

పాఠశాల, విశ్వవిద్యాలయాల స్థాయిల్లో విద్యాసేవలు సక్రమంగా అందేలా చూడాలి. పాఠశాల విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచారు. ఇటీవల విధించిన విద్యాసెస్సు అందరికీ ఆమోదయోగ్యంగానే ఉంది. సత్ప్రమాణాలతో కూడిన విద్యకోసం పెద్దయెత్తున డిమాండ్ వినవస్తుండటం ముదావహం. పేదలు సైతం తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో వారి విద్యకోసం గణనీయంగా ఖర్చు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో– విద్యారంగానికి సంబంధించి అర్థవంతమైన విధానాలను అమలు చేయడం, నిధులు కాకుండా 'ఇతర వనరులను సమకూర్చడం ద్వారా మానవశక్తిని పెంపొందించవచ్చు. తద్వారా వృద్ధిరేటును కనీసం ఒక శాతం పెంచవచ్చు.

దేశంలో ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలను అందించే విషయంలో ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం ఇటీవల కొన్ని చర్యలు తీసుకున్న మాట నిజమే. అయితే– అదనంగా నిధులను కేటాయించడం, మరింత మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి చర్యలు తీసుకున్నంత మాత్రాన పరిస్థితులు మారవు. వ్యాధుల బారినపడే సామాన్య ప్రజలు వాటికి చికిత్స చేయించుకోవడానికి వైద్యసేవల నిమిత్తం అధిక మొత్తంలో వ్యయం చేయవలసివస్తోంది. తమ ఆదాయంలో అధిక మొత్తాన్ని ఇలా ఆసుపత్రి ఖర్చుల కోసం వెచ్చించవలసిరావడం వారిపై పెనుభారం మోపుతోంది. వారు బీదరికంలో మగ్గుతుండడానికి, అప్పులపాలు కావడానికి, ఉత్పాదకత తగ్గడానికి కారణం ఆ వ్యాధులూ, ఖర్చులే. ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు సక్రమంగా అందాలంటే ముందుగా ఆసుపత్రుల పనితీరులో సమూల మార్పులు రావాలి.

**ఆ దిశగా ప్రధానంగా తీసుకోవలసిన చర్యలు ఇవి–** ఆసుపత్రుల నిర్వహణను

వికేంద్రీకరించాలి. అవి ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాలి. ప్రజారోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమన్వయపరచాలి. ప్రజలకు పౌష్టికాహారం, రక్షితనీరు లభించేలా చూడాలి. వీటన్నిటినీ మించి వైద్య ఆరోగ్య సేవలను ఏవిధంగా, ఏ ఆసుపత్రి నుంచి తాము పొందాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ప్రజలకు కల్పించాలి. వైద్య, ఆరోగ్య సేవల రంగంలో పోటీతత్వాన్ని ప్రోత్సహించాలి. ప్రజారోగ్యం నిమిత్తం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను స్వల్ప మొత్తంలోనే పెంచి ఉండవచ్చు. అయితే ప్రజారోగ్య పరిరక్షణ వ్యవస్థ పనితీరులో సమూల మార్పులు వస్తే– ఆ కొద్దిపాటి నిధుల సాయంతోనే దేశ ప్రజల్లో అత్యధికుల కడగండ్లను మనం తీర్చవచ్చు తద్వారా వారి ఆదాయం, ఉత్పాదకత శక్తి పెరుగుతుంది. వృద్ధిరేటు గణనీయంగా పెరగడానికీ అది దోహదం చేస్తుంది.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మనుగడ, అభివృద్ధి సాధన... ప్రధానంగా చట్టబద్ధ పాలనపైనే ఆధారపడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చేవారిని ప్రోత్సహించాలంటే– ఎవరి పట్లా పక్షపాతంతో వ్యవహరించకూడదు. స్థలాలకు సంబంధించిన సర్వేలు నిర్దిష్టంగా ఉండాలి. వివాదాలను సత్వరం పరిష్కరించాలి. చట్టాలను ఉల్లంఘించేవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. మనదేశంలో స్వతంత్రంగా వ్యవహరించే న్యాయవ్యవస్థ, చట్టాలను అమలుచేసే సంస్థలు ఉన్నాయన్నది వాస్తవమే. అయితే అవి కాలంచెల్లిన విధానాలను అనుసరిస్తుండటంవల్ల ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. పర్యవసానంగా నేరగాళ్లు, మాఫియాశక్తులు, గూండాలు వివాదాల 'పరిష్కార కర్తలు'గా అవతారమెత్తుతున్నారు. కిరాయి పుచ్చుకుని మోటు పద్ధతుల్లో వివాదాలను పరిష్కరిస్తున్నారు భారతదేశంలోని కొన్ని విదేశీ బ్యాంకులు సైతం తమ బకాయిలను తిరిగి రాబట్టుకోవడానికి కిరాయి గూండాలను వినియోగిస్తున్నాయని వినికిడి. ఇటువంటి దారుణ పరిస్థితులు– ఆర్థిక కార్యకలాపాలకు, అభివృద్ధికి ప్రతిబంధకంగా తయారవుతాయి. నిజానికి చట్టాల అమలుతీరును, న్యాయ ప్రక్రియను మెరుగుపరచడానికి ఉపకరించే యంత్రాంగాలు మనకు చాలా ఉన్నాయి. వాటికి అయ్యే వ్యయమూ తక్కువే. రాజకీయంగానూ అవి ఆమోదయోగ్యమైనవే. వాటిని సద్వినియోగం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దవచ్చు. తద్వారా– వృద్ధిరేటులో ఏటా కనీసం ఒక్కశాతం పెరుగుదలను మనం సాధించవచ్చు.

పన్ను వసూళ్ల విభాగాల తమ ఏకపక్ష విధానాలతో, అవినీతి పనులతో దేశంలోని

చిన్న, మధ్య తరహా పరిశ్రమల జవసత్వాలను పీల్చి పిప్పిచేస్తున్నాయి. పర్యవసానంగా వస్తూత్పత్తి రంగంలో పోటీతత్వం నీరుగారిపోతోంది. ప్రత్యక్ష పన్నుల విధానం కొంతవరకు మెరుగుపడినప్పటికీ సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్నులు, కస్టమ్స్, రాష్ట్రస్థాయిలో విధించే అమ్మకం పన్నులు వంటివి ఇప్పటికీ వివక్షాపూరితంగానే ఉన్నాయి. ఇది పారిశ్రామికవేత్తల ఉత్సాహంపై నీళ్లు జల్లుతోంది. పారదర్శకంగా, పరిశ్రమలకు ఊతమిచ్చే విధంగా ఉండే విధానాలను అనుసరించడం- ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికే కాక ఆదాయం పెరగడానికీ తోడ్పడుతుంది. డబ్బు వెచ్చించవలసిన అవసరంలేని ఈ విధానాలు వృద్ధిరేటు పెంపొందడానికి దోహదం చేస్తాయి. ఈ నాలుగు రంగాలను మెరుగుపరచడం ద్వారా ఆర్థిక వృద్ధిరేటును మూడు, లేక నాలుగు శాతం పెంచవచ్చు.

## పకడ్బందీ విధానాలు అవసరం

ఈ రంగాల పనితీరు మెరుగుపడితే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈదిశగా మనం ముందడుగు వేయడం కష్టమేమీ కాదు. అయితే అందుకు ప్రభుత్వపరంగా పకడ్బందీ విధానాలు రూపొందాలి. ఈనాలుగు రంగాలను మెరుగుపరచాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించడానికి, ప్రజాభిప్రాయం కూడగట్టడానికి రాజకీయస్థాయిలో కృషి జరగాలి. అభివృద్ధి సాధించడానికి స్వేచ్ఛ ఓ సువర్ణ అవకాశమే తప్ప అడ్డంకి కానే కాదు. అందువల్ల- దీర్ఘకాలంలో అభివృద్ధి విషయంలో చైనాను మనం అధిగమించగలం.. అధిగమించాలి కూడా. అందుకు మనం ముందుగా మన ఇంటిని చక్కదిద్దుకోవాలి.

* * *

# అసమానతలే అసలైన అడ్డుగోడలు

## బెంగాల్ విభజన నేర్పుతున్న పాఠాలు

**జూలై 25, 2005**

బెంగాల్ విభజనకు పథక రచన చేసిన లార్డ్ కర్జన్ కరుడుగట్టిన సామ్రాజ్యవాది. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని పటిష్ఠపరచడం, దానిని సంరక్షించడం ఆయన ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి... బెంగాల్ విభజన పర్యవసానంగా చోటుచేసుకొన్న రెండు కీలకమైన పరిణామాలు భారతపై శాశ్వత ప్రభావాన్ని కనబరిచాయి. విభజనపై పెల్లుబికిన నిరసన జ్వాలలు క్రమేపీ జాతీయోద్యమంగా రూపుదాల్చడం మొదటి పరిణామం. హిందూ ముస్లిముల మధ్య అంతరం పెరగడం రెండో పరిణామం... అన్ని వర్గాలవారికీ సమానావకాశాలు కల్పించే ప్రాతినిధ్య పద్ధతి; నీతి నిజాయతీలు ఉట్టిపడే నాయకత్వం; వివక్షలు, అసమానతల అడ్డుగోడల్ని ఛేదించే ప్రజలందరినీ ఒకే జాతిగా గుర్తించే సరికొత్త రాజకీయ వ్యవస్థల ఆవశ్యకతను బెంగాల్ విభజన నాటి సంఘటనలు చాటిచెబుతున్నాయి....

బెంగాల్ విభజన జరిగి సరిగ్గా వందేళ్లు! సువిశాలమైన బెంగాల్‌ను రెండుగా వేరుచేస్తూ 1905 జులై 19న బ్రిటిష్ పాలకులు తీసుకున్న నిర్ణయం– భారతదేశంలో జాతీయోద్యమం రగుల్కొనేలా చేసింది. స్వాతంత్ర్య పోరాటాన్ని కీలకమైన మలుపు తిప్పిన సంఘటనగా తదనంతర కాలంలో బెంగాల్ విభజన చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సామ్రాజ్యవాద ధోరణులు నరనరాన జీర్ణించుకుపోయిన అప్పటి వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ విభజనకు వ్యూహకర్త. బెంగాల్ ప్రావిన్సు వైశాల్యంలో పెద్దదిగా ఉండటం, బ్రిటిష్ ప్రభుత్వం తూర్పు ఇండియాలో స్వాధీనం చేసుకున్న భూభాగాలను బెంగాల్‌తో కలపడంవల్ల పాలనపరమైన చిక్కులు తలెత్తడం విభజనకు కారణాలుగా కర్జన్ పేర్కొన్నా అవి కుంటిసాకులు మాత్రమే. విభజన ద్వారా బ్రిటిష్ పాలకులు ఆశించిన ప్రయోజనాలు వేరు.

### జాతీయ భావాల అణచివేతకే...

బ్రిటీష్ పాలకులకు అప్పట్లో రాజధానిగా ఉన్న కలకత్తాలోను, మొత్తం బెంగాల్ ప్రావిన్సులోనూ జాతీయోద్యమ ప్రభావం ఎక్కువగా కనబడేది. ప్రజలలో

జాతీయతాభావాలు వెల్లువెత్తేవి. బెంగాలీల్లో రగుల్కొన్న స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని అణగదొక్కాలంటే వారిని విభజించడమొక్కటే మార్గమని బ్రిటిష్ ప్రభుత్వం భావించింది. తలచినదే తడవు విభజనకు శ్రీకారం చుట్టింది. హిందీ, ఒరియా మాట్లాడే ప్రాంతాలు బెంగాల్‌తో కలిసే ఉన్నా వాటిని అలాగే ఉంచి, కేవలం బెంగాలీ మాట్లాడే ప్రాంతాలనే రెండుగా వేరుచేశారు. బెంగాల్ వైశాల్యంలో పెద్దదిగా ఉండటమే కారణమైతే బెంగాలీయేతర భాషలు మాట్లాడే ప్రాంతాలను వేరుచేసి ఉండాలి. అలా జరగలేదు కాబట్టి తమకు పక్కలో బల్లెంలా మారిన బెంగాలీలను వేరుచేసే దురుద్దేశంతోనే విభజన చేపట్టారన్న సంగతి స్పష్టమవుతోంది. బెంగాల్ విభజనకుగల రెండు ప్రధాన కారణాలలో ఇది మొదటిది. అవిభాజ్యంగా ఉన్న బెంగాల్ ప్రావిన్సు జనాభా 7.8కోట్లు. ఇందులో 5.4కోట్ల మంది... అంటే 75 శాతానికిపైగా హిందువులు. మిగిలిన వారు ముస్లిములు. ఇది గమనించిన బ్రిటిష్ వలస ప్రభుత్వం 'విభజించు – పాలించు' అనే తమదైన నికృష్ట రాజకీయ పాచికను ప్రయోగించింది. కొత్తగా ఏర్పడే తూర్పు బెంగాల్ ప్రావిన్సులో ముస్లిం జనాభా ఎక్కువగా ఉండేలా విభజన సమయంలో జాగ్రత్తలు తీసుకుంది. బెంగాలీల్లో జాతీయోద్యమాన్ని అణగదొక్కడంతో పాటు వారి మధ్య మతకలహాల చిచ్చురేపడం బ్రిటిష్ పాలకుల అసలు ఉద్దేశం. ఇది బెంగాల్‌ను విభజించడానికి గల రెండో కారణం.

బెంగాల్ విభజనకు పథక రచన చేసిన లార్డ్ కర్జన్ 1899లో వైస్రాయ్‌గా నియమితుడయ్యారు. అప్పటికి ఆయన వయస్సు నలభయ్యేళ్లు. కర్జన్ కరుడుగట్టిన సామ్రాజ్యవాది. స్వాతంత్ర్యోద్యమ నాయకులపట్ల, దేశ ప్రజల మనోభావాలపట్ల ఆయనకు వీసమెత్తయినా గౌరవభావం ఉండేది కాదు. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని పటిష్ఠపరచడం, దానిని పరిరక్షించడం ఆయన ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి. రష్యాను నిలువరించే ఉద్దేశంతో అఫ్గానిస్తాన్‌కు చేరువయ్యేందుకు కర్జన్ ప్రయత్నించారు. వాయవ్య సరిహద్దు రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. టిబెట్‌తో సంబంధాలను పటిష్ఠం చేసుకున్నారు. ఇలా బ్రిటిష్ సామ్రాజ్యం వేళ్లూనుకొని బలపడేందుకు కావలసిన అన్ని చర్యలూ తీసుకున్నారు. భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, వారు కోరుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆయనకు ఏమాత్రం పట్టేవికావు. కర్జన్ దృష్టిలో జాతీయోద్యమం ఓ అనవసరమైన గోల. నయానో, భయానో దానిని మొగ్గలోనే తుంచివేయడం ఆయన లక్ష్యం. అందులో భాగంగా చోటుచేసుకున్నదే బెంగాల్ విభజన. భారతీయులు సాగించిన పోరాటం ఫలితంగా 1911లో బెంగాల్ విభజన రద్దయింది. లార్డ్ మింటో

తరవాత వైస్రాయ్‌గా వచ్చిన లార్డ్ హోర్డింజ్ వేరుపడిన బెంగాల్ ప్రాంతాలను తిరిగి ఒకటి చేశారు. బీహార్, ఒరిస్సా ప్రాంతాలను ప్రత్యేకమైన ప్రావిన్సుగా గుర్తించారు. అప్పటివరకూ బెంగాల్ వ్యవహారాలను లెఫ్టినెంట్ గవర్నర్ మాత్రమే పర్యవేక్షించేవారు. గవర్నర్ జనరల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించేవారు. ఏకీకరణ అనంతరం బెంగాల్‌కు పూర్తిస్థాయి గవర్నర్ నియమితులయ్యారు. అయితే ఆంగ్లేయులను ప్రతిఘటించినందుకు బెంగాలీలు మూల్యం చెల్లించుకొనక తప్పలేదు. రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి తరలించడం ద్వారా వారిని బ్రిటిష్ పాలకులు దెబ్బతీశారు. బెంగాల్ విభజన... భారతీయుల డిమాండ్లపై బ్రిటిష్ ప్రభుత్వం దృష్టి సారించేలా చేసింది. విభజనను నిరసిస్తూ మొదలైన ఉద్యమం మహోద్ధృతమై, దేశమంతటా ప్రభంజనంగా వీచింది. ప్రజలందరిలోనూ నిద్రాణంగా ఉన్న స్వాతంత్ర్యకాంక్షను రగుల్కొల్పింది. దీంతో భారతీయుల మనోభావాలను పరిగణలోకి తీసుకొంటూ 1909లో బ్రిటిష్ పాలకులు సంస్కరణలు తీసుకువచ్చారు. వీటికే మింటో–మార్లే సంస్కరణలని పేరు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోనూ, ప్రావెన్షియల్ కౌన్సిళ్లలోనూ భారతీయుల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ఈ సంస్కరణల ద్వారా నామమాత్రంగా ప్రయత్నించారు. ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్యను అరవైకి పెంచారు. (అప్పటివరకూ ఇందులో సభ్యుల సంఖ్య 25 మాత్రమే) ఇందులో 28 మంది అధికారులు. వీరు మండలికి నేరుగా నామినేట్ అవుతారు. మిగిలిన 32 మంది అనధికారులు, ప్రావెన్షియల్ కౌన్సిళ్లనూ ఇదేమాదిరిగా విస్తరించారు. ఈ మండళ్లకున్న అధికారాల పరిధిని కూడా కొంతవరకూ పెంచారు. అప్పటివరకు తమ ముందుంచిన బిల్లులను పరిశీలించడమొక్కటే వీటికి పనిగా ఉండేది. 1892 చట్టం ప్రకారం సభ్యుల్ని ప్రశ్నించడం, వార్షిక బడ్జెట్‌పై సభ్యులతో చర్చించడం వంటి అధికారాలు మండళ్లకు సంక్రమించాయి. అనుబంధ ప్రశ్నలు వేసేందుకు, తీర్మానాలను సభలో ప్రవేశపెట్టేందుకు 1909 చట్టం వాటికి అధికారాన్నిచ్చింది. బొంబాయి, మద్రాసు రాష్ట్రాల్లోని గవర్నర్ల కార్యనిర్వాహక మండళ్లలో నలుగురు చొప్పున సభ్యులు ఉండేవారు. మింటోమార్లే సంస్కరణల అనంతరం.... ఈ నలుగురిలో ఒకరిని అనధికారుల వర్గం నుంచి ఎంపికచేసే సాంప్రదాయం మొదలైంది. అలాగే భారత వ్యవహారాలను పర్యవేక్షించే లండన్‌లోని ఇండియా కౌన్సిల్‌కు తొలిసారిగా ఇద్దరు భారతీయులు సభ్యులుగా నామినేట్ అయ్యారు. అదేకోవలో కార్యనిర్వాహక మండలికి నియమితుడైన తొలి భారతీయుడిగా సర్

సత్యేంద్ర సిన్హా గుర్తింపు పొందారు. బెంగాల్ విభజన పర్యవసానంగా చోటుచేసుకున్న రెండు కీలకమైన పరిణామాలు భారత్‌పై శాశ్వత ప్రభావాన్ని కనబరిచాయి. విభజనపై పెల్లుబికిన నిరసన జ్వాలల క్రమేపీ జాతీయోద్యమంగా రూపుదిద్దుకోవడం అందులో మొదటిది. బెంగాల్ విభజన రేపిన కలకలం నుంచి సురేంద్రనాథ్‌బెనర్జీ తిరుగులేని సమరయోధిగా ఎదిగారు. స్వదేశీ ఉద్యమం ఊపందుకొంది. విదేశీ వస్తువులను బహిష్కరించడం మొదలైంది. పరాయిపాలనపై పోరు హింసాత్మక రూపం దాల్చింది. ఉన్నత కుటుంబాలకు చెందిన ఎందరో బెంగాలీలు ఈ పోరాటంలో పాలుపంచుకొని, తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారు. బ్రిటిష్ పాలనపై నిరసన తెలిపేందుకు ఉద్యమకారులకు 'వందేమాతరం' ఓ సాధనంగా మారింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ నినాదం కలిగించిన స్ఫూర్తి, అది రగిలించిన దేశభక్తి మాటల్లో చెప్పలేనిది. "1905–47 మధ్యకాలంలో లక్షలాది దేశభక్తులకు 'వందేమాతరం' నినాదమే ఆయుధమైంది. వలసపాలకుల కరకు లాఠీలకు వారు ఎదురొడ్డి నిలిచినా, వెరపు లేకుండా ఉరికొయ్యలను కౌగలించుకున్నా ఆ నినాదమిచ్చిన స్ఫూర్తే కారణం" అంటూ ప్రముక చరిత్రకారుడు ఆర్.పి. మజుందార్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇలా... విభజన పర్యవసానంగా జరిగిన ఈ సంఘటనలన్నీ జాతీయోద్యమంగా మారి, ప్రజలలో దేశభక్తిని రగిలించేందుకు దోహదపడ్డాయి. బెంగాల్ విభజన తరవాత చోటుచేసుకున్న మరో పరిణామం – హిందూ ముస్లిముల మధ్య అంతరం పెరగడం. బెంగాల్ ప్రావిన్సును విభజించడం ద్వారా మత కలహాలకు, వేర్పాటువాదానికి ఆంగ్లేయులు బీజం వేశారు. ముస్లిములను ఎదగనీయకుండా చేస్తున్నారనే భావన ఆ మతానికి చెందిన నాయకుల్లోనూ, విద్యాధికుల్లోనూ బలపడసాగింది. జాతీయోద్యమం, వందేమాతర గీతం– ఈ రెండూ హిందువులకు అనుకూలంగా ఉన్నవేనని వారు భావించారు. దీంతో కాంగ్రెస్‌పైనా, దాని శక్తిసామర్థ్యాలపైనా ముస్లిములలో అపనమ్మకం ఏర్పడింది. పర్యవసానంగా ముస్లింలీగ్ బలం పుంజుకుంది. ఈ పరిణామాలన్నీ దేశ విభజనకు దారితీశాయి. హిందూముస్లిముల మధ్య దూరం పెంచేందుకు ఆంగ్లేయులు చేయని ప్రయత్నం లేదు. ఉదాహరణకు 1909లో మత ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు ఈ పరిణామం రెండు మతాల వారి మధ్య మరింత దూరం పెరిగేందుకు దారితీసింది. అనంతరకాలంలో ఈ సంఘటనే ద్విజాతి సిద్ధాంతానికీ బీజం వేసింది.

## కొత్త వ్యవస్థలకు ఊపిరులూదాలి

శతాబ్దం కిందట జరిగిన ఈ సంఘటనల నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చవచ్చు. అన్నింటికంటే ముందుగా సిసలైన దేశభక్తికి, జాతీయతావాదానికి గల అర్థాలను పునర్నిర్వహించుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయవాదం ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థ ఆశలకు, ఆకాంక్షలకు తగినట్లుగా ఉండాలి. రాజ్యాంగ విలువల పరిరక్షణకు, మానవహక్కుల సముద్ధరణకు కట్టుబడడం ద్వారా, దేశ సమగ్రతకు, సర్వతోముఖాభివృద్ధికీ పాటుబడడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ దేశభక్తిని చాటుకోవాలి. అన్ని వర్గాల వారికీ సమానావకాశాలు కల్పించే ప్రాతినిధ్య పద్ధతి, నీతి నిజాయతీలు ఉట్టిపడే నాయకత్వం; వివక్షలు, అసమానతల అడ్డుగోడల్ని ఛేదించి ప్రజలందరినీ ఒకే జాతిగా గుర్తించే సరికొత్త రాజకీయవ వ్యవస్థల ఆవశ్యకతను బెంగాల్ విభజన నాటి సంఘటనలు చాటిచెబుతున్నాయి. ఇలా... చరిత్ర చెప్పే విలువైన పాఠాలను గ్రహించి దేశ ఉజ్వల భవిష్యత్తుకు బాట వేయాలి. గతంలో చేసిన తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్వకపోతే మాత్రం, భవిష్యత్తులో అందుకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.

* * *

# సమైక్యత సాధనతోనే దేశ భద్రతకు భరోసా

ఏప్రియల్ 14, 2003

సార్వభౌమత్వ పరిరక్షణ అంతర్జాతీయ సూత్రాలలో అత్యంత కీలకమయినదిగా ఈనాటిదాకా భావించాం. విధిలేక ఇతర దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకున్నా. అందుకు అన్నీ అప్రకటిత సూత్రాలు గత 58 ఏళ్లలో వర్తించాయి. తప్పనిసరి అయితే పొరుగున ఉన్న దేశంలో జోక్యం చేసుకోవటం జరిగేది. అలా జరిగినప్పుడు కూడా దాడి చేసిన దేశాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు సోవియట్ యూనియన్ పతనానికి ప్రధాన కారణాలలో ఒకటి అఫ్ఘానిస్థాన్‌లో సైనిక జోక్యం చేసుకొని పరాజయం పాలుకావటం. అలాగే చైనాలాంటి దేశంలో వియత్నాంపై దాడి చేసి భంగపడింది. ఇక దూరతీరాల్లో ఉన్న దేశాలలో జోక్యం చేసుకున్న సందర్భాల్లో ఇప్పటిదాకా అపజయమే మిగిలింది. ఆగ్నేయాసియాలోని వియత్నాం, లావోస్, కాంబోడియా దేశాలలో అమెరికా జోక్యం చేసుకుంది. భయంకర మారణహోమం తరవాత అమెరికా ఆ మూడు దేశాల నుంచి వెనుదిరగవలసి వచ్చింది. ఈవిధంగా గతంలో దేశ భద్రతకు బయటినుంచి రెండే సవాళ్ళుండేవి. మొదటిది సరిహద్దు వివాదాలు. ఇతర విభేదాలవల్ల పొరుగుదేశాల నుంచి దాడులు; రెండోది: ప్రపంచదేశాలన్నీ కలిసి నిర్ణయించినప్పుడు జరిగే దాడులు. రెండో రకం ప్రమాదం ఉత్పన్నమయ్యేనాటికి ఆదేశ ప్రభుత్వ విశ్వసనీయత దారుణంగా పతనమయ్యేది. ఉదాహరణకు కువైట్ విముక్తికోసం 1991లో ఇరాక్ మీద జరిగిన యుద్ధంలో ప్రపంచమంతా ఏకమయింది. ఇరాక్‌లో బ్రిటిష్, అమెరికన్ సైన్యాలు జోక్యం చేసుకున్నాక అంతర్జాతీయ పరిస్థితులు మారిపోయాయి. ఓ బలమైన దేశం మరో దేశంలో సైనిక జోక్యం చేసుకోవటానికి అనుకూల పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రతిదేశం తనజాతి భద్రతల గురించి అంచనాలను ఆలోచనలను మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. పరిస్థితులలో భారత్ భద్రతను పటిష్టం చేయటం ఎలాగో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

## వ్యవస్థ పట్ల విశ్వాసం

ఒక దేశం సురక్షితంగా ఉండాలంటే ఆధునిక యుగంలో కావలసిన కీలకావసరం

అక్కడి ప్రభుత్వానికి, రాజ్యవ్యవస్థకు ప్రజల్లో ఉన్న విశ్వసనీయత. దేశప్రజలే జాతి రక్షణకోసం పూనుకున్నప్పుడు ఆ జాతి భద్రతకేమీ ఢోకా ఉండదు. అంతేకాదు అదేదో జీతం తీసుకునే సైనికుల పని అని భావిస్తే ఇక ఆ దేశాన్ని ఎవరూ రక్షించలేరు. నిజమయిన భద్రత ప్రజలకు తమ వ్యవస్థపైనున్న విశ్వాసంమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సెర్బియాలో మిలోసెవిక్ మతతత్వం పట్ల ప్రజలలో విశ్వాసంగాని, గౌరవంగాని లేవు. ఆ వ్యవస్థను శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మార్చే అవకాశములేదు. అందుకే నాటో దాడికి యుగోస్లావియా లొంగిపోయింది. సోవియట్ యూనియన్ అకస్మాత్తుగా 15 స్వతంత్ర దేశాలుగా విడిపోవటంగాని, తూర్పు ఐరోపాలో దశాబ్దకాలం నిరంకుశాధికారాన్ని చలాయించిన కమ్యూనిస్టు నియంతృత్వాలు పతనంకావటంగాని విదేశీ దాడులవల్ల జరగలేదు. కేవలం ప్రజలలో పెల్లుబికిన నిరసనవల్ల, ప్రదర్శనల వల్ల, సహాయ నిరాకరణలవల్ల తూర్పు ఐరోపాలో కమ్యూనిజం అవతరించింది. సోవియట్ సామ్రాజ్యం పతనమయింది. ఈ అనుభవాలనుంచి మన పాలకులు గుణపాఠం నేర్చుకోవాలి. మనదేశం, ఈ వ్యవస్థ కేవలం కొంతమంది గద్దెనెక్కి పెత్తనం చేసేవాళ్లకోసం మాత్రమే ఉన్నాయని దేశప్రజలు భావిస్తే మనజాతికి భద్రత ఉండదు. ఎన్నికలు వ్యాపారంగా మారినప్పుడు, అవినీతి రాజ్యమేలుతున్నప్పుడు, పౌరులను పాలితులుగా, దీనులుగా, హీనులుగా, చేయిచాచి అర్జించే యాచకులుగా చూస్తున్నప్పుడు, అధిక సంఖ్యాకులైన ప్రజలకు ఆ వ్యవస్థ ఉనికి పట్ల ఆసక్తి ఉండదు. అందుకే నక్సలైట్లు తుపాకి పట్టినప్పుడు ప్రజలు దాన్ని తమ జీవితాలకు సంబంధించిన అంశంగా భావించడంలేదు. అదేదో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య పోరాటంగా చాలామంది పరిగణిస్తున్నారు. పేరుకు ప్రభుత్వాన్ని తామెన్నుకున్నప్పటికీ, ప్రభుత్వంతీరు వల్ల స్వపాలనకేమీ తీసిపోలేదనే భావన ప్రజలందరి మనసులలో ఉంది. అందుకే ఇదేదో మన ప్రనభుత్వం మీద దండయాత్రగా జనసామాన్యం అనుకోవటంలేదు. వ్యాపారంగా మారిన రాజకీయంపట్ల కలిగిన జుగుప్స కారణంఆ వ్యవస్థపట్ల విశ్వాసం తగ్గటమే ఈ నిర్వేదానికి కారణం. ఈ పరిస్థితులు జాతి భత్రకు ప్రమాదం పెరిగిందన్న విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికలలో ప్రభుత్వాలు మారుతున్న మాట వాస్తవం. అయితే గద్దెనెక్కిన వాళ్ల ముఖాలు మారుతున్నాయేఆని, గద్దెనెక్కించినవాళ్ల జీవితాల మీద ఆ ఎన్నికల ప్రభావం లేదు. అందుకే ప్రజలకు వ్యవస్థ పట్ల ఆదరణ తగ్గింది. తాత్కాలికంగా దేశభక్తి గీతాలతో, భరతమాత స్తుతి స్తోత్రాలతో మనం ప్రజలలో స్పందన తేవచ్చు

కాని కాస్తంత వేడి చల్లారగానే వ్యవస్థలో కొనసాగుతున్న దోపిడీ, అవినీతి, అహంకారం గుర్తుకొచ్చి వెగటు కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో అతి కీలకమయిన అంశం– ఓటు ద్వారా, శాంతియుతంగా మార్పును సాధించగలమన్న విశ్వాసం. ఆ నమ్మకానికి తూట్లు పడ్డప్పుడు సమాజం సులభంగా హింసకు లోనవుతుంది.

దేశ భద్రతకు కీలకమయిన రెండో అంశం ఐకమత్యం. కేవలం రెండుకోట్లకుపైగా జనాభా ఉన్న దేశం ఇరాక్. కాని ఆ చిన్నదేశంలోనే అరబ్‌లు, షియాలు, కుర్దులు. ఈ మూడు వర్గాల మధ్య సామరస్యం లేదు. దక్షిణాన ప్రధానంగా షియాలు, పశ్చిమాన అరబ్‌లు, ఉత్తరాన కుర్దులు. ఈమూడు వర్గాలలో తమకు ఉమ్మడి ప్రయోజనాలున్నాయనే భావం బలపడలేదు. షియాలు అధిక సంఖ్యాకులయినా, దేశం సున్నీ అరబ్ నియంతృత్వంలో నాలుగు దశాబ్దాలు మగ్గింది. ఉత్తరాన ఉన్న కుర్దులపై జరిగిన హత్యాకాండ అత్యంత దారుణం. సద్దాం హుస్సేన్ పాలనలో లక్షలమంది అమానుషంగా హత్యలకు గురయ్యారు. వేలమంది రసాయన ఆయుధాలకు బలయ్యారు. దేశంలో అంతర్గతంగా తీవ్ర విభేదాలున్నప్పుడు ఐకమత్యం నశించినప్పుడు విదేశీ దాడులను తట్టుకోవటం అసాధ్యం. మనదేశంలో ఎన్నో కులాలు, మతాలు, భాషలు, వర్గాలు, తెగలు ఉన్నా శతాబ్దాల పర్యంతం అందరం సహజీవనానికి అలవాటుపడ్డాం. అందుకే ఎన్ని విభేదాలున్నా విదేశీ ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు సంఘటితంగా ఎదిరించగలుగుతున్నాం. గతంలో అలాంటి ఐకమత్యం లేకపోబట్టే ఒకరినొకరు వెన్నుపోటు పొడవబట్టే, విదేశీ ఆక్రమణలకు లొంగిపోయాం. వలసపాలనను చవి చూశాం. మహాత్మాగాంధీ అవిరళ కృషి పుణ్యమా అని మనలో జాతీయతా భావం ప్రబలింది. మన రాజ్యాంగం కింద, మన రాజ్య వ్యవస్థలో దళితులకు, ముస్లిములకు, బీదలకు, అన్ని వర్గాలకు భాషతో, మతతో, కులంతో, ప్రాంతంలో నిమిత్తం లేకుండా సమానావకాశాలుంటాయన్న వివక్ష ఉండదన్న విశ్వాసం కలగాలి. ఆ నమ్మకం కొరవడితే మనదేశం ముక్కలవటం చాలా సులభం. సోవియట్ యూనియన్ అంతర్ధానం తరవాత, యుగొస్లోవియా పతనం తరవాత, ప్రపంచంలో ఇన్ని భాషలు, వైవిధ్యాలు, ప్రాంతాలు మతాలతో నిండి ఉండి కూడా సమైక్యంగా నిలబడిన ఏకైక దేశం భారత్. చైనాలో వైవిధ్యం ఉన్నా దాదాపు 85 శాతం మంది మంగోలియన్ జాతికి చెంది, మాండరిన్ మాట్లాడే ప్రజలు ప్రపంచంలో ఎక్కడా కనిపించనన్ని జాతులు, భాషలు భారత్‌లో ఉన్నాయి. ఈ దేశంలో మతం, కులం, భాష, ప్రాంతం పేరుతో విభేదాలను సృష్టించి మనుషులను వేరుచేస్తే 'మనవాళ్ళు'

'పరాయివాళ్లు' అనే భావంతో దూరంపెంచితే దేశ సమైక్యత, సమగ్రతలకు గండిపడుతుంది. ఈ దేశంలో పుట్టిన అందరికీ సమాన పౌరసత్వం ఉందన్న విశ్వాసం, ఎలాంటి విచక్షణకు తావులేకుండా ఆదరణ లభిస్తుందన్న నమ్మకం ఉన్ననాడు మనజాతి భద్రతకు ఎవరూ ముప్పు కలిగించలేరు. ఆధునికయుగంలో దేశ రక్షణ కేవలం సైనిక పాటవంమీద ఆధారపడి లేదు. ఆర్థికంగా ఓ దేశం సుసంపన్నమైనప్పుడు మరే దేశమూ దాన్ని కన్నెత్తిచూడలేదు.

## ఆర్థికబలిమే కీలకం

ఓ ప్రబల ఆర్థికశక్తిగా ఎదిగిన దేశంపైన దాడి జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం సంక్షోభానికి లోనవుతుంది. కాబట్టి అన్ని దేశాలు కలిసికట్టుగా ఓ సంపన్న దేశ రక్షణకు నడుం కడతాయి. అందుకే చైనా తన దేశ భద్రతనే కీలకంగా భావించి, ప్రపంచంలో ఏం జరిగినా పట్టించుకోకుండా ఆర్థికాభివృద్ధి మీద దృష్టిని కేంద్రీకరిస్తోంది. భారత్ ఇటీవలికాలంలో గణనీయమయిన ఆర్థిక ప్రగతిని సాధిస్తోంది. కొన్ని కీలక చర్యలను చేపడితే చైనా స్థాయికి ఎదగడమన్నది మన చేతుల్లో పనే. మన దేశ భద్రతను కాపాడాలంటే ప్రభుత్వాలు, పార్టీలు విభేదాలను పక్కనపెట్టి ఆర్థిక ప్రగతికోసం ధృడదీక్షతో కృషి చేయాలి. దేశ భద్రతకు సైనిక పాటవం ఎలాగూ అవసరం. ఉత్తర కొరియాకు సైనిక పాటవం, అణుబాంబులు ఉన్న కారణంగానే అమెరికా దాడికి దిగటంలేదు. పాకిస్థాన్ కూడా అదేవిధంగా సైనిక బలాన్ని పెంచుకోవటంతో ప్రపంచమంతా బుజ్జగించే ప్రయత్నిం చేస్తోంది. కాని ఆ దేశాన్ని బెదిరించటంలేదు. భారత జవాన్లు కూడా వీరోచితంగా పోరాడి, ప్రాణాలను పణంగా పెట్ట దేశానికి రక్షణ కల్పిస్తున్నారు. ఆధునికయుగంలో సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక ఆయుధాలు, పరికరాలు యుద్ధరంగంలో విజయానికి అవసరం. దేశ రక్షణ ఖర్చులో అధికభాగం జవానుల పోరాట పటిమను, సామర్థ్యాన్ని పెంచే అంశాలమీద ఖర్చు చేయటం అవసరం. దశాబ్దాల క్రితంనాటి తుపాకులను ఈనాటికీ వాడటంవల్ల విడిభాగాలు కూడా దొరకని మిగ్ విమానాల మీద ఆధారపడటంవల్ల ఎంతో నష్టపోతున్నాం. దేశ రక్షణ కోసం ఖర్చుపెట్టే డబ్బును సద్వినియోగం చేసి, సైనిక ఆధునికీకరణకు నడుం కట్టడం అవసరం. అప్పుడు భారత్‌ను కన్నెత్తి చూసే సాహసాన్ని ఎవరూ చేయలేరు. మనదేశానికి నిజమైన భద్రత మన రాజ్యవ్యవస్థ విశ్వసనీయతలో, మన సమాజ ఐక్యతలో, మన ఆర్థిక ప్రగతిలో దాగి ఉంది. దీన్ని మన ప్రభుత్వాలు, పార్టీలు గుర్తించటం అవసరం.

* * *

# చరిత్ర చెప్పిన పాఠాలు చెవినబెడితేనే ప్రగతి

**నవంబర్ 29, 1999**

భారతదేశంలో పరిపాలనలో అవకతవకలు, అక్రమాలు, అవినీతి, అలసత్వం, అవిద్య, దుర్భర దారిద్ర్యం గమనించిన వారికెవరికయినా అసలు ఈ విషవలయం నుంచి బయటపడగలమా అని సందేహం కలగటం సహజం. వ్యవస్థలో మౌలిక సంస్కరణలు కావాలన్న వాదనతో విభేదించేవారెవరూ ఉండరు. కాని చాలామందిని బాధించే శంక ఏమంటే, నిజంగా ఈ దుష్పరిపాలన స్థానే మంచి పాలన వస్తుందా అని! ఇందుకు సమాధానం వెతుక్కోవాలంటే ఎక్కడికోపోనక్కరలేదు. చరిత్రలో సరిగ్గా పది సంవత్సరాలు వెనక్కి వెళ్ళి చూస్తే చాలు. 1989వ సంవత్సరం బహుశ ఈ శతాబ్దంలోనే చరిత్రాత్మకమయినది. అప్పటికి సరిగ్గా 200 సంవత్సరాల కిందట ఫ్రెంచి విప్లవం ప్రపంచాన్ని కుదిపేసింది. 1789లో ఫ్రెంచి విప్లవంతో హింస, రక్తపాతం పెద్దఎత్తున చెలరేగాయి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావాలు ప్రజలలో వ్యాపించాయేగాని, అలాంటి రాజ్యస్థాపన మాత్రం వెంటనే సాధ్యం కాలేదు. 1776లోనే అమెరికాలో మొదటి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రిపబ్లిక్ ఏర్పడినా, యూరపులో మాత్రం అందుకు చాలాకాలం పట్టింది. రాచరికాన్ని కూలదోయటం కోసం ప్రారంభమయిన ఫ్రెంచి విప్లవం మళ్ళీ నియంతృత్వానికి, రాచరికానికి దారితీసింది. 1989లో నిజంగా ప్రజల చొరవ వల్ల సునాయాసంగా, రక్తపాతం లేకుండా తూర్పుయూరపులో ఊహించని విప్లవం సాధ్యమయింది.

## ఏక పార్టీ నియంతృత్వం

1917లో రష్యా విప్లవంతో అన్ని ఉత్పత్తి సాధనాలు ప్రభుత్వం చేతుల్లో ఉంచితే ప్రజలకి మేలు జరుగుతుందనే భావం బలపడింది. కాలక్రమేణా రెండో ప్రపంచయుద్ధం ముగిసేసరికి ఉత్తరాన బాల్టిక్ రాజ్యాల దగ్గర నుంచి దక్షిణ బాల్కన్లు, ఏడ్రియాటిక్ సముద్రందాకా సోవియట్ రష్యా ప్రభావంలోకి వచ్చాయి. ఆ 'ఇనుపతెర'కు తూర్పున అన్ని దేశాలలోను స్వేచ్ఛ నశించింది. ప్రజలు పూర్తిగా ప్రభుత్వాధినేతల శాసనాలకు, ఆదేశాలకు బద్ధులయ్యారు. రహస్య పోలీసులు

నిరంతరం జనం కదలికలపైన నిఘా వేశారు. ఏ అర్ధరాత్రి తలుపు చప్పుడయినా పోలీసులు అరెస్టు చేస్తారేమో, ఏళ్ళతరబడి జైళ్లలో మగ్గిపోవాలేమో, క్రూర హింసలకు బలికావాలేమో, ప్రాణమే పోతుందేమోనని ప్రజలు హడలిపోయేవారు. సోవియట్ రష్యాలోని పదిహేను రిపబ్లిక్కులలోనే కాక, పోలెండ్, చెకొస్లవేకియా, హంగరీ, రుమేనియా, బల్గేరియాలలో సోవియట్ ఆధిపత్యం కొనసాగింది. యుగోస్లావియాలో మార్షల్ టిటో నాయకత్వంలో అలాంటి నియంతృత్వమే సోవియట్ ఆధిపత్యం బయట కొనసాగింది. అల్బేనియాలో కూడా అలాగే నియంతృత్వ పాలన నడిచింది. ఈ మొత్తం దేశాలన్నింటిలోను ఏకపార్టీ పాలన, నియంతృత్వం, సోవియట్ ఆధిపత్యం కొనసాగాయి. 1956లో హంగరీలో ఇమ్రెనేగీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం కోసం పోరాటం జరిగినా, సోవియట్ యూనియన్ ట్యాంకులతో సైన్యాన్ని పంపించి, ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. అలాగే 1968లో చెకొస్లవేకియాలో స్వేచ్ఛాయుత పాలన కోసం 'ప్రాగ్ వసంతం' పేరుతో తీవ్రప్రయత్నం జరిగింది.. బ్రెజ్నేవ్ నాయకత్వంలోని సోవియట్ యూనియన్ మరోసారి ఐదులక్షల సైనికుల్ని పంపి ఆ ప్రయత్నాన్ని అంతం చేసింది. ప్రజాస్వామ్యానికి నియంతృత్వానికి మధ్య జరిగిన ఈ ఘర్షణలో అత్యంత ప్రధాన పాత్ర వహించిన దేశం జర్మనీ. 1945లో రెండో ప్రపంచయుద్ధంలో జర్మనీ ఓటమితో, ఆదేశం ఒకవైపు రష్యా, మరోవైపు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సుల ఆధిపత్యంలోకి వెళ్ళింది. పశ్చిమాన పాశ్చాత్య దేశాల ఆధీనంలో ఉన్న పది లాండర్‌లు (రాష్ట్రాలు) కలిపి పశ్చిమ జర్మనీగా ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడ్డాయి. అక్కడ పౌరహక్కులు, స్వేచ్ఛా వాణిజ్యం, వాక్స్వాతంత్ర్యం, ఓటు హక్కు వేళ్ళూనుకున్నాయి. తూర్పున రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతంలోని ఐదు లాండర్‌లు కలిసి తూర్పు జర్మనీగా రూపొందాయి. అక్కడ ఏకపార్టీ నియంతృత్వం, ప్రభుత్వ గుత్తాధిపత్యం ఏర్పడి ప్రజల స్వేచ్ఛను కాలరాశారు. 1950లలో తూర్పు జర్మనీ నుంచి పశ్చిమ జర్మనీలో భాగమయిన పశ్చిమ బెర్లిన్‌లోకి పెద్దఎత్తున జనం వలసపోవటం ప్రారంభించారు. దాన్ని ఆపటం కోసం తూర్పు జర్మనీ ప్రభుత్వం బెర్లిన్ నగరాన్ని రెండుగా విభజిస్తూ గోడ కట్టింది. సెర్చిలైట్లు, సైనికుల పహరాలు, ఫిరంగులు, మర తుపాకులు ప్రజలు ఆ గోడని దాటకుండా కట్టుదిట్టం చేస్తూ తూర్పు జర్మనీని ఒక పెద్ద జైలుగా మార్చేశాయి. అప్పటి నుంచి బెర్లిన్ గోడ ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య తేడాని ఎత్తిచూపే ప్రబల చిహ్నంగా ప్రజల మనస్సులలో నిలిచిపోయింది. ఎంతోమంది తూర్పు జర్మన్‌లు రహస్యంగా బెర్లిన్ గోడ దాటాలని ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయారు.

## కుప్పకూలిన బెర్లిన్ గోడ

1989వ సంవత్సరం మధ్య వరకు ఈ పరిస్థితిలో ఏ మార్పు లేదు. 1985లో గోర్బచెవ్ అధికారంలోకి వచ్చాక పూర్వంలాగా తూర్పు యూరపు దేశాలలో చీటికి మాటికి సైనిక జోక్యం చేసుకోవటం సాధ్యకాదని సోవియట్ రష్యా నిర్ణయించింది. అయితే తూర్పు యూరపు దేశాలలో వివిధ పేర్లతో కమ్యూనిస్టు పార్టీలు, రహస్య పోలీసులు, సైన్యం, నియంతృత్వ సాధనాలతో బలమైన పట్టు సాధించాయి. అందువల్ల పరిస్థితిలో పెద్ద మార్పు రాలేదు. పోలెండులో లేవాలెసా నాయకత్వంలో సోలిడారిటీ అనే కార్మిక సంస్థ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతోంది. మొదటిసారిగా పోలిష్ పోప్ రెండో జాన్‌పాల్ కాథలిక్ చర్చికి అధిపతి కావటంతో పోలెండ్‌లో ప్రజాస్వామ్య ఉద్యమానికి అమితబలం చేకూరింది. కాని తూర్పు జర్మనీలో, ఇతర తూర్పు యూరపు దేశాలలో పరిస్థితిలో మార్పులేదు. 1989 ఉత్తరార్ధంలో అనుకోకుండా కొన్ని మార్పులు ప్రారంభమయ్యాయి. వేలమంది తూర్పు జర్మన్లు టూరిస్టులుగా చెకొస్లవేకియా నుంచి హంగరీ వెళ్ళారు. హంగరీలో 1956లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని అణిచేశాక జోనాస్‌కాదర్ నాయకుడుగా ఉన్నాడు. 1988 మేలో కాదర్‌ని పదవి నుంచి తొలగించి సంస్కరణలను కోరే నాయకత్వం అధికారంలోకి వచ్చింది. వేలమంది తూర్పు జర్మన్లు దాన్ని అవకాశంగా తీసుకుని హంగెరీ నుంచి సరిహద్దు దాటి పాశ్చాత్య దేశమయిన ఆస్ట్రియాలోకి, అక్కడి నుంచి పశ్చిమ జర్మనీకి వెళ్ళాలని సంకల్పించారు. వారి వత్తిడి వల్ల హంగరీ, ఆస్ట్రియా సరిహద్దులలో ఆంక్షలను క్రమక్రమంగా సడలించారు. కొద్ది వారాలలో ఐదు లక్షల మంది తూర్పు జర్మన్లు సరిహద్దు దాటి పశ్చిమ జర్మనీకి వలసపోయారు. ఎంత ప్రయత్నించినా తూర్పు జర్మనీ ప్రభుత్వం ప్రజల వలసను ఆపలేకపోయింది. ఎట్టకేలకు లక్షల మంది జర్మన్ ప్రజల పదఘట్టనల వల్ల బెర్లిన్ గోడ కుప్పకూలింది! తుపాకులు పేలకుండా, రక్తపాతం లేకుండా, కేవలం ప్రజల నిశ్శబ్ధ నిరసన వల్ల నియంతృత్వం కుప్పకూలింది. 1989 నవంబరు తొమ్మిదిన బెర్లిన్ గోడను లాంఛనంగా కొన్నిచోట్ల కూల్చి ప్రజల రాకపోకలను స్వేచ్ఛగా అనుమతించారు. నియంతృత్వానికి, శృంఖలాలకు, బానిసత్వానికి ప్రతీకగా ఒకనాడు నిలిచిన బెర్లిన్ గోడ శకలాలు నేడు ఖరీదయిన ఇళ్లలో డ్రాయింగు రూములలో చరిత్ర స్మృతి చిహ్నాలుగా మిగిలిపోయాయి. 1989లో అలా ఓ మహావిప్లవం అతి సులువుగా సాధ్యమయింది. దాని పర్యవసానంగా 1991లో కొద్ది వారాలలో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై పదిహేను స్వతంత్ర దేశాలుగా ఏర్పడ్డాయి. గతంలో ఎనిమిది

కమ్యూనిస్టు దేశాలు ప్రస్తుతం 27 దేశాలుగా అవతరించాయి. రష్యాలో, ఒకప్పటి యుగొస్లావియాలో ఇంకా పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జాతుల వైరాల కారణంగా రక్తపాతం కొనసాగుతోంది. ఇంత పెద్ద మార్పులకు కారణాలు తెలుసుకోవటం కష్టమేమీ కాదు. అసత్యాన్ని కలకాలం నమ్మించలేం. కాలక్రమేణా తమ స్వానుభవంతో ప్రజలు నిజాన్ని గుర్తించగలరు. ప్రచారంతో అబద్ధాన్ని కొంతకాలం నిజంగా చూపినా, నెమ్మదిగా అనుభవం ద్వారా అసత్యాన్ని జనం గుర్తిస్తారు. తూర్పు యూరపులో అదే జరిగింది. పాశ్చాత్య దేశాలలోని స్వేచ్ఛ, ఆర్థిక ప్రగతి క్రమక్రమంగా తూర్పు యూరపు ప్రజలకు అర్థమయ్యాయి. ఎంతగా సమాచారం అందకపోయినా, విదేశీ ప్రయాణాన్ని అనుమతించకపోయినా, పత్రికలను సెన్సారు చేసినా, కాలక్రమేణా వాస్తవం ఆనోటా, ఈనోటా పాకి అందరికీ తెలిసిపోయింది. టెలవిజన్ బాగా విస్తరించటంతో ఇక సత్యాన్ని దాచటం, అబద్ధాలను నమ్మించటం అసాధ్యమవయింది. సమయం సందర్భం కలిసి రాగానే విప్లవాత్మక మార్పులు సునాయాసంగా సంభవించాయి. ఆ విప్లవానికి 1989 నవంబరు మాసం ప్రతీకగా నిలిచిపోయింది.

## పతనమౌతున్న వ్యవస్థ

విప్లవాలు వచ్చినంత మాత్రాన అన్ని మార్పులు మంచివి కానక్కరలేదు. పరిస్థితుల్ని సరిగ్గా అవగాహన చేసుకుని, సకాలంలో సరైన మార్పుల్ని తెచ్చే ప్రయత్నిం చేసిన చోట్ల 1989 విప్లవం స్వేచ్ఛకు, ప్రగతికి దోహదం చేసింది. ఉదాహరణకు తూర్పు, పశ్చిమ జర్మనీలు విలీనమై బలమైన రాజ్యంగా ఏర్పడి యూరపు భవిష్యత్తును మారుస్తున్నాయి. అలాగే చాలా తూర్పు యూరపు దేశాలలో శాంతి, స్వేచ్ఛ, ప్రగతి సాధ్యమయ్యాయి. కాని సకాలంలో సరైన చర్యలు తీసుకోని చోట్ల పరిస్థితులు మరింత విషమించి ప్రజలకు సుఖసంతోషాలు కొరవడ్డాయి. ఉదాహరణకు ప్రస్తుత రష్యాలో ఉత్పత్తి పడిపోయింది; అరాచకత్వం తాండవిస్తోంది; అశాంతికి లోనైన ప్రజలు పదేళ్ళ కిందటే పరిస్థితి బాగుందనుకుంటున్నారు. అలాగే ఒకప్పటి యుగోస్లావియాలో మారణహోమానికి గురై వేలమంది అమాయకులు బలవుతున్నారు. ఇంకా ఆ కార్చిచ్చు చల్లారలేదు. అల్బేనియాలో లక్షల మంది కొంపాగూడు కోల్పోయి ఆకలితో నకనకలాడుతున్నారు. చరిత్ర పథంలో సమయం సందర్భం కలిసి వచ్చినప్పుడు పెనుమార్పులకు అట్టే కాలం పట్టదు. 1989 జూన్ – జులైల వరకూ

ఏ సందడీ లేని తూర్పు జర్మనీలో నవంబరు వచ్చేసరికి దాని చరిత్రే మారిపోయింది. 1991 వేసవి వరకు అవిచ్ఛిన్నంగా, అమెరికాతో దీటుగా అగ్రరాజ్యంగా కొనసాగుతున్న సోవియట్ యూనియన్ అదే సంవత్సరం డిశంబరుకల్లా పదిహేను దేశాలుగా ముక్కలయింది! భారతదేశంలో కూడా పెనుమార్పులకు కాలం దగ్గరపడింది. అందుకు ఎన్నో సంకేతాలున్నాయి. రాజకీయ అస్థిరత, ప్రభుత్వాల ఆర్థిక, సంక్షోభం, టెలివిజన్ ప్రభావం, ప్రజలలో పెరుగుతున్న అశాంతి, విస్తరిస్తున్న నేర రాజకీయం, అరాచకత్వం, అంతులేని ఎన్నికల ఖర్చు, అక్రమాలు, అవినీతి– ఇవన్నీ దేశ వ్యవస్థ పతనాన్ని సూచిస్తున్నాయి. వచ్చే ఐదేళ్ళలో భారతదేశం అనూహ్యమయిన మార్పులకు గురవుతుంది. చరిత్రగతిని అర్థం చేసుకుని సకాలంలో నిజాయితీతో, విజ్ఞతతో, చొరవతో, స్థైర్యంలో ఆలోచనాపరులు స్పందిస్తే, రాబోయే మార్పులు మన బిడ్డల జీవితాలను సుగమం చేస్తాయి. అలాకాక తాత్సారం చేసి, ఆత్మవంచనకులోనై, దుష్పరిపాలనను ఇలాగే కొనసాగిస్తే వచ్చే మార్పులు సమాజాన్ని అతలాకుతలం చేసి జనజీవనాన్ని అశాంతిమయం చేస్తాయి. ఇప్పటి ప్రశ్న దేశంలో పెనుమార్పులు వస్తాయా, లేదా అని కాదు; వచ్చే మార్పులు ప్రజల భవిష్యత్తును పదిల పరుస్తాయా, లేక మరింతగా చేటు చేస్తాయా అని మాత్రమే.

* * *

# సంస్కరణల సేద్యానికి ఇదో సదవకాశం

**జూలై 12, 2004**

ప్రతి అంశానికి సంబంధించి బలమైన రాజకీయ దృక్కోణం నుంచి ఆలోచించే వాతావరణం నెలకొని ఉన్న సమాజం మనది. ఈ వ్యవస్థలో కొందరు ఒత్తిడి కారణంగానో, పరిస్థితుల ప్రభావంవల్లో విస్తృతమైన భూమిక పోషించాల్సి వస్తుంది. అలాంటప్పుడు పౌరసమాజంలో స్వతంత్ర పాత్ర నిర్వహిస్తున్నవారు జాతీయ సలహామండలి వంటి సంస్థల్లో సభ్యత్వాన్ని ఆమోదించడం భిన్నాభిప్రాయాలకు తావిస్తుంది. ఇప్పుడూ, ఏ పార్టీకీ చెందని స్వతంత్రులు జాతీయ సలహా మండలిలో చేరడం అదే మాదిరిగా రకరకాల అభిప్రాయాలు వ్యక్తం కావడానికి కారణమయింది. ఎన్.ఎ.సి.లో సభ్యత్వాన్ని నేను ఎందుకు ఆమోదించానో చెప్పేముందు మరికొన్ని అంశాలను వివరించడం సహేతుకం.

**'లోక్‌సత్తా' నేపథ్యం...**

లోక్‌సత్తా ఉద్యమం సంస్కరణల్ని ఆశిస్తూ ప్రజాభిప్రాయాన్ని కూడగడుతోంది. ఇది ఏ రాజకీయ పార్టీకీ అనుబంధ ఉద్యమం కాదు. ఇది పూర్తిగా స్వతంత్ర ఉద్యమం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని ఎన్నికల ప్రక్రియలో, పరిపాలన విధానాల్లో రావలసిన సంస్కరణలు అవసరాన్ని విశదీకరిస్తూ దేశంలోని రాజకీయ పక్షాలన్నింటి తోడ్పాటుతో ఆ క్రమంలో ముందడుగులు వేయడానికి లోక్‌సత్తా ప్రయత్నాలు సాగిస్తోంది. రాజకీయ పక్షాలూ ఈ దేశం ఎదుర్కొంటున్న పాలనపరమైన సంక్షోభాన్ని నివారించేందుకు సదవగాహనతో స్పందిస్తుండటం శుభ పరినామం. పదమూడో లోక్‌సభలో– పార్టీ విరాళాలకు సంబంధించిన సంస్కరణలు, పార్టీ ఫిరాయింపుల నిషేధం, రాజ్యసభ ఎన్నికలలో నివాస నిబంధనను మార్చడం, మంత్రి మండలి పరిమణాన్ని పరిమితం చేయడం వంటి అంశాలపై ప్రధాన రాజకీయ పక్షాల మధ్య వ్యక్తమైన ఏకాభిప్రాయం ఈదేశంలో రాజకీయాలు మళ్ళీ తేటన పడుతున్నాయనడానికి, ప్రజాస్వామ్యం బలంగా వేరూనుకుంటోందనడానికి ప్రతీకలు.

ప్రభుత్వం వ్యవస్థ ప్రజలకు సేవచేయడానికే ఉందని, అది సమాజం అవసరాలను

గుర్తించి వాటిని తీర్చాలని లోక్‌సత్తా భావిస్తోంది. ప్రజల ఆమోదం ద్వారానే ప్రభుత్వానికి చట్టబద్ధత లభిస్తుంది. రాజకీయ పార్టీలు ఈ ప్రజాస్వామిక పాలన వ్యవస్థలో అంతర్భాగాలు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు– ఈ రెండిటతో ప్రజలు నిరంతరం సత్సంబంధాలు నెరపడం అవసరమని లోక్‌సత్తా విశ్వసిస్తోంది. మనందరం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే ఆటనియమాలను మార్చాలే తప్ప, ఆటగాళ్లను మార్చడంవల్ల ప్రయోజనం ఉండదని, ఆట నియమాలను మార్చడం ద్వారానే వ్యక్తి కేంద్రబిందువుగా ఉండే జవాబుదారీ తనంగల వ్యవస్థను, మనిషిని మనిషిగా గుర్తించి గౌరవించే సమాజాన్ని, సరైన న్యాయపాలనను నెలకొల్పగలమని లోక్‌సత్తా తొలినాటి నుంచి వివరిస్తోంది.

పాలనపరమైన, రాజకీయపరమైన సంస్కరణలను తీసుకువచ్చే లక్ష్యంతోనే, లోక్‌సత్తా గడిచిన కొన్నేళ్లుగా రాజకీయ నాయకులతో, పార్టీలతో సంబంధాలను కొనసాగిస్తూ వస్తోంది. ఎన్.డి.ఎ. కేంద్రంలో అధికారం నెరపిన రోజుల్లే ఉదాహరణగా తీసుకోండి... రాజ్యాంగ సమీక్షా సంఘంలోని పార్లమెంటరీ సంస్కరణలు ఉపకమిటీలో నేను సభ్యుడిని. తద్వారా జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నాతో కలిసి పనిచేశాను. భారత రిపబ్లిక్ స్వర్ణోత్సవాల కమిటీలో సభ్యుడిగా ఉండాల్సిందిగా కూడా ఎన్.డి.ఎ. ప్రభుత్వం నన్ను కోరింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... ఎవరు అధికారంలో ఉన్నా, ఎవరు విపక్షంలో ఉన్నా... రాజకీయ నాయకులతో లోక్‌సత్తా సంవత్సరాలుగా సంబంధాలు కొనసాగిస్తోంది.

ఇప్పుడు... జాతీయ సలహామండలి సభ్యుడిగా ఉండాల్సిందిగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వర్తమానం అందినప్పుడు– ఆ ప్రతిపాదనను ఆమోదించాలంటే నాకు నిర్దిష్టంగా రెండు హామీలు ఇవ్వాలని సమాధానం పంపాను. అందులో మొదటిది– నా అభిప్రాయాలూ ఆలోచనల్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేయడం మీద ఎలాంటి అభ్యంతరమూ ఉండకూడదన్నది. రెండోది– రాజకీయాలకు అతీతంగా ఉండే స్వభావాన్ని, స్వతంత్ర విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోబోనని– అందుకు సమ్మతమైతేనే మండలిలో సభ్యుడిగా ఉంటానని వర్తమానం పంపాను. ఈ రెండు అంశాలలో ప్రధానమంత్రి కార్యాలయం నుంచి స్పష్టమైన హామీ లభించిన తరవాత మాత్రమే.. మండలలో సభ్యత్వానికి ఆమోదం తెలిపాను. మన ప్రజాస్వామ్యంలో ఉన్న సర్వరుగ్మతలకూ ఒక్క రాజకీయ నాయకుల్నే బాధ్యులుగా చేయాలని లోక్‌సత్తా

ఏనాడూ వాదించలేదు. నిజానికి, ఈరోజున కనిపిస్తున్న వైఫల్యాలు, వైకల్యాలకు రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలు, అందరు వ్యక్తులు బాధ్యత వహించాలి. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారన్నదానితో నిమిత్తం లేకుండా... ఈ విషయవలయంలో అందరికన్నా ఎక్కువగా నష్టపోతున్నది నాయకులే. నేటి దురవస్థకు పూర్తిబాధ్యత రాజకీయ నాయకులది కాదుగానీ, ఈ వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకువచ్చి దాన్ని మెరుగుపరచే బాధ్యత మాత్రం రాజకీయ నాయకులమీదే ఉంది. మంచి రాజకీయాలన్నవి ఓ ఆదర్శ భావన. రాజకీయాలు చెడ్డగా ఉన్నంతమాత్రాన అవే వద్దనుకోవడం మాత్రం సరైన ఆలోచన కాబోదు. నేటి రాజకీయాల్లో నాయకులు అత్యంత సంక్లిష్టమైన రెండు ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. అందులో మొదటిది– పరిమితమైన వనరులతో అపరిమితమైన ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు ప్రయత్నించడం. రెండోది– భిన్నవర్గాలు – ప్రయోజనాలలో తీవ్ర వైరుధ్యాలు ఉన్న సమాజంలో అందరినీ కలుపుకొని వెళ్లే ప్రయత్నాలు సాగించడం. కాబట్టి, రాజకీయాలలో ఉన్న చెడును కడిగివేయడానికి మరింత మెరుగైన రాజకీయమే సరైన సమాధానం. మెరుగుదల కనపడాలంటే– మరింతగా రాజకీయ పార్టీలు, నాయకులతో సంబంధాలను పెంపొందించుకోవడం, నిర్మాణాత్మకంగా చర్చలు నెరపడం... ఇవే సరైన సాధనాలు. సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేయకుండా చేసే విమర్శలవల్ల, రాజకీయనాయకుల్ని ఈ సమాజానికి దాపురించిన రాచపుళ్లుగా అభివర్ణించడంవల్ల అనుకూల ఫలితాలు లభించవు. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే ముషారఫ్ విధానాలు కావాలని ఆశించడమూ హేతుబద్ధంకాబోదు. మన వ్యవస్థలోని రాజకీయ శక్తుల్ని బలోపేతం చేయడం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకోగలుగుతాం. రాజకీయాల్లో ఉన్నవారంతా చెడుకు ప్రతిరూపాలని, విలన్లని భావించడంగానీ... మిగతావారంతా దేవతలని నిర్ణయానికి రావడంగానీ సరికాదు. ఇలా వారో శిబిరం– మనమో వర్గం అనుకోవడం వల్ల మన రాజకీయ వ్యవస్థ, మొత్తంగా ప్రజాస్వామ్య సౌధం బలహీనపడటం తప్ప మరో ప్రయోజనం సిద్ధించదు. సమాజంలో సహేతుకమైన మార్పులు రావాలంటే అది అందరూ చేతులు కలిపితేనే సాధ్యం. ఈ ప్రక్రియలోనుంచి రాజకీయ నాయకుల్ని మినహాయించి సాధించేదేమీ ఉండదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ప్రతి ఒక్క చెడుకూ మనం నాయకుల్నే బాధ్యులుగా చిత్రిస్తే.. ఉమ్మడిగా సత్ఫలితాలు సాధించాలన్న భావనే సాకరం కాదు. ఇప్పుడు కావాల్సింది వ్యవస్థకు మంచి చేసే సంస్కరణలకోసం ఉమ్మడిగా కదలడమే

తప్ప, అందరం కలిసి నేరాన్ని ఒకరిమీదే నెట్టేయడం కాదు. కార్యనిర్వాహక వర్గంతోను, రాజకీయ పార్టీలతోను కలిసి పనిచేయాలనడానికి సిద్ధాంతపరమైన మరో ముఖ్య ప్రాతిపదిక ఉంది. ప్రజాస్వామ్యంలో పౌరుడే సార్వభౌముడు. ఎన్నికైన ప్రతినిధులు, ఉద్యోగిస్వామ్యం ప్రభువులైన ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే ఏర్పడిన వ్యవస్థలు. అంటే... రాజకీయ నాయకుడికి– ప్రజలకు మధ్య సంబంధం ఓ సేవకుడికి– యజమానికి మధ్య ఉండే సంబంధంలాంటిదే అయినప్పుడు... యజమానికి సేవ చేయడానికి సేవకుడు ఎలా నిరాకరించగలుగుతాడు? అలాగే, సంస్కరణల్ని ఆశిస్తున్న వారికి వ్యవస్థలో ఉన్నత స్థానాలను అలంకరించినవారికి మధ్య ఎంతో అంతరం ఉన్నా, వారు కలిసి పనిచేస్తేనే వ్యవస్థలో చెడును పరిహరించే వీలుంటుంది. ఈరోజు అధికారంలో ఉన్న వ్యక్తులు మన అభిప్రాయాన్ని, సలహాని అడిగినప్పుడు– చెప్పడం మన విధి. అంతేగాని 'పౌర సమాజం' నిరంతరం ప్రభుత్వంతోను, పాలకులతోను విభేదిస్తూ ఉండాలన్న భావన సరికాదు.

## మార్పునకు ఉపకరణాలు

ఇక జాతీయ సలహా మండలి విషయానికి వస్తే.... దాని నియమ నిబంధనలు విశాల దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. అవి సరళమైన నిబంధనలు కూడా. అందులో సభ్యత్వం– రాజకీయాలు, పాలనపరంగా రావాల్సిన సంస్కరణల్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఉపకరిస్తుందని నేను ఆశిస్తున్నాను. ఐక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో అనేక ఇతర అంశాలతో పాటు విద్యా ప్రమాణాలను పెంచడం, ఆరోగ్య భద్రత, అధికార వికేంద్రీకరణ, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి, రాజకీయ, పరిపాలన పరమైన సంస్కరణల్ని ప్రస్తావించింది. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని లోక్‌సత్తా బలంగా విశ్వసిస్తోంది. ఎన్నికల సంస్కరణలు, స్థానిక సంస్థలకు అధికారాలు, సత్వరం సరైన న్యాయాన్ని అందించే వ్యవస్థ, జవాబుదారీతనాన్ని పెంపొందించే విభాగాలు సంస్కరణలకు హృదయం వంటివి. అలాంటి సంస్కరణల ద్వారానే పౌరులు ఈ సమాజంలో మర్యాదా మన్ననలతో జీవించగలుగుతారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఎన్నికా మార్పునకు వేదికే. రాజకీయ పక్షాలు, ఎన్నికైన ప్రభుత్వం సరైన మార్పునకు ఉపకరణాలు, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అటు ప్రభుత్వంతోను, ఇటు రాజకీయ పక్షాలతోను కలిసి పనిచేయడం

పౌరులందరి విధి. కాబట్టే లోక్‌సత్తా-ప్రజాస్వామ్యాన్ని బలవర్ధకం చేసే ప్రక్రియలో ప్రభుత్వంతో కలిసి పనిచేసే అవకాశాన్ని ఉపయోగించుకుంటుంది. మన రాజకీయ వ్యవస్థ ప్రజల విన్నపాలకు స్పందిస్తుందని, పరిపాలన మెరుగుపరచే ప్రక్రియకు విభేదాలను పక్కనపెట్టి రాజకీయ పక్షాలన్నీ మద్దతు పలుకుతాయని, అవినీతి లేని భరతావనిని నిర్మించి ఈ దేశంలో బాలలు తమ సామర్థ్యాలను నిరూపించుకునే అవకాశాన్ని కల్పించాలని, సాధ్యమైనంతవరకు వారికే ఇబ్బందీ కలగకుండా చూడాలని- ఇందుకు పాలకులూ సహకరిస్తారని మేం ఆశిస్తున్నాం.

* * *

# నిర్దుష్ట వ్యవస్థ రూపొందిననాడే నిజమైన పర్వదినం

**డిసెంబర్ 27, 1999**

**19వ** శతాబ్దంలో సుప్రసిద్ధ రచయిత, మానవతావాది, తత్వవేత్త విక్టర్ హ్యూగో 20వ శతాబ్దం సమాజాన్ని చాలా అందంగా ఊహించారు. ఆయన ఊహ ప్రకారం "20వ శతాబ్దంలో యుద్ధం అంతరిస్తుంది; ఉరికంబం నశిస్తుంది. మానవాళి మొత్తానికి ఒకే దేశం ఉంటుంది; అది ఎల్లలు లేని భూగోళం. మానవజాతి మొత్తానికి ఒకే ఆశ ఉంటుంది; అది మన ప్రపంచాన్ని స్వర్గతుల్యం చేసుకోవటం". అలాంటి ఆశలు చాలావరకు నెరవేరలేదు. 20వ శతాబ్దంలో మున్నెన్నడూ లేనంతగా రెండు ప్రపంచయుద్ధాలు మారణహోమాన్ని సృష్టించాయి. నరజాతి సమస్తాన్ని భస్మీపటలం చేయగల అణ్వాయుధాలు తయారయ్యాయి. ఎప్పుడు ప్రపంచస్థాయి అణుయుద్ధం జరుగుతుందోనని జనం నాలుగు దశాబ్దాలపాటు భయాందోళనలతో నలిగిపోయారు. ఇప్పుడిప్పుడే ఆ భయాన్నుంచి ప్రపంచం తేరుకుంటోంది. చరిత్రలో ఎన్నడూ చవిచూడని క్రూరత్వం కోట్ల మందిని కబళించింది. జర్మనీలో, మిగతా యూరపులో 60 లక్షలమంది యూదులు వర్ణించనలవికాని హింసలకు గురయ్యారు, స్టాలిన్ రష్యాలో లక్షల మంది దుర్భరమైన శారీరక క్లేశాలకు బలయ్యారు. కాంబోడియాలో మూడోవంతు జనాభా పోల్‌పాట్ నిరంకుశ జ్వాలలలో మాడి మసైపోయింది. ఆకలి కోట్లమందిని కబళించింది. 1943-44లో బెంగాల్ క్షామంలో లక్షలమంది ప్రాణాలు కోల్పోగా, 1959-60 కాలంలో చైనాలో రెండు కోట్ల మంది ఆశువులు బాశారు. ఇథియోపియాలో, సొమాలియాలో, రువాండాలో, ఇంకా ఎన్నో ప్రాంతాలలో ఈ దశాబ్దంలో కూడా లక్షల మంది తిండి లేక మరణిస్తున్నారు. భారత్‌లాంటి దేశాలలో ఇప్పటికీ దుర్భర దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం తాండవిస్తున్నాయి. మనిషికి మనిషికి మధ్యదూరం పెరిగి అభద్రభావం, మానసిక వ్యాధులు ప్రబలిపోతున్నాయి. నేరప్రవృత్తి పెరిగిపోతున్నది. ఇవన్నీ చూస్తే 20వ శతాబ్దం ఒక పీడకల అని కొందరు భావించవచ్చు.

## ఈ శతాబ్దంలో వెలుగులూ ఉన్నాయి...!

నిష్పాక్షికంగా పరిశీలిస్తే దుష్పరిణామాలు సంభవించినప్పటికీ 20వ శతాబ్దం మానవాళి పురోగతికి ఎంతో దోహదం చేసింది. వలస రాజ్యాలు అంతరించి ఆసియా, ఆఫ్రికాలలో ఎన్నో స్వతంత్ర దేశాలు ఆవిర్భవించాయి. మునుపెన్నడూ లేనంత స్థాయిలో సంపద సృష్టి జరిగింది; జరుగుతున్నది. గతంలో ఊహించనలవికాని వస్తువుల, సేవల ఉత్పత్తి సాధ్యమయింది. శతాబ్దాల పర్యంతం మహమ్మారిగా భావించిన మశూచికం అంతరించిపోయింది. పోలియో, క్షయ, మలేరియా, కలరా లాంటి ఎన్నో వ్యాధులు నివారించటం సాధ్యమయింది. ఎన్నో అంటువ్యాధులకు దివ్యౌషధాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఆహారోత్పత్తి అందరికీ పుష్కలంగా సరిపోయేలా జరుగుతోంది. మనిషి సగటు జీవనకాలం అనూహ్యంగా పెరిగింది. ఒకప్పుడు కొద్దిమందికే లభ్యమయిన అక్షరజ్ఞానం ఇప్పుడు అత్యధిక సంఖ్యాకులకు అందుబాటులో ఉంది. విద్య, ఆరోగ్యం పుట్టిన ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కులనే భావం ప్రపంచమంతటా వ్యాపించింది. సాంకేతిక విజ్ఞానం అనూహ్యంగా విస్తరించింది. శతాబ్దం క్రితం ఊహకైనా సాధ్యంకాని రీతిలో టెలిఫోన్, విమానయానం, మోటారు కారు, సినిమాలు, రేడియో, టెలివిజన్, కంప్యూటర్, ఇంటర్‌నెట్ ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయాయి. లింగ, వర్ణ, కుల, మత వివక్షలు లేకుండా మనుషులందరూ సమాన గౌరవానికి అర్హులనే భావన చరిత్రలో మొదటిసారిగా ప్రపంచమంతటా వ్యాపించింది. మానవ హక్కుల్ని నియంతలు సైతం ఆమోదించాల్సిన పరిస్థితి వచ్చింది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన ప్రపంచమంతటా ఆధునిక రాజ్యవ్యవస్థలో ప్రమాణాలుగా గుర్తింపు పొందాయి. వ్యక్తి స్వేచ్ఛ ఈ శతాబ్దంలో అవధులు లేకుండా విస్తరించింది. మనిషి సుఖానికి కావలసిన అన్ని సాధనాలూ సమకూరాయి. దుర్భరమైన శారీరక క్లేశానికి గురికాకుండా సులభంగా పనులు చేయటం మొదటిసారిగా సాధ్యపడింది. గతంలో చక్రవర్తులకు సైతం అందని సదుపాయాలు ఇప్పుడు సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చాయి అడపాదడపా స్థానికంగా యుద్ధాలు కొనసాగుతున్నా 54 సంవత్సరాలుగా ప్రపంచమంతటా మొత్తం మీద శాంతియుత సహజీవనం సాధ్యమయింది. ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవడం వ్యక్తిగతమైన అంశమనీ, అందుకోసం పరులను ద్వేషించనక్కరలేదని మనిషి తొలిసారిగా అర్థంచేసుకున్నది ఈ శతాబ్దంలోనే. బానిసత్వ శృంఖలాలను ఛేదించుకుని మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే

అవకాశం కలిగిందీ ఈ శతాబ్దంలోనే. ఇలా మనిషి జీవనాన్ని స్పృశించే ప్రతి రంగంలోను 20వ శతాబ్దం స్వేచ్ఛను, సుఖాన్ని, సమభావాన్ని పెంచింది. అంతర్జాతీయ వాణిజ్యం, విదేశీయానం బాగా పెరిగి దేశాల మధ్య ఎల్లల ప్రాధాన్యం తగ్గుముఖం పడుతోంది. ప్రపంచ దేశాల మధ్య, వివిధ జాతుల మధ్య సయోధ్య పెరిగింది.

## జటిలమౌతున్న సమస్యలు

అంతమాత్రం చేత భవిష్యత్తు స్వర్గతుల్యంగా ఉంటుందనే హామీ ఏదీ లేదు. మనదేశంలోను, దక్షిణాసియాలోను, ఇంకా కొన్ని ఆఫ్రికన్ దేశాలలోను ఇప్పటికీ బీదరికం, ఆకలి తొలగిపోలేదు. ఇంకా నిరక్షరాస్యత, అనార్యోం ప్రజలను పీడిస్తున్నాయి. జనాభా అదుపు లేకుండా పెరిగిపోతున్నది. ఆధునిక ప్రపంచంలో అవిద్యం, అనారోగ్యం, బీదరికం, ఆకలి, అధిక జనాభా– ఇవన్నీ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. వీటన్నింటికి మూలం దుష్పరిపాలన, దోపిడీ రాజకీయం. 52 సంవత్సరాలుగా మన పాలకులు పాఠశాల విద్యని, ప్రాథమిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారు. ఇప్పటికి ప్రజలను 18వ శతాబ్దంలో ఉంచాలనే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిమంది మాత్రం విద్యావకాశాల్ని పొంది 21వ శతాబ్దంలోకి వడివడిగా అడుగులు వేస్తుండగా, మిగిలినవాళ్లంతా ఇంకా 19వ శతాబ్దంలోకి కూడా చేరుకోలేదు! విద్య లేనివారికి ఏ పనిలోను తగిన నైపుణ్యం ఉండదు. నైపుణ్యం లేనిదే సంపద సృష్టిలో పాలుపంచుకోవటం సాధ్యంకాదు. దాంతో బీదరికం తప్పదు. నిరంతరం అనారోగ్యానికి గురై, అకాల మృత్యువుతో బాధపడే కుటుంబాలలో జనాభాను నియంత్రించాలన్న ఆలోచన కూడా రాదు. ఎక్కువమంది బిడ్డలుంటే మరికాస్త కూలి చేసి సంపాదించవచ్చనే ఆశో, లేదో ఒక బిడ్డ చనిపోయినా మరో బిడ్డ బతికి ఉండాలనే సహజమైన కోరికో అపరిమితంగా బిడ్డల్ని కనేలా చేస్తుంది. మన రాష్ట్రంలో ఎనిమిది లక్షలమంది ప్రభుత్వోద్యోగులలో 2,50,000 మంది గుమాస్తాలు, 1,80,000 మంది బంట్రోతులు, అధికార వాహనాలకు డ్రైవర్లు. అంటే దాదాపు 55 శాతం మంది ఏ నిర్ణయమూ స్వంతంగా తీసుకోని వారు; ఏ వస్తువును ప్రజల కోసం ఉత్పత్తి చేయనివారు! 2,75,000 మంది అధ్యాపకులున్నా, వారు నిజంగా విద్యావసరాలకు ఏమాత్రం చాలరు. పోని ఉన్న అధ్యాపకులు సరిగ్గా విద్యాబోధన చేయగలుగుతున్నారా అంటే అందుకు తగ్గ వాతావరణాన్ని సృష్టించడంలో పాలకులు విఫలమయ్యారు. ప్రాథమిక ఆరోగ్యం చాలావరకు కాగితాలకే పరిమితమయ్యింది. తత్ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో దేశంలో అట్టడుగు నుంచి మూడోస్థానంలో

ఉంది! పల్స్‌పోలియో లాంటి కొన్ని మంచి కార్యక్రమాలను మినహాయిస్తే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య రక్షణ లభిస్తుందనే ఆశే అడుగంటింది. నూటికి తొంభైమంది బాలలు ఎందకూ కొరగాకుండా పోతున్నారు. ప్రకృతి ఇచ్చిన శక్తి సామర్థ్యాలు, ప్రతిభాపాటవాలు శాశ్వతంగా మరుగున పడిపోతున్నాయి. అటు జీవితాన్ని ఆస్వాదించటంలో ఇటు సంపద సృష్టిలో విఫలురై ఎందరో వ్యర్థజీవనం గడుపుతూ బీదరికం కోరల్లో చిక్కుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో రోగానికి చికిత్సేగాని వ్యాధినిరోధంపట్ల శ్రద్ధ లేకపోవటంతో అనారోగ్యం అదుపులోకి రావటం లేదు. ఎక్కువ పెట్టుబడితో ఆధునిక సదుపాయాలు అందించాలన్న తహతహతో ప్రైవేటు ఆసుపత్రులు సామాన్యులకు అందుబాటులో లేకుండాపోయాయి. ప్రభుత్వం యంత్రాంగానికిచ్చే జీతభత్యాలన్నీ నిరర్థకమవుతున్నాయి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించకపోగా, ప్రతిచోట లంచం విశ్వరూపం ధరించటంతో నిరంతర దోపిడీ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. చివరికి ప్రభుత్వం ఎందుకు అంటే పన్నులు వసూలుచేసి ఉద్యోగులకు జీతభత్యాలివ్వటానికి అని చెప్పుకొనే పరిస్థితి వచ్చింది. మరి ఉద్యోగులు ఎందుకు అంటే లంచాలు తిని ప్రజల్ని వేధించటానికి అనే సమాధానం వస్తుంది. ఎన్నికయ్యే ప్రతినిధులు ఎందుకు అంటే పైరవీలు చేయటానికి, సొంత లాభం చూసుకోవటానికి, అధికార పిపాసతో మనమీద స్వారీ చేయటానికి అని జవాబు వస్తుంది. పాలన అంతా చట్టబద్ధ చౌర్యంగా, రాజ్యాంగబద్ధ దోపిడీగా మారిపోయింది. ఉద్యోగులలో, అధికారులలో, ఎన్నికయిన ప్రతినిధులలో ఎందరో మంచివాళ్లు, నిజాయతీపరులు, చిత్తశుద్ధితో సేవకులుగా ప్రవర్తించేవాళ్లు లేకపోలేదు. కాని అలాంటివాళ్లు ఉన్నకొద్దీ బలహీనులై మనల్ని దోచుకునేవాళ్లు బలపడుతున్నారు.

## ప్రజల చేతనతోనే చక్కటి సమాజం

ఈ పరిస్థితిని మార్చాలి, ప్రజల పన్నుల డబ్బు ప్రజల సౌకర్యాల కోసం వినియోగం కావాలి. ప్రజల ఉప్పు తినే ప్రజాసేవకులు వారి కోసం పనిచేయాలి. అందరికీ పాఠశాల విద్య, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందాలి. ఇందుకు అవసరమైన పాలన సంస్కరణల్ని చేపట్టి అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజలకు స్థానికంగా జవాబుదారిగా తీర్చిదిద్దాలి. పరిస్థితులు మారనంతవరకు దేశ ప్రజలు 21వ శతాబ్దాన్ని గురించి ఆలోచించటం వ్యర్థం. నూతన సంవత్సర సంబరాలు భవిష్యత్తును దర్శించేవాళ్ల కోసం గాని, గతంలో పాతుకుపోయే వాళ్ళకోసం కాదు. ఈ మార్పు దానంతట అదే రాదు. మానవ ప్రయత్నం వల్ల, విజ్ఞతవల్ల మాత్రమే

ఇది సాధ్యం. మన జీవితాన్ని మనమే శాసించుకునే అవకాశాన్ని ప్రజాస్వామ్యం మనకిచ్చింది. భవిష్యత్తును పండించుకుని సుందరంగా మలచుకునే సాధనాలను ఆధునిక సాంకేతిక విజ్ఞానం సమకూర్చింది. పరిస్థితులు మారకపోతే ఆ పాపం మనదే. ఇప్పటికయినా సమయం మించిపోలేదు. సత్వరం పాలనను సమూలంగా సంస్కరించుకుని, ప్రజలు చెల్లిస్తున్న పన్నుల డబ్బు సద్వినియోగమయ్యేలా, పిల్లలందరికీ కనీస విద్య, అందరికీ కనీస ఆరోగ్యం అందేలా; సమాజలో శాంతి, సత్వర న్యాయం దొరికేలా రాజ్య వ్యవస్థను సరిదిద్దాలి. అందుకు అనువైన మార్గాలు, వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రయత్నం చేస్తే, ఖచ్చితంగా పది హేను, ఇరవై సంవత్సరాలలో ఒక సమాజంగా, ఒక జాతిగా, ఓ దేశంగా తలెత్తుకోగలం. ఆధునిక విజ్ఞానం అనతికాలంలోనే సమాజాన్ని మార్చుకునే అవకాశాన్నిచ్చింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆలస్యంగానయినా భారత్ 21వ శతాబ్దంలోకి ప్రవేశిస్తుంది. ఇంకా పందొమ్మిదో శతాబ్దాన్ని దాటని మనకు నూతన శతాబ్ద సంబరాలతో అప్పటివరకు పనిలేదు.

* * *

# సమగ్ర సంస్కరణలే సంక్షోభానికి పరిష్కారం

**ఆగస్టు 18, 1997**

నేటి పాలన సంక్షోభం చాలా జటిలమైనది. దేశం ఎదుర్కొంటున్న సమస్యల స్వభావం, వాటి తీవ్రత, పరిణామం మనల్ని భయకంపితుల్ని చేస్తాయి. అందరి కళ్లముందే మన రిపబ్లిక్ క్రమక్రమంగా పతనమవుతోంది. కాని, సంక్షోభం ఎంత తీవ్రమయినదయినా, దాని పరిష్కారం మానవాతీతమయినదేమీ కాదు. దేశం విధిగా అరాచకత్వానికి, నియంతృత్వానికి, విచ్ఛిన్నకర శక్తులకు లోబడవలసిన అవసరం ఏమాత్రం లేదు. చాలామంది భారతదేశ జడత్వాన్ని సమస్యల తీవ్రతను భూతద్దంలో చూపి ఎక్కువగా అంచనా వేస్తున్నారు. సమస్యల్ని పరిష్కరించుకోవటం అసాధ్యం అన్న భావన వెలిబుచ్చుతున్నారు. బయటి వాళ్లు ఈదేశం భవిష్యత్తుని 'నిరాశ' అనే రంగు కళ్లద్దాల లోంచి చూసి 100 కోట్ల మంది భారతీయులను చిన్నచూపు చూస్తున్నారు. దేశంలో అనేకమంది ఆత్మవిశ్వాసం కోల్పోయి 'ఆత్మహింసకు' లోనవుతున్నారు. ఆత్మన్యూనత భావంలో కుంగిపోతూ, ఇక ఈ దేశాన్ని భగవంతుడు కూడా బాగు చేయలేడు', 'జనమంతా చెడిపోయారు', మన జాతికి శీలం లేకుండా పోయింది' అంటూ కుమిలిపోతున్నారు. ఒక వ్యక్తికిగాని, సంస్థకు ఆని, జాతికి గాని ఆత్మవిమర్శ అవసరమే. అయితే అది ఆత్మన్యూనతగా, ఆత్మహింసగా పరిణమిస్తే వినాశకారణమౌతుంది. దేశానికి, సమాజానికి ఈ సంక్షోభం నుంచి బయటపడి మన బిడ్డలు గర్వించే భవితవ్యాన్ని నిర్మించే శక్తి సామర్థ్యాలున్నాయి. అందుకు కావలసిన విలువలు, ఆత్మస్థైర్యం, మేధా సంపత్తి వనరులు మనకు పుష్కలంగా ఉన్నాయి. అందుకు అవసరమైన సృజనశక్తికి, ముందుచూపునకు, విజ్ఞతకు, ధైర్యానికి కొదవలేదు. అయితే మన కలలు పండాలంటే అక్కడక్కడా చిన్న చిన్న మాట్లు వేసి అతుకులబొంతలాగా చేయటం కాక, నిజమైన ప్రజాస్వామ్యం పునాదుల మీద వ్యవస్థను ప్రతిష్టించాలి. అందుకు నేటి వ్యవస్థ లోపాల్ని సవరించి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరుల భాగస్వామ్యాధికారం, చట్టాల శిరోధార్యత, సంస్థల స్వయం పరివర్తన పుష్కలంగా ఉండేటట్లు తీర్చిదిద్దాలి. రాజ్య వ్యవస్థను ఆ పునాదులపై పటిష్టం చేసి, జాతిని

పునీతం చెయ్యాలి. తల్లి భారతి కన్నీరు తుడవాలి. అప్పుడే సమాజంలో శాంతి భద్రతలు, సుస్థిరత్వం, సహజీవనం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం; దేశ ఐక్యత, అఖండత మనమాశించిన స్థాయిలో వర్ధిల్లగలుగుతాయి. అప్పుడే శీఘ్ర ఆర్థిక ప్రగతి సాధ్యమౌతుంది. బీదరికం కోరల నుండి దేశ పౌరులు బయటపడగలుగుతారు. బిడ్డల భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దగలుగుతాం. ఇది పూర్తిగా మన చేతుల్లో పని. ఈ కార్యాన్ని మన మీద జాలితోనో, అభిమానంతోనో, మరెవరో చేపట్టరు. ఈ అవసరం మనది. ఈ బాధ్యత మనందరిది. అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలు మనవి.

## అతుకులతో పని జరగదు

గత 50 సంవత్సరాల కాలంలో వ్యవస్థలో లోపాలను సవరించడానికి అడపాదడపా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అవినీతి నిర్మూలన కోసం కొన్ని చట్టాలు, కొన్ని రాష్ట్రాల్లో లోకాయక్తల నియామకం జరిగాయి. ఎన్నికల సంస్కరణల కోసం ఈ మధ్య ఎన్నికల సంఘం ప్రయత్నించింది. న్యాయమూర్తుల నియామకంలో రాజకీయ జోక్యం నివారించడానికి ప్రస్తుతం సుప్రీంకోర్టు శతవిధాల ప్రయత్నిస్తోంది. అధికార వికేంద్రీకరణ కోసం వివిధ రాష్ట్రాల్లో పంచాయితీరాజ్ చట్టాల్ని అమలు చేశారు. ఇటీవల రాజ్యాంలో 73, 74 సవరణల రూపంలో ఇదే ప్రయత్నం జరిగింది. నేర పరిశోధనలో రాజకీయ జోక్యం నివారించాలని న్యాయస్థానాలు కొంతవరకు ప్రయత్నిస్తున్నాయి. ఇలా ఎన్ని ప్రయత్నాలు విడిగా చేపట్టినా, అవి సమస్య మూలాన్ని ఛేదించకుండా శాఖల్ని తుంచే ప్రయత్నాలే అయ్యాయి. సంక్షోభం సమసిపోలేదు. ఒకవేళ చేసిన చట్టం మంచిదనిపించినా, చుట్టూ ఉన్న వ్యవస్థాపరమైన కారు చీకట్లో అతి చిన్న దీపాల ప్రభావం నామమాత్రంగా ఉంటోంది. చేపట్టిన చిన్న సంస్కరణ ఎంత మంచిదయినా, ఎంత సదుద్దేశంతో అమలు చేసినా, మిగిలిన అనుబంధ రంగాలలో మార్పులు లేకపోవటంతో ఫలితాలు కానరావటం లేదు. ఉదాహరణకు ఎన్నికలలో కనీస పరిమితి మేరకు నిధుల్ని నిజాయితీగా సేకరించి వెచ్చించే అవకాశం లేకపోవడంతో, ఎన్నికైన అందరు ప్రజాప్రతినిధులు అబద్ధమాడవలసి వస్తోంది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడంతో ఆయా పార్టీలలో సమర్థులు, సచ్ఛీలురు నిరుత్సాహ పడుతున్నారు. ధన బలం, కండబలం ఉన్నవాళ్లే రాజ్యం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినా నిజమైన అధికారాలు కేంద్రీకృతం కావడంతో వాటిపాత్ర నామమాత్రం అయిపోయింది. న్యాయమూర్తులు విశ్వప్రయత్నం

చేసినా, చట్టాల నిబంధన వల్ల సకాలంలో న్యాయాన్ని అందించలేకపోతున్నారు. ప్రభుత్వాలు మారినా, ప్రజల విశ్వాసాన్ని పొందినా, ఉద్యోగ వర్గాలతో పనిచేయించలేక పోతున్నారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం ఉన్నా, నిజాయితీతో రాజకీయ మనుగడ కష్టమయిన నేపథ్యంలో, చట్టం మూకుమ్మడి ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందనేగాని, ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వాలు మనుగడ సాగించలేక పోతున్నాయి. ఇలా చిన్న, చిన్న ఒయాసిస్సులున్నా, అవి చుట్టూ ఉన్న ఎడారిలో సులభంగా కనుమరుగవుతున్నాయి. ఇది బాగానే ఉందని, దాన్లో మార్పేమి అక్కర్లేదని వారు వాదిస్తున్నారు. అలాగే గత వైభవాన్ని కీర్తించే పెద్దలు, సంప్రదాయవాదులు, అసలు లోపమంతా నేటి తరంలోనే ఉన్నది, వారిలో నైతిక విలువలు పెరగందే ఏ వ్యవస్థ అయినా, ఏ చట్టమయినా ఒకేటనని విశ్వసిస్తారు. గతానుభవం నుంచి పాఠాలు నేర్చుకోలేకపోతే, ఏ వ్యవస్థ అయినా ఎక్కువకాలం నిలవదు. మంచి పాలన వ్యవస్థ మంచి ప్రవర్తను ప్రోత్సహించాలి; చెడుని నిరోధించాలి అంతా మంచి వాళ్ళై, నిరంతరం మంచే చేసినట్లయితే అసలు రాజ్యం, రాజ్యవ్యవస్థ, రాజ్యాంగం, చట్టం అక్కరలేదు. మనిషి ప్రవర్తనను మంది బాగుకోసం అదుపులో ఉంచాల్సిన అవసరం ఉంది. కాబట్టే చట్టాలు కావాలి. ఈ చట్టాలు, సంస్కరణలు పాలన సంక్షోభాన్ని సమూలంగా తొలగించేట్లుగా ఉండాలి. లోపాన్ని నిరంతరం సరిదిద్దగలిగే యంత్రాంగాన్ని ఈ సంస్కరణలు రూపొందించాలి. అది జరగాలంటే మౌలిక సమస్యల పరిష్కారానికి సమగ్రమైన సంస్కరణలు కావాలి. తీగ లాగితే డొంకంతా కదులుతుందని సామెత. ఏ తీగ లాగితే ఏ డొంక కదులుతుందో అర్థం చేసుకొని చర్యలు చేపట్టాలి. ఒట్టి వెంట్రుకలు ఏరడంతో తృప్తిపడకుండా, అపరిశుభ్రంగా ఉన్న కంబళిని శుద్ధి చేయాలి.

## ప్రవృత్తి - ప్రవర్తన

ప్రవాస భారతీయులనే తీసుకుంటే, భారతీయ సంతతికి చెందిన వారు ప్రపంచమంతటా దాదాపు కోటి 50 లక్షల మంది ఉన్నారు. వారంతా దాదాపు అన్ని దేశాలలోను అక్కడి సమాజాల మన్ననలు పొందారు. వారందరి సంవత్సరాదాయం కలిపి, 100 కోట్ల జనాభా ఉన్న భారతదేశం మొత్తం జాతీయాదాయంతో సమానం. అంటే ఇదే భారతీయులకి మంచి అవకాశం కల్పించి, వారిలో మంచిని, సామర్థ్యాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తే ఎంతటి సత్ఫలితాలను సాధించగలరో ప్రవాస భారతీయులు దృష్టాంతం రుజువు చేస్తోంది. అలాగే దేశంలోనే

కొన్ని కొన్ని సంస్థలలో సమర్థమైన నాయకత్వం, మంచి పద్ధతులు, సరైన పరిస్థితులు, వాతావరణం జతగూడినప్పుడు, ఆయా సంస్థలలో సాధించిన ఫలితాలు ప్రపంచంలో ఎవరికీ తీసిపోని విధంగా ఉన్నాయి. అంటే సమాజంలో వ్యక్తుల ప్రవృత్తితో నిమిత్తం లేకుండా, సరైన పరిస్థితుల్ని కల్పిస్తే వారి ప్రవర్తన గణనీయంగా మెరుగుపడుతుందని, సమాజం మొత్తం సత్ఫలితాలను అందుకుని లాభపడుతుందని స్పష్టమవుతున్నది. కొందరి ఆలోచన ప్రకారం దేశంలో కుళ్ళు అంతా రాజకీయంలో ఉన్న వాళ్ళవల్లనే ఉత్పన్నమవుతున్నది. ప్రజల్లో నిరక్షరాస్యత, అజ్ఞానం ఎక్కువ కావటం వల్ల సరైన వాళ్లను ఎన్నుకోవటం లేదు. మంచి వాళ్లను ప్రజలు ఎన్నుకునేదాకా ఏ ప్రయోజనమూ ఉండదు. కాని వాస్తవాన్ని గమనిస్తే ఈ వాదనలో పసలేదని తెలిసిపోతుంది. మంచి వ్యవస్థ అంటే మంచి వాళ్ళనే అధికారంలోకి రానిచ్చి, చెడ్డవాళ్ళని నిరోధించగల వ్యవస్థ, మంచివాళ్ళకు నిజాయితీతో రాజకీయంలో మనుడ సాగించే అవకాశం కల్పించే వ్యవస్థ. అలా మంచి వాళ్ళు పైకెదగటానికి, అధికారంలో ఎవరున్నా, తమ పదవులను దుర్వినియోగం చేసే అవకాశం వారికి లేకుండా ఉండడానికి తగిన వ్యవస్థాగత ఏర్పాట్లు కావాలి. ఎందరో సచ్ఛీలురు, సమర్థులు, హేమాహేమీలు భారత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. కాని వారివల్ల కూడా ఆశించిన సత్ఫలితాలు రాలేదు. అందుకు కారణం, ఎలాంటి వారు అధికారంలో ఉన్నా, వాళ్ళ వల్ల పరిమిత స్థాయిని మించి మంచిని సాధించే రాజకీయ వ్యవస్థ, పాలనా వ్యవస్థ లేకపోవటం. అది లేనంత కాలం, వ్యవస్థలో గుర్రానికి, గాడిదకు అట్టే తేడా లేదు. అందుకే సంక్షోభ పరిష్కారం కోసం సమగ్ర సంస్కరణలు కావాలి.

## పిచ్చి - పెళ్ళి

నిరక్ష్యరాస్యత, అజ్ఞానం పోయేదాకా ప్రజాస్వామ్యం బాగుపడదన్న వాదనను పరిశీలించాలి. మంచి రాజ్యవ్యవస్థలో అక్షరజ్ఞానం అందరు బాలలకు అందేవిధంగా ఏర్పాటు చేయగలగాలి. అప్పుడు ఆ పిల్లలే పౌరులై స్వపరిపాలనను సార్థకం చేసుకోగలుగుతారు. ఎన్నో దేశాలలో 1950 దశకంలో మనకంటే తక్కువ అక్షరజ్ఞానం ఉన్న సమాజాలుండేవి. కాల క్రమేణా ఆయా దేశాలలో వారు ఏర్పరచుకున్న సంస్థాగత ఏర్పాట్లవల్ల, మంచి పాలనవల్ల, సంస్కరణలవల్ల సమాజమంతటా అక్షర జ్ఞానాన్ని పెంచగలిగారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో బాలలందరికి నిర్బంధ ప్రాథమిక విద్య, సమాజంలో అందరికీ అక్షరజ్ఞానం ప్రభుత్వాల కనీస బాధ్యతలు. ఇన్నేళ్లుగా పాలన వైఫల్యం వల్ల అక్షరజ్ఞానం కావలసినంత స్థాయిలో పెరగలేదు. ఇప్పుడా

నిరక్ష్యరాస్యతని, అజ్ఞానాన్ని బూచిగా చూపెట్టి, వాటి కారణంగా దేశంలో మంచి పాలనగాని, ప్రజాస్వామ్య సంస్కరణలుగాని, సాధ్యంకావని వాదించటం చాలా అన్యాయమౌతుంది. ఈ వాదం పెళ్లి కుదిరితేగాని పిచ్చిపోదు; పిచ్చిపోతే గాని పెళ్లి కుదరదు అన్న సామెతను గుర్తుకు తెస్తుంది. పాలన వ్యవస్థలో శాంతియుత, ప్రజాస్వామ్య సమగ్ర సంస్కరణలను వెంటనే చేపట్టాలి. వ్యవస్థలో అధికార యంత్రాంఆన్ని ముందుగా ప్రక్షాళించి, ప్రజల్ని నిజమైన ప్రభువుల్ని చేసి, సంస్థల్లో స్వయం పరివర్తన యంత్రాంగాన్ని రూపొందించాలి. ఇప్పటివరకు గమనించిన మౌలిక లోపాలను – అధికారాన్ని మంచికి వినియోగించటంలో అవరోధాలు, దుర్వినియోగానికి పట్టపగ్గాలు లేని స్థితి; చట్టబద్ధంగా పనిజరగకపోవడానికి కావలసినన్ని హేతుబద్ధమైన వంకలు, సామాన్యుడి ఓటుకి, అతడి సంక్షేమానికి మధ్య సంబంధం తెగిపోవటం; అధికారం ఒకచోట బాధ్యత మరోచోట, ఉండటం; రాజ్యవ్యవస్థలో మంచి ప్రవర్తనకు ప్రోత్సాహం కరువు కావడం; దుష్టప్రవర్తనకు బహుమానం; రాజకీయంలో మనుగడకోసం నిజాయితీకి తిలోదకాలివ్వవలసిన పరిస్థితి– వీటన్నింటినీ నిర్దిష్టంగా ఎదుర్కోవాలి. అధికారంలో ఉన్న వాళ్ళు దాన్ని దుర్వినియోగం చేయకుండా పగ్గాలు వేయాలి. ఒకచోట వెలితి కనిపించినా, వ్యవస్థలోని మిగిలిన అంగాలు దాన్ని వెంటనే పూడ్చగలగాలి. అంతేకాని ఒక లోపం మరో లోపానికి దారితీసి, వ్యవస్థను చింపిరి బట్టలాగా చిన్నాభిన్నం చేయకూడదు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛతోపాటు, స్వపరిపాలన, చట్టం శిరోధార్యత, పౌరుల భాగస్వామ్యాధికారం సమృద్ధిగా ఉండే విధంగా వ్యవస్థను పునర్నిర్మించాలి. ఇలాంటి బృహత్ప్రయత్నం శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలంటే మనం కోరే మార్పులు దేశంలో అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమై ఉండాలి. అందుకోసం జనావళిని విభజించే అంశాల జోలికి పోగూడదు. ఏకాభిప్రాయం సాధ్యంకాని అంశాలను మామూలు రాజకీయానికి, ఎన్నికలకు వదిలి పెట్టాలి. మంచి ప్రజాస్వామ్యాన్ని స్థాపించటం కోసం చేపట్టవలసిన సంస్కరణల మీద మాత్రమే దృష్టి సారించాలి. సర్వరోగ నివారిణిలాగా దేశంలో అన్ని సమస్యలకి ఒకటే పరిష్కారం లేదు. అయితే మంచి రాజ్యవ్యవస్థ వీటన్నింటి పరిష్కారానికి మూలం. నిజమైన ప్రజాస్వామ్యం ఉన్ననాడు, ఇతర సమస్యలను మరింత సులభంగా, సమర్థంగా పరిష్కరించుకోవచ్చు. మంచి ప్రజాస్వామ్యం ఒక చక్కని పలకలాంటిది. దానిమీద ఏం రాయాలో ఎప్పటికప్పుడు ప్రజలు నిర్ణయించుకోవాలి. కాని ఆ పలక లేకపోతే

ఏ రాద్ధామని ప్రభుత్వం చేసినా ఫలితం లేదు. అందుకోసం అన్ని వర్గాలకు పనికివచ్చే అంశాలను చేపట్టాలి. ఒక వర్గానికి లాభం కలిగించి, మిగిలిన వాళ్లకు నష్టం అనిపించే ఏ అంశాన్ని చేపట్టినా, ఏకాభిప్రాయ సాధన అసాధ్యం; దాంతో శాంతియుతంగా మౌలిక సంస్కరణలు చేపట్టడం వీలుకాదు. వాటిని మామూలు రాజకీయాలకు వదిలేసి, జాతి భవిష్యత్తును శాసించే ప్రజాస్వామ్య పటిష్టత, మంచి రాజ్యనిర్మాణం, మౌలిక పాలనా సంస్కరణలను మాత్రం మనం చేపట్టి ఆ ఎజెండా వెనుక సర్వజనబలాన్ని సమీకరించాలి.

## జాతీయ ఎజెండా

ఇంతవరకు విశ్లేషణలో సంక్షోభం వ్యక్తిగతమైనది కాదని, వ్యవస్థాగతమయిందని తేలింది. దాని పరిష్కారాన్ని మౌలిక ప్రజాస్వామ్య సూత్రాలకనుగుణంగా సాధించాలి. స్వేచ్ఛను పెంచుతూ, నిజమైన స్వపరిపాలనకు వీలు కల్పిస్తూ, పౌరులకు నిరంతర భాగస్వామ్యాధికారాన్నిస్తూ, చట్టం అందరికీ శిరోధార్యం అయ్యేట్టుగా, స్వయం పరివర్తన సాధ్యమైన రాజ్యవ్యవస్థను నిర్మించాలి. ఎజెండా అన్ని అంశాలను ఆవరించకుండా, అతి ప్రధానమైన వాటిని మాత్రం చేపట్టాలి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం కావాలి; గతానుభవాన్ని వినియోగించుకోవాలి; చారిత్రక సామాజిక స్థితిగతులకనుగుణంగా ఉండాలి. ఈ మౌలిక ప్రజాస్వామ్య సంస్కరణలన్నింటిపైనా అందరిలో పూర్తి ఏకాభిప్రాయం ఎప్పటికీ సాధ్యం కాదు. ఏ ఇద్దరి మధ్య అన్ని అంశాలలోనూ నూటికి నూరుపాళ్ళు ఏకాభిప్రాయం ఉండటం అసాధ్యం. కాబట్టి మనం ఆశించవలసింది, అత్యధిక అంశాలపై అత్యధికుల ఆమోదం. విభేదాలున్న అంశాలపై జాతీయస్థాయిలో నిష్ణాతులంతా చర్చించి, ఎక్కువమంది అంగీకరించే అంశాలను ఎజెండాలో చేర్చవచ్చును. కాని ఇప్పటికే దేశవ్యాప్తంగా చాలావరకు మౌలికమైన పాలనా సంస్కరణలమీద ఏకాభిప్రాయం ఉన్నది దీనిని ఆధారం చేసుకొని, ఆలోచనాపరులందరూ నేటి పరిస్థితులను కూలంకషంగా అవగాహన చేసుకొని సర్వజనామోదమైన మౌలిక సంస్కరణల అమలుకోసం సుసంఘటితంగా వెంటనే నడుంకట్టాలి. రాజకీయాన్ని ప్రజాస్వామికీకరణచేస్తూ, అధికార దుర్వినియోగాన్ని, అవినీతిని నిరోధించేందుకు వీలుగా రాజ్యవ్యవస్థలో ఏర్పాట్లు చేయాలి. పాలనను పూర్తిగా వికేంద్రికరించి, ప్రజలే ప్రభువులుగా, పాలకులు ప్రజలకు జవాబుదారిగా ఉండేవిధంగా పౌరులకు సేవ చేసే ప్రభుత్వం యంత్రాంగాన్ని నిర్మించాలి. వీటితో పాటు, కుంటినడక నడుస్తున్న న్యాయవ్యవస్థలో చలనం కలిగించి, సకాలంలో

సమర్ధంగా న్యాయం అందే ఏర్పాట్లు చేయాలి. దేశంలో అధిక సంఖ్యాకులకు ఇప్పటికే వ్యవస్థ పట్ల విశ్వాసం సన్నగిల్లింది. మౌలిక సంస్కరణలు కావాలని అన్ని వర్గాల ప్రజలు తహతహలాడుతున్నారు. జనసామాన్యంలో ఉన్న ఆందోళనను, ఆతృతను సక్రమ మార్గానికి మళ్ళించి జాతి భవిష్యత్తును సుందరంగా మలచటం సమాజంలో ఆలోచనాపరులందరి ప్రథమ కర్తవ్యం.

* * *

# పాలకుల స్వార్థంకోసమా - ప్రజా శ్రేయంకోసమా

## (అధికారుల బదిలీలు)

**మార్చి 22, 1999**

మహారాష్ట్రలో రాణే ప్రభుత్వం పూనా నగర పాలక కమిషనర్ అరుణ్ భాటియాను అకస్మాత్తుగా బదిలీ చేస్తూ ఒకవారం క్రితం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వాధికారుల బదిలీ పెద్ద వార్త ఏమీ కాదు. కాని అరుణ్ భాటియాను పునా నగర కమిషనర్‌గా నియమించి కొద్దిరోజులే అయింది. నిజాయతీపరుడిగా, నిర్భయంగా విధి నిర్వహణ చేసే అధికారిగా ఆయనకు మంచి పేరుంది. పూనాలో ఉన్న కొద్ది రోజులలో అతను చేసిన పాపం ఏమిటంటే బాగా డబ్బున్నవాళ్ళు కట్టిన అక్రమ కట్టడాలను కూలదోసే ప్రయత్నం చేయడం! అందులో – రాజ్యసభ సభ్యుడు సురేష్ కల్మాడికి, మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌జోషికి, ఇంకా ఇతర ఘరానా మనుషులకు చెందిన ఆస్తులున్నాయి. అంతే! “ప్రజలే దేవుళ్ళు, వారి సేవ కోసమే ఉన్నాము” అని నిరంతరం ఘోషించే ప్రభుత్వాలు సామాన్యుల గుడిసెల్ని కూల్చేస్తే పట్టించుకోవుగాని, అవినీతిపరుల్ని శిక్షించినా, అక్రమార్జనపరులకు ఇబ్బంది కలిగించినా, రాజకీయ పలుకుబడి ఉన్న కోటీశ్వరుల అక్రమ కట్టడాలను కూలదోసినా క్షణం కూడా సహించవు.

### ప్రభుత్వం ప్రైవేటు సంస్థానం కాదు

ఇలా అధికారుల్ని ఎందుకు బదిలీ చేస్తున్నారని అడిగితే ప్రభుత్వాలు ఎప్పుడూ ఒకే సమాధానం ఇస్తాయి. “అధికారుల బదిలీ ప్రభుత్వంలో ఉన్న వారి ఇష్టం. అందునా ఐ.ఎ.ఎస్, ఐ.పి.యస్, అధికారుల బదిలీ స్వయంగా ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు జరుగుతాయి. అందుకు పాలన సంబంధమయిన కారణాలుంటాయి”–అని. అధికారులు ప్రభుత్వానికి జవాబుదారిగా ఉండాలన్న విషయంలో భిన్నాభిప్రాయం లేదు. ప్రభుత్వం ఏ ఒక్కరి స్వంత ఆస్తీ కాదు. అది ముఖ్యమంత్రి ప్రైవేటు సంస్థానం కాదు. మంత్రివర్గం, ప్రభుత్వం, అధికారులు– అందరూ ప్రజా సంక్షేమానికి తాత్కాలిక ధర్మకర్తలు. వారిలో ఎవరు అధికారం వినియోగించినా అది ప్రజల తరపున, ప్రజా

ప్రయోజనాల కోసం వినియోగించాలి గాని, ప్రజలకి వ్యతిరేకంగా, కొందరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం అధికారాన్ని ఉపయోగించటం చట్టవిరుద్ధం. మహారాష్ట్రలోనే నాసిక్‌లో కొద్దికాలం క్రితం మరో మంచి పేరున్న కమిషనర్‌ను బదిలీచేసే ప్రయత్నం చేస్తే ప్రజలలో తీవ్ర నిరసన వ్యక్తమయింది. చేసేదిలేక ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. పునాలో అరుణ్ భాటియా బదిలీపైన కూడా ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం వారు పూనాలో అక్రమకట్టడాలు ఎలా వచ్చాయో విచారించకుండా, భాటియా తమ ఆదేశాలను ఎలా ధిక్కరించాడో తెలుసుకోవటానికి మాత్రం దర్యాప్తు సంఘాన్ని నియమించారు. ఇదేదో మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వానికి మాత్రమే పరిమితమయిన జాడ్యం కాదు. గుజరాత్‌లో తమ మాట వినని ఒక నిజాయతీపరుడయిన కలెక్టరును 1996 పార్లమెంటరీ ఎన్నికలకు ముందు మత్స్యశాఖ డైరెక్టరుగా బదిలీ చేశారు. అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనరు శేషన్ గడుసుపిండం కనుక, ఆనవాయితీ ప్రకారం ఆ జిల్లా కొత్త కలెక్టరును పార్లమెంటు నియోజకవర్గానికి రిటర్నింగు అధికారిగా నియమించకుండా, బదిలీ అయిన మత్స్యశాఖ డైరెక్టరునే రిటర్నింగు అధికారిగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు! ఇలా పాలన యంత్రాంగాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవటం కోసం ప్రభుత్వాలు బదిలీ అస్త్రాన్ని ప్రయోగించటం సర్వసామాన్యం. అందునా స్థానిక ప్రభుత్వాలలో అధికారుల్ని నియమించడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటు వ్యవహారంగా మారిపోయింది. అక్కడ ఎన్నికైన ప్రభుత్వం ఉండగా వారి ప్రమేయం లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు అధికారులను మార్చటం ఆనవాయితీ అయింది. చివరికి వలస పాలన రోజులలో బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఇంత అక్రమంగా, అన్యాయంగా పని చేయలేదు. ఉదాహరణకు 1924లో కలకత్తా నగర మేయరు దేశబంధు చిత్తరంజన్‌దాస్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ అధికారి కూడా కాని సుభాష్ చంద్రబోస్‌ను మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు! తరువాత స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నాడనే కారణంగా సుభాష్‌బోస్‌ను జైల్లో పెట్టినప్పుడు కూడా సి.ఆర్.దాస్ కోరిక మేరకు కలకత్తా జైల్లో ఉన్నంతకాలం సుభాష్ బోస్ కమిషనర్‌గా అక్కడినుంచే విధులు నిర్వర్తిస్తారని అసాధారణమైన ఆదేశాన్ని జారీ చేశారు! అంటే ఆనాడు బ్రిటిషువారు పాటించిన నాగరిక పాలనను కనీస ప్రజాస్వామ్య సంప్రదాయాలను, మర్యాదలను, నిజాయతీని పాటించటం స్వతంత్ర భారతంలో ఎన్నికయి అధికారం పేరుతో దోపిడీకి పాల్పడుతున్న కుహనా నేతలకు కష్టం అవుతోంది! ప్రతి ప్రభుత్వ పదవిలో ఎం.ఎల్.ఎ.ల పైరవీలు, సిఫారసులు తప్ప

ప్రజాప్రయోజనాలకు, నిజాయతీకి విలువ లేకుండా పోయింది. "మా మాట వినటం లేదు" అనే ఫిర్యాదే తప్ప "అవినీతిపరుడు, ప్రజలకు ద్రోహం చేస్తున్నాడు" అనే ఫిర్యాదు కారణంగా బదిలీ అయిన అధికారులను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. మన రాష్ట్రంలోనూ అవినీతిపరులయిన అధికారులను రాజకీయ ప్రయోజనాల కోసం అందలాలెక్కించటం, నిజాయతీపరుల్ని అణగద్రొక్కటం చాలాకాలంగా చూస్తున్నాం. ఉదాహరణకు 1998 పార్లమెంటు ఎన్నికల్లో, ఒకానొక కలెక్టరు రిటర్నింగు అధికారిగా ఉంటూ, ఎందరో ప్రిసైడింగ్ అధికారులు తమ పోలింగు బూతులలలో రిగ్గింగు జరిగిందని ఫిర్యాదులు చేస్తే రీపోలింగ్ కోసం ఎన్నికల సంఘానికి సిఫారసు చేయాల్సింది పోయి, ఆ అధికారుల మీద వత్తిడి తెచ్చి తమ ఫిర్యాదు ఉపసంహరించుకోవలసిందిగా బలవంతపెట్టాడట! చివరికి ఆ ప్రిసైడింగ్ అధికారులు గట్టిగా పట్టుబట్టి, బెదిరింపులకు లొంగకుండా నిజాయతీగా నిలబడటంతో, చేసేదిలేక రీపోలింగుకు ఆదేశాలిచ్చారట! ఇది దక్షిణాది రాష్ట్రాలలో కనీవినీ ఎరగని విషయం! పక్షపాత రాజకీయం, పరవీలు, ఎం.ఎ.ఎల్.ఎ.లు, మంత్రుల సిఫారసులు, అవినీతి అధికారుల నియామకాలలో ఎంతగా ప్రధానపాత్ర వహిస్తున్నాయో వివరించి చెప్పనక్కరలేదు. అందుకనే అధికారులు నిజాయతీపరులయితే మళ్ళీ మళ్లీ బదిలీలు, వేధింపులు, అవినీతిపరులుగా అందరిలో ముద్రపడిన వారికి ఎల్లప్పుడూ అందలాలు, దీర్ఘకాలం పదవులు ఆనవాయితీ అయిపోయాయి!

## ముడుపులు, పైరవీలు..

కొన్నేళ్ళ క్రితం మన రాష్ట్రంలోనే పౌరసరఫరాల శాఖ అధికారుల బదిలీకి స్పష్టమయిన రేట్లు ఉండేవి. జిల్లా స్థాయి అధికారిగా బదిలీ చేయాలంటే రేటు రూ 8 లక్షలు! ఇప్పటికీ ఎన్నో శాఖలలో అక్కడ వచ్చే 'ఆదాయాన్ని' బట్టి బదిలీలకు రేట్లున్నాయి! పోలీసుస్టేషన్లలో, కొన్ని చెక్ పోస్టులలో పోస్టింగుల కోసం బహిరంగంగానే వేలంపాటలు వేసి, ఎవరు ఎక్కువ మొత్తానికి పాడితే వారికే ఆ పదవిని ఖాయం చేయటం చాలాసార్లు జరుగుతుంది! కొంతకాలం క్రితం ఒక జిల్లాలో పోలీసుశాఖ దసరా మామూళ్లు వసూలు చేసే హక్కు కోసం వేలంపాట జరపగా ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు, మరో సబ్‌ఇన్‌స్పెక్టరు వేలంలో పోటీపడ్డారు. చివరికి సబ్ ఇన్‌స్పెక్టరు ఎక్కువ మొత్తానికి పాడి 'ధర్మంగా' ఆ హక్కును పొందాడు! అయితే తాను గెలవలేదన్న ఉక్రోషంతో ఇన్‌స్పెక్టరు పత్రికల వారితో మామూళ్ళను గురించి వార్తలు రాయించటం, సబ్‌ఇన్‌స్పెక్టరు వాళ్ళపైన చేయి చేసుకోవటం, తరువాత పాత్రికేయుల సంఘంవారు

తీగలాగితే డొంకంతా బయటపడటం జరిగాయి! అలాగే పౌరసరఫరాల విజిలెన్సు శాఖలో డెప్యుటేషన్‌పైన వెళ్ళటానికి ఏస్థాయిలో పైరవీలు జరుగుతాయో ఊహించటానికి అలవికాదు. ఒక మామూలు కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ స్థాయిలో నియామకానికి కూడా శాసనసభ్యులు, మంత్రులు విపరీతంగా పైరవీ చేయటం సర్వసాధారణం. ఎందరో రెవెన్యూ ఉద్యోగులు, 'సార్'! మా అమ్మాయి పెళ్ళి చేయాలి. రిటైర్‌మెంట్‌కి ఇంకా మూడేళ్లే ఉంది. పౌర సరఫరాల (సివిల్ సప్లయిస్) శాఖలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా వేయించండి సార్' అని వేడుకోవటం కద్దు! ఇలా జరిగే బదిలీలన్నిటినీ 'ప్రజాప్రయోజనాల కోసం, అధికార బాధ్యతలలో, విధి నిర్వహణలో భాగంగా" జరుగుతున్నాయని చెప్పడం ప్రజలను వంచించటమే! ఏతావతా తేలేదేమంటే మనదేశంలో కీలక ప్రభుత్వం ఉద్యోగాలలో బదిలీలు, పోస్టింగులకు బోలెడు గిరాకీ ఉంది. ఆయా బదిలీల కోసం లక్షలు, కొండొకచోకోట్లు చేతులు మారతాయి. ఉన్నతస్థాయిలో పైరవీలు జరుగుతాయి. చాలామంది మంత్రులు, శాసనసభ్యులు పనిలో నూటికి 80 పాళ్ళు బదిలీల కోసం పైరవీలు చేయటమే. ఈ బదిలీలకి నిర్దిష్టమయిన రేట్లున్నాయి. ఒక్క వరస బదిలీలు చేస్తే కొన్ని శాఖలలో మంత్రులకు, ఉన్నతాధికారులకు కోట్లు ముడతాయి. ఉదాహరణకు రిజిస్ట్రేషను శాఖలో బదిలీలు చేస్తే లక్షలు మారటం చాలాకాలంగా ఆనవాయితీ. ఉన్నతాధికారి నిజాయతీపరుడయితే ఆ డబ్బు నాయకులకు ముడుతుంది. చట్టప్రకారం బదిలీ అధికారం ఎవరిదయినా, వాస్తవానికి ఆదేశాలిచ్చేది ఆ డబ్బు పుచ్చుకునే మంత్రులు, లేదా పైరవీలకు లొంగిన నాయకులు. మళ్లీ ఆ పైరవీ చేసేది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లంచం తిన్న 'పెద్దలు'. కొన్ని సందర్భాలలో పైరవీ చేసే నాయకులు లంచం తినకపోయినా, తమ కులంవాడనో, వర్గం వాడనో, తమకు విశ్వాసపాత్రుడనో పలుకుబడి ఉపయోగించి కావలసిన చోటికి బదిలీ చేయిస్తుంటారు. అప్పటినుంచి ఆ ఉద్యోగి లేదా అధికారి పనిచేసేది ప్రజల కోసం కాదు; తనను అక్కడ వేయించిన నాయకుల కోసం. అలాగే ఆస్థానంలో ఉన్నంతకాలం నెలకింత అని తమ కోసం పైరవీ చేసిన నాయకులకు సమర్పించుకోవటం కూడా కద్దు!

## ప్రజల నిఘాతోనే పారదర్శకత్వం

ఒక విషయం మాత్రం సుస్పష్టం. స్వతంత్ర భారతంలో ప్రజలిచ్చిన అధికారం ప్రజల కోసం పొరపాటున తప్ప ఉపయోగపడటం లేదు. కేంద్రంలో అధికారం అంతా ప్రధానమంత్రి స్వంత ఎస్టేటు లాగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆస్తిలాగా

వినియోగించటం రివాజయింది. ఆ వంకతో పాలన యంత్రాంగం మొత్తాన్ని తమ సేవకులుగా, లాభాలు వసూలుచేసి అందించే సాధనాలుగా, ఎం.ఎల్.ఎ.లను తృప్తిపరచే ఆటబొమ్మలుగా భావించడం, వారందరు తమ పార్టీ ప్రయోజనాలను ఎన్నికలలో అన్యాయంగా కాపాడే కార్యకర్తలని భావించి వాడుకోవటం అన్ని పార్టీలకి సర్వసాధారణమయింది. అధికారంలో ఉన్న ప్రతి ఒక్కరు ప్రజల సేవకులు మాత్రమే. వాళ్ళు తింటున్నది ప్రజల డబ్బు. వాళ్ళు ఖర్చు చేస్తున్నదంతా ప్రజల సొత్తు. వాళ్ళని గద్దె మీద కూర్చోబెట్టిందే ప్రజలు. వాళ్ళ పనల్లా ప్రజల తరపున తాత్కాలికంగా ధర్మకర్తలలాగా, ఏజెంట్లలాగా, ప్రతినిధులలాగా వ్యవహరించి ప్రజాసేవ చేయటం మాత్రమే. ప్రజలు మౌనంగా కూర్చున్నంతకాలం ఈ దోపిడీ ఇలాగే కొనసాగుతూనే ఉంటుంది. ఏలికల మోచేతి నీళ్లు తాగుతూ, వాళ్ళకు ఊడిగం చేయటం ప్రజల ప్రయోజనాలకు భంగం; ఆత్మగౌరవానికి దెబ్బ; జాతి భవిష్యత్తుకు ప్రమాదం. అందుకే అధికారుల బదిలీలను పాలకులు ప్రైవేటు వ్యవహారంగా కాక, ప్రజా ప్రయోజనాల అంశంగా పరిగణించి శల్య పరీక్ష చేయటం నేర్చుకోవాలి. తప్పు జరిగితే వాస్తవాలను నిర్భయంగా వెలికితీసి ఆ ప్రభుత్వాన్ని ఎండగట్టాలి. పాలన అన్నది తాత్కాలిక పాలకుల స్వంత వ్యవహారం కాదని గుర్తించాలి. అధికారులలో ఎవరు నిజాయతీపరులో, ఎవరు ధైర్యవంతులో, ఎవరు సమర్థులో, ఎవరు వాగాడంబరులో, ఎవరు ప్రచారశూరులో, ఎవరు నిష్క్రియాపరులో, ఎవరు అవినీతిపరులో, ఎవరు ఏలినవారిబంట్లో, ఎవరు ఏ ఎండకాగొడుగు పడతారో– ఇలా వివిధ రకాల అధికారులను గుర్తించటం చాలా సులభం. కొత్తవాళ్ళ విషయం చప్పున చెప్పలేంగాని, కొన్నేళ్ళ పనితీరు గమనించాక పాత్రికేయులకు, అన్ని పార్టీల నేతలకు, పాలన వ్యవహారాలను గమనించేవారికి అందరికీ అధికారుల మంచి చెడులు కరతలామలకం. నిజాయతీపరుల్ని సమర్థుల్ని ఆర్నెలకోసారి బదిలీ చేస్తూ, అవినీతిపరుల్ని ఏళ్ళ తరబడి కీలక స్థానాలలో ఉంచుతూ, పైకిమాత్రం నీతులను వల్లె వేసే వారివల్ల ప్రయోజనం లేదు.  ఇటీవల చాలా రాష్ట్రాలలో ఉన్నతాధికారుల సగటు పదవీకాలం కీలక స్థానాలలో తొమ్మిదినెలలు మాత్రమే ఉంటోంది. వచ్చేపోయే అధికారులతో ఎప్పుడూ సందడే తప్ప ప్రజల పనులు జరగటంలేదు. ప్రభుత్వం అధికారులను బదిలీ చేసేటప్పుడు బహిరంగంగా కారణాలు వివరించి చేయాలి. ఎప్పుడూ పారదర్శకత్వాన్ని, నిజాయతీని గురించి దీర్ఘోపన్యాసాలు చేసే నాయకులు అవినీతిపరులకు ఎందుకు అగ్రతాంబూలం ఇస్తున్నారో, నిజాయతీపరులను ఎందుకు మెడలు వంచుతున్నారో

బయటకు చెప్పాలి. బదిలీల నిర్ణయాలను అధినేతల చిత్తానికి వదలకుండా వీలయిన మేరకు బహిరంగ విచారణకు, ప్రజల నిఘాకు అవకాశం ఉండేలా సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. బ్రిటన్‌లో లాగా సివిల్ సర్వీస్ బోర్డుల వంటి వాటిని ఏర్పరచి సమిష్టి నిర్ణయాలు నిజంగా ప్రజాప్రయోజనాలకనుగుణంగా ఉండేలా వత్తిడి తేవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వం యంత్రాంగం పాలకుల భృత్యగణం కాదని, పౌరుల డబ్బుతో పనిచేసే ప్రజల సేవకుల బృందమని రుజువు చేయటం జాతి భవిష్యత్తుకి అత్యవసరం.

* * *

# ప్రధాని ప్రతిపాదన అసంబద్ధం

**ఆగస్టు 30, 2004**

ఆల్ ఇండియా సర్వీసులు, కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు చెందిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో కొన్ని కీలక సంస్కరణలను ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ప్రతిపాదించారు. మన సివిల్ సర్వీసులలో, ఉన్నతాధికార యంత్రాంగ వ్యవస్థలో పలు లోటుపాట్లున్నమాట నిజమే. ప్రజల అవసరాలు రోజురోజుకి మారుతున్నా వాటికి తగినట్లుగా మన పాలన యంత్రాంగం స్పందించలేకపోతోంది. సివిల్ సర్వెంట్స్‌లో నిజాయతీతో పనిచేసే సమర్థవంతులైన అధికారులు చాలామంది ఉన్నారనడంలో సందేహం లేదు. ఇటువంటి అధికారులు తరచు ఒత్తిడులను ఎదుర్కోవలసి వస్తోంది. అవమానాలకు గురికావలసి వస్తోంది. అసమర్థులు, అవినీతిపరులైన అధికారులకు మాత్రం అందలాలు లభిస్తున్నాయి. ప్రభుత్వంలోని సీనియర్ హోదాలు సివిల్ సర్వీసులలో పాతుకుపోయిన ఉన్నతాధికారుల గుత్తసొత్తుగా మారడంతో – సమాజంలో ఉత్తమ శ్రేణి ప్రొఫెషనల్స్‌గా పేరొందినవారికి పాలనలో తమ వంతు పాత్ర పోషించే అవకాశం లభించడంలేదు. సివిల్ సర్వీసులలో నియమితులైన యువ అధికారులకు పదోన్నతుల విషయంలో ఢోకా ఉండదు. ఎన్నికల తరవాత ప్రభుత్వాలు మారడం పరిపాటే. కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రభుత్వానికి ఎన్నో ఆకాంక్షలు, ఎంతో తపన ఉండవచ్చు. అయితే పట్టువిడుపుల్లేని పాలన యంత్రాంగ వ్యవహారశైలి కారణంగా పరిస్థితుల్లో ఎటువంటి మార్పు ఉండదు. ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకపోవడం, అవినీతి, అసమర్థత, అధికారుల ఫ్యూడల్ మనస్తత్వం, గోప్యత, వేధింపులు తదితర కారణాలవల్ల ప్రజల్లో అసంతృప్తి ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో– మన సివిల్ సర్వీసు వ్యవస్థను సంస్కరించవలసిన అవసరం ఉందనడంలో సందేహం లేదు. ఆ సంస్కరణల్లో భాగంగా ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైనవారిని ఓ ఉమ్మడి పోటీపరీక్ష ద్వారా సివిల్ సర్వెంట్స్‌గా ఎంపిక చేయాలని ప్రధాని సూచించారు. అలా ఎంపికైనవారికి అయిదేళ్ళ కోర్సు ఉంటుంది. ఆ కోర్సులో చక్కని ప్రతిభ కనబరచినవారిని సివిల్ సర్వీసులలోకి తీసుకుంటారు. పరీక్షల్లో వారికి వచ్చే ర్యాంకును బట్టి వారిని ఏ సర్వీసులో చేర్చుకోవాలో, ఏ రాష్ట్రానికి వారిని కేటాయించాలో నిర్ణయిస్తారు. ఇటువంటి సంస్కరణల ద్వారా సివిల్ సర్వీసుల

ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రధాని భావిస్తున్నట్లుంది. డాక్టర్ మన్మోహన్‌సింగ్ మేధావి అనడంలో రెండో అభిప్రాయానికి తావులేదు. అయితే- సివిల్ సర్వీసులకు సంబంధించి అసలు సమస్యను ఆయన సరిగా గుర్తించలేదని మాత్రం చెప్పకతప్పదు.

## నియామకాల ప్రక్రియకు మెరుగులు

సివిల్ సర్వీసులలో నియామకాల ప్రక్రియకు మెరుగులు దిద్దేలా కొన్ని మార్పులు చేయడం అవసరమే. ఉదాహరణకు: అభ్యర్థుల ప్రతిభాపాటవాలను, బలహీనతలను అంచనా వేయడానికి వీలుగా వారి వ్యక్తిత్వ వికాసాన్ని పరీరక్షించాలి. అందుకు మరింత కఠినమైన పద్ధతుల్లో పరీక్షలు నిర్వహించాలి. అభ్యర్థులు ఆప్షనల్ సబ్జెక్టులు ఎంపిక చేసుకోవాలన్న విధానానికి స్వస్తిచెప్పాలి. పరిపాలనకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రశ్నపత్రాలు రూపొందించాలి. సివిల్స్‌కు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఆ ప్రాతిపదిక మీదే పరీక్షలు నిర్వహించాలి. ఎంపికైనవారికి ఇచ్చే శిక్షణ పద్ధతులనూ మెరుగుపరచాలి. నిజానికి- ఇప్పుడు కూడా యు.పి.ఎస్.సి పరీక్షల విషయంలో కఠినమైన పద్ధతులనే అనుసరిస్తోంది. వాటిలో నెగ్గిన తరవాతనే- అత్యంత ప్రతిభావంతులైన యువజనులను సివిల్ సర్వీసులలోకి తీసుకుంటోంది. నియామక దశలో ఈ యువజనుల్లో చాలామంది భవిష్యత్తులో మంచి ప్రభుత్వాధికారులుగా రాణించగలరన్న విశ్వాసాన్నీ కలిగించేవారు. అయితే ప్రభుత్వాధికారులుగా నియమితులైన తరవాత కొంత కాలానికే వారిలో అనేకమంది నిష్క్రియాపరులుగా తయారవుతుండటమే విషాదకరం. జడత్వం, అవినీతి, నిర్లిప్తత, రాజకీయ జోక్యం, సంక్లిష్ట విధానాలు మన పాలనా యంత్రాంగానికి చీడలా దాపురించాయి. వీటితోపాటు నిర్దిష్ట బాధ్యతల అప్పగింతకు సరైన అధికారులను ఎంపిక చేయలేకపోవడం, అధికారుల్లో చొరవ కొరవడటం, బాగా పనిచేసేవారిని ప్రోత్సహించకపోవడం- వంటి జాడ్యాలూ మన పాలన యంత్రాంగాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రభుత్వాధికార యంత్రాంగాన్ని అతలాకుతలం చేస్తున్న ఈ సమస్యలపై దృష్టి సారించడానికి బదులు- లేని రుగ్మతను నయం చేయాలని ప్రధాని ప్రయత్నిస్తున్నారు.!

మన్మోహన్‌సింగ్ ప్రతిపాదనవల్ల కొన్ని కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదముంది. సివిల్ సర్వీసులలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్మీడియట్‌ను అర్హతగా నిర్ణయిస్తే- దానివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల, బీద విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతింటాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేకమంది విద్యార్థులకు, పేద విద్యార్థులకు తమ

తరగతి గదులు, పాఠ్యపుస్తకాలు తప్ప బాహ్య ప్రపంచం తెలియదు. పాఠశాల చదువు ముగిసిన తర్వాత అయిదారేళ్లపాటు కళాశాలల్లో చదివితే– వారు విద్య విషయంలో తమ లోటుపాట్లను అధిగమించగలుగుతారు. వారిలో అధిక ప్రతిభాపాటవాలు గలవారు ధనిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ధీటుగా పోటీ పరీక్షలకు నిలబడగలరు. విజయం సాధించగలరు. హైస్కూల్ లేదా ఇంటర్మీడియట్ స్థాయిగల విద్యార్థులకు సాధారణంగా తెలిసింది తక్కువే ఉంటుంది. అటువంటివారికి ప్రభుత్వ సర్వీసులలో ప్రవేశం దక్కే అవకాశాలు అంతంత మాత్రమే. అదీగాక– ఇంటర్మీడియట్ విద్యార్థులంటే వారి వయసు పదిహేడు, పద్దెనిమిదేళ్లు ఉంటుంది. వారిలో చాలామందికి భవిష్యత్తులో తామేం చేయాలన్న అంశంపై సరైన అవగాహన ఉండదు. తల్లిదండ్రుల నుంచో, లేదా ఇంతరత్రానో వచ్చే ఒత్తిడుల కారణంగా వారు ఇంటర్మీడియట్ తరవాత పోటీ పరీక్షలకు హాజరై సివిల్ సర్వీసులకు ఎంపికైనా– ప్రభుత్వ ఉద్యోగానికి వారు నప్పకపోవచ్చు. నిజానికి– సివిల్ సర్వీసులలో చేరిన పట్టభద్రులలోనే సేవానిరతి లేనివారు చాలామంది ఉన్నారు. ఇక పిన్నవయస్సులోనే ఆ సర్వీసులకు అభ్యర్థుల నియామకాలు చేపడితే పరిస్థితి మరింత దిగజారుతుంది. సివిల్ సర్వీసులలో నియామకాలకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం వల్ల మెడిసిన్ తదితర వృత్తుల నేపథ్యం ఉన్నవారు సివిల్ సర్వీసులలో చేరడానికి అవకాశం ఉంది. ఇలా వివిధ రంగాల్లో నిష్ణాతులైనవారికి ఆ సర్వీసులలో తగినంత ప్రోత్సాహం లభించడం లేదన్నది వేరే విషయం. కానీ ప్రస్తుత విధానం వల్ల కనీసం వారు సివిల్ సర్వీసులలో చేరే అవకాశమైనా ఉంది. అదే ఇంటర్మీడియట్ చదివినవారిని సివిల్ సర్వీసులకు ఎంపికచేస్తే ఒకేవిధమైన నేపథ్యం ఉన్నవారే ఆ సర్వీసులలోకి వస్తారు. పరిస్థితులకు తగినట్లు వ్యవహరించే శక్తిసామర్థ్యాలు వారికి ఉండవు. ఒకటి రెండేళ్ళపాటు ప్రత్యేకంగా నిర్వహించే కోర్సులు అయిదారేళ్లపాటు కాలేజీ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా అభ్యర్థులు సముపార్జించే విజ్ఞానానికి, వారికి అలవడే నైపుణ్యానికి ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాజాలవు.

## విస్తృతస్థాయి చర్చ అవసరం

సివిల్ సర్వీసుల వ్యవస్థలో సంస్కరణలు అవసరమేకానీ అవి ఇప్పుడు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న తరహాలో ఉండరాదు. వృత్తిగతంగా సివిల్ సర్వీసులను మరింత పటిష్టం చేయడం తక్షణావసరం. సివిల్ సర్వీసులో ఉన్నవారితోపాటు వివిధ వృత్తులు, విద్య మేనేజ్‌మెంట్ తదితర రంగాలకు చెందినవారిలో అత్యంత ప్రతిభావంతులను

ప్రభుత్వ సర్వీసులలోని కీలక ఉద్యోగాలకు ఎంపిక చేయాలి. ఆ ఎంపిక పారదర్శకంగా జరగాలి. కీలక స్థానాల్లో నియమితులైన వారు కనీసం అయిదేళ్ళపాటు అవే ఉద్యోగాల్లో కొనసాగేలా చూడాలి. సి.యల్. సర్వెంట్స్‌లో జవాబుదారితనాన్ని పెంపొందించాలి. ఈ దిశలో చర్యలు తీసుకోకుండా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారిని సివిల్ సర్వీసులకు ఎంపిక చెయ్యాలని ప్రభుత్వం యోచిస్తుండటం సరికాదు. మన్మోహన్ ప్రతిపాదన ఆచరణలోకి వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతుంది కాబట్టి– సివిల్ సర్వీసులలో సంస్కరణలు తెచ్చే విషయమై తన ప్రాథమ్యాలపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలి. ప్రధాని సూచనపై తుదినిర్ణయం తీసుకునేముందు ప్రభుత్వం ఆ సర్వీసులకు సంబంధించిన అన్ని అంశాలపై విస్తృతస్థాయిలో చర్చ జరిగేలా చూడాలి.

* * *

# రూపు మారితేనే 'మండలి'కి సార్థకత!

**జూలై 19, 2004**

రాజ్యాంగంలోని 169వ అధికరణ ప్రకారం- రాష్ట్రంలో శాసనమండలిని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించింది. ప్రస్తుతం బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ ఈ నాలుగు రాష్ట్రాల్లో మాత్రమే శాసనమండళ్లు ఉన్నాయి. గతంలో మన రాష్ట్రంలోనూ శాసనమండలి ఉండేది. అయితే రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పురస్కరించుకుని పార్లమెంటు చేసిన ఓ చట్టం మేరకు 1985 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రద్దయింది. నిజానికి రాష్ట్రాల్లో రెండో చట్టసభ ఉండాలా... అక్కర్లేదా అనే అంశం అత్యంత వివాదాస్పదంగా పరిణమించింది. శాసనమండడళ్లు అసలెంతవరకు అవసరమో, వాటి కూర్పు ఎలా ఉండాలో క్షుణ్ణంగా చర్చించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

శాసనసభ సభ్యులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించడానికి అసెంబ్లీ తప్పనిసరి. ఇక శాసనమండలి విషయానికొస్తే అందులోని సభ్యులను పరోక్షంగా ఎన్నుకుంటారు. కొందరు నామినేటెడ్ సభ్యులుంటారు. రాజ్యాంగంలోని 169వ అధికరణ ప్రకారం- ఏ రాష్ట్రంలోనైనా శాసనమండలిని ఏర్పాటు చేయాలన్నా, రద్దు చేయాలన్నా సంబంధిత రాష్ట్ర శాసనసభ ఆ మేరకు తీర్మానాన్ని ఆమోదించాలి. సభలో హాజరై ఓటువేసే సభ్యుల్లో మూడింట రెండువంతులమంది, అసెంబ్లీని మొత్తం సభ్యుల్లో అత్యధికులు ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటువేసి ఉండాలి. ఆ తీర్మానం ప్రాతిపదికగా పార్లమెంటు ఓ చట్టం ద్వారా సంబంధిత రాష్ట్ర అభీష్టం మేరకు శాసనమండలిని ఏర్పాటు చేయవచ్చు... లేదా రద్దు చేయవచ్చు. ఈ విషయంలో పార్లమెంటు తెచ్చే చట్టాన్ని పార్లమెంటు ఉభయ సభలు సాధారణ మెజారిటీతో ఆమోదిస్తే చాలు

### భిన్న వాదనలు

రాష్ట్రాల్లో శాసనమండళ్లను ఏర్పాటు చేయడాన్ని సమర్థించే వారున్నట్లే వ్యతిరేకిస్తున్నవారూ ఉన్నారు. శాసనసభ తొందరపాటుతోనో, అనాలోచితంగానో రూపొందించే శాసనాలకు అడ్డుకట్టవేయడానికి శాసనమండలి దోహదం చేస్తుందని- శాసనమండలిని సమర్థిస్తున్న వారి వాదన. అయితే ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకే

తుది శాసనాధికారం ఉంటుంది. ద్రవ్య బిల్లులపై శాసనమండలికి ఎటువంటి అధికారం ఉండదు. ఇతర బిల్లుల విషయానికొస్తే– శాసనసభ ఆమోదించిన ఓ బిల్లుకు మండలి తన ఆమోద ముద్రవేయకపోయినా, అదే బిల్లును శాసనసభ రెండోసారి ఆమోదిస్తే దాన్ని ఉభయసభలూ ఆమోదించినట్లుగానే పరిగణిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే శాసనసభ ఆమోదించిన ఓ బిల్లులో (ద్రవ్య బిల్లులు మినహా) శాసనమండలి కొన్ని మార్పులు, చేర్పులు సూచించవచ్చు. అసెంబ్లీ పరిశీలనార్థం ఆ బిల్లును వెనక్కు పంపించవచ్చు. తద్వారా ఆ బిల్లు మూడు నెలలపాటు ఆమోదం పొందకుండా చూడవచ్చు. ఆవిధంగా బిల్లులపై ప్రభుత్వం తొందరపాటును ప్రదర్శించకుండా నివారించడానికి శాసనమండలి తోడ్పడుతుందని మండలి అనుకూలురు వాదిస్తున్నారు.

శాసనమండలి శుద్ధ దండగని, దానివల్ల ఎటువంటి ప్రయోజనం లేకపోగా, ప్రభుత్వ ఖజానాకు మరింత వ్యయమవుతుందని– మండలి ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వారు అంటున్నారు. మండలివల్ల శాసనాలకు ఆమోదం లభించడంలో జాప్యం జరగడం తప్ప ఒరిగేదేమీ లేదన్నది వారి వాదన. శాసనమండలి అంటే 'రాజకీయ నిరుద్యోగులకు పునరావాసం కల్పించే కేంద్రం' అని భావించేవారు ఎందరో ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిక్కెట్లు దొరకని కాంగ్రెస్ నేతలను అనునయిస్తూ– అప్పట్లో ఆ పార్టీ రాష్ట్రశాఖ వ్యవహారాల ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తించిన గులామ్‌నబీ ఆజాద్ చేసిన ప్రకటనలు గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ టిక్కెట్లు లభించని వారు నిరాశ చెందనక్కరలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేట్లయితే రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించి, అందులో వారికి చోటు కల్పిస్తుందని ఆజాద్ అప్పట్లో అన్నారు.

ప్రజల సంక్షేమంపై కంటే 'రాజకీయ నిరుద్యోగులకు పునరావాసం కల్పించాలన్న లక్ష్యంతోనే శాసనమండలిని పునరుద్దరిస్తున్నారన్నది సుస్పష్టం. అంతమాత్రాన శాసనమండలి పూర్తిగా అనవసరమని, అది చేతికున్న ఆరో వేలివంటిదని కొట్టి పారేయాలా? శాసనమండలికి అనుకూలంగాను, వ్యతిరేకంగాను వినవస్తున్న వాదనలను ప్రజాప్రయోజనాలకు ఉపకరించే విధంగా సమన్వయ పరచలేమా...? ఈ ప్రశ్నలకు సమాధానం శాసనమండలి కూర్పు ఏవిధంగా ఉంటుందన్న అంశంపై ఆధారపడి ఉంటుంది. శాసనమండలిలోని సభ్యుల సంఖ్య సంబంధిత రాష్ట్ర

అసెంబ్లీలోని మొత్తం సభ్యుల సంఖ్యలో మూడింట ఒక వంతుకు మించరాదని రాజ్యాంగంలోని 171వ అధికరణం నిర్దేశిస్తోంది. ఏ శాసనమండలిలోనైనా కనీసం 40 మంది సభ్యులుండాలి. శాసన మండలి సభ్యుల్లోని మూడింట ఒకవంతు మందిని స్థానిక సంస్థలు, మూడింట ఒకవంతు మందిని అసెంబ్లీ సభ్యులు, 1/12 వంతు మందిని గ్రాడ్యుయేట్లు, 1/12 వంతు మందిని ఉపాధ్యాయులు ఎన్నుకోవాలని, మిగిలిన స్థానాలకు వివిధ రంగాల్లో పేరెన్నికగన్న వారిని ప్రభుత్వ సిఫార్సు మేరకు గవర్నర్ నామినేట్ చేస్తారని 171వ అధికరణం పేర్కొంటోంది. ఈ పద్ధతి ప్రస్తుత కాలానికి అనుగుణమైనదికాదు. ఈనేపథ్యంలో రాజ్యసభ కూర్పు, అది పనిచేసే విధానం ఎలా ఉంటుందో అధ్యయనం చేయడం సముచితం. మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యసభను రాష్ట్రాల మండలిగా ఏర్పాటు చేశారు. రాజ్యసభలోని మొత్తం సభ్యులో 238 మందిని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎన్నుకుంటారు. 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. ఆవిధంగా- రాజ్యసభ కేంద్రస్థాయిలోని లెజిస్లేచర్‌లో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ద్రవ్య బిల్లులు, విశ్వాస, అవిశ్వాస తీర్మానాలు తప్ప ఇతర శాసనాల విషయంలో లోక్‌సభకు గల అధికారాలన్నీ రాజ్యసభకూ ఉన్నాయి. నిజానికి రాష్ట్రాల హక్కులు పరిరక్షించేందుకు రాజ్యసభకు కొన్ని ప్రత్యేక అధికారాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు- రాష్ట్రాల జాబితాలోని ఓ అంశంపై జాతీయ ప్రయోజనాల దృష్ట్యా చట్టం చేసే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించాలంటే మూడింట రెండువంతుల మెజారిటీతో రాజ్యసభ ఓ తీర్మానాన్ని ఆమోదించాలని రాజ్యాంలోని 249వ అధికరణ నిర్దేశిస్తోంది. అలాఏ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపించేవిధంగా కేంద్ర ప్రభుత్వం అధికారాలు వినియోగించాలంటే (352వ అధికరణం కింద ఆత్యయిక పరిస్థితి, 360వ అధికరణం కింద ఆర్థిక ఎమర్జెన్సీ విధింపు వంటివి) లోక్‌సభతో పాటు రాజ్యసభ కూడా ఆమోదముద్ర వేయాలి. లోక్‌సభ వేగిరపాటుతో నిర్ణయాలు తీసుకోకుండా చూడటం మాత్రమేకాక, ప్రత్యేకించి రాష్ట్రాల ప్రయోనాలనూ కాపాడటం కూడా కేంద్ర స్థాయలో దిగువ సభగా రాజ్యసభను ఏర్పాటు చేయడంలోని ఉద్దేశం.

## స్థానిక సంస్థలకు ప్రాధాన్యం

రాజ్యాంగాన్ని రూపొందించడానికి ముందు మనదేశంలో ప్రావిన్సులు ఉండేవి. అందువల్ల రాజ్యాంగ నిర్మాతలు రాష్ట్రాల మండలిగా రాజ్యసభను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలోని కొన్నిచోట్ల స్థానిక ప్రభుత్వాలున్నప్పటికీ- వాటికి

రాజ్యంగ ప్రతిపత్తి లేదు అందువల్ల రాష్ట్రాల్లో ఎగువ సభలుగా శాసనమండళ్లను ఏర్పాటు చేశారు. వాటిలోని మూడింట ఒకవంతు మంది సభ్యులను స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు ఎన్నుకోవాలన్నారు. అయితే రాజ్యాంగంలోని 73, 74 అధికరణలకు చేసిన సవరణలతో స్థానిక సంస్థలకు ప్రభుత్వంలోని మూడో అంచెగా రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది. స్వయం పరిపాలనలో ముఖ్యమైన విభాగాలుగా అవి గుర్తింపునూ పొందాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వాలు మండలిగా శాసనమండలిని తీర్చిదిద్దడం సబబుగా ఉంటుంది. శాసనమండలికి కొద్దిమంది సభ్యులను మాత్రమే గవర్నర్ నామినేట్ చేయాలి. మిగిలినవారినందరినీ ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులే ఎన్నుకోవాలి. అలా ఏర్పడే శాసనమండలి– రాజ్యసభ మాదిరి పనిచేస్తూ, స్థానిక సంస్థల ప్రయోజనాలను పరిరక్షించాలి. శాసనాలకు సంబంధించినంతవరకు శాసనమండలికిగల అధికారాలను ఇప్పుడున్నరీతిలోనే పరిమితం చేయవచ్చు. అదే సమయంలో రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించడంలో రాజ్యసభకు గల అధికారాలతో సమానమైన అధికారాలను , స్థానిక సంస్థల ప్రయోజనాలను పరిరక్షించడానికి శాసనమండలికి కల్పించాలి. ఓ చట్టంద్వారా శాసనమండళ్ల కూర్పును మార్చడానికి రాజ్యాంగం పార్లమెంటుకు వీలు కల్పిస్తోంది. అందువల్ల రాష్ట్ర లెజిస్లేచర్‌లో స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యం లభించేలా శాసనమండళ్ల కూర్పు ఉండేవిధంగా చట్టాన్ని సవరించాలి.

* * *

# సంస్థాగత సంస్కరణలే - ప్రగతికి సోపానాలు

ఆగస్టు 18, 2003

ఇటీవలనే గోదావరి పుష్కరాలు ముగిశాయి. గోదావరి నదిలో 12 రోజులలో కోట్ల మంది స్నానం చేయడతో మన దేశ ప్రజలలో సంప్రదాయాలు, మత విశ్వాసాల పట్ల ఎంత మక్కువ ఉందో మరోసారి రుజువయింది. కోట్లమంది ప్రశాంతంగా, ఏ ఇబ్బందీ లేకుండా ఒకచోట చేరటం, ఎలాంటి అసౌకర్యం, అనారోగ్యం, అవాంతరాలు లేకుండా తమ కార్యక్రమాలు ముగించుకోవటం అపురూపంగా చెప్పుకోవాలి. పాలన యంత్రాంగం ఇలాంటి సందర్భాలలో ప్రదర్శించే అసాధారణ సామర్థ్యం, చొరవ మనం గమనించదగ్గవి. వర్షాకాలంలో, వరదల మధ్య లక్షల మందికి ప్రయాణం, మంచినీటి వసతులు, పారిశుద్ధ్యం, శాంతిభద్రతలు, బస, ఆహారం, స్నానఘట్టాలు, పూజా వాటికలు, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల రక్షణ ఇన్ని ఏర్పాట్లను విజయవంతం చేయటం సామాన్యమయిన విషయం కాదు. ఇప్పటికీ మన పాలన యంత్రాంగం అప్పుడప్పుడు వేగంగా కదులుతుందని, సమర్థంగా పనిచేయగలదని దీంతో రుజువవుతోంది.

**కొన్ని విజయాలు**

ఈ సామర్థ్యం, చొరవ, వేగం అన్ని సందర్భాలలో కనిపించవు. కేవలం స్వల్పకాలికంగా యుద్ధప్రాతిపదికన చేపట్టే కొన్ని కార్యక్రమాలలోనే ఇలాంటి సామర్థ్యం ప్రభుత్వ యంత్రాంగంలో కనిపిస్తుంది. ఉదాహరణకు ఎన్నికల నిర్వహణలో, జనాభా లెక్కలను సేకరించటంలో, ప్రముఖుల పర్యటన కార్యక్రమాల నిర్వహణలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకునే తాత్కాలిక ఉపశమన చర్యలలో, యుద్ధసమయంలో, పుష్కరాలలాంటి అసాధారణ జనసందోహం గుమిగూడిన సందర్భాలలో, రాజకీయ సంకల్పం ఉన్నప్పుడు మతకల్లోలాలను అదుపుచేయటలో ప్రధానంగా ఇలాంటి శక్తి సామర్థ్యాలు ప్రదర్శించే పాలన యంత్రాంగం, మామూలు పరిపాలన వ్యవహారాల్లో నిస్తేజంగా ఉంటోంది. ప్రభుత్వం యంత్రాంగం అసాధారణ విజయాలు సాధించిన ప్రతి కార్యక్రమంలోను లక్ష్యాలు నిర్దిష్టంగా ఉంటాయి. ఎక్కడా

అనుమానానికి, రంధ్రాన్వేషణకు తావుండదు. ఉదాహరణకు ఎన్నికల లక్ష్యం ప్రజలు స్వేచ్ఛగా ఓటువేసే పరిస్థితిని కల్పించడం, కనిపించే అక్రమాలను ఆపడం, పోలింగు నిర్వహించి పకడ్బందీగా ఓట్లు లెక్కించడం, ఎన్నిక ఫలితాలను నిర్ద్వంద్వంగా ప్రకటించడం. ఈ ప్రక్రియలో ప్రతి ఉద్యోగికీ నిర్దిష్టంగా తన స్థానమేమిటో, తానే పనిని నిర్వహించాలో స్పష్టంగా తెలుసు. లక్ష్యాలు స్పష్టంగా ఉన్నా, తగినన్ని వనరులు లేకపోతే ఫలితాలు రావు. ఉదాహరణకు అందరికీ టీకాలు వేయాలనే లక్ష్యం ఉన్నా, అందుకు కావలసిన వ్యాధి నిరోధక టీకాలు, వాటిని నిలవ చేయటానికి కావలసిన శీతలీకరణ ఏర్పాట్లు, తగిన సిబ్బంది లేకపోతే లక్ష్యాన్ని సాధించలేం. గతంలో ఓటర్లందరికీ ఫొటో గుర్తింపు కార్డులుండాలని నిర్ణయించారు. కాని అందుకు తగిన వనరులను, యంత్రాంగాన్ని సరిగ్గా ఏర్పాటు చేయకపోవటంతో, ఆ కార్డులు అందరికీ అందలేదు. ఇటీవల కొన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయటంతో గుర్తింపుకార్డుల పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. ఎన్నికల నిర్వహణలోను, ప్రముఖుల పర్యటనల్లోను ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవటంలోను, యుద్ధ నిర్వహణలోను నిజానికి వనరుల లోటు ఏమీ ఉండదు. లక్ష్యసాధనకు కావలసిన అన్ని వనరులు ఎక్కడికక్కడ అందుబాటులో ఉంటాయి. ఒకవేళ ఏదైనా లోటుపాట్లున్నా వాటిని సవరించే అధికారం స్థానిక అధికారులకుంటుంది. ప్రతిస్థాయిలోను బాధ్యతలను, అధికారాన్ని స్పష్టంగా నిర్వహించటంతో ఎలాంటి అస్పష్టతకు, సందేహానికి తావుండదు. తప్పుచేసినా, లోపం జరిగినా అందుకు బాధ్యులను స్పష్టంగా గుర్తించే ఏర్పాటుండటంతో ఎవరికి వారు తమ విధి నిర్వహణలో జాగ్రత్తపడతారు. ప్రతిస్థాయిలోను బాధ్యతలను నిర్వచించి, అందరి మధ్య సమన్వయం సాధించే ఏర్పాట్లు ఉండటంతో, యంత్రాంగం మొత్తం వేగంగా, ఉమ్మడిగా కదులుతుంది. సమర్థ విధినిర్వహణలో కానవచ్చే మరో అంశం అందికార వికేంద్రీకరణ. ఎక్కడికక్కడ పరిస్థితులను బట్టి చొరవతో చప్పున నిర్ణయాలు చేసే అవకాశం, అధికారం అన్నిస్థాయిలలో ఉంటాయి. అధికారాన్ని వికేంద్రీకరించినప్పుడు లక్ష్యసాధన కోసం కొత్త పద్ధతులను అన్వేషించటం జరుగుతుంది; ఆరోగ్యకరమైన పోటీ పెరుగుతుంది. ఉత్సాహంగా ప్రతిస్థాయిలోను ఉద్యోగులు స్పందిస్తారు; వ్యక్తి ప్రతిష్ఠకన్నా సమష్టి విజయం ప్రధానమవుతుంది.

కేవలం స్వల్పకాలిక లక్ష్యాలకు, కొద్దికాలం పాటు జరిగే ఉత్సవాలకు, కార్యక్రమాలకు మాత్రమే ఇలాంటి విజయాలు పరిమితం కావడం దురదృష్టకరం. దీర్ఘకాలిక లక్ష్యాల సాధనలో, సామాన్య ప్రజలకు అందించవలసిన విద్య, ఆరోగ్యం,

పారిశుద్ధ్యం, సమర్థ సేవలు, సులభ న్యాయంలాంటి అంశాలలో ఈ ప్రతిభాపాటవాలు సాధారణంగా కానరావు. ఇలాంటి విజయాలను సాధించాలంటే రాజకీయ సంకల్పం, సమర్థ నాయకత్వం అవసరం. అన్ని లక్షణాలు ఉన్నా, నాయకత్వం పట్ల విశ్వాసం, గౌరవం కరవయితే ఫలితాలు అంతగా రావు. ఇక ప్రజల విషయానికి వస్తే ఫలితాలు స్పష్టంగా ఉన్నప్పుడు, లక్ష్యాల విషయంలోను, పాలన యంత్రాంగం స్పందించే తీరులోను ఎలాంటి అనుమానాలకు తావులేనప్పుడు, జనం బాగా సహకరిస్తారు. ఓ పుష్కరానికి వెళ్ళినప్పుడు అక్కడ యాత్రికులకు తాము ఏం ఆశిస్తున్నామో నిర్దిష్టంగా తెలుసు. తాము కోరిన రీతిలో ఫలితాలుండటంతో యంత్రాంగం, ప్రజలు పరస్పర విశ్వాసంతో వ్యవహరిస్తారు. కాని ఓ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళినప్పుడు తాము కోరుకున్న రీతిలో అక్కడి యంత్రాంగం స్పందిస్తుందన్న విశ్వాసం లేనప్పుడు ప్రజలు సహకరించరు. ప్రజల సహాయ నిరాకరణ ప్రభుత్వ యంత్రాంగంలో మరింత అలసత్వాన్ని, కరకుదనాన్ని పెంచుతుంది. ఇలా ఒక విషవలయం తయారయి, మామూలుగా కనిపించే సామర్థ్యం కూడా కరువయిపోతుంది. అంతమాత్రాన ఇక ప్రభుత్వం యంత్రాంగం నుంచి ఏమీ ఆశించరాదని నిరాశ చెందాల్సిన అవసరం లేదు. పరిస్థితులు అనుకూలిస్తే ఈ యంత్రాంగమే అసాధారణమైన ఫలితాలను ప్రజలకు అందించగలదు. మన రాజ్యవ్యవస్థలో ఎన్నో లోపాలున్నా, అది ఇంకా పతనం కాలేదు. ఇప్పటికీ జవజీవాలు మిగిలి ఉన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని దీర్ఘకాలిక లక్ష్యాల కోసం ఎంతో నేర్పును, విజ్ఞతను ప్రదర్శించాలి. ఈ సామర్థ్యాన్ని, చొరవను జనహితం కోసం మళ్లించటం ఎలాగో తెలుసుకోవాలి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, చట్టబద్ధపాలన ఈ రంగాలలో పాలన యంత్రాంగం సమర్థంగా పనిచేసే ఏర్పాట్లు ఎంతో కట్టుదిట్టంగా ఉండాలి.

ఈ రంగాలలో సత్ఫలితాలు సాధించటానికి మంచి మార్గాలున్నాయి. ఎంతో తక్కువ ఖర్చుతో మనకున్న పరిమిత వనరులతో, ఎందరో మార్గదర్శకులు అసాధారణ విజయాలను సాధించారు. సంస్థాగతంగా ఆ మెళకువలను, పద్ధతులను దేశమంతటా ప్రవేశపెట్టటం సాధ్యమే. ఉదాహరణకు కంటి ఆరోగ్యం విషయంలో– దక్షిణాదిన ఉన్న మూడు సుప్రసిద్ధ సంస్థలు– శంకర నేత్రాలయ, అరవింద కంటి ఆసుపత్రి, యల్.వి.ప్రసాద్ నేత్ర సంస్థ– ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలను సాధించాయి. ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో, సులభ పద్ధతులతో ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆరోగ్యాన్నందించటలో జాంఖేడ్‌లో డాక్టర్ అరోలి అద్భుత విజయాన్ని

సాధించారు. బాలకార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తిచేసి, వారి వ్యక్తిగత అవసరాలను గమనించి, మంచి ప్రమాణాల పాఠశాల విద్య అందించటలో డాక్టర్ శాంతాసిన్హా ఆధ్వర్యంలో యం.వి. ఫౌండేషన్ గర్వించదగ్గ విజయాలను సాధించింది. తణుకు లాంటి పట్టణంలో అందరికీ మరుగుదొడ్లు నిర్మించటంలో డి.వి.వి.యస్. వర్మ ఎన్నడో విజయాన్ని సాధించారు. సూరత్ పట్టణంలో ప్లేగు వ్యాధి సోకిన నేపథ్యంలో పారిశుద్ధ్యాన్ని, నగర పాలనను గణనీయంగా మెరుగుపరచటంలో యస్.ఆర్. రావు ఘన విజయాన్ని సాధించారు. ఇలా ఎందరో సమర్థుల స్ఫూర్తితో, ముందుచూపుగల నాయకత్వంతో, గణనీయమైన ఫలితాలను సంస్థాగతంగా ఎలా సాధించవచ్చో అలాంటి అనుభవాలు రుజువుచేశాయి. మనకు రెండురకాల అనుభవాలున్నాయి. స్వల్పకాలిక లక్ష్యాలను యుద్ధప్రాతిపదికన సాధించడం; లేదా కొందరి వ్యక్తిత్వం వల్ల, సమర్థ నాయకత్వం వల్ల కొన్ని రంగాలలో, కొన్ని ప్రాంతాలలో గణనీయమైన ఫలితాలను దీర్ఘకాలికంగా సాధించడం. ఇలాంటి దీర్ఘకాలిక లక్షణాలను సంస్థాగతంగా అమలు చేయటం, వాటిని పెద్దఎత్తున అన్ని ప్రాంతాలకు విస్తరించటం, ఆ విస్తరణలో ఆ కార్యక్రమాల స్ఫూర్తి జావగారిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం– ఇవి మన ముందున్న సవాళ్ళు. కొన్ని ప్రత్యేక ఉద్యమాలు పెద్దఎత్తున విస్తరించిన సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకు డాక్టర్ వర్ఘీస్ కురియన్ నాయకత్వంలో దేశంలో చాలా ప్రాంతాలలో సహకార పాడిపరిశ్రమ విస్తరించి అద్భుత విజయాలను సాధించింది. శ్రీ పాండురంగశాస్త్రి అథావలే నాయకత్వంలో పశ్చిమ సముద్ర తీరాన వేలాది గ్రామాలలో స్వాధ్యాయ ఉద్యమం ప్రజల జీవితాలను శాశ్వతంగా మార్చింది. కేరళలో శతాబ్దం క్రితం నిమ్నజాత కులస్తులుగా ముద్రపడిన ఈళవ, ఇతర కులస్తులు నారాయణగురు స్ఫూర్తితో అంటరానితనం నుంచి వెనకబడ్డ తనం నుంచి శాశ్వతంగా విముక్తి చెందారు.

## నిరాశ అనవసరం

సమర్థ నాయకత్వం, చిత్తశుద్ధితో పాటు తగిన ఏర్పాట్లు ఉంటే, ఉత్తమ ఫలితాలను పెద్దఎత్తున సాధించవచ్చు. ఇప్పుడు జాతికి కావలసింది దీర్ఘకాలిక లక్ష్యాలను దేశవ్యాప్తంగా సాధించే చేవ. అందుకు మంచి నాయకత్వంతో పాటు మన రాజ్యావ్యవస్థలో సంస్థాగత సంస్కరణలు అవసరం. అవినీతి కూపంలో కూరుకుపోయిన ఎన్నికల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తే నిజాయతీ, సామర్థ్యం కలిసిన నాయకత్వం ఎదుగుతుంది. అధికారాన్ని వికేంద్రీకరించి బాధ్యతలను ఎక్కడికక్కడ

అప్పగిస్తే చొరవగల పౌరులు ముందుకు వస్తారు. లక్ష్యాల సాధనలో ప్రజలను భాగస్వాముల్ని చేస్తే లక్షల పౌరులు అసలు సిసలైన యోధులుగా రంగంలోకి దూకుతారు. పుష్కరాలను, ఎన్నికలను సమర్థంగా నిర్వహించామని సంబరపడితే చాలదు. ఆ సామర్థ్యాన్ని దీర్ఘకాలిక లక్ష్యాలకు వినియోగించడం, అందుకవసరమయిన సంస్థాగత సంస్కరణలకు నడుంకట్టడం అవసరం. ఈ స్వల్పకాలిక విజయాలు మన వ్యవస్థలో ఉన్న అంతర్గత బలాన్ని, మన సమాజం శక్తి సామర్థ్యాలను మరోసారి రుజువుచేశాయి. మనం నిరాశతో కుంగిపోవలసిన అవసరం లేదని అవి గుర్తుచేస్తున్నాయి.

* * *

# సుపరిపాలనకు పటిష్ఠ పౌర సమాజమే పునాది

**జూలై 30, 2000**

స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు పూర్తయ్యాయి. పోలింగుకు ముందు డబ్బు పంపిణీ, దౌర్జన్యం, సారాయి ప్రవాహం, హింసాకాండ, రింగ్గంగు చోటు చేసుకున్నాయి. ఇక ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక జరిగిన విచిత్రాలు, దారుణాలు అన్నీ ఇన్నీ కావు. నిన్న ఓ పార్టీ అభ్యర్థిగా గెలిచి ఈ రోజు వేరే పార్టీలో చేరిపోవటం, ఎదుటి పార్టీ వాళ్లను గెలిపించటానికి అవసరమైతే వారం తిరక్కుండానే పదవికి రాజీనామా చేయటం, ఎన్నికైన సభ్యులను ఓ చోట ఉంచి గొర్రెల మందలాగా కాపలా పెట్టడం, కిడ్నాపులు, ప్రతి కిడ్నాపులు, డబ్బు ఎరవేసి సభ్యులను కొనుక్కోవటం- ఇవన్నీ జరిగాయి. ఇదంతా చూస్తే ఓ విషయం స్పష్టమవుతోంది. రాజకీయంలో ఎన్నికలకు, ప్రజల జీవితానికి మధ్య సంబంధం ఏమీ లేదు. కొందరు అధికారం, దర్పం కోసం ప్రజల్ని దోచుకోవడానికి, పాలన యంత్రాంగాన్ని గుప్పిట్లో ఉంచుకోవడానికి ఆడే రాజకీయ క్రీడే ఎన్నికలు! అంతేగాని ఎన్నికయిన వాళ్లు జనం పేరుతో, జనం మద్దతుతో ప్రజా ప్రతినిధులుగా, ప్రజా సేవకోసం నియమితులయిన వాళ్లు కాదు. కేవలం ఆ పోలింగు రోజు ఓటు వేసేదాకా మాత్రమే ప్రజలు ఏక్‌దిన్‌కా సుల్తాన్‌లు. ఆ పని కాస్తా అయిపోయాక షరామామూలే!

## ఓటుకు విలువేది?

అంతమాత్రం చేత జనం ఏమీ చేయలేరని దిగులు పడనక్కరలేదు. ప్రజలు మౌనంగా చేతులు ముడుచుకుని కూర్చోనక్కరలేదు. ఇటీవల ఎన్నికలలో జరిగిన ఓ ముఖ్యమైన సంఘటన ప్రజా బలానికి, జన వాక్యానికి పాలకులు తలవంచాల్సిందేనని రుజువు చేస్తోంది. కర్నూలు జిల్లాలో హింసా రాజకీయాలకు, దౌర్జన్యాలకు, హత్యలకు పాల్పడే ముఠా నాయకులకు అధికార పార్టీ, జిల్లా పరిషత్ అధ్యక్ష పదవిని కట్టబెడుతోందని ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే సి.పిఐ. పార్టీ దాన్ని బయటపెట్టి ఎలాగైనా ఈ దారుణాన్ని ఆపాలని కోరింది. లోక్‌సత్తాలాంటి ప్రజా ఉద్యమాలు, పత్రికలు, ప్రసార సాధనాలు ఈ విషయంలో ఏకమై హత్యా రాజకీయాలకు పాల్పడే ముఠా నాయకులు పదవులు కట్టబెట్టడాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి. లోక్‌సత్తా

అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాసింది. కర్నూలు జిల్లాలో అధికార పార్టీలో అన్ని ముఠాలు, గ్రూపులు, అందరు శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు ఆ ముఠా నాయకుణ్నే జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని పట్టుబట్టారట. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేరొకర్ని సూచించామని కోరినా వారంతా తిరస్కరించారట. నేర రాజకీయం, హింసా సంస్కృతి ఎంతగా ఎదిగిపోయాయో, దాన్ని నిరోధించటంలో రాజకీయ నాయకులు ఎంత ఆశక్తులో ఈ సంఘటన రుజువు చేసింది. అయినా తెలుగుదేశం పార్టీ ముఖ్యులను సంతృప్తి పరచటం కోసం తప్పు చేస్తే రాష్ట్రమంతటా ప్రజల ముందు లోకువైపోతామని గ్రహించింది. పత్రికలు, ఇతర పార్టీలు, పౌర సమాజం బలహీనంగా లేవని, గొంతెత్తి అక్రమాన్ని ఖండిస్తాయని తెలుసుకుంది! దాని పర్యవసానంగా తెలుగుదేశం పార్టీ వేరే సభ్యుడిని జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా పోటీ చేయించి గెలిపించింది. ఇది ఏ కారణాలవల్ల జరిగినా అధికార పార్టీని అభినందించాలి. తప్పు చేసినప్పుడు నిర్మొహమాటంగా విమర్శించటం అంతే అవసరం. నేటి రోజుల్లో ఓ పార్టీని నడపటం, అన్ని వర్గాలను మర్ధించుకు రావటం, అధికార క్రీడలో నెగ్గుకురావటం అత్యంత కష్టసాధ్యమైన ప్రక్రియ. అన్ని పార్టీలకు ఈ ఇబ్బందులున్నాయి. ఎన్నో వైరుధ్యాలుండి. సంక్లిష్టమయిన మన సమాజంలో రాజకీయాన్ని నడపటం కన్నా కష్టం మరొకటి లేదు. అందుకే ఆడపాదడపా జరిగే మంచిని మెచ్చుకుని పదిమందీ సమర్థించినప్పుడే పార్టీల వైఖరిలో ఆహ్వానించదగ్గ మార్పులొస్తాయి. ఇటీవల జాతీయ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నిధుల వసూళ్ల విషయంలో ఇలాంటి మంచి నిర్ణయాన్ని తీసుకుంది. దురదృష్టం ఏమంటే మన పత్రికలు, ప్రసార సాధనాలు దాన్ని గూర్చి దాదాపు పట్టించుకోలేదు. రాజకీయంలో అరుదుగా జరిగే మంచిని గుర్తించి, గౌరవించటం మన జాతి భవిష్యత్తుకు అవసరం. అందుకే స్థానికంగా, ఇబ్బందులు ఎదురయినా మంచి నిర్ణయం తీసుకున్న తెలుగదేశం పార్టీని, జాతీయస్థాయిలో పార్టీ నిధుల విషయంలో మంచి సంప్రదాయాన్ని ఏకపక్షంగా ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీని అభినందించాలి. పార్టీలు ఈ మాత్రమైన ప్రజల భావాలకు స్పందిస్తున్నాయంటే కారణం జనవ్యాం. మనం సంఘటితంగా, నిష్పక్షపాతంగా నిలదీస్తే పార్టీలు విధిగా మార్పులు తీసుకువస్తాయి. పార్టీల లక్ష్యం ప్రజల మద్దతు పొందటం, అధికారాన్ని సంపాదించటం. అలాంటప్పుడు ఆ ప్రజలను కాపాడాలని ఏ పార్టీ దూరం చేసుకోదు. అయితే ప్రజలు ఏం కావాలో తెలియనప్పుడు, పదిమంది కలిసి తమ వాణిని వినిపించలేనప్పుడు, జనం నిస్తేజంగా ఉన్నప్పుడు,

పార్టీలు, రాజకీయ నాయకులు మన అజ్ఞానాన్ని, అనైక్యతను, జడత్వాన్ని ఆసరగా తీసుకుని జనాన్ని వంచించటం, రాజకీయ జూదంలో జనాన్ని పావులుగా వాడుకోవడం సహజం. అందుకే బలమైన పౌర సమాజం మంచి పాలనకు పునాది. ఎవరో ఒకరు మన పేరుతో అధికారం చేపట్టాక మంచి జరుగుతుందని హామీ ఏమన్నా ఉందా? గతంలో ఎన్నోమార్లు ఎందరో నమ్మించి మోసం చేవారు. ఎవరు గెలిచినా నిరంతరం ఓడుతున్నది ప్రజలే. ప్రజల నిరంతర నిఘా ఉన్నప్పుడే కొంత మేరకయినా మంచి పాలన వస్తుంది. ఈ పాలకులంతా కేవలం ప్రజా సేవకులే. మన డబ్బుతో, మనమిచ్చిన ఓటుతో వాళ్లు మన నెత్తిమీద కూర్చుని మన జీవితాలను శాసిస్తున్నారు. కేవలం రాష్ట్రంలోనే రోజుకు రూ. 100కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం మన పేరుతో ఖర్చుపెడుతోంది. ఇందులో పదోవంతు కూడా ప్రభుత్వ సేవల రూపంలోగాని, ప్రజల ఆస్తుల రూపంలోగాని మనకు అందడం లేదు. ప్రభుత్వ సేవలు మన డబ్బుతో మనకందాలి. కాని మనం ఏ చిన్నపనికైనా ఏదైనా ఆఫీసుకు వెళితే మనల్ని పురుగుల్లాగా చూస్తున్నారు; చీత్కరిస్తున్నారు; లంచాలకు చేయిచాపుతున్నారు; లంచమివ్వకపోతే వేధిస్తున్నారు; పదిసార్లు మళ్లీ మళ్లీ తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. మనం అదంతా సహించి ఊరుకోవలసిందే? పౌర సేవలను నిర్దిష్ట ప్రమాణాలతో సకాలంలో అందుకునే పద్ధతులున్నాయి. బ్రిటన్‌లో జాన్‌మేయర్ ప్రభుత్వం పదేళ్లకిందట పౌరహక్కుల పత్రాలు (సిటిజన్స్ చార్టర్లు)ను తయారు చేసింది. ప్రతి ప్రభుత్వ సేవకు ప్రమాణాలు నిర్ణయించి, పౌరులకు ఆ సేవలందుకునే హక్కును ఆ విధంగా నిర్వచించారు. 1998లో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సత్తా అన్ని ప్రభుత్వ సేవలను చాలా ప్రమాణికంగా క్రోడీకరించి దేశంలో మొదటిసారిగా ప్రజలకు అందించింది. “స్వరాజ్యం-ప్రజాహక్కుల పత్రం” అనే పుస్తకం రాష్ట్రంలో, దేశంలో విశేష జనాదరణ పొందింది. ఆ పుస్తకం వెలువరిస్తున్నప్పుడే లోక్‌సత్తా రాష్ట్రంలో పెట్రోలు బంకులలో కొలతల్లో మోసాన్ని అరికట్టింది. ప్రజాహక్కుల పత్రం ఆధారంగా లోక్‌సత్తా జంట నగరాలలో, కొన్ని జిల్లా కేంద్రాలలో తనిఖీలు మొదలు పెట్టగానే తూనికలు, కొలతల శాఖ రాష్ట్రంలో ఉన్న 1500 పెట్రోలు బంకులలోను మీటర్లను సరిచేసింది. అడపాదడపా లోక్‌సత్తా కార్యకర్తలు ఈ మీటర్లను తనిఖీ చేస్తుండడంతో దేశంలో మొదటిసారిగా మన రాష్ట్రంలో పెట్రోలు బంకులలో కొలతల మోసం ఆగిపోయింది. దీని వల్ల వినియోగదారులకు ప్రతిరోజు దాదాపు కోటి రూపాయలు ఆదా అవుతోంది! ప్రజాహక్కుల పత్రం వెలువరించటంతో పాటు లోక్‌సత్తా రాష్ట్రమంతటా సంతకాలు ఉద్యమాన్ని చేపట్టి ప్రతి సేవకు పౌరహక్కుల పత్రాలను వెలురించాలని రాష్ట్ర

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఎన్నో వినియోగదార్ల సంస్థలు ఇందులో పాలుపంచుకున్నాయి. ప్రభుత్వం స్పందించి తొమ్మిది శాఖలలో సిటిజన్స్ చార్టర్లను రూపొందిస్తున్నట్లుగా ప్రకటించింది. అవి మునిసిపాలిటీలు; హైదరాబాద్ నగర పాలక సంస్థ, హైదరాబాద్ నీటి సరఫరా, సివరేజి బోర్డు, వాణిజ్య పన్నుల శాఖ; రవాణా శాఖ; ఆర్.టి.సి; రాష్ట్ర విద్యుత్ బోర్డు, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిలు; రిజిస్ట్రేషన్ శాఖ, అయితే మాటలు చెప్పినంత వేగంగా పనులు జరుగవు. చాలా శాఖలలో ఈ పౌరహక్కుల పత్రాల బయటపడలేదు. విడుదలైన కొద్ది సిటిజ్స్ చార్టర్లు కూడా కంటి తడుపు చర్యలే తప్ప పసలేనివి. నిజమైన హక్కుల పత్రంలో నాలుగు భాగాలుండాలి. మొదటిది, ఆ సేవకు ఏ ఉద్యోగి బాధ్యుడో స్పష్టంగా ప్రకటించాలి. రెండోది, ఆ సేవ అందుకోవటానికి మనం ఏం చేయాలో, ఎలాంటి దరఖాస్తులు పూరించాలో, ఎంత రుసుము ఏ విధంగా, చెల్లించాలో నిర్దిష్టంగా మనకు తెలపాలి. మూడోది, ఆ సేవను ఏ ప్రమాణాలతో, ఎన్ని రోజులలో అందిస్తారో నిర్ధిష్టంగా నిర్వచించాలి. చివరిది, అన్నిటికన్నా ముఖ్యమయింది – ఆ సేవ సకాలంలో, సరైన ప్రమాణాలతో అందకపోతే పౌరుడికి ప్రతిరోజు ఆలస్యానికి నష్టపరిహారం చెల్లించాలి. ఈ నాలుగు ఉన్నప్పుడే అది పౌరహక్కుల పత్రం అవుతుంది. వాటిని అమలు చేసినపుడే అది జవాబుదారితనం అవుతుంది. పౌర సమాజం ఒత్తిడితేగా, తేగా కొన్ని మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వంలో అధికారులు, రాజకీయులలో కొంత మందైనా చిత్తశుద్ధిగలవారు లేకపోలేదు. ఇటీవల మన రాష్ట్రంలో జరిగిన ఓ అద్భుతం మరోసారి ఈ విషయాన్ని రుజువుచేసింది. పట్టాణాభివృద్ధి శాఖలో ఓ ఉన్నతాధికారి ప్రసాదరావు చొరవ వల్ల దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలో ఓ చక్కని పౌరహక్కుల పత్రం రూపొంది వెలువడింది. మునిసిపాలిటీలన్నింటికీ వర్తింపచేస్తూ ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం చాలా మంచి సిటిజన్స్ చార్టర్‌ను అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఆస్తి పన్ను మదింపునకు, ఇంటి నంబరు ఇవ్వటానికి15రోజులు; గృహనిర్మాణ దరఖాస్తుల పరిశీలనకు 15రోజులు, నీటి సరఫరా ఇవ్వటానికి సాధారణంగా 30రోజులు, జనన, మరణ సర్టిఫికెట్ల జారీకి 5రోజులు కాలపరిమితిని నిర్దిష్టంగా నిర్దేశించారు. ప్రతి మునిసిపాలిటీలో ప్రజాసేవా కేంద్రాలను విధిగా ఏర్పాటు చేయాలని, ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర దాకా దరఖాస్తులను స్వీకరించాలని, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటలదాకా ఈ అనుమతులను, సర్టిఫికెట్లను మంజరు చేయాలని ఆదేశించారు. అన్నింటినీ మించి కాలపరిమితిలోగా సేవ అందకపోతే పౌరుడికి రోజుకు 50 రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, ఆ డబ్బును బాధ్యులయిన వ్యక్తుల నుంచి వసూలు చేయాలని

ఆదేశించారు. దేశ చరిత్రలో ఇలాంటి పౌర హక్కుల పత్రం విడుదలవటం ఇదే ప్రథమం. దీంతోపాటు అన్ని వివరాలను, దరఖాస్తు ఫారాలను విడుదల చేశారు. కొన్ని మునిసిపాలిటీలు చొరవ తీసుకుని ఇప్పటికే దీన్ని అమలు చేస్తున్నాయి. ఇది ప్రజలకు అద్భుత విజయం. ఇందుకు చొరవ తీసుకున్న మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి ప్రసాదరావును, పురపాలకశాఖ మంత్రిని, కార్యదర్శిని మనసారా అభినందించాలి. అయితే ఇల్లలకగానే పండగ కాదు. పౌరహక్కుల పత్రం ఓ మంచి పరికరం. దాన్ని ఉపయోగించటం ప్రజలకు తెలియాలి. అన్ని పట్టణాలలో, నగరాలలో అది అమయ్యేలా మనం ఒత్తిడి తేవాలి. సాక్షాత్తు రాష్ట్ర రాజధానిలోనే దీన్ని అమలు చేయలేమని అధికారులు మొండికెత్తారు. ఆర్భాటంగా సేవాకేంద్రాన్ని ప్రారంభించారుగాని, సిటిజన్స్ చార్టర్‌ను మాత్రం అమలులోకి తేలేదు. ప్రభుత్వ ఆదేశం రాజధానిలో కూడా అమలు కాదని రుజువు చేశారు. అదేమంటే ఆలస్యానికి పరిహారం చెల్లించే శక్తి లేదని వాదిస్తున్నారు. ప్రజలకు జవాబుదారిగా ఉండటం అధికారులకు ఎంత అనిష్టమో ఈ ఉదంతం రుజువు చేస్తోంది. విధిగా ఈ పౌరహక్కుల పత్రం అన్ని పట్టణాలలో అమలయ్యేలా మన పోరాడాలి; విజయం సాధించాలి.

## ప్రజా నిఘా అవసరం

మనకు సేవలందవలసింది కేవలం పురపాలక సంఘాల నుంచి మాత్రమే కాదు. ఎన్నో ప్రభుత్వ శాఖలలో మనకు సేవలందాలి. వాళ్లంతా మన పన్నుల డబ్బుతోనే మన మీద పెత్తనం చేస్తున్నారు. కాబట్టి ప్రతి శాఖకు, ప్రతి సేవకు ఇలాంటి పౌరహక్కుల పత్రం విడుదల కావాలి. దాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. అన్ని ప్రజా సేవల విషయంలో పాలకులు మన జవాబుదారిగా ఉండాలి. అప్పుడే పౌర సార్వభౌమత్వానికి ఓ రూపం వస్తుంది. దీంతోపాటు అన్ని పాలన విషయాలలో ప్రజలకు సమాచారా హక్కు చట్టబద్ధంగా ఉండాలి. పౌరహక్కుల పత్రాల అమలు, సమాచార హక్కు ఉంటే కనీసం సామాన్య ప్రజలకు, బడుగు జీవలుకు ప్రభుత్వ యంత్రాంగం ఓ గుదిబండలాగా కాకుండా, కొంత మేరకయినా సేవలందించే సంస్థగా రూపొందుతుంది. సంఘటితంగా, పరిజ్ఞానంతో నిలదీస్తే మనం సాధించలేనిది లేదు. మౌన రోదన వల్ల, శుష్క చర్చలవల్ల, మొట్టవేదాంతం వల్ల, నిష్క్రియా విమర్శల వల్ల మనం ఏమీ సాధించలేం. నిర్దిష్ట చర్యల కోసం నిర్విరామంగా, సంఘటితంగా కృషి చేస్తే అపూర్వ విజయాలు సాధించవచ్చు. మంచి పాలన కేవలం ఎన్నికలతో, ఊకదంపుడు ఉపన్యాసాలతో రాదు; అది ప్రజల నిరంతర నిఘావల్ల మాత్రమే సాధ్యం.

* * *

# పటిష్ఠ చట్టంతోనే ప్రజలకు సమాచార హక్కు

**సెప్టెంబర్ 3, 2000**

మన దేశంలో మంత్రులు పదవీస్వీకారం చేయగానే మొట్టమొదట చేసే ప్రతిజ్ఞ- తననెన్నుకుని బాధ్యతల్ని అప్పగించిన ప్రజలకు తెలియకుండా అధికార రహస్యాలను దాచిపెడతానని'. రాజ్యాంగ నిర్మాతలు దీన్ని ఏకంగా రాజ్యాంగంలోని మూడో షెడ్యూలులో చేర్చారు. మంత్రులందరూ విధిగా ఈ ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరాన్ని కల్పించారు. దీనివల్ల ఏం నష్టం జరిగిందనేది అంత ముఖ్యంకాదు. వాస్తవానికి వలస పాలకులు చేసిన 'అధికార రహస్యాల చట్టాన్న'నుసరించి కొన్ని అంశాల్ని మాత్రమే దాచిపెట్టాలి. కాని పదవీస్వీకారాన్ని రహస్య ప్రతిజ్ఞతో జోడించటం ఒకరకంగా మన వ్యవస్థలో జవాబుదారితనం కొరవడటానికి దారితీస్తోంది. ఒకసారి ఎన్నికలయ్యాక ఇక ప్రజలకు మళ్లీ అయిదేళ్లదాకా ఏ పాత్రలేదని, నోరు మూసుకుని అన్ని అవమానాలను దిగమింగుకుంటూ, అన్యాయాలను సహిస్తూ కూర్చోవలసిందేనని ఈ రహస్య శపథం మనకు గుర్తుచేస్తోంది. పాత్రికేయుడుగాని, పౌరుడుగాని ఏ చిన్న పాలన విషయాన్ని గూర్చి సమాచారం తెలుసుకోవాలన్నా అధికారులు ప్రదర్శించే బెట్టు, దాపరికం అంతా, ఇంతా కాదు. మన డబ్బుతో మనమీద పెత్తనం చేస్తూ- అసలు జనం కలిగించే ఇబ్బందులు లేకపోతే తమపని ఏ చీకూ చింత లేకుండా హాయిగా జరిగిపోతుంద'ని మన పేరుతో మన సేవకులుగా కూర్చున్నవాళ్ళ భావన. అందుకే ఎక్కడ ఏ ఉద్యోగిని నిలదీసినా మనకి తరచు ఎదురయ్యే ప్రశ్న "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని.

## రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ

రాజ్యాంగంలో 19(1)(ఎ) అధికరణలో పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యాన్ని, భావస్వాతంత్ర్యాన్ని అందించారు. అలాగే 21వ అధికరణంలో జీవించే హక్కు వ్యక్తి స్వేచ్ఛను పొందుపరిచారు. 19(2) అధికరణ ప్రకారం ఈ స్వేచ్ఛకు కొన్ని హేతుబద్ధమైన పరిమితులను మాత్రమే చట్టం ద్వారా విధించవచ్చు. ఉదాహరణకు దేశ భద్రత కోసం, వివిధ దేశాలతో సత్సంబంధాల కోసం, శాంతిభద్రతల పరిరక్షణ

కోసం, సమాజంలో నీతిని, మర్యాదను కాపాడటం కోసం, కోర్టుల గౌరవాన్ని కాపాడటం కోసం, నేరాన్ని ప్రేరేపించకుండా నిరోధించడం కోసం మాత్రమే వ్యక్తి స్వేచ్ఛను కొంతమేరకు అదుపుచేయవచ్చు. అంతకుమించి ఏ చట్ట సభకు, ప్రభుత్వానికి వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కును నిరోధించే హక్కులేదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధం. సుప్రీంకోర్టు వివిధ కేసులలో తీర్పులనిస్తూ పాలన సమాచార హక్కును రాజ్యాంగబద్ధమైన హక్కుగా గుర్తించింది. 1973లో బన్నెట్ కోల్‌మన్ కేసులోను; 1975లో రాజ్‌నారాయణ్ కేసులోను; 1980లో ఎస్.పి.గుప్త కేసులోను, 1989లో మనుభాష్ షా వర్సెస్ ఎల్.ఐ.సి కేసులోను సర్వోన్నత న్యాయస్థానం నిర్ద్వంద్వంగా ప్రజలకు పాలన సమాచార హక్కు రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులలో భాగమని ప్రకటించింది. అయినా ఇన్నాళ్లకు కూడా దేశంలో ఈ హక్కుకు సరైన రూపం కల్పిస్తూ ప్రజలకు పనికివచ్చే చట్టాన్ని చేయలేకపోయారు. ఎన్నో నిపుణుల కమిటీలు నమూనా చట్టాలను రూపొందించాయి. శౌరి కమిటీ ప్రతిపాదించిన బిల్లు; ప్రెస్ కౌన్సిల్ బిల్లు, యస్.ఐ.ఆర్.డిలో జస్టిస్ సావంత్, జార్జి ఫెర్నాండెజ్, కన్నాభిరాన్, నిఖిల్‌డే, ఈ వ్యాస రచయిత తయారుచేసిన నమూన చట్టం ఇలా ఎన్నో రకాల నమూనాలు అందుబాటులో ఉన్నాయి. కాని ఇప్పటికి కూడా దేశవ్యాప్తంగా అమలయ్యే చట్టం మాత్రం మన నేతలకు సాధ్యం కాలేదు. ప్రతి పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో సమాచార హక్కును గూర్తి ప్రస్తావించింది. కాని మాటలకు, చేతలకు పొంతనలేకపోవడం మనందరికీ అలవాటైన పంథాయే. ప్రపంచంలో పరిణతి చెందిన ప్రతి ప్రజాస్వామ్య దేశంలోను సమాచార హక్కు చట్టాలున్నాయి. ఉదాహరణకు స్వీడన్‌లో 1810 నుంచి ఇలాంటి హక్కు అమలవుతోంది. అమెరికా 1966లో ఇలాంటి చట్టాన్ని చేసి పకడ్బందీగా అమలుపరుస్తోంది. ఆదేశంలో అందుకే అధికారంలో ఉన్న వాళ్లకు పత్రికలన్నా, సమాచారాన్ని కూపీలాగి బయటపెట్టే స్వచ్ఛంద సంస్థలన్నా హడలు. నార్వే, ఫిన్లండులలో 1970లో, ఫ్రాన్సులో 1978లో, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో 1982లో, కెనడాలో 1983లో, గ్రీసులో 1986లో, దక్షిణాఫ్రికాలో 1997లో, ఐర్లాండులో 1998లో, బ్రిటన్‌లో 2001లో ఇలాంటి చట్టాన్ని చేశారు. అన్ని ప్రజాస్వామ్య దేశాలలోను పాలన సమాచార హక్కులో భాగంగా రెండు అంశాలు అమలులో ఉన్నాయి. అడగకుండా ప్రభుత్వాలు అన్ని ముఖ్య నిర్ణయాలకు సంబంధించి సమాచారాన్ని తెలపాలి. అదికాక అడిగినప్పుడు ఇతర అంశాలకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్నివ్వాలి.

గత సంవత్సరం జులైలో భారత ప్రభుత్వం పార్లమెంటులో ఓ సమాచార హక్కు బిల్లును ప్రవేశపెట్టింది. అందులో చాలా లోపాలున్నాయి. ఏ అంశానికయినా సమాచారం ఇవ్వాలంటే 30 పనిరోజులు గడువు పెట్టారు. ఓ వ్యక్తి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు, ఓ పౌరుడి స్వేచ్ఛకే ప్రతిబంధకం కలిగినప్పుడు గంటలలోగా సమాచారం అందకపోతే, నెలరోజులపాటు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే అది ప్రమాదాలకు దారితీస్తుంది. అలాగే ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉండే సాధారణ సమాచారానికి కూడా 30 రోజుల గడువునివ్వటం అసంబద్ధం. ఇంత గడువు దాటాక కూడా బుద్ధిపూర్వకంగా సమాచారం అందించకపోయినా లేక తప్పుడు సమాచారాన్నిచ్చినా, ఆ అధికారులకు ఏ శిక్షాలేదు! తప్పుచేస్తే శిక్షకు అవకాశం కల్పించని చట్టం వ్యర్థం. అది కోరలు పీకిన పాములాంటిది. అలాంటప్పుడు ఇక చట్టం ఎందుకో అర్థంకాదు. మనుషుల మనస్తత్వాలను మార్చాలని, చట్టంలో శిక్షలుండటం వల్ల ప్రయోజనం లేదని కొందరు వాదిస్తున్నారు. ఇంతకన్నా అసంబద్ధమైన వాదన మరొకటి లేదు. తప్పుచేస్తే శిక్ష ఉంటుందన్న భయం, మంచి చేస్తే గుర్తింపు, గౌరవం ఉంటాయన్న నమ్మకం సమాజంలో నీతికి, సత్ప్రవర్తనకు ఆధారాలు అసలు శిక్షలే అక్కరలేదని, మనుషులను సన్మార్గులను చేద్దామని ప్రయత్నిస్తే అది మత గురువులు, మహాత్ములు చేయవలసిన పని. చట్టం పని మంచిని ప్రోత్సహించటం, చెడుని నిరోధించటం, కాబట్టి చట్టాన్ని బుద్ధిపూర్వకంగా ఉల్లంఘించిన వాళ్ళకు ప్రజల హక్కులను కాలరాసే వారికి శిక్ష విధిగా ఉండాలి. ఇక సమాచారం అందించకపోతే పౌరుడి ఫిర్యాదులను అందుకునే స్వతంత్ర సంస్థల ఏర్పాటు ఈ బిల్లులో లేదు. కేవలం ప్రభుత్వం లోపల మాత్రమే రెండు అప్పీళ్లకు ఏర్పాటు ఉంది. అంటే ఈ ప్రభుత్వంలో వాళ్లు తాము చేసిన దుశ్చర్యలు, అవినీతి బయటపడతాయని భయపడి వాస్తవాలను దాచిపెడితే, ఇక దానికి పరిష్కారం ఉండదు. పౌరుడు గుడ్లప్పగించి మౌనంగా చేతులు ముడుచుకుని కూర్చోవలసిందే! అలాగే భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో సమాచారాన్ని అందించటానికి మినహాయింపులు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఏదో ఒక వంకన సమాచారం అందించకుండా అధికారులు తప్పించుకునే అవకాశాన్ని ఈ మినహాయింపులు కల్పిస్తున్నాయి. అదీకాక సమాచార హక్కు ఆచరణ రూపం దాల్చాలంటే ప్రభుత్వంలో జరిగే అవకతవకలను ప్రజా ప్రయోజనాల కోసం బయటపెట్టే వారిని ప్రోత్సహించాలి; అలాంటి సమాచారాన్ని వెల్లడిచేసే అధికారులకు చట్టంద్వారా రక్షణ కల్పించాలి.

పార్లమెంటు ముందున్న బిల్లులో ఆ ఏర్పాటు లేదు. ఈ లోపాలన్నీ తొలగించాలని లోక్‌సత్తా రాజస్థాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్, అహ్మదాబాద్‌లోని కన్స్యూమర్ ఎడ్యుకేషన్ రీసెర్చి సెంటర్ వగైరా సంస్థలు, ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మన ప్రభుత్వాలకు నోళ్లున్నాయిగాని, చెవులు లేవు. కళ్లున్నాయిగాని చూడలేరు. అందువల్ల ఆ బిల్లు ప్రస్తుతానికి యథాతథంగా పార్లమెంటు కమిటీ ఆమోదం పొందినట్లు వార్తలొచ్చాయి. అయితే జాతీయస్థాయిలో చట్టం కోసం వేచిచూడకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, రాజస్థాన్‌లలో సమాచార హక్కు చట్టాలను ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో అలాంటి బిల్లు శాసనసభ ఆమోదం పొంది రాష్ట్రపతి అనుమతి కోసం పంపి నాలుగేళ్ళయినా అక్కడ అతీగతీలేదు! అయినా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిబంధనల రూపంలో అమలుచేస్తోంది. ఈ చట్టాలన్నిటిలో గోవా, కర్ణాటక రాష్ట్రాల చట్టాలు మంచివి.

## మన రాష్ట్రం చొరవచూపాలి

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల అనుభవాలను ప్రపంచదేశాల చట్టాలను పరిగణలోకి తీసుకుని లోక్‌సత్తా మన రాష్ట్రానికి ఓ నమూనా చట్టాన్ని తయారుచేసి ప్రభుత్వానికి, ప్రధాన పార్టీల నాయకులకు పంపింది. అయితే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఎప్పుడూ పారదర్శకతను గూర్చి మాట్లాడే ప్రభుత్వాధినేతలు మౌనముద్ర దాల్చారు! లోక్‌సత్తా నుంచి, పౌరసమాజం నుంచి వస్తున్న ఒత్తిడివల్ల చట్టాన్ని త్వరలో తెస్తామని ప్రభుత్వం పరోక్షంగా హామీ ఇస్తోంది. ఏదో ఒక చట్టం కొద్దికాలంలో రావచ్చు. అయితే మనం పోరాడవలసింది కంటితుడుపు చట్టం కోసం కాదు. సరయిన సమాచారహక్కు చట్టంలో కొన్ని కనీస ప్రమాణాలుండాలి. అతి తక్కువ కాలవ్యవధిలో సమాచారాన్నందించటం, వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన అంశాలలో వెంటనే సమాచారాన్నివ్వటం, బుద్ధిపూర్వకంగా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు వేటయం, స్వతంత్ర ప్రతిపత్తిగల అధికారులకు అప్పీలుచేసే వీలు కల్పించటం, సమాచార వెల్లడికి అతి తక్కువగా, స్పష్టమయిన మినహాయింపులు ఉండటం, ప్రజాప్రయోజనాలరీత్యా సమాచారాన్ని వెల్లడిచేస్తే అధికారులకు రక్షణ కల్పించటం– ఇవన్నీ సమాచార చట్టంలో ఉండాలి. అన్నింటినీ మించి మరో సదుపాయం కల్పించాలి. శాసనసభ నుంచి సమాచారాన్ని దాచే సాహసాన్ని ప్రభుత్వాలు చేయవు. శాసనసభ్యులు తమ అధికారాలు, హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంటారు.

కాబట్టి శాసనసభకు అందించే సమాచారం అంతా ప్రజలకు కూడా వెల్లడయ్యేలా చట్టంలో నిర్దిష్ట ఏర్పాట్లు ఉంటే పౌరులకు సమాచార హక్కు నిరంతరం విస్తృతమవుతూ ఉంటుంది. ఇప్పుడు రాజకీయ పార్టీలు, పౌర సమాజం, పత్రికలు, ప్రచార సాధనాలు రెండు అంశాల మీద దృష్టిని సారించాలి. మొదటిది కంటితుడుపు చట్టంకాక నిజంగా ప్రజలకు పనికివచ్చేది, పాలకులకు జవాబుదారిగా చేసేది అయిన చట్టం వచ్చేలా పోరాడాలి. రెండోది, ఆ చట్టం సరిగ్గా అమలయ్యేలా, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకునేలా పౌరుల్ని తయారుచేయాలి. ఇల్లలకగానే పండగకాదు ఎన్నో చట్టాలు కాగితం మీద ఉన్నా, వాటి ప్రయోజనం శూన్యం. ప్రజలకు ఆ చట్టాలను వినియోగించుకోవటం తెలిసినప్పుడే చట్టాలవల్ల స్వేచ్ఛ వికసించి ప్రజాస్వామ్యం పునీతమవుతుంది. పాలన సమాచారహక్కు కేవలం ఒక చిన్న సంస్కరణకాదు. దాన్ని సాధిస్తే ప్రభుత్వ నిర్వహణ మొత్తం ప్రజలకు వెల్లడవుతుంది. మనంకట్టే పన్ను డబ్బుతో ప్రభుత్వం చేసే ఖర్చు, ఉద్యోగుల పనితీరు, చట్టాల అమలు, ప్రభుత్వాల నిర్ణయాలు– అన్నీ మనకు తెలిసే అవకాశం ఉంటుంది. పౌరులు ప్రభువులు కావాలంటే మంచి చట్టం వచ్చేలా, ఆ చట్టం సరిగ్గా అమలయ్యేలా పౌరసమాజం పోరాడాలి. అప్పటిదాకా పారదర్శకత కేవలం నేతల ప్రసంగాలలోనే కనిపిస్తుంది.

* * *

# అవ్యవస్థలను చక్కదిద్దుకోలేమా?

**నవంబర్ 21, 2005**

మన రాజకీయ వ్యవస్థ బలహీనతను సొమ్ము చేసుకొని సంఘటిత నేరగాళ్లు ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకోగలుగుతున్నారు... హింస, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు దేశంలో వేళ్లూనుకొని పోయాయి. మావోయిస్టుల కార్యకలాపాల విస్తృతి వాటిలో ముఖ్యమైనది. దేశంలో పదోవంతు భూభాగం సైద్ధాంతిక హింసతో తల్లడిల్లుతోంది. ఇతర చోట్ల కూడా వివిధ రకాల హింస చెలరేగుతోంది.

దిగ్భ్రాంతి కలిగించిన జెహానాబాద్ దురంతరం మన ప్రభుత్వ దౌర్బల్యాన్ని ఎండగట్టింది. శీఘ్ర ఆర్థిక వృద్ధి కోసం మనం పడుతున్న తపన ప్రభుత్వ వైఫల్యం వల్ల కొరగాకుండా పోయే ప్రమాదం ఉంది. ఇదెంతో ఆందోళన కలిగిస్తోంది. మనం ఇప్పుడు ఓ చిక్కు సమస్యను ఎదుర్కొంటున్నాం. సామాజిక ఉద్రిక్తలు తగ్గి, శాంతి-సామరస్యాలు వెల్లివిరియాలంటే త్వరితగతిన వృద్ధి సాధించాల్సి ఉంటుంది. కానీ, అస్థిరత, హింస, సామాజిక సంఘటర్షణ వల్ల వృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతోంది. ప్రాంతీయ, సామాజిక అసమానతలు మరింత పెరిగిపోరిగిపోతున్నాయి. ఈ విధంగా చూస్తే- భారత ఆర్థిక వ్యవస్త ఇప్పుడొక కూడలిలో ఉంది. అంతర్గత పరిస్థితుల్ని చక్కదిద్దుకోలేకపోతే అది పట్టాలు తప్పుతుంది. అవరోధాలు తొలగిస్తే పరుగిడుతుంది. రాజకీయ వ్యవస్థ ఎలా స్పందిస్తుందన్న దానిపై భవిష్యత్తు ఆధారపడి ఉంది. పరిస్థితిని యథాతథంగా కొనసాగనిద్దామా, లేక రాజకీయ స్వరూప-స్వభావాలు, ప్రభుత్వ పాత్రపై పునరాలోచన చేద్దామా?

రాజకీయ ప్రక్రియ, పరిపాలన ప్రమాణాలు, ఆర్థిక వృద్ధి సామాజిక సయోధ్య- ఇవి ఆధునిక సమాజంలో విడదీయలేనివి, జెహానాబాద్ సంఘటన నేర్పుతున్న అమూల్యమైన పాఠమిది. మైథిలీ భుస్సుర్మత్ చెప్పినట్లు- తీవ్ర అసమానతలు, రాజకీయ వైఫల్యాల దుష్పర్యవసానాల బారి నుంచి ఓ.ఇ.సి.డి (ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ) దేశాలు కూడా తప్పించుకోలేక పోయాయి. నిజమైన రాజకీయాలు గొప్ప తపస్సు వంటి. ఎందుకంటే- అవి మానవాళి సంతోషం కోసం ఉద్దేశించినవి. సమాజంలోని అన్ని వర్గాల ఉజ్వల భవిష్యత్తు కోసం జరిగే కృషిని అనుసంధానం

చేసే ప్రక్రియే రాజకీయాలు. లక్ష్యం సాధించాలంటే రాజకీయాలు రెండు కీలక లక్షణాలు కలిగి ఉండాల్సి ఉంటుంది. విభిన్న వర్గాల మధ్య సమరస్యం– సయోధ్య సాధించడం మొదటిది. ఆర్థిక, మానవ, సంస్థాగత వనరును హేతుబద్ధంగా కేటాయించడం రెండోది. రాజకీయాలను స్వలాభార్జనకు మార్గంగా దిగజార్చడంతో ప్రభుత్వం బలహీనపడిపోయింది. మన వ్యవస్థ చట్టబద్ధత నీరుగారింది. లక్షలమంది భవిష్యత్తు ప్రమాదంలో పడిపోయింది.

## నేరగాళ్లదే హవా

ఆధునిక, నాగరిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పాత్రను స్పష్టంగా నిర్వచించలేకపోయాం. ఫలితంగానే స్వాతంత్ర్యానంతరం మన రాజకీయాలు, ప్రజాపాలన వ్యవస్థ దారుణంగా విఫలమయ్యాయి. ఈ వైఫల్యం మూడు దుష్పర్యవసానాలకు దారితీసింది. మొదటిది–కీలక విధుల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైంది. ఎన్నో కొత్త కొత్త బాధ్యతలను నెత్తికెత్తుకుంది. కాని వాటిని సమర్థంగా నిర్వర్తించలేకపోయింది. దాంతో ప్రభుత్వ సత్తాకొడిగట్టింది. చట్టం చట్టుబండలైంది. కర్ర ఉన్నవాడిదే బర్రె అనే పరిస్థితి వచ్చింది. సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాల్లో హింసదే ముఖ్య భూమికగా మారింది. మన కోర్టుల్లో న్యాయం లభించక నిరాశా నిస్పృహలకు లోనైన ప్రజానీకం– మౌనంగా బాధ భరించడం లేదా డబ్బు పెట్టి న్యాయం కొనుక్కోవడానికి నేరగాళ్ల ముఠాలను, అవినీతిపరులైన పోలీసులను ఆశ్రయించడం రహస్యమేమీ కాదు. మన సమాజంలో ఇప్పుడు నేరగాళ్ల హవా నడుస్తోంది. మన రాజకీయ వ్యవస్థ బలహీనతను సొమ్ము చేసుకొని సంఘటిత నేరగాళ్లు ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకోగలుగుతున్నారు. పార్టీలకు ధనబలం, భుజబలం, కులబలం కావాలి. సాయుధ ముఠాల ద్వారానే ఇవి వాటికి లభిస్తాయి. ఇందుకు బదులుగా నేరగాళ్లు ప్రభుత్వ రక్షణ కోరుకొంటారు. చట్టాన్ని అమలు చేసే విభాగంపై నియంత్రణ కావాలంటారు. ఉభయతారకమైన ఈ ఏర్పాటు వల్ల యావత్ రాజకీయ వ్యవస్థ దిగ్భ్రమ గొలిపే స్థాయిలో నేరగ్రస్తమైపోయింది. మన ప్రజాస్వామిక వ్యవస్థకు, చట్టబద్ధపాలనకు తీవ్ర విఘాతం తగిలింది.

రెండోది– ఆర్థిక నిర్ణయాలు, సాధారణ వాణిజ్య లావాదేవీల్లో కూడా ప్రభుత్వం అతిగా జోక్యం చేసుకొంటోంది. ఫలితంగా– డబ్బు, హోదా, ప్రాపకంతో కూడుకొన్న రాజకీయాలు సాధారణమైపోయాయి. లైసెన్స్– పర్మిట్– కోటా రాజ్యంలో ప్రభుత్వ

అధికారుల ధనదాహం మితిమీరింది. స్వలాభాపేక్ష మామూలైపోయింది. భూమి రికార్డు పొందటం మొదలుకొని ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్)ను నమోదు చేయడం వరకు మౌలిక ప్రజాసేవలు అత్యధిక ప్రజానీకానికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. అధికార యంత్రాంగానికి కోరినంత డబ్బు ముట్టజెబితే తప్ప వారికి ఈ సదుపాయాలు దక్కడం లేదు. ప్రభుత్వాధికారుల్లో చాలామంది విషవలయంలో చిక్కుకొన్నారు. నిజాయతీపరులైన ఎంతో మంది సర్కారీ ఉద్యోగులు పరిస్థితిని చక్కదిద్దలేక నిస్సహాయులుగా ఉండిపోవలసివస్తోంది. అధికార పదవి అన్నది నేడు మార్కెట్ సరకుగా మారిపోయింది. ఏ విధంగానైనా సరే అధికారాన్ని అందుకోవడానికి భారీయెత్తున అక్రమ ధనాన్ని వ్యయం చేస్తున్నారు. అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే పరమావధిగా మారింది. రాజకీయాలు చేయడం పెద్ద వ్యాపారంగా తయారైంది. అధికార పదవి ప్రైవేటు సొత్తుగా మారింది. అధికారుల బదిలీలు, వివిధ లావాదేవీల్లో ముడుపులు, నేర పరిశోధన వ్యవస్థపై నియంత్రణ వంటివి అధికార దర్పానికి ఆనవాళ్ళుగా మారాయి. అధికారాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేయడం వల్ల ప్రభుత్వం చట్టబద్ధమైన పాలన అందించలేకపోతోంది. ప్రభుత్వ పాలన యంత్రాంగం అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. దానివల్ల హింస, అస్థిరత మరింత పెరుగుతున్నాయి. స్థానిక పరిస్థితులను బట్టి అనేక రకాలుగా హింస చెలరేగుతోంది. ప్రభుత్వ వ్యవస్థ చట్ట వ్యతిరేక వ్యవహార శైలే ఈ అరాచకత్వానికి, తుపాకి సంస్కృతికి మూలకారణం.

చివరగా– ప్రజా సేవలు, విద్య, ఆరోగ్య రంగాలకు సహేతుకంగా వనరుల కేటాయింపు, నిర్వహణలో ప్రభుత్వం విఫలం కావడంతో– ఈ రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయి. గ్రామసీమల్లోని కొన్ని వేలు, లక్షల మంది బాలల ఆశలు 1960ల వరకు కూడా సజీవంగానే ఉండేవి. నిలదొక్కుకునే అవకాశాలు ఉండేవి. భవిష్యత్తుపై నమ్మకం ఉండేది. పేదరికం కూడా ఇంత దుర్భరంగా ఉండేదికాదు. అంతంత మాత్రమే చదువుకొన్నవారు సైతం పెద్దగా నైపుణ్యం లేకపోయినా సంపద సృష్టిలో పాలుపంచుకొనేవారు. నిజానికి–మనిషి అవసరాలను తీర్చే వస్తూత్పత్తి, సేవల కల్పనలోనే నిజమైన సంపద ఇమిడి ఉంది. దేశంలో చదువుకున్న నిరుద్యోగ యువకుల సంఖ్య ప్రస్తుతం రెండు కోట్లకు పైనే. హింసకు, అరాచకత్వానికి ఈ భారీ నిరుద్యోగిత కారణమవుతోంది.

హింస, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు దేశంలో వేళ్లూనుకొని పోయాయి. మావోయిస్టుల కార్యకలాపాల విస్తృతి వాటిలో ముఖ్యమైనది. దేశంలో పదోవంతు భూభాగం సైద్ధాంతిక హింసతో తల్లడిల్లుతోంది. ఇతర చోట్ల వివిధ రకాల హింస చెలరేగుతోంది. కానీ వాటికి కారణాలు ఒకే విధమైనవి. హింస చెలరేగిన చోట్ల శాంతి భద్రతల పునరుద్ధరణకు స్వల్పకాలిక చర్యలు అవసరమే. కానీ – అసలు రుగ్మతకు అది సరైన చికిత్స కాదు. మరి సమస్య పరిష్కారమవుతుందని మనం ఆశించడానికి సరైన కారణాలు ఉన్నాయా? భేషుగ్గా ఉన్నాయి. దేశంలోని అనేక ప్రాంతాలు ఇంకా వెనకబడే ఉన్నప్పటికీ, ఇంతకు ముందు ఎన్నడూ లేనంత వేగంతో ఆర్థిక వృద్ధి సాధిస్తున్నాం. విస్తృతమవుతున్న మధ్య తరగతి, సమాచార విప్లవం, పెరుగుతున్న యువశక్తి– పరివర్తనకు ప్రధానంగా దోహదపడుతున్నాయి. ప్రభుత్వ వ్యవస్థలు చతికిలపడినప్పటికీ, ప్రజాస్వామిక ప్రక్రియ ప్రాభవం కోల్పోలేదని ఎప్పటికప్పుడు రుజువవుతూనేవుంది. మన రాజకీయ, సామాజిక వ్యవస్థల్లో గొప్ప మార్పు తేవడానికి అవసరమైన సుస్థిరతను, సావకాశాన్ని ఈ అంశాలు మనకు కల్పిస్తున్నాయి.

## సంస్కరణలకు బాట వేయాలి

మనం ఏమి చేయాలన్నది ముజేతి కంకణం. మొట్టమొదట చట్టబద్ధపాలన ప్రాధాన్యాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. చట్టాన్ని అమలు పరచినంత మాత్రాన, లేక ఆధునిక మారణాయుధాలను భారీగా సమకూర్చుకొన్నంత మాత్రాన చట్టబద్ధపాలన సాధించినట్లు కాదు. శాంతి భద్రతలు, చట్టం– న్యాయం, నిష్పాక్షిక– సమర్థ నేరపరిశోధన– ఇవన్నీ కలిస్తేనే చట్టబద్ధ పాలన. సత్వర సమర్థ న్యాయం కోసం సమగ్ర న్యాయసంస్కరణలు, జవాబుదారి కలిగిన స్వతంత్ర నేర పరిశోధన; పోలీసు దళారులను ఆదునికీకరించడం– అవి మానవత్వంతో వ్యవహరించేలా చూడటం; అల్లర్లు చెలరేగినప్పుడు తక్షణం రంగప్రవేశం చేసి పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చే సత్తా; శాంతి భద్రతలను కాపాడేందుకు సమీకృత చర్యలు... మన సమాజంలో చట్టబద్ధపాలన పునరుద్ధరణకు అవసరమయ్యే మూలస్తంభాలివి. రెండోది– పక్కదోవ పట్టిన ప్రజాస్వామిక రాజకీయాలను క్రమానుగత సంస్కరణల ద్వారా సమర్థంగా తిరిగి పట్టాలకెక్కించాల్సిన అవసరం ఉంది. రాజకీయాలు, పరిపాలన వ్యవస్థల నుంచి ఆర్థిక రంగం కానీ, సమాజం కానీ రక్షణ పొందలేవు. ప్రోత్సాహకాల ప్రాథమ్యాలు మార్చాలి. సమగ్రతను పెంపొందించాలి. ప్రతిభకే పట్టం కట్టాలి.

ఉత్తమ సేవలు అందించాలి. ఇందుకు దోహదపడే రాజకీయ వ్యవస్థే నేడు మనకు అవసరం. ప్రస్తుత రాజకీయ అవ్యవస్థ స్థానే సరికొత్త పరిపాలన సంస్కృతిని నెలకొల్పాలి. అధికార వికేంద్రీకరణ, కీలక రంగాల్లో దేశీయ పరిజ్ఞానం, ప్రతి స్థాయిలో జవాబుదారితో కూడుకున్న అధికారానికి వీలు కల్పించే పరిపాలన సంస్కరణలే దీర్ఘకాలంలో సత్ఫలితాలు ఇస్తాయి. వృద్ధికి నిరోధకాలుగా కాకుండా ప్రేరకాలుగా పనిచేస్తాయి. చివరగా– విద్య ఆరోగ్యం, మౌలిక రంగాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించాలి. భారీ పెట్టుబడులు; సేవలను సంబంధించి స్వరూప- స్వభావాల్లో సమగ్ర మార్పులు– చేర్పులు; సమర్థమైన, వృత్తిపరమైన నిర్వహణ; జవాబుదారీతనం కోసం సరికొత్త పద్ధతులు, పోటీ వాతావరణం; పౌరులకు భాగస్వాములకు తగినన్ని అధికారాల కల్పన– ఇవి ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు కావాలి. ఒక జాతిగా ఇవన్నీ సాధించే సత్తా మనకు ఉంది. దేశాన్ని పునరుత్తేజితం చేయడమే మన తక్షణ కర్తవ్యం.

* * *

# ఖర్చులేని సంస్కరణల్తో మంచిపాలనకు శ్రీకారం

**జనవరి 18, 1999**

దాపరికం లేకుండా, సామాన్యులకు అందుబాటులో, జవాబుదారీగా ఉండే పాలన అవసరమని అన్ని పార్టీలవారూ అంగీకరిస్తున్నారు. ఆచరణలోకి వచ్చేసరికి మాత్రం వెనుకాడుతున్నారు. కబుర్లతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. రాజకీయ పార్టీలను సంస్కరించాలన్నా, ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగి మంచివారు సాయకత్వంలోకి రావాలన్నా- జాతీయ స్థాయిలో పార్లమెంటు చట్టం చేస్తేనే సాధ్యమవుతాయి. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్నిర్వచించాలన్నా రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. అందుకు పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతులమంది ఆమోదంతోపాటు, కనీసం సగం రాష్ట్రాల శాసనసభల మద్దతు ఉండాలి. నిజాయితీగా పరిపాలించగల సుస్థిర ప్రభుత్వాల ఏర్పాటుకు తగిన సంస్కరణల కోసం కూడా రాజ్యాంగ సవరణలు తప్పవు. ప్రజలకు సకాలంలో న్యాయం అందాలంటే, కొన్ని కేంద్ర చట్టాలతోపాటు, కొంత మేరకు రాజ్యాంగాన్ని సవరించాల్సి రావచ్చు. నిష్పాక్షికంగా రాజ్యాంగ సంస్థ నియామకాలు జరగడానికి, పలు విధాల అధికార దుర్వినియోగాన్ని నివారించడానికి కేంద్ర చట్టాలు మార్చాలి; ఒక్కో సందర్భంలో రాజ్యాంగాన్ని కూడా మార్చవలసి వస్తుంది.

## పౌర హక్కుల పత్రాలు-సమాచార హక్కు

ప్రస్తుత పరిస్థితులలో అసలు లోక్‌సభలలో మెజారిటీ సభ్యుల మద్ధతుతో ప్రభుత్వం ఏర్పాటు కావడమే గగనమైపోతోంది. ఏదో రకంగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటయినా అది తుమ్మితే ఊడే ముక్కులా మూన్నాళ్ల ముచ్చటయిపోతున్నది. ఇటీవలి కాలంలో పలు సంఘటనలు ప్రభుత్వాల ఆశక్తతకు అద్దంపడుతున్నాయి. లోక్‌సభలో ఏపార్టీ కాదన్నాబిల్లులు ప్రవేశపెట్టటమే కష్టసాధ్యమవుతున్నది. మహిళలకు చట్టసభలలో మూడో వంతు సీట్లు కేటాయించాలనే ప్రతిపాదనను గుజ్రాల్ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టలేకపోయింది. అలాగే ఇన్సూరెన్సు ప్రైవేటీకరణ, విద్యుత్‌రంగం సంస్కరణలు, ప్రసార భారతి, పేటెంట్ల బిల్లుల విషయంలో ప్రభుత్వాలు పడుతున్న

అగచాట్లు అందరికీ తెలుసు. పార్లమెంటరీ వ్యవస్థలో ఉన్న అతి ముఖ్యమైన సౌలభ్యం ఏమంటే; ప్రభుత్వానికి చట్టసభలో మెజారిటీ మద్దతు ఉంటుంది. కాబట్టి సునాయాసంగా చట్టాలను ప్రతిపాదించి ఆమోదించవచ్చు. అసలు సభలో చట్టం ప్రతిపాదనను ప్రవేశపెట్టడమే అసాధ్యమైతే పార్లమెంటరీ వ్యవస్థ ఉనికే ప్రమాదంలో పడ్డట్టు లెక్క! అతికష్టం మీద ప్రతిపాదన లోక్‌సభ ఆమోదం పొందినా, ఎగువ సభ అయిన రాజ్యసభ కూడా ఆమోదించనిదే అది చట్టం కాదు. ఒక్క ఆర్థిక సంబంధ విషయాలలో మాత్రమే రాజ్యసభ అంగీకరించినా, అంగీకరించకపోయినా చట్టాలు చేయడం సాధ్యం కాదు. ఈ పరిస్థితుల్లో ఎంత అత్యవసరమైనా రాజ్యాంగ సవరణలకు ప్రయత్నించడం దుస్సాహసమే. అవుతుంది. గుజ్రాల్, వాజ్‌పేయి ప్రభుత్వాలు మహిళా బిల్లును ప్రవేశపెట్టటం కంటితుడుపు వ్యవహారమేగాని నిజంగా ఫలితాలను ఆశించి కాదు. ఫలితం లేకపోయినా సరే, ఏదో చేయటానికి ప్రయత్నిస్తున్నారని ప్రజలల్లో భ్రమ కల్పించటమే ఇలాంటి ప్రయత్నాల వెనుక అసలు కిటుకు! ఈ సందర్భంలో ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మామూలు పరిపాలనే ఇంత దినదినగండంగా నడుస్తున్నప్పుడు ఇక దేశంలో శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా పాలనా సంస్కరణలకు అవకాశమేది? దేశం ఇలా కుంగిపోవలసిందేనా? 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టే తరుణంలో భారత ప్రజలు మిగిలిన ప్రపంచం ముందు తలలు దించుకోవలసిందేనా? పాలన బాగుపడుతుందని ప్రజలు ఆశించటం వ్యర్థమేనా? కాస్త పరికించి చూస్తే అలాంటి నిర్వేదం అక్కరలేదని, మంచి ఫలితాల్ని ఇవ్వగల పాలనా సంస్కరణలకు ఎన్నో మార్గాలున్నాయని గోచరిస్తుంది. ఇంతటి సంక్షోభంలోనూ సాధించగల సంస్కరణల గురించి కొంచెం నిశితంగా పరిశీలించాలి. ప్రస్తుత పరిస్థితులలో జాతీయ స్థాయిలో మార్పులు సాధ్యం కానందున స్థానికంగా, రాష్ట్ర స్థాయిలో చేపట్టగలిగిన మార్పుల మీద దృష్టి సారించటం శ్రేయస్కరం. కేంద్రంలో ప్రభుత్వాలు ఎంత పేలవంగా, బలహీనంగా, అస్థిరంగా ఉన్నా రాష్ట్రాలలో మటుకు చాలా వరకు సుస్థిర ప్రభుత్వాలే ఏర్పడుతున్నాయి. రాష్ట్రాలలో చిక్కు ఏమంటే, ఏ సంస్కరణ చేపట్టినా దానివల్ల ఖజానామీద బరువు పడగూడదు. దాదాపు అన్ని రాష్ట్రాలు దివాళాతీసే పరిస్థితులలో ఉన్నాయి. పలువురు నాయకులు, అధికారులు రాజభోగాలనుభవిస్తూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాలు మాత్రం ఖాళీగా ఉంటున్నాయి. పన్నులు ఇప్పటికే గరిష్ఠస్థాయికి చేరుకున్నందున డబ్బు ఖర్చయ్యే సంస్కరణలు ఎంత మంచివి ప్రతిపాదించినా ప్రయోజనం ఉండదు. అరిచి గీపెట్టినా

కానీ రాలకపోవటంతో, చాలా మంది ప్రతిపాదనలు కూడా కాగితాలకు, ఉపన్యాసాలకు పరిమితమవుతున్నాయి. అందువల్ల ఖర్చులేని సంస్కరణలపై దృష్టి సారించాలి. ఎంత ఖర్చు లేని సంస్కరణలయినా సరే– విషయంలో అన్ని వర్గాలు, పార్టీల మధ్య సయోధ్య లేకపోతే అమలు చేయడం కుదరదు. అందుకే పార్టీలన్నీ అంగీకరించగల, ప్రజలలో అన్ని వర్గాలవారు ఆమోదించగల సంస్కరణల్ని చట్ట రూపంలో తెచ్చి అమలు చేయాలి. ఎలాంటి సంస్కరణలు చేపట్టినా ఏదో చేసినట్లు కనిపించటం కాక, నిజంగా వాటి అమలువల్ల రాజ్య వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చి, ప్రజలకు మంచి పరిపాలన అందే మార్గం సుగమం కావాలి. ఈ లక్షణాలున్న సంస్కరణలు అసలు ఏమైనా ఉన్నాయా? కాస్త విషయ పరిజ్ఞానం, చిత్తశుద్ధి లోతైన ఆలోచన ఉంటే రాష్ట్రంలో అమలు చేయడానికి ఇలాంటి లక్షణాలున్న సంస్కరణలు ఎన్నో కానవస్తాయి. ఉదాహరణకు పౌరహక్కుల పత్రాలు– సిటిజన్స్ చార్టర్లు. చాలా ఏళ్లుగా ప్రభుత్వాలు ఇలాంటి పౌరపత్రాలు తెస్తామని కబుర్లు చెబుతున్నాగాని; ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే పెద్దలకు అసలు అవేమిటో స్పష్టంగా తెలియవు. తెలిసినా, వాటిని ఎలా రూపొందించాలో, ఏ విధంగా అమలు చెయ్యాలో సుతరామూ తెలియదు! అందుకే ప్రభుత్వాలు యథాప్రకారం కబుర్లతో కడుపు నింపుతున్నాయి. పౌరహక్కుల పత్రం అంటే ప్రభుత్వ సేవలు సరిగ్గా అందేలా, వాటిలో జవాబుదారీతనం ఉండేలా ప్రజలకు చట్టబద్ధ హక్కుల్ని కలిగించే పత్రం. బ్రిటన్‌లో జాన్‌మేజర్ ప్రభుత్వం ఈ దశాబ్దంలోనే మొదటిగా సిటిజన్స్ చార్టర్లను ప్రవేశపెట్టింది. వాటి ద్వారా ప్రతి ప్రభుత్వ సేవ విషయంలోను నిర్దిష్ట వివరాలు పొందుపరిచి ప్రజలకు చట్టబద్ధ హక్కుల్ని కల్పించారు. (1) ఆయా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే వ్యక్తి/ వ్యక్తులు ఎవరు? (2) సేవ ప్రజలకు ఏయే ప్రమాణాలతో అందాలి? ఉదాహరణకు– జనన సర్టిఫికేట్ కావాలంటే. ఎంత కాలంలో, ఏ రూపంలో, ఏయే సమాచారాలతో ఇస్తారు? దీనికి సంబంధించిన ప్రమాణాల ప్రకారం సేవలను అందిస్తామని చట్టబద్ధ హామీని ఇవ్వాలి. (3) ఆ సేవను హామీ ఇచ్చిన విధంగా అందించలేకపోతే, పౌరులకిచ్చే పరిహారం ఏమిటి? అందించని వ్యక్తులకు పడే శిక్ష ఏమిటి? –ప్రతి ప్రభుత్వ సేవ విషయంలో ఈ విధంగా పత్రాలు రూపొందించి వాటికి చట్టరూపం వచ్చి ప్రకటించాలి. అదే సిటిజన్స్ చార్టర్. అలాగే చాలా కాలంగా ప్రచారమవుతున్న సంస్కరణ– ప్రజలకు పాలనా సమాచార హక్కు నిరంతరం అన్ని పాలనా వ్యవహారాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుకునే హక్కు పౌరులకు చట్టబద్ధంగా కల్పించాలి. ప్రజలకు

పాలనా సమాచారం అందించే బాధ్యతను ఉల్లంఘించినా, ఉద్దేశపూర్వకంగా రహస్యాలను దాచినా, అలాంటివారికి శిక్ష విధించడమేగా, పౌరులకు నష్టపరిహారం అందాలి.

## స్థానిక ప్రభుత్వాలకు ప్రాధాన్యం

స్థానికంగా నిర్దిష్ట బాధ్యతలు, అందుకు తగ్గ వనరులు, ఆ విషయాలను చూసే ప్రభుత్వోద్యోగుల మీద అజమాయిషీ- ఈ మూడింటినీ స్థానిక ప్రభుత్వాలకు అప్పజెప్పాలి. ఈ రకమైన అధికార విభజనలను పంచాయతీరాజ్, మునిసిపాల్టీల చట్టాల మార్పుతో రాష్ట్ర స్థాయిలోనే సాధించవచ్చును. రాష్ట్రంలో సులభంగా చేపట్టగల మరో సంస్కరణ, ప్రభుత్వ సేవల అవసరం ఉన్న లబ్ధిదారులకు వాటికి సంబంధించిన బాధ్యతను, అజమాయిషీని అప్పగించటం, ఇటీవల నీరుపారుదల రంగంలో సాగునీటి సంఘాల ద్వారా ఒకమేరకు ఈ ప్రయత్నం జరిగింది. అలాగే కొన్ని లోపాలున్నా, విద్యాకమిటీల ద్వారా పాఠశాలల బాధ్యతను విద్యార్థుల తల్లిదండ్రులకిచ్చారు. వీటిలో లోపాలను సవరించటంతోపాటు, నిర్దిష్టంగా లబ్దిదారులను గుర్తించగల ఇతర రంగాలకూ ఈ పద్ధతిని విస్తరించాలి. ఉదాహరణకు మార్కెట్ కమిటీలు పూర్తిగా ప్రభుత్వం నియమించిన వారి అధీనంలో ఉన్నాయి. అలాగే రేషన్‌షాపులు, మునిసిపల్ వార్డుల స్థాయిలో పౌర సేవలు- వీటిపై అక్కడి లబ్దిదారులకే అజమాయిషీ ఉండాలి. మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ ప్రభుత్వం పాలనా సమాచార హక్కు కల్పిస్తూ చట్టం వేసింది. ప్రజలకు ప్రాథమిక విద్య గారంటీ పథకాన్ని- విద్యా హామీ పథకం (ఇ.జి.ఎస్) పేరిట అమలు చేసి 18నెలల కాలంలో 19వేల పైచిలుకు ప్రాథమిక పాఠశాలల్ని అతి తక్కువ ఖర్చుతో, స్థానిక ప్రజల తోడ్పాటుతో ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్‌లో చేపట్టిన మరో మంచి సంస్కరణ- స్థానికంగా సత్వర న్యాయం అందించటానికి వీలుగా గ్రామీణ కోర్టుల ఏర్పాటుకు చట్టం. 1995లో ఎన్.టి.ఆర్ ప్రభుత్వం ఇదే లక్ష్యంతో న్యాయ పంచాయతీల చట్టాన్ని శాసనసభలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇదే లక్ష్యంతో న్యాయ పంచాయతీల చట్టాన్ని శాసనసభలలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపింది. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని మళ్లీ వెనక్కి తీసుకుంది. అందులో కొన్ని అంశాలపై వివాదాలుండవచ్చు. వాటిని మార్చి స్థానిక న్యాయస్థానాలు పూర్తిగా న్యాయ వ్యవస్థ అధీనంలో ఉండేలా మార్పులు చేసి చట్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ప్రస్తుతం ఆ ఊసే లేదు.

చిత్తశుద్ధి, ఆలోచన, ముందు చూపు ఉంటే ఇలా రాష్ట్ర, స్థానిక స్థాయిలలో చేపట్టటానికి వీలున్న సంస్కరణలెన్నో ఉన్నాయి. ప్రభుత్వాలలో ఉన్నవారికి ప్రజలగోడు అంతగా పట్టదు. అప్పుడప్పుడు పత్రికలలో పతాక శీర్షికలలో వార్తలు రావాలన్న మక్కువే తప్ప, నిజంగా మంచి పాలనను ప్రజలకందించాలన్న ధ్యాస ఉండదు. ప్రజలు తామే ఈ విషయాలపై దృష్టి సారించి అవినీతిని తగ్గించే సులభమైన సంస్కరణల కోసం ఉద్యమించాలి. వీటిని సాధించినప్పుడే నిజమయిన స్వరాజ్యానికి చేరువ అవుతాం.

* * *

# జేపీ స్మృతి కరదీపికగా మరో స్వాతంత్ర్య పోరాటం

**డిసెంబర్ 28, 1998**

దివంగతులు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కు భారతరత్న పురస్కారం ఇస్తున్నట్లు రాష్ట్రపతి గత వారం ప్రకటించారు. 1970 దశకంలో యువకులుగా ఉన్న ఒక తరాన్ని లోక్‌నాయక్ భావాలు ఉద్యమాలు తీవ్రంగా ప్రభావితం చేశాయి. భారతరత్న వార్త వినగానే నా మనస్సులో ఎన్నో స్మృతులు, ఆలోచనలు, ఊహలు మెదిలాయి. 1971లో గరీబీ హఠావో నినాదంతో ఇందిరాగాంధీ ఎదురులేని అధికారాన్ని పొందటం, 1973 కల్లా ప్రజలలో నిరసన పెరగడం ఆ దశాబ్ది పోరాటాలకి నాంది. అంతులేని అవినీతి, అపరిమిత అధికార కేంద్రీకరణ, అర్థం లేని వ్యక్తి ఆరాధన ఇందిరాగాంధీ పాలనకు చిహ్నాలయ్యాయి. అరచేతిలో స్వర్గం చూపించటం, వాగ్దానాలతో మభ్యపెట్టటం, ఆ తరువాత రాజకీయంలో అంతర్భాగమయ్యాయి. అదే సమయంలో రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను తుంగలో తొక్కారు. అర్థం పర్థం లేని అభద్రతా భావం వల్ల ఇందిరాగాంధీ ప్రతిచోటా శత్రువులను, కుట్రలను ఊహించుకున్నారు. ఎక్కడ ఏం జరిగినా 'విదేశీ హస్తం' గూర్చి మాట్లాడారు. 'అస్మదీయుల్ని', అవినీతిపరుల్ని అందలాలెక్కించారు. ధిక్కరించిన వారిని శంకరగిరి మాన్యాలు పట్టించారు. ప్రజల జీవన స్థితిగతులు మాత్రం ఏమీ మారలేదు. ఆ నేపథ్యంలో ముందు గుజరాత్‌లో నవనిర్మాణ సమితి పేరుతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థుల ప్రధాన శక్తిగా ప్రజా ఉద్యమం చెలరేగింది. ఆ వెంటనే బీహార్‌లో విద్యార్థులు, పేద ప్రజలు ఉద్యమించారు. రాజకీయాల నుంచి చాలాకాలం దూరంగా ఉండిన సర్వోదయ ఉద్యమకారుడు జయప్రకాశ్ నారాయణ్ పరిస్థితుల ప్రభావం వల్ల ప్రజా ఉద్యమానికి నాయకులయ్యారు.

## దుష్పరిపాలన పట్ల నిరసన

1971లో చిన్నతనంలో ఇందిరాగాంధీ పిలుపు విని, ఆమె వాగ్దానాలకు ముగ్ధులైన చాలా మంది 1973 కల్లా కళ్లు తెరిచి దేశానికి జరుగుతున్న హానిని,

ప్రజాస్వామ్యానికి జరుగుతున్న కీడును కొంత అర్థం చేసుకోగలిగారు. ప్రజా ఉద్యమాల వెనక ఉన్న జనం ఆర్తిని, ఆవేదనని అర్థం చేసుకుని పరిష్కారం వెతకాల్సిందిపోయి దమననీతితో ప్రజలను అణచివేయాలని ప్రయత్నించడంతో ఇందిరాగాంధీ పాలన పట్ల చాలా మందికి జుగుప్స పెరిగింది. ఏకవ్యక్తి పాలన, కాంగ్రెస్ 'నాయకుల' లజ్జారహిత ప్రవర్తన స్వేచ్ఛా ప్రియులకు బాధ కలిగించాయి. ఆ పరిస్థితులలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ (జే.పీ.) 'సంపూర్ణ విప్లవం' పిలుపు ఎందరినో ముఖ్యంగా యువతరాన్ని ఆకర్షించింది. మహోదాత్తమయిన వ్యక్తిత్వం, మూర్తీభవించిన సౌజన్యం పుణికిపుచ్చుకున్న జే.పీ. నాయకత్వం విద్యార్థి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. జె.పి. మీద ఇందిరాగాంధీ ఘాట విమర్శలు ఆ ఉద్యమాన్ని నీరుగార్చలేకపోగా, మరింత బలపరిచాయి. ఎవరు ధర్మం కోసం పోరాడుతున్నారో, ఎవరు అధర్మం పక్షాన నిలబడుతున్నారో ప్రజలు చాలా సులభంగా పోల్చుకోగలిగారు. అదే కాలంలో అమెరికాలో వాటర్‌గేట్ కుంభకోణం బయటపడింది. అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ మన నేతలతో పోలిస్తే చాలా చిన్న తప్పిదాలే చేశాడు. అక్కడి పత్రికలు అమెరికన్ కాంగ్రెస్ (చట్టసభలు) దాన్ని తీవ్రంగా పట్టించుకొని కూపీలు లాగాయి. జనం విపరీతంగా స్పందించారు. క్రమక్రమంగా నిక్సన్ అధికార దుర్వినియోగం చేసినట్లుగా సాక్ష్యాలు బయటపడ్డాయి. 1974 ఆగస్టులో చివరికి పదవీచ్యుతి తప్పదని తేలటంతో, లక్షలాది ప్రజల నిరసనకుతలొగ్గి రిచర్డ్ నిక్సన్ రాజీనామా చేశారు. ఉపాధ్యక్షుడు స్పైరో ఆగ్న్యూ అవినీతి ఆరోపణలపైన అంతకుముందే రాజీనామా చేయవలసి వచ్చింది. చివరికి ఎన్నిక కాని ఉపాధ్యక్షుడు జెరాల్డ్ ఫోర్డ్ అమెరికా అధ్యక్షుడు పదవిని చేపట్టారు. వియత్నాం యుద్ధం కారణంగా అమెరికా అంటే నాటి యువతరంలో చాలా మందికి కోపం ఉండేది. అయినా అత్యంత శక్తిమంతుడయిన అధ్యక్షుడు తప్పుచేయగానే పదవీచ్యుతి చేసిన వ్యవస్థ పట్ల, ప్రజల చైతన్యం పట్ల సహజంగానే గౌరవం పెరిగింది. అంతకు కొన్ని వందల రెట్ల ఘోరాలు చేస్తూ, అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ, అవినీతికి పాల్పడుతూ, విశృంఖలంగా, యథేచ్ఛగా, పాతకాలం రాజుల్లాగా విర్రవీగుతున్న ఇక్కడి నేతలను చూస్తే ఎంతటి దుష్ట పాలనని అనుభవిస్తున్నామో ఆలోచనాపరులకు అవగతమైంది. గుజరాత్ ఉద్యమం ఓ కొలిక్కి వచ్చి మొరార్జీదేవాయ్‌ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అసెంబ్లీని రద్దు చేయక తప్పలేదు. 1975 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్ గద్దె దిగారు. బాబూభాయ్ పటేల్ నాయకత్వంలో

కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. ఈ పరిస్థితులలో 1975 జూన్ 12న అలాహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా రాయబరేలీలో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చారు. తన పదవిని కాపాడుకోవడానికి 1975 జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించారు. తరువాత బయటపడింది కనీసం మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా ఎమర్జెన్సీ ప్రతిపాదన రాష్ట్రపతి దగ్గరికీ వెళ్లిందనీ, అప్పుడు రాష్ట్రపతిగా ఉన్న ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ కనీసం ఎందుకు ఎమర్జెన్సీ విధించారో తెలుసుకోకుండా, మంత్రివర్గ ఆమోదం ఉందో లేదో పరిశీలించకుండా గుడ్డిగా సంతకం పెట్టారనీ! ఆ అర్ధరాత్రి బి.బి.సి. వింటుంటే ఎమర్జెన్సీ విషయం తెలిసింది!రాత్రికి రాత్రే దాదాపు లక్ష మందిని అంతరంగిక భద్రతా చట్టం (మీసా) కింద నిర్బంధంలోకి తీసుకున్నారు. నాజీ పోలీసుల స్థాయిలో అర్ధరాత్రి తలుపు చప్పుళ్లు, ఏమవుతోందో తెలుసుకునే లోపే అరెస్టులు జరిగాయి! ఎందరో యువకులు ఆగ్రహంతో ఊగిపోయారు. జె.పి. పిలుపునివ్వగలిగితే, స్వేచ్ఛ కోసం వేల మంది ప్రాణాలిచ్చేవారు! అంతటి ఉద్రేకం, ఆదర్శం, స్వేచ్ఛాప్రియత్వం నాటి యువతరం నరాల్లో ఉప్పొంగాయి. ప్రభుత్వం విధించిన సెన్సారుషిప్ పుణ్యమా అని పత్రికల్లో వార్తలే తెలిసేవి కావు. రేడియోలో ఇందిరాగాంధీ భజనలు తప్ప మరో అంశమే ఉండేది కాదు. చివరికి అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు దేవకాంత బారువా “ఇందిరా ఈజ్ ఇండియా, ఇండియా ఈజ్ ఇందిరా’ అని స్తోత్రం చేసి, 5000 సంవత్సరాల అవిచ్ఛిన్న చరిత్ర గల దేశానికి ఎన్నటికీ మరిచిపోలేని తలవంపులు తెచ్చాడు. యువరాజుగా సంజయ్‌గాంధీ వెలుగొందాడు. అతడొక రాజ్యాంగాతీత శక్తిగా రంగప్రవేశం చేసి కేంద్ర మంత్రులను, ముఖ్యమంత్రులను పాదాక్రాంతులని చేసుకున్నాడు. జుగుప్సకరమైన భజనలు, స్తోత్రాలు, వందిమాగధుల పొగడ్తలు, నయవంచకుల దాసోహాలు, ఎన్నో పత్రికల స్వయం సెన్సార్‌షిప్పులు భరించరానివిగా తయారయ్యాయి. అదే సమయంలో అసమాన ధైర్యంతో నిరంకుశత్వాన్ని ఎదిరించిన ధీరులున్నారు. నిర్భయంగా వీలైనంత మేరకు వాస్తవాన్ని ప్రజలకందించిన కొన్ని పత్రికలున్నాయి. అధికారంలో అధిక సంఖ్యాకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రభుత్వం మోచేతి నీళ్లు తాగే వాళ్లలాగా, కిరాయిగూండలలా ప్రవర్తించారు. ఎమర్జెన్సీ అండతోస్వంత లాభం కోసం పని చేశారు. కొందరు సమర్థులయిన అధికారులు ఎమర్జెన్సీలో తాతత్కాలికంగా ఏ ఆటంకం లేకుండా కొంత మంచిని కూడా సాధించారు. కాని, తరువాతి కాలంలో అద్వానీ

పాత్రికేయులనుద్దేశించి అన్నట్లుగా “చాలా మంది ఒదిగి ఉండమని ఆదేశిస్తే, నేల మీద పాకటానికి సిద్ధపడ్డారు”. జైలులో జె.పి. ఆరోగ్యం కొద్ది నెలల్లోనే క్షీణించింది. మూత్రపిండాలు పాడయ్యాయి. ఆయన్ని విడుదల చేశారు. ఎంత కాలం ఎమర్జెన్సీ కొనసాగుతుందో తెలియక జనం విలవిల్లాడారు. పార్లమెంట్ తన పదవీకాలన్ని తానే పెంచుకుంది. 1976 మార్చిలోగా జరగవలసిన పార్లమెంట్, శాసనసభల ఎన్నికలు వాయిదా పడ్డాయి. దేశంలో ఇక ఎన్నికలు జరుగుతాయో లేదోననే శంక చాల మందిని వేధించింది. భారతదేశం పూర్తిస్థాయి ఏకవ్యక్తి నియంతృత్వానికి గురయ్యింది. జార్జి ఫెర్నాండెజ్ వంటి వారు కొంతకాలం బయట వీరోచిత పోరాటం చేసి చివరికి అరెస్టయ్యారు. అలాంటి వారు బతికి బట్టకడతారో లేదో తెలియని పరిస్థితి దాపురించింది. జైళ్లల్లో మగ్గుతున్న కొందరు ప్రతిపక్షాల నాయకులు ధైర్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. 1977 ప్రారంభంలో ఇందిరాగాంధీ హఠాత్తుగా ఎన్నికలు ప్రకటించారు. ఎమర్జెన్సీ కొనసాగిస్తూనే జైళ్లలోంచి కొందరు నాయకులను విడుదల చేశారు. కొన్ని స్వేచ్ఛలను పునరుద్ధరించారు. పత్రికల సెన్సార్షిప్‌ను సడలించారు. వెంటనే జగజ్జీవనరాం, హేమవతీనందన్ బహుగుణ కాంగ్రెస్‌ను వదలి ‘కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ’ని స్థాపించారు. జైళ్ళ నుంచి బయటకు వచ్చిన ప్రతిపక్ష నాయకులు ఏకమై జె.పి. ఆశీస్సులతో జనతా పార్టీని స్థాపించారు. ఎన్నికలలో సమైక్యంగా పోటీ చేసి ఉత్తరాదిన కాంగ్రెస్‌ను మట్టికరిపించారు. 1977 మార్చి 21న వెలువడ్డ ఎన్నికల ఫలితాలతో ఢిల్లీ నగరానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరం వరకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేక పోయింది. ఇందిరాగాంధీ స్వయంగా రాయబరేలీలో ఓడిపోయారు. ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ ఓటమిపాలయ్యారు. కొన్ని పత్రికలు 1977 మార్చిలో కూడా అబద్ధాలు ప్రచారం చేసి పాలకపక్షానికి బాకాలుగా పనిచేసి శాశ్వత అపకీర్తిని మూటగట్టుకున్నాయి. జనతా పార్టీ అధికారంలోకి వచ్చి నియంతృత్వానికి అంతం పలికింది. ఇంతా చేసి, ఆటగాళ్లు మారారు గాని, ఆట నియమాలు కొనసాగాయని త్వరలోనే తెలిసిపోయింది. నియంతృత్వం నశించిందిగాని పాలన మెరుగుడపలేదు. అనతికాలంలోనే జనతా ప్రభుత్వం విఫలమయింది. ఆ పార్టీ ముక్కలయింది. 1980లో జనతా వైఫల్యాన్ని, ఉల్లిపాయల ధరలను చూపెట్టి ఇందిరాగాంధీ మళ్లీ అధికారం కైవసం చేసుకున్నారు. శారీరక అనారోగ్యం, మానసిక అశాంతి 1979లో జె.పి. మరణానికి కారణమయ్యాయి. ఇన్నేళ్ల తరువాత భారత ప్రభుత్వం జె.పి.కి భారతరత్న

పురస్కారమిస్తున్నామని ప్రకటించింది. కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసి, కనీసం రెండు తరాల భారతీయుల హృదయాల మీద చెరగని ముద్ర వేసిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కు 'భారతరత్న'లు, ఇతర బిరుదులు అక్కరలేదు. 1930 నుంచి భారత చరిత్రను ఎవరు ఎలా రాసినా అందులో జె.పి.స్థానం అద్వితీయం. ఒకరకంగా నేడు ఆయనకు 'భారతరత్న' ప్రకటించి ఆయన స్థానాన్ని తగ్గించారు. మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్.. ఈ ఐదుగురి స్థానాన్ని ఈ శతాబ్ది భారత చరిత్ర నుంచి ఎవ్వరూ తొలగించలేరు. గాంధీజీ వంటి వారికి ఏవో అవార్డులు, పురస్కారాలు, బిరుదులు ఇవ్వనక్కరలేదు.

## వైఫల్యాల నుంచి పాఠాలు

ఈ రూపంగా స్వతాంత్రనంతరం మన వైఫల్యాలని సమీక్షించుకోడం మంచిదే. అంత జనబలంతో ముందుకొచ్చిన సంపూర్ణ క్రాంతి ఉద్యమం ఎందుకు విఫలమయింది? ఒక గాంధేయ విప్లవంగా ప్రజలంతా భావించిన జనతా విజయం స్వల్పకాలంలో ఎందుకు చేదు స్మృతులను మిగిల్చింది? నేతలు ఎక్కడ తప్పటడుగులు వేశారు. ఇవన్నీ మననం చేసుకోవాలి. చరిత్ర పాఠాలను గుర్తుంచుకోవాలి. నిజమయిన స్వరాజ్యం కోసం రెండో స్వతంత్ర పోరాటం చేపట్టాలి. గత అనుభవాల సారాన్ని వంటపట్టించుకుని, తగిన పరిజ్ఞానంతో సంఘటితంగా ఉద్యమించాలి. దిశ తెలియని గందరగోళంలో మగ్గిపోతున్న నేటి యువతకు విజ్ఞతతో కూడిన మార్గాన్ని చూపాలి. నిర్దిష్టమైన, ఆచరణ సాధ్యమయిన, అందరికీ ఆమోదయోగ్యమయిన ప్రజాస్వామ్య లక్ష్యాల కోసం పోరాడాలి. అదే జె.పి.కి మరెందరో స్వతంత్ర పోరాట యోధులకు ఇచ్చే నిజమైన నివాళి.

* * *

# భ్రష్ట రాజకీయ చరిత్రలో సరికొత్త పుటలు

మార్చి 14, 2005

ప్రస్తుత గవర్నర్ల వ్యవస్థ ఆరో వేలు మాదిరిగా నిరర్థకంగా, నిష్ప్రయోజనంగా తయారైంది. అనేక సందర్భాలాలో గవర్నర్లు తమ చర్యల ద్వారా లేనిపోని గందరగోళాలకు కారణమవుతున్నారు. గవర్నర్ల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం ద్వారా గోవా, జార్ఖండ్‌లలో సంభవించిన పరిణామాలు పునరావృతం కాకుండా చూడవలసిన అవసరం ఉంది.

గోవా, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలో ఇటీవల సంభవించి విపరిణామాలు మన సమాజానికి శాపంగా పరిణమించిన భ్రష్ట రాజకీయాలకు మరోసారి అద్దం పట్టాయి. ఇందుకు ఓ గవర్నర్‌నో, లేక ఒక పార్టీ నాయకుడినో లేదా శాసనసభ్యుణ్నో తప్పుబట్టడం తేలికే.కానీ, రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు అందుకు కారణాలను తెలుసుకుని, సరైన పరిష్కార మార్గాలను అన్వేషించినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థలో అవరోధాలూ, ఆటుపోట్లూ ఎదురవడం సహజం. ప్రజాస్వామిక దేశాలన్నీ ఈ రకమైన సంక్షోభాలను ఎదుర్కొన్నవే. వాటిని అధిగమించేందుకు సరైన విధానాలను, సంస్కరణలనూ రూపొందించుకుని అవి ముందుకు సాగుతున్నాయి.రాజకీయంగా సమస్యలూ, సంక్షోభాలూ తలెత్తినప్పుడు ఏం చేయాలో తెలీక చాలా మంది నిరాశనిస్పృహలలో కూరుకుపోతుంటారు. అందుకు కారణమైన నాయకులను, రాజ్యాంగ ప్రతినిధులనూ నిందించడమే పనిగా పెట్టుకుంటారు. ఈ రకమైన ధోరణి అహేతుకమైనది. ఎందుకంటే.. నాయకులంతా నయవంచకులనీ, వారిని ఓ కంట కనిపెట్టే మనమంతా సచ్ఛీలురమని అనుకోవడంలో అర్థం లేదు. అలాగని, మితిమీరిన ఆశ, పదవీలాలస ఉన్నవారే రాజకీయాల్లో ప్రవేశించేందుకు అర్హులని భావించడమూ తప్పే అవుతుంది. నాయకులలో రాజకీయ అనైతికత, దుష్ప్రవర్తన పదేపదే ప్రస్ఫుటమవుతున్నప్పుడు, వారి ప్రవర్తనకు గల

కారణాలను కనుగొని, పరిష్కార మార్గాలను అన్వేషించాలి. లేనిపక్షంలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగిన ప్రతిసారీ విస్తుపోవడం మన వంతవుతుంది.

## కీలకాంశాలు

తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా నాలుగు అంశాలపై మనం ప్రధానంగా దృష్టి సారించవలసిన అవసరం ఉంది. అందులో మొదటిది.. శాసనకర్తల ఫిరాయింపుల వ్యవహారం. చట్ట సభల సభ్యుల సంఖ్యతో నిమిత్తం లేకుండా, ఫిరాయించిన వారెవరినైనా అనర్హులుగా పరిగణించేందుకు వీలుగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పటుతరం చేసుకున్నాం. అయినా ఫిరాయింపులు కొనసాగుతూనే ఉన్నప్పుడు వాటిని పూర్తిగా అరికట్టేందుకు అనువైన ఎన్నికల వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. మరోవిధంగా చెప్పాలంటే.. శాసనసభత్వానికి రాజీనామా చేయడం ద్వారా శాసనకర్తలు లబ్ధిపొందకుండా అడ్డుకునేందుకు, ప్రభుత్వాలను కూల్చివేసే ఫిరాయింపుదారులకు పదవులు లభించకుండా నిరోధించేందుకు వీలు కల్పించే వ్యవస్థ తక్షణావసరం. ఎన్నికల అనంతరం నెలకొనే అనిశ్చిత పరిస్థితి రెండవ అంశం. ఎన్నికలు ముగిసిన తరవాత, అప్పటి వరకూ తెరవెనక ఉన్న పెద్దలు అకస్మాత్తుగా రంగప్రవేశం చేసి ప్రజా తీర్పును కాలరాస్తారు. ప్రజాప్రయోజనాలకు, ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిచ్చి, అస్మదీయులు గద్దెనెక్కేలా చక్రం తిప్పుతారు. ఎన్నికల ప్రక్రియనే ఓ ప్రహసనంగా మార్చివేస్తారు. అలాంటి వారికి ముకుతాడు వేయలేమా? 2004 ఎన్నికల తరవాత కర్నాటకలోను, 1982లో హర్యానాలోనూ జరిగిన సంఘటనలు ఇలాంటి కపట రాజకీయవేత్తల పన్నాగాలకు తార్కాణాలుగా చెప్పుకోవచ్చు. ప్రజాస్వామ్యాయుతంగా ఎన్నికైన ప్రభుత్వాల మనుగడ మూడవ అంశం. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలి తమ మనుగడ కోసం శాసనకర్తలను మచ్చిక చేసుకోవడానికే అధిక సమయం కేటాయిస్తున్నాయి. ఈ రకమైన పరిస్థితిలో మార్పు తీసుకురాలేమా? రాజకీయాల్లో స్వార్థ ప్రయోజనాలకు అడ్డుకట్ట వేసి, ప్రజల కోసం పాటుబడే వారికి పెద్దపీట వేసే విధంగా రాజకీయ వ్యవస్థను తీర్చిదిద్దుకోలేమా? అనే ప్రశ్నలు ఈ సందర్భంగా ఉత్పన్నమవుతాయి. మనం దృష్టి సారించవలసిన నాలుగవ అంశం.. గవర్నర్ల వ్యవస్థ. భారత్ అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. భౌగోళికంగానూ ఎంతో పెద్దది. మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు వేటికవే, ప్రపంచంలోని అనేక దేశాలకంటే

పెద్దవి. ఇలాంటి దేశంలో, ఇప్పటికీ మధ్యయుగం నాటి పద్ధతులు, వలసవాద విధానాలు కొనసాగుతూ ఉన్నాయి. గవర్నర్ల వ్యవస్థ ఇందుకు నిదర్శనం. రాష్ట్రానికి సంబంధించినవరకూ గవర్నర్ రాజ్యాంగాధినేతగా వ్యవహరిస్తారు. ఎన్నికల ద్వారా తమ నాయకులను ప్రజలను స్వేచ్ఛగా ఎన్నుకొనే వెసులుబాటుగల మన దేశంలో, గవర్నర్లను మాత్రం కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే విధానమే ఇప్పటికీ అమలులో ఉండడం విచారకరం. ఈ విధంగా నియుక్తులయ్యే వారికి ప్రజాతీర్పును తోసిరాజనే నైతిక హక్కు ఎక్కడిది? మన దేశాన్ని పాలించినప్పుడు తమ ఆధీనంలో ఉండే దూర ప్రాంతాలకు ప్రతినిధులుగా సుబేదార్లను నియమించే వారు. వారికీ, ఇప్పటి గవర్నర్ల వ్యవస్థకూ పెద్ద తేడా ఏముంది? ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా, సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, గవర్నర్ల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉంది.

ఫెడరల్ ప్రజాస్వామిక వ్యవస్థ అమలులో ఉన్న దేశాలలో సార్వభౌమాధికారం ఎవరికి చెందాలి? కేంద్ర ప్రభుత్వానికా? లేక రాష్ట్రాలకా అనే విషయం ఎప్పుడూ వివాదాస్పదంగా మారుతూ ఉంటుంది. ఫెడరల్ ప్రభుత్వానికీ, రాష్ట్రాలకూ మధ్య అధికారాల విభజన అనేది కూడా ఒక సమస్య. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో కేంద్రం ఎంతవరకూ జోక్యం చేసుకోవచ్చనే అంశంపై కూడా స్పష్టత ఉండదు. అయితే, పౌరహక్కులను, రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. ఈ దిశగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు ఎన్నో సునిశితమైన విధానాలను ఏర్పరచుకున్నాయి. రాష్ట్రాలకు సంబంధించి రాజ్యాంగాధినేతగా వ్యవహరించే వారి విషయంలో ఆయా దేశాలు అనుసరిస్తున్న విధానాలను ఒకసారి పరికిద్దాం.

అధికారాల విభజనకు సంబంధించి ప్రముఖ తత్వవేత్త మాంటెస్క్యూ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అనుసరించి అమెరికా సరళమైన, సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించుకుంది. దీని ప్రకారం మొత్తం అధికారాలు మూడు విలక్షణమైన విభాగాలుగా వర్గీకృతమయ్యాయి. వీటిలో కార్యనిర్వాహక వ్యవస్థ దేశ పాలనావ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. చట్టాలను అమలు చేస్తుంది. శాసన వ్యవస్థ చట్టాలకు రూపకల్పన చేస్తుంది. పన్నులు, వ్యయానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించే ప్రతిపాదనలను ఆమోదిస్తుంది. అలాగే కార్యనిర్వాహక వ్యవస్థను ఓ

కంట కనిపెడుతూ ఉంటుంది. మూడవదైన న్యాయ వ్యవస్థ ఈ రెండింటికంటే స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. నేరాలను, వివాదాలను విచారించి, తప్పుచేసిన వారికి శిక్ష విధిస్తుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య తలెత్తే సమస్యలనూ పరిష్కరిస్తుంది. రాజ్యాంగ సూత్రాలకు భాష్యం చెబుతుంది. పౌరహక్కుల పరిరక్షణకు కృషి చేస్తుంది. ఈ మూడు వ్యవస్థలూ వేటికవే స్వతంత్రమైనవి, అయితే, ప్రతి వ్యవస్థా మిగతా రెండింటివల్ల అధికార దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షిస్తూ ఉంటుంది. గవర్నర్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతి అమెరికాలో అమలులో ఉంది. ఇలా ఎన్నికైన గవర్నర్ ప్రభుత్వ అధినేతగానూ, రాజ్యాంగ ప్రతినిధిగానూ కూడా వ్యవహరిస్తారు. ప్రజలే నేరుగా ఎన్నుకుంటారు కాబట్టి, పదవీకాలం పూర్తయ్యేలోగా ఆయన ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని చట్టసభ సభ్యులు కూల్చివేసే అవకాశం ఉండదు. రాష్ట్రాలు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వీలుంది. రాజ్యాంగ పరిరక్షణ నిమిత్తం ఫెడరల్ ప్రభుతమూ తన అధికారాలను ఉపయోగించుకోవచ్చు. ఫెడరల్ ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ సమస్యలు, సంక్షోభాలను నివారించే సరళమైన, ఆచరణీయమైన విధానమిది. తమ నాయకుణ్ని ప్రజలే నేరుగా ఎన్నుకునే అవకాశం ఉండటం, రాష్ట్రాలను తమ అదుపాజ్ఞలలో పెట్టుకునేందుకు కేంద్రానికి వీలు లేకపోవడం ఇందులోని మెచ్చదగిన అంశాలు.

ఫెడరల్ ప్రజాస్వామిక దేశాలైన కెనడా, ఆస్ట్రేలియాలు ఒకప్పుడు వలసవాద రాజ్యాలు. ఈ రెండు దేశాలకూ ఇప్పటికీ బ్రిటిష్ రాణే సార్వభౌమురాలు. ఆయా దేశాల ప్రధానమంత్రుల సలహా మేరకు అక్కడ గవర్నర్ జనరళ్లను నియమించే అధికారం బ్రిటిష్ రాణికే దాఖలు పడి ఉంది.

కెనడాలో లెఫ్టినెంట్ గవర్నర్లు ఆయా రాష్ట్రాలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. వారిని ప్రధాని సలహాపై గవర్నర్ జనరల్ నియమిస్తారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు కొన్ని ప్రత్యేకాధికారాలు ఉన్నా, వాటిని ఉపయోగించడం అరుదు. నిజానికి, ఒక బిల్లుకు అనుమతి నిరాకరించే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంది. కానీ, 1961 తర్వాత ఇలాంటి అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్ ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఆస్ట్రేలియాలో రాష్ట్రాలకు రాజ్యాంగాధినేతలుగా గవర్నర్లను నియమిస్తారు. ప్రధానమంత్రి సలహా మేరకు బ్రిటిష్ రాణి ఈ నియామకాలు జరుపుతారు. అత్యవసర సమయాలలో ఉపయోగించేందుకు వీలుగా గవర్నర్లకు కొన్ని ప్రత్యేకాధికారాలు

సంక్రమిస్తాయి. కానీ, వాటిని చాలా అరుదుగా ఉపయోగిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే అధికారం గవర్నర్‌కు ఉన్నా, అలా చేయడం కలలో మాట.

జర్మనీలో కూడా రాష్ట్రాలకు గవర్నర్లను ఫెడరల్‌ప్రభుత్వం నియమించదు. రాష్ట్ర శాసనసభ మినిస్టర్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటుంది. ఆయన రాష్ట్రానికి సంబంధించి రాజ్యాంగాధినేతగా వ్యవహరిస్తారు. ఆయనే ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ఈ ప్రభుత్వానికి శాసనసభలో మెజారిటీ సభ్యుల మద్దతు ఉంటుంది. ఇంతకుమించి మినిస్టర్ ప్రెసిడెంట్‌కు ఇతర అధికారాలేమీ ఉండవు.

## ప్రక్షాళన అసవరం

మన దేశంలో గవర్నర్ల వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉంది. ప్రజలే ప్రభుత్వాధినేతను నేరుగా ఎన్నుకోవాలి. ఇలా ఎన్నికైన వారు, ఆయా రాష్ట్రాలలో రాజ్యాంగాధినేతగానూ వ్యవహరించాలి. ఈ పద్ధతిలో రాజకీయ అస్థిరతకు, అనిశ్చిత స్థితికీ ఆస్కారం ఉండదు. పైగా నిజాయతీతో కూడిన, సుపరిపాలనను అందించే ప్రభుత్వం ఏర్పాటు సాధ్యమవుతుంది. లేదంటే, గవర్నర్‌ను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి. రాష్ట్రపతిని ఎన్నుకున్నట్టే, రాష్ట్రాలలోని చట్ట సభలు గవర్నర్‌ను ఎన్నుకోవచ్చు. అలాగే, సదరు గవర్నర్‌ను తొలగించే అధికారమూ చట్టసభకే ఉండాలి. ఇలా గవర్నర్ల నియామకంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయానికి అడ్డుకట్ట వేయవచ్చు. ప్రస్తుత గవర్నర్ల వ్యవస్థ ఆరో వేలు మాదిరిగా నిరర్థకంగా, నిష్ప్రయోజనంగా తయారైంది. అనేక సందర్భాలలో గవర్నర్లు తమ చర్యల ద్వారా లేనిపోని గందరగోళాలకు కారణమవుతున్నారు. గోవా, జార్ఖండ్‌లలో సంభవించిన పరిణామాలు పునరావృతం కాకుండా చూడవలసిన అవసరం ఉంది.

* * *

# ఎమర్జెన్సీకి ముప్ఫయేళ్లు అవే నీడలు... అవే జాడలు

**జూన్ 20, 2005**

మన గణతంత్రంలో మొదటి 15ఏళ్లలో ప్రభుత్వ ఉద్దేశాలను కానీ, చర్యలను కానీ తప్పుపట్టలేం. తరవాతి దశాబ్దంలో అంతా ఇందిరాగాంధీ ప్రాబల్యమే. ప్రజా కర్షక విధానాలను అనుసరించడం, అధికారాన్నంతా తన గుప్పిట్లో పెట్టుకోవడం, అవినీతి పెచ్చు మీరడం ఆమె పాలనకు గీటురాళ్లు..

అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన వారి వాదనా సరైనది కాదు. ఇందిరాగాంధీయే అసలు సమస్య అని అందువల్ల ఆమెను పదవి నుంచి తొలగించడమే ఈ సమస్యకు పరిష్కారమని వారు భావించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఉద్యమాలను, కోర్టు తీర్పులను ఆసరాగా చేసుకొన్నారు. నాయకులు నేటికీ అలాంటి తప్పుదోవలోనే పయనిస్తున్నారు.

అత్యవసర పరిస్థితిని మన గణతంత్ర చరిత్రలోనే మాయనిమచ్చ. 1975వ సంవత్సరం జూన్ 25వ తేదీ అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించారు. ఆనాటి గందరగోళ పరిస్థితులను నిష్పాక్షికంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. అత్యవసర పరిస్థితి గురించి గత మూడు దశాబ్దాల్లో రెండు వాదాలు బయలుదేరాయి. ఎమర్జెన్సీని సమర్థించే వారు మూడు వాదనలను ముందుకు తెచ్చారు. అందులో రెండు వాదనలు స్పష్టంగానే ఉన్నాయి. ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని వ్యతిరేకించడమంటే భారత ప్రభుత్వాన్ని వ్యతిరేకించడమేనని, అందువల్ల నిరంకుశ పద్ధతిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసి వచ్చిందన్నది మొదటి వాదన. స్వేచ్ఛ అంటే-ఏమైనా చేయడానికి లైసెన్సు అనుకొనే దుస్థితి వచ్చేసిందని, క్రమశిక్షణ కోసం దాన్ని నియత్రించాల్సి వచ్చిందన్నది రెండోవాదన. మూడో వాదనే అస్పష్టంగా ఉంది. 'తమకు ఏది మంచో, ఏది చెడో పేదలకు తెలీదు. దాంతో వారిని కాపాడాల్సిన అవసరం ఏర్పడింది. వారి హక్కులను పరిమితులు విధించాల్సి వచ్చింది. బలవంతంగా కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించాల్సిన వచ్చింది' అన్నది ఈ మూడో వాదన.

స్వప్రయోజనాలను కాపాడుకోవాలన్న ఉద్దేశం తప్ప ఈ వాదనల్లో ఎంత మాత్రం పసలేదని తెలుస్తూనే ఉంది.

అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన వారి వాదనా సరైనది కాదు. ఇందిరాగాంధీయే అసలు సమస్య అని అందువల్ల ఆమెను పదవి నుంచి తొలగించడమే ఈ సమస్యకు పరిష్కారమని వారు భావించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఉద్యమాలను, కోర్టు తీర్పులను ఆసరాగా చేసుకొన్నారు. నాయకులు నేటికీ అలాంటి తప్పుదోవలోనే పయనిస్తున్నారు. ప్రత్యర్థులను ఏదో ఒక విధంగా పదవిలోంచి తప్పించడమే రాజకీయంగా మారిపోయింది. ఆటగాళ్లు మారినంత మాత్రాన ఒనగూడేదేమీ ఉండదు. ఆట నియమాలు మారాల్సిన అవసరాన్ని ఎవరూ గుర్తించడంలేదు. ఎవరికి తోచిన రీతిలో వారు భావావేశాలతో చర్చలు లేవనెత్తుతున్నారు. ఆనాడు అంతగా అధికార దుర్వినియోగానికి దారితీసిన ఆర్థిక, రాజకీయ కారణాలు మాత్రం మరుగున పడిపోతున్నాయి. సమగ్ర విశ్లేషణలో తేలేదొక్కటే. పేదల పేరుతో అవినీతికి, అక్రమాలకు పాల్పడేందుకు వీలుకల్పించిన లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్‌తోనే ఎమర్జెన్సీకి బీజం పడింది. నెహ్రూ ప్రవచించిన సామ్యవాదం నిర్మాణాత్మకమైనదే. కానీ, సమగ్రమైనదికాదు. వివిధ సంస్థల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన, కీలక పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చినందువల్ల అది నిర్మాణాత్మకమైనదని చెప్పవచ్చు. అదే సమయంలో-వికేంద్రీకరణకు, విద్య, ఆరోగ్య పరిరక్షణ ద్వారా మానవ వికాసానికి తగినంత ప్రాముఖ్యం ఇవ్వలేదు కనుక అది అసమగ్రమైనది. మొత్తంమీద చూస్తే, మన గణతంత్రలో మొదటి 15ఏళ్లలో ప్రభుత్వ ఉద్దేశాలను కానీ, చర్యలను కానీ తప్పుపట్టలేం. తరవాతి దశాబ్దంలో అంతా ఇందిరాగాంధీ ప్రాబల్యమే. ప్రజాకర్షక విధానాలను అనుసరించడం, అధికారాన్నంతా తన గుప్పిట్లో పెట్టుకోవడం, అవినీతి పెచ్చుమీరడం- ఆమె పాలన తీరుకు గీటురాళ్లు.

ఆనాడు ప్రభుత్వ వైఫల్యం అనివార్యంగా మారింది. ఎందుకంటే ప్రజల అకాంక్షల్ని నెరవేర్చేక్రమంలో మిగతా వ్యవస్థలు సవ్యంగా పనిచేసేందుకు అది సరైన అవకాశమే ఇవ్వలేదు. ప్రభుత్వ పాత్ర ఏమిటో, దాని పరిమితులు ఏమిటో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కఠిన నియంత్రణలను అమలుపరిచింది. ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని జాతీయం చేస్తూ 1973 ఏప్రిల్‌లో ప్రభుత్వం తీసుకున్న

నిర్ణయం అవివేకానికి పరాకాష్ఠ. తరవాత సర్కారు ఆ నిర్ణయాన్ని వాపసు తీసుకుంది. ఆదాయం పన్ను రేట్లను అసాధారణ స్థాయికి పెంచడం దుష్పరిణామాలకు దారితీసింది. ఒకానొక దశలో లక్ష రూపాయల ఆదాయంపై పన్ను 90శాతాన్ని మించిపోయింది. నల్లధనం పేరుకుపోవడానికి అది కారణమైంది. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పింది.

ఆ దశలో ఒక సానుకూల పరిణామం సంభవించకపోలేదు. ఇందిరాగాంధీ నాయకత్వంలో సి. సుబ్రమణ్యం, బి.ఎన్.శివరామన్ వంటివారి సమర్థ సారథ్యంలో హరిత విప్లవాన్ని ఆవిష్కరించడం జరిగింది. లక్షల మంది కర్షకుల కృషి ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది. ప్రజలు తమ పంట పొలాల్లో ఈ విప్లవం సృష్టించారు. అవి ప్రభుత్వ భూములు కావు. సోవియట్ యూనియన్‌కు, మనకు మధ్య కీలకమైన తేడా అదే. అక్కడి ఉమ్మడి వ్యవసాయం చివరికి వ్యవస్థ కుప్పకూలడానికి, యూనియన్ అదృశ్యమైపోవడానికి కారణమైంది. భారత్ తన పద్ధతి ద్వారా మెరుగైన రీతిలో ఆహారోత్పత్తి సాధించగలిగింది. పంపిణీ పెంచినప్పటికీ లాభాలు చేజారాయి.

అప్పట్లో మన ఆర్థిక వ్యవస్థ దాదాపు పతనం అంచుకు చేరింది. 1973 అక్టోబర్‌లో తలెత్తిన చమురు సంక్షోభం, వ్యవసాయరంగాన్ని కుదిపివేసిన వరుస కరవులు దేశ ఆర్థిక రంగాన్ని తిరోగమనం వైపు నడిపించాయి. అధిక పన్ను రేట్లు, ద్రవ్యోల్బణం, కంట్రోళ్లు విధించడం, వనరుల లేమి, పెచ్చుమీరిన అవినీతి దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన అవరోధాలుగా పరిణమించాయి.

అత్యవసర పరిస్థితి అనంతరం 1977లో జనతా ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో ప్రజలలో కొత్త ఆశలు చిగురించాయి. కుంగిపోయిన ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేసేందుకు, ప్రజాభ్యున్నతిలో ప్రభుత్వం పాత్రను పునర్నిర్వచించేందుకు జనతా ప్రభుత్వానికి చక్కటి అవకాశం లభించింది. కాని, ఆ సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పాలనపరంగా అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ అపారమైన శక్తి సామర్థ్యాలు గలవారు, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడంలో సాటిలేనివారు అయినప్పటికీ, ఆయన నేతృత్వంలోని జనతా ప్రభుత్వం కొద్దికాలానికే కుప్పకూలిపోయింది. పర్యవసానంగా, భారత్ ఊహించని ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఈ పరిణామాలే 1991లో ఆర్థిక

సరళీకృత విధానాల అమలుకు దారితీశాయి. మన దేశంలో జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలోనే పొరుగున ఉన్న చైనాలో డెంగ్ జియావోపింగ్ కమ్యూనిజానికి సరికొత్త అర్థం చెబుతూ సంస్కరణలకు బాట వేశారు. వాటి ద్వారా ఆ దేశం చవిచూస్తున్న ప్రగతి ఫలాలు ఇప్పుడు ప్రపంచ దేశాలనే సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతున్నాయి.

భారత్‌లో 1991లో అమలుకు నోచుకున్న సంస్కరణల ముఖ్యోద్దేశం ఇంకా నెరవేరలేదు. అప్పట్లో ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ చేసిందేమిటంటే– ఉత్పాదక శక్తికి అవరోధంగా మారిన నియంత్రణలు, లైసెన్సుల వ్యవస్థలోని కఠినమైన నిబంధనలను తొలగించటం. గతంతో పోల్చుకుంటే ఇప్పటి మన వృద్ధి రేట్లు ఎంతో మెరుగైనవిగా కనిపిస్తున్నా. పేదరికాన్ని నిర్మూలించేందుకు, అవినీతిని పారదోలేందుకు అవి ఎంతమాత్రం సరిపోవు. మన కలలు సాకారం కావాలంటే రాజకీయ, పాలన రంగాల్లో సంస్కరణలను తీసుకురావడం ద్వారా యావత్తు ప్రభుత్వ వ్యవస్థకు కొత్త రూపు కల్పించడం అవసరం.

రాజకీయ పాలనపరమైన సంస్కరణలను అమలు చేయాల్సిన ఆవశ్యకతను బీహార్‌లో నెలకొన్న పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. 1975లో తలెత్తిన రాజకీయ విపరిణామాలకు ఆ రాష్ట్రం కేంద్ర బిందువుగా నిలిచింది. ఇప్పటికీ బీహార్‌లో అదే అరాచకీయం కొనసాగుతోంది. మిగతా రాష్ట్రాల కంటే బీహార్ భిన్నమైనదని కొందరు వాదిస్తుంటారు. ఇలాంటి వాదనలు పసలేనివి. ఎందుకంటే బీహార్‌ను పోలిన రాజకీయ పరిస్థితులు అన్నో ఇన్నో ఇప్పుడు ప్రతి రాష్ట్రంలోనూ పొడసూపుతున్నాయి. అయితే పాలనపరమైన సంక్షోభానికి పరాకాష్ఠగా బీహార్ చెప్పుకోవలసిందే. ప్రభుత్వ యంత్రాంగంలో ఏడో దశకం నాటికే వేళ్లూనుకుపోయిన అవినీతి, అధికార దుర్వినియోగం ఇప్పటికీ తగ్గుముఖం పట్టకపోగా సమాజానికి మరింత కీడు కలిగించే విధంగా పరిణమించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్నికల వ్యవస్థ, అక్రమాలకు నిలయంగా మారిన రాజకీయ వ్యవస్థల కారణంగా ఇప్పుడు మరిన్ని కీలక రంగాలకు అవినీతి వ్యాపించింది. సత్యేంద్ర దూబే దారుణ హత్యోదంతం, తెల్గీ స్టాంపుల కుంభకోణం, ప్రశ్న పత్రాలను లీక్ చేసి సొమ్ము చేసుకొనే సంజీవ్ డాన్ వంటి వారి మితిమీరిన ధనాశ, స్వార్థ ప్రయోజనాలను ఆశించి నేరగాళ్ళు –పోలీసులు–రాజకీయ నాయకులు కుమ్మక్కు అవుతున్న తీరు, న్యాయ వ్యవస్థలోని లోపాలు–ప్రస్తుత సమాజం

ఎదుర్కొంటున్న రాజకీయ, పాలన పరమైన సంక్షోభాలకు తార్కాణాలుగా చెప్పుకోవచ్చు.

అత్యవసర పరిస్థితి విధించి ముప్ఫయ్యేళ్లు కావస్తున్న సందర్భంగా వేదికలనెక్కే రాజకీయ నాయకులు ఆవేశ పూరిత ప్రసంగాలు చేయడం ద్వారా, చరిత్ర వక్రభాష్యాలు చెప్పడం ద్వారా కాలహరణం చేస్తారనడంలో సందేహం లేదు. నిజానికి, 70ల నాటి రాజకీయ పరిస్థితులను, ఆర్థిక సంక్షోభానికి దారితీసిన అప్పటి సంఘటనలను నిష్పాక్షికంగా సమీక్షించేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకోవాలి. వాటికి వ్యవస్థాగతమైన పరిష్కారాలను కనుగొనడం ద్వారా ఇప్పటి రాజకీయ, పాలన రంగాలలో నెలకొన్న సంక్షోభాల నివారణకు నడుం బిగించాలి.

* * *

# రాష్ట్రాల పునర్విభజన కత్తిమీద సాము తొందరపాటు జాతికి అనర్థం

**అక్టోబరు 12, 1998**

భారత రాజ్యాంగం ప్రకారం మనదేశం కొన్ని రాష్ట్రాల కలయిక (యూనియన్). మనం వాడుకలో భారత ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నాం. రాజ్యాంగంలో మాత్రం ఎక్కడా కేంద్రం అనే మాట కానరాదు. రాజ్యాంగ నిర్మాతలు ప్రతి సందర్భంలోనూ జాతీయ స్థాయిలోని ప్రభుత్వాని యూనియన్ అనే పేర్కొన్నారు. భారత్‌లో నిజమైన ఫెడరల్ వ్యవస్థ లేదు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు కలిసి ఉమ్మడిగా ఒక రాజ్యాన్ని ఏర్పరచుకుంటాయి. అంటే రాష్ట్రాలు ముందు ఏర్పడి ఉంటాయి. యూనియన్ లేదా ఫెడరల్ ప్రభుత్వం ఆ తరువాత ఏర్పడుతుంది. అందుకే నిజమైన ఫెడరల్ ప్రభుత్వాలలో రాష్ట్రాల ఎల్లలను మార్చటం, ఉన్న రాష్ట్రాలను రద్దు చేయటం అసాధ్యం.

## రాజ్యాంగం ప్రకారం పార్లమెంటుకే అధికారం

అమెరికా సంయుక్త రాష్ట్రాల (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా – యు.ఎస్.ఎ.) ఏర్పాటు 1776లో 12 రాష్ట్రాల కలయికతో ఏర్పడింది. అందులో ఏ రాష్ట్రాన్నీ నేటి వరకు మార్చలేదు. కొత్త ప్రాంతాలు రాష్ట్రాలుగా ఏర్పడటంతో, ఆ రాష్ట్రాల సంఖ్య 50 వరకు పెరిగింది. ఉన్న రాష్ట్రాలను మార్చే అవకాశం లేదు. నిజానికి 1861–65 మధ్య బానిసత్వ నిర్మూలన అంశంపై అంతర్యుద్ధం జరిగే వరకూ ఆ దేశంలో రాష్ట్రాలే చాలా బలంగా ఉండేవి. బానిసత్వాన్ని కొనసాగించాలని పట్టుపట్టి దక్షిణాది రాష్ట్రాలు విడిపోయి వేరే దేశంగా ప్రకటించుకోవటంతో ఆమెరికా ఉనికికే సవాలు ఎదురయింది. అంతర్యుద్ధం తప్పలేదు. దేశ సమగ్రత ప్రధానం కాగానే ఫెడరల్ ప్రభుత్వం ప్రాముఖ్యం పెరిగింది. అంతర్యుద్ధంలో ఉత్తరాది రాష్ట్రాల విజయం, విడిపోయిన రాష్ట్రాల ఓటమితో ఫెడరల్ ప్రభుత్వం బలపడింది. ఆచరణరీత్యా చూస్తే నేటికీ పరిపాలనలో ఎన్నో ప్రధాన అంశాలు ప్రజలకు చేరువగా స్థానిక ప్రభుత్వాల చేతుల్లోనే ఉన్నాయి. మిగిలిన అంశాలలో చాలా మటుకు రాష్ట్రాల చేతుల్లో ఉన్నాయి. ఫెడరల్ ప్రభుత్వం రాష్ట్రాల పరిపాలనలో జోక్యం చేసుకునే అవకాశం లేదు. రాష్ట్రాలకు విధుల ఎరచూపించి

వాటి నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చునేమోకాని, బెదిరింపులతో పాలనలో జోక్యం చేసుకోవటం అసాధ్యం. ఉదాహరణకు – కార్లు వేగంగా పోవటంతో దేశమంతటా రోడ్డు ప్రమాదాలు పెరగుతున్నాయని కొన్నేళ్ళ క్రితం ఫెడరల్ ప్రభుత్వం 55 మైళ్ళ వేగం పరిమితి ఉండాలని భావించింది.రాష్ట్రాలను ఆ విధంగా చట్టాలు చేయాల్సిందిగా శాసించే అధికారం ఫెడరల్ ప్రభుత్వానికి లేదు. అందుకోసమని రహదారుల కోసం ఇచ్చే నిధులను కార్ల వేగంతో ముడిపెట్టారు. క్రమక్రమంగా చాలా రాష్ట్రాలలో చట్టాలను మార్చుకుని వాహనాల వేగపరిమితిని 55 మైళ్ళుగా నిర్దేశించారు. మళ్ళీ కొద్ది కాలంలోనే చాలా రాష్ట్రాలలో పరిమితులను పెంచారు. అలాగే జర్మనీలో 15 లాండర్లు (రాష్ట్రాలు) ఉన్నాయి. వాటిని మార్చే హక్కుగాని, రద్దుచేసే అధికారం గాని ఫెడరల్ ప్రభుత్వానికి లేదు. పన్నులు చాలా వరకు ఫెడరల్ ప్రభుత్వం పేరిట వసూలయినా, అందులో నిర్దిష్టశాతం రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రాలకు చెందుతాయి. బలమయిన స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో చాలా వరకు అంశాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. భారత దేశంలో రాష్ట్రాల పరిస్థితి అమెరికా, జర్మనీ పద్ధతులకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. రాజ్యాంగంలో 2వ అధికరణం ప్రకారం మన పార్లమెంటు సాధారణ మెజారిటీ ద్వారా చట్టం చేసి కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. అలాగే 3వ అధికరణం ప్రకారం ఒక రాష్ట్రం విస్తీర్ణాన్ని పెంచటం, లేదా తగ్గించటం చేయవచ్చు. సరిహద్దులను ఇష్టం వచ్చినట్లు మార్చవచ్చు. పేర్లు మార్చవచ్చు. ఒక రాష్ట్రాన్ని ముక్కలుగా విడగొట్టవచ్చు. రెండు లేదా ఎక్కువ రాష్ట్రాలను కలపవచ్చు. రాష్ట్రాలలో భాగాలను, లేదా కేంద్రపాలిత ప్రాంతాలను కలిపి కొత్తరాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. అంటే మన రాజ్యాంగం ప్రకారం అసలు రాష్ట్రాల ఉనికే పూర్తిగా పార్లమెంటు మీద ఆధారపడి ఉంది. రాష్ట్రాలను మార్చటానికి కనీసం రాజ్యాంగ సవరణ కూడా అక్కరలేదు. నిర్నిబంధమైన ఈ పార్లమెంటు అధికారానికి ఒకే ఒకచిన్న హద్దు ఉంది. అదేమంటే ఒక రాష్ట్ర సరిహద్దును మార్చే చట్టం చేసేముందు, ఆ రాష్ట్రం లేదా రాష్ట్రాల చట్టసభలకు ఆ ప్రతిపాదనను – విధిగా పంపి, నిర్దేశించిన గడువులోగా తమ అభిప్రాయాలను తెలియజేయమని కోరవచ్చు. రాష్ట్ర చట్ట సభల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్న నిబంధన మాత్రం ఎక్కడా లేదు! ఏతావతా తేలేదేమంటే యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలను కేవలం పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పడిన ప్రాంతాలుగా భావించి పార్లమెంటు ఇష్టం వచ్చినట్లు మార్చవచ్చు. రాజ్యాంగం ప్రకారం దేశంలో అన్ని రాష్ట్రాలను కలిపి

ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది! అందుకు కేవలం సాధారణ మెజారిటీ చాలు. కాగితం మీద రాష్ట్రాల ఏర్పాటు విషయంలో విశృంఖలమయిన అధికారాలు పార్లమెంటుకు ఉన్నప్పటికీ వాస్తవానికి ఈ విషయంలో మాత్రం మన పార్లమెంటు ఇప్పటి వరకూ ఎంతో సంయమనంతోనూ, బాధ్యతతోనూ, చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. ఎన్నోమార్లు యూనియన్ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయసభలలో తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ, కొత్త రాష్ట్రాల ఏర్పాటును చిన్న విషయంగా ఏనాడూ భావించలేదు. మన దేశం ఎన్నో మతాల, భాషల, కులాల, ప్రాంతాల, జాతుల కలయిక. ఈపరిస్థితులలో కొత్త రాష్ట్రాలను ఏర్పరచటం రాజకీయంగా చాలా సంక్లిష్టమయిన ప్రక్రియ. రాష్ట్రాల విభజనకాని, కలయికకాని, కొత్త రాష్ట్రాల ఏర్పాటుకాని ఎన్నో ఆవేశకావేషాలకు, ఉద్రిక్తతలకు దారి తీయటం సహజం. దాన్ని గమనించి యూనియన్ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీలు ఈ విషయంలో మాత్రం చాలా జాగరూకతతో వ్యవహరించాయి. రాష్ట్రాలలో చీటికీ మాటికీ రాష్ట్రపతి పాలన విధించటానికి ఉత్సాహం చూపిన ప్రభుత్వాలు, రాష్ట్రాల ఉనికి విషయంలో మాత్రం తొందరపాటు చూపకుండా విజ్ఞతతో వ్యవహరించటం గమనార్హం. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న రాష్ట్రాలలో చాలా వరకు 1953–56 సంవత్సరాల మధ్య భాషా ప్రాతిపదికపైన జరిగిన రాష్ట్రాల పునర్విజనలో ఏర్పడ్డాయి. మొదటి ప్రధాని పండిట్ నెహ్రూ ముందు సందేహించినా, పొట్టి శ్రీరాములు ఆత్మార్పణంతో విధిగా రాష్ట్రాల పునర్విభజన చేపట్టవలసి వచ్చింది. భాష ప్రజలను ఏకం చేస్తుందనీ, భాష ప్రాతిపదికగా సాహిత్యం, సంస్కృతి, నాగరికత, అలవాట్లు, సంప్రదాయాలు ఏర్పడతాయనీ, ఒకేభాష మాట్లాడే ప్రజలలో సహజంగానే సంఘీభావం, ప్రత్యేకత కానవస్తాయనీ అంగీకరించి భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. కాస్తలోతుగా ఆలోచిస్తే, అసలు భాష అనేది ప్రపంచంలో చాలాచోట్ల జాతీయతకు కూడా పునాది. చాలా దేశాలలో ఒకేభాష ఉంది. చైనాలో వేర్వేరు భాషలున్నప్పటికీ, 85 శాతం ప్రజలు మాండరిన్ భాషనే వాడతారు. కెనడాలాంటి అభివృద్ధి చెందిన దేశంలో కూడా క్విబెక్ రాష్ట్రంలో ఫ్రెంచి మాట్లాడేవారు అధిక సంఖ్యలో ఉండటంతో, ఆదేశంలో ఇంగ్లీషు మాట్లాడే ఇతర రాష్ట్రాలకు, క్విబెక్‌కు నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంది. అడపాదడపా క్విబెక్ వేరుపడాలనే ప్రతిపాదన ముందుకు వస్తూనే ఉంది. అదివరకటి సోవియట్ యూనియన్‌లో రష్యన్ భాష మాట్లాడని మిగిలిన 14 రాష్ట్రాలు విడిపోయి ఇప్పుడు స్వతంత్ర దేశాలుగా

చెలామణీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నో భాషలున్న భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలు ఒకే జాతి సహజీవనం చేయగలగటం ప్రపంచంలోనే అపూర్వమయిన విషయం. మన చరిత్రలో ఎన్నో అపశృతులు దొర్లినప్పటికీ, 5000 సంవత్సరాల పాటు సహజీవనం చెయ్యటం వలన, ఎన్నో జాతులు, సంప్రదాయాలు, మతాలు, భాషలు కలవటం వలన, స్వతంత్ర భారతంలో ఇన్ని భాషల వారు ఒకే దేశంలో, ఒకేజాతిగా మనగలుగుతున్నారు. దీన్ని రక్షించుకోవటం మనజాతి భవిష్యత్తుకు ఒక దేశంగా మన ఉనికికి అత్యవసరం. అందువల్లనే మొదట్లో కొంత ప్రతిఘటన ఎదురయినా, ఒకేభాష మాట్లాడే ప్రజలు ఒక రాష్ట్రంలో ఉండటం, భాష ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పాటు చేయటం జాతీయ విధానంగా రూపొందింది. అందువల్ల దేశ సమగ్రతకు భంగం కలిగిన దాఖలాలు ఏమీ లేవు. భాషలు వేరైనా జాతి ఒకటే అనే అంశాన్ని దేశ వ్యాప్తంగా అందరూ అంగీకరిస్తున్నారు. హిందీ జాతీయ భాషగా చేసి, అన్ని ప్రాంతాలలో విధిగా నేర్చుకోవాలన్న ప్రతిపాదన కారణంగా దక్షిణాది రాష్ట్రాలలో, ముఖ్యంగా తమిళనాడులో తీవ్ర ఆందోళన తలెత్తింది. ఈ విషయంలో కూడా నెహ్రూ సారథ్యంలోని జాతీయ నాయకత్వం చాలా ముందు చూపును, విజ్ఞతను ప్రదర్శించింది. సామరస్యంగా, ఉభయతారకంగా ఆ సంక్షోభాన్ని దేశం అధిగమించగలిగింది. 1956 తరువాత ఈశాన్య భారతంలో ప్రత్యేక కారణాల వల్ల ఆరు చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. భాష ప్రాతిపదికగా పంజాబు, హర్యానా విడిపోయాయి. ఇప్పటికీ దాని ప్రకంపనలు పూర్తిగా సద్దుమణగలేదు. చండీగఢ్ నగరాన్ని ఎవరు పొందాలనే సమస్య నదీ జలాల వాటాలతో తీవ్రమై మతం పేరుతో జటిలమై ఇటీవలనే కాస్త సర్దుకుంటోంది. హిమాచల్ ప్రదేశ్ కూడా కొత్త రాష్ట్రంగా రూపొందింది. సిక్కిం మనదేశంలో విలీనమై కొత్త రాష్ట్రంగా రూపొందింది. గోవాలాంటి కేంద్రపాలిత ప్రాంతాలు రాష్ట్రాలుగా రూపొందాయి. ప్రస్తుతం దేశంలో 25 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రానికి స్వంత చట్ట సభ(లు), ఎన్నికయిన రాష్ట్ర ప్రభుత్వం, ఆప్రభుత్వ ఆధీనంలో అధికార యంత్రాంగం ఉన్నాయి. కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని అడపాదడపా కొన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు. అప్పుడప్పుడు అవి తీవ్ర ఆందోళనలుగా మారుతున్నాయి. మన రాష్ట్రంలోనే 1969, 1973లో రాష్ట్ర విభజన కోసం రెండు ఉద్యమాలు చెలరేగాయి. మరోసారి జాతీయ నాయకత్వం ప్రదర్శించిన చొరవవల్ల, ముందుచూపువల్ల సంఘీభావం సాధ్యమయింది. బెంగాల్‌లో సుభాష్ ఘీషింగ్ నాయకత్వంలో గూర్ఖాలాండ్ ఉద్యమం డార్జిలింగ్‌లో

తల ఎత్తింది. మొదట్లో యూనియన్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం బెంగాల్‌లో ఉన్న మార్క్సిస్టు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించింది. కాస్త ఆలస్యంగానయినా దాన్ని సమయస్ఫూర్తితో సర్దుబాటు చేశారు. దాని ఫలితంగా విశేషమయిన అధికారాలు, బాధ్యతలతో డార్జిలింగులో స్థానిక ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రాలను పునర్విభజించాలని,చిన్నచిన్న రాష్ట్రాలను పాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఎన్నోసార్లు ముందుకు వచ్చింది. రాజకీయంగా ఎన్నో చిక్కుముడులుండటంతో ఏ ప్రభుత్వమూ ఈ తేనెతుట్టెని కదిపే సాహసం చేయలేదు. కొన్ని పార్టీలు అడపాదడపా రాష్ట్రాల విభజనను ప్రస్తావించినా, మొత్తం మీద అధికార బాధ్యత నెత్తిన పడగానే దాన్ని పక్కన పెట్టాయి.

## దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి

దేశ రాజధాని ఢిల్లీని పూర్తిస్థాయి ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని, ఉత్తరప్రదేశ్‌లో పర్వత ప్రాంతాలలో ఉత్తరాంచల్ రాష్ట్రాన్ని,దక్షిణ బీహార్‌ను జార్ఖండ్ రాష్ట్రంగా, మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌ను కొత్త రాష్ట్రంగా చేయాలనే ప్రతిపాదనలు ఇటీవల బలంగా వచ్చాయి. యూనియన్ ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బి.జె.పి. ఈ ప్రతిపాదనలను బలపరచటంతో మరోసారి రాష్ట్రాల విభజన చర్చ జాతిముందుకు వచ్చింది. ఉత్తరాంచల్‌లో సిక్కుల ప్రాబల్యం ఉన్న ఉధంసింగ్‌నగర్ జిల్లాను కలవరాదని, అలా చేస్తే యూనియన్ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటామని ఇప్పటికే అకాలీదల్ స్పష్టం చేసింది. అలాగే జార్ఖండ్‌ను బీహార్ నుంచి విడదీసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తే రక్తపుటేరులు పారతాయని లాలూ ప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. బీహార్ శాసన సభ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తిరస్కరించింది. ఒకప్పుడు అదే శాసన సభ ఏకగ్రీవంగా ప్రత్యేక రాష్ట్రం కావాలని తీర్మానించినా, రాజకీయ పరిస్థితులు మారగానే ఉద్రిక్తత చెలరేగింది. ఈ పరిస్థితులను గమనిస్తే రాష్ట్రాల పునర్విభజన ఎంత క్లిష్టమయిన ప్రక్రియో అర్థమవుతుంది. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు ఎంతో సంయమనంతో వ్యవహరించి, ఉమ్మడిగా రాష్ట్రాల ఏర్పాటుకు కొన్ని మౌలిక సూత్రాలను అంగీకరించాల్సిన అవసరం ఉంది. అలాకాక సమస్యలను ఎలాగోలా కనబడకుండా చేద్దామని ప్రయత్నిస్తే ఇది ఎల్లకాలం దాగే సమస్య కాదు. ఒక ప్రభుత్వం ఢిల్లీ గద్దెనెక్కగానే ఏకపక్షంగా రాష్ట్రాల ఏర్పాటుకు తొందరపడితే కష్టాలు తప్పవు. శాశ్వత ప్రభావం ఉండే నిర్ణయాలలో సంయమనం

అవసరం. లేనిపక్షంలో ప్రస్తుతం చూస్తున్నట్లు రాజకీయంగా పెనుతుపానులు చెలరేగే ప్రమాదం ఉంది. అందుకే రాష్ట్రాల విభజన విషయమై అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా కొన్ని మౌలిక మార్గదర్శక సూత్రాలను రూపొందించటం అవసరం. ఉద్రేకాలను తగ్గించి – దేశ సమగ్రత, పాలన సౌలభ్యం, ప్రజల మనోభావాలు– వీటిని పరిగణనలోకి తీసుకుని జాతి దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది.

* * *

# 'విభజన' వాయిదా సముచితం, సమయోచితం

ఫిబ్రవరి 21, 2000

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నో చిక్కులున్నాయి. కొన్ని నిర్ణయాలు వెంటనే తీసుకోవటం కష్టం. ప్రజా ప్రయోజనాలను రక్షించే హేతుబద్ధమయిన నిర్ణయాలు కూడా అందరినీ సంప్రదించి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, చాలా ఆలస్యంగా తీసుకోవలసి వస్తుంది. చేసిన ప్రతి పనికి విమర్శలకు లోనుకావలసివస్తుంది. అధిక సంఖ్యాకుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ప్రతి వర్గం నిరంతరం చిన్నచిన్న సమస్యలను సైతం భూతద్దంలో చూపి గందరగోళం సృష్టించే అవకాశాన్ని ప్రజాస్వామ్యం ఇస్తుంది. ఒక సమస్య మీద, లేదా ఓ విధానం మీద ప్రజల తీర్పు ప్రకారం నిర్ణయం జరిగినా, ప్రజల కోర్టులో ఓడిన వారు మళ్ళీ మర్నాటి నుంచి ధ్వజమెత్తుతారు. అధికారంలో ఉన్నవాళ్ళకు ఒక్కక్షణం కూడా ప్రశాంతత, రాజకీయ భద్రత, స్థిరత్వం ఉండవు. అనునిత్యం వివిధ వర్గాల ప్రయోజనాల మధ్య రాజీలు చేయటం. సామరస్యంగా అందరినీ కలుపుకుపోతూ నిర్ణయాలు చేయటం, అలిగిన వాళ్ళను బుజ్జగించటం, ప్రజల మద్దతు కొనసాగేలా వ్యవహరించటం – ఇవన్నీ తలనొప్పి కలిగించే ప్రక్రియలు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే, స్వేచ్ఛను బతికించుకోవాలంటే ఈ తంటాలు, చికాకులు తప్పవు. ఇన్ని ఒడిదొడుకులున్నా సామాన్యుడి మాటకు విలువ, అతడి వ్యక్తిత్వానికి గౌరవం ప్రజాస్వామ్యంలోనే సాధ్యం. నియంతృత్వంలోనో, రాచరికంలోనో జటిలమైన సమస్యలు ఓ దేశం ముక్కలు కావటానికి, అంతర్యుద్ధాలు వచ్చి నరమేధం జరగటానికి దోహదమవుతాయి. లేదా ఆ భయంతో ఆ సమస్యలను దాచేసి, పరిస్థితులు విషమించి చేతులు కాలేదాకా తాత్సారం చేయటం జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో మాత్రమే అలాంటి గడ్డు సమస్యలను కూడా సామరస్యంగా, జనరంజకంగా, ప్రజాహితాన్ని పరిరక్షిస్తూ పరిష్కరించుకోవటం సాధ్యం.

### ఆశాకిరణాలు

మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నో భయంకర లోపాలున్నాయి. విశృంఖలమైన

అవినీతి, నేర రాజకీయం, అసమర్థత, బాధ్యతారాహిత్యం. అధికార కేంద్రీకరణ, వారసత్వ రాజకీయం, బంధుప్రీతి, సామాన్యుడిపట్ల చిన్నచూపు, ప్రతి పనికీ జాప్యం, పాలనలో దాపరికం, ఎన్నికలలో అవకతవకలు, విపరీతమయిన దుబారా, ఉద్యోగుల అలసత్వం, జవాబుదారితనంలేని పాలన, అధికార దర్పం, వ్యక్తి స్వేచ్ఛ అణచివేత, కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవటం, అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగం, శాంతిభద్రతల వైఫల్యం, పెరుగుతున్న అరాచకత్వం, ఏళ్ళు గడిచినా అందని న్యాయం – ఇవన్నీ మన వ్యవస్థను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఇన్ని సమస్యలున్నా చీకట్లో కొన్ని చిరుదివ్వెలు ప్రజాస్వామ్య ప్రియులకు ఉత్సాహాన్ని కలిగించి భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని పెంచుతున్నాయి. ఈ వారంలో ప్రభుత్వం ప్రకటించిన జనాభా విధానం ఇలాంటి చిరుదివ్వెలలో ఒకటి. మనదేశం ఐకమత్యానికి సవాలుగా చాలా కాలం నుంచి ఒక పెనుముప్పు పొంచి ఉంది. ఇందిరాగాంధీ నాయకత్వంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ సభ్యుల సంఖ్యను – 1971వ సంవత్సరంలో ఉన్న స్థాయిలోనే – 2001వ సంవత్సరం వరకు స్థిరంగా ఉండేలా చట్టం చేశారు. రాజ్యాంగంలో 81, 82వ అధికరణల ప్రకారం ప్రతి జనాభా లెక్కల తరువాత జనాభా ప్రాతిపదికపైన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించాలి. వీలున్నంత మేరకు ప్రతి నియోజకవర్గంలో దాదాపు సమాన జనాభా ఉండేలా చూడాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని 42వ సవరణలో ఈ అంశాన్ని చేర్చారు. 42వ రాజ్యాంగ సవరణను ఎమర్జెన్సీ చీకటి రోజులలో రాజ్యాంగంలో చేర్చారు. నియంతృత్వ ధోరణికి, స్వేచ్ఛ అణచివేతకు, ప్రజాస్వామ్య ఖననానికి 42వ సవరణ ప్రతీక. కాని లోక్‌సభ స్థానాలను 2001వ సంవత్సరం వరకు యథాతథంగా ఉంచుతూ చేసిన ఈ సవరణ మాత్రం సముచితమయినది. అందుకే తరవాత జనతా ప్రభుత్వం వచ్చాక 43, 44వ రాజ్యాంగ సవరణల ద్వారా 42వ సవరణలో చాలా భాగం రద్దు చేసినా, ఈ భాగాన్ని మాత్రం అలాగే కొనసాగించారు. పాతికేళ్ళు గడిచేసరికి ఓ గడ్డు సమస్య దాపురించింది. దేశ జనాభా సమస్య పాతికేళ్ళలోగా అదుపులోకి వస్తుందని ఆనాడు ఆశించారు. మన నేతల పిరికితనం వల్ల, అసమర్థత, అప్రయోజకత్వం వల్ల, పాలన యంత్రాంగం అలసత్వం వల్ల, కనీస  అక్షర జ్ఞానం, ఆరోగ్య సదుపాయాలను పేద వర్గాలకి కల్పించలేని దారుణ వైఫల్యం వల్ల – జనాభా విపరీతంగా పెరుగుతూనే ఉంది. మన జనాభా 100 కోట్లకు చేరుకుంటున్నది. ఇంకా జనాభా పెరుగుదల ఆగకపోవటంతో 21వ శతాబ్దంలో 165 కోట్లు దాటి, చైనాను మించిపోయి –

ప్రపంచంలో జనాభా రీత్యా అతి పెద్ద దేశంగా భారత్ అవతరించే ప్రమాదం ప్రస్ఫుటమవుతోంది. జనాభా విస్ఫోటం వల్ల కలిగే ప్రమాదాలు అటుండగా, వివిధ రాష్ట్రాల మధ్య జనాభా పెరుగుదలలో ఉన్న వ్యత్యాసాలు దేశం ఉనికికి, ఐకమత్యానికి ప్రమాదం తెచ్చి పెట్టాయి. దేశంలో మొత్తం మీద జనాభా పెరుగుతున్నా అది అన్ని రాష్ట్రాలలో సమానంగా లేదు. కేరళలో అక్షర జ్ఞానం, ఆరోగ్యం అందరికీ అందుబాటులోకి రావటంతో జనాభా పెరుగుదల ఆగిపోయింది. ప్రజలంతా చిన్న కుటుంబాల పట్ల మక్కువ పెంచుకుని, కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారు. దాంతో కొత్తగా పుట్టే వాళ్ళ సంఖ్య మరణించే వారి సంఖ్యతో సమానమయింది. అలాగే మరో పెద్ద రాష్ట్రమయిన తమిళనాడులో గణనీయంగా కుటుంబ నియంత్రణ అమలు జరిగి జనాభా పెరుగుదల తగ్గుముఖం పట్టింది. వచ్చే కొద్ది సంవత్సరాలలో తమిళనాడులో జనాభా స్థిరస్థాయికి చేరుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ 1970ల వరకు జనాభా నియంత్రణలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముందంజలో ఉండగా, గత 20 సంవత్సరాల నిర్లక్ష్యం వల్ల మన జనాభా పెరుగుదల దేశంలో సగటు పెరుగుదలతో దాదాపు సమానంగా ఉంది. మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాలలో జననాల రేటు గణనీయంగా తగ్గుముఖం పట్టినా, జనాభా ఎక్కువగా ఉండి దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న పెద్ద రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున బతుకు తెరువు కోసం వలస రావటంతో అక్కడా జనాభా పెరుగుదల తగ్గుముఖం పట్టలేదు. ఇక ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లాంటి రాష్ట్రాలలో జననాల రేటు అత్యధికంగా ఉంది. వెరసి దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య జనాభా పెరుగుదలలో విపరీతమైన వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. జనాభా పెరుగుదల వల్ల ఉత్పన్నమయ్యే ఆర్థిక, సామాజిక సమస్యలను అటుంటి, తీవ్రమయిన రాజకీయ ప్రమాదం ఎదురయింది. కేరళ, తమిళనాడులాంటి రాష్ట్రాలలో జనాభా శాతం (దేశ జనాభాలో) తగ్గిపోయింది. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా శాతం పెరిగింది. ప్రతి ఒక్కరికి ఒక ఓటు సిద్ధాంతం ప్రజాస్వామ్యానికి ప్రాణం కావటం వల్ల, రాజ్యాంగం నిర్దేశించిన విధంగా లోక్‌సభ స్థానాలను ప్రతి నియోజకవర్గంలో సమాన సంఖ్యలో ఓటర్లుండేలా పునర్వ్యవస్థీకరిస్తే – చాలా గందరగోళం చెలరేగే పరిస్థితి దాపురించింది. జనాభా రీత్యా లోక్‌సభ సీట్లను పునర్వ్యవస్థీకరిస్తే కేరళలో దాదాపు ఆరు స్థానాలు తగ్గే ప్రమాదముంది. అంటే ప్రస్తుతమున్న 20 స్థానాలు 14కు తగుతాయి. అలాగే తమిళనాడులో ఆరు నుంచి ఎనిమిది స్థానాలు తగ్గే ప్రమాదముంది. అంటే

ప్రస్తుతమున్న 39 స్థానాలు 33 లేదా, 31కి తగ్గుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల పెద్దగా తగ్గకపోవటం వల్ల చెప్పుకోదగ్గ మార్పు ఉండదు. మహా అయితే ఒకటి రెండు స్థానాలు తగ్గవచ్చు. అంటే 42 స్థానాలకు బదులు, 40, లేదా 41 స్థానాలు మిగలవచ్చు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు మరికొన్ని సీట్లు అదనంగా వచ్చి చేరతాయి. అంటే జనాభా పెరుగుదలను అదుపుచేయకుండా, కుటుంబ నియంత్రణను ప్రోత్సహించకుండా వెనకబడ్డ రాష్ట్రాలకు రాజకీయంగా మరింత బలం చేకూరుతుంది! కొంత బాధ్యతతో, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందించి, జనాభాను అదుపులోకి తేవటానికి గట్టి ప్రయత్నం చేసి విజయం సాధించిన రాష్ట్రాలు రాజకీయంగా కేంద్రంలో తమ ప్రాబల్యాన్ని కోల్పోతాయి! అంటే కాస్తో కూస్తో మంచి పాలన అందించిన రాష్ట్రాలను శిక్షించి, సమాజాన్ని అధోగతిలో ఉంచిన రాష్ట్రాలకు వరాలివ్వటమే అవుతుంది! అంతకంటే అధ్వాన్నమయిన పరిస్థితి మరొకటి లేదు. 2001లో ఇదే జరిగితే దేశ సమైక్యతకు పెనుముప్పు ముంచుకు వచ్చేది. తమిళనాడులాంటి రాష్ట్రంలో ఇది సులభంగా వేర్పాటువాదంగా మారేది. జనాభాను అదుపు చేసిన కారణంగా రాజకీయంగా నష్టం కలిగించే దేశంలో అంతర్భాగంగా ఉండకూడదనే వాదం తలెత్తితే అక్కడ బలంగా ఉన్న రెండు ప్రాంతీయ పార్టీలు అందుకు వత్తాసు పలకవలసి వస్తుంది. దేశం ముక్కలు కావటానికి ఎంతో కాలం పట్టేది కాదు.

## ఆలస్యంగానైనా విజ్ఞత

ఈ ఉపద్రవం ముంచుకొస్తున్న తరుణంలో మన రాజకీయ పార్టీలు ఆలస్యంగానయినా కనీసం ఈ విషయంలో ఎంతో విజ్ఞతను, దూరదృష్టిని ప్రదర్శించాయి. బాధ్యతాయుత పదవులలో ఉన్న కొందరు తొందరపాటుతో వ్యవహరించే ప్రయత్నం చేయకపోలేదు. ఉదాహరణకు గత ప్రభుత్వంలో కొంతకాలం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఉన్న మదన్‌లాల్ ఖురానా జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల పునర్వ్యవస్థీకరణ వెంటనే జరగాలని వాదించి, ఆ ప్రతిపాదనను కొంత దూరం నడిపారు. అలాగే గతంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఉండగా శరద్‌యాదవ్ వంటివారు అలాంటి వాదనే చేశారు. దేశం అదృష్టం పుణ్యమా అని అలాంటి ప్రయత్నాలకు తెరపడింది. 2026వ సంవత్సరం వరకు లోక్‌సభ స్థానాలు రాష్ట్రాల వారిగా మారకుండా స్థిరంగా ఉండాలని ఈ వారం కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం, జనాభా విధానంలో భాగంగా చేసిన ప్రతిపాదన చాలా

సముచితమైనవి. ఇందుకు అనుగుణంగా రాజ్యాంగ సవరణ తేవటంలో అన్ని పార్టీలు సహకరించి వెంటనే చట్టంచేయాలి. రాష్ట్రాలలో జనాభా సరిసమానంగా ఉండేలా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించవచ్చు. ఉదాహరణకు ముంబాయి నగరంలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య దాదాపు 15 లక్షలు! అలాగే మన రాష్ట్రంలో ఖైరతాబాదు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు లక్షలకు పైగా ఓటర్లున్నారు! అలాంటివి లేకుండా రాష్ట్రం పరిధిలోనే మార్పులు చేయటంలో తప్పులేదు. అయినా రెండు సమస్యలున్నాయి. కనీసం వచ్చే పాతికేళ్ళలో జనాభాను అదుపు చేయకపోతే, ఆనాటికి ఈ సమస్య మరింత వికృతరూపం దాల్చి దేశం ఉనికికి ప్రమాదకారి అవుతుంది. ఇప్పటికయినా గట్టి చర్యలు తీసుకోకపోతే భారత్ శాశ్వతంగా దుర్భర దారిద్ర్యంలో, అజ్ఞానంలో మగ్గే ఓ బడుగు దేశంగా స్థిరపడిపోతుంది. వివిధ రాష్ట్రాల మధ్య పెరిగే ఆర్థిక అసమానతలు హింసకు, సంఘర్షణలకు ఆజ్యం పోసి దేశ భద్రతకు, ఐకమత్యానికి ముప్పు తెరస్తాయి. పార్టీలు స్వార్థ రాజకీయాలను ప్రక్కన పెట్టి అన్నివర్గాల వారిని జనాభా నియంత్రణ లక్ష్యం వైపు నడపాలి. అందుకు కులమతాల అడ్డుగోడలను తొలగించి అందరినీ కలుపుకుపోవాలి. జనాభా విధానాన్ని మరింత పటిష్టపరిచి చిత్తశుద్ధితో అమలు చేయటం అవసరం. చిక్కులున్నప్పటికీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం దూరదృష్టితో కూడుకున్నది. ఎన్ని ఒడిదొడుకులున్నా భారత ప్రజాస్వామ్యం గడ్డుసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటుందనే ఆశావాదానికి ఈ జనాభా విధానం బలం చేకూరుస్తుంది. ఇదేమీ చిన్న విజయం కాదు. పక్కనున్న పాకిస్థాన్‌తో పోలిస్తే ఇందులో పొంచి ఉన్న ప్రమాదం అర్థమవుతుంది. దశాబ్దాల పర్యంతం పాకిస్థాన్‌లో రాష్ట్రాల వారీగా జనాభా లెక్కలు సేకరించటం అసాధ్యమవుతోంది. వివిధ రాష్ట్రాల మధ్య జనాభా పెరుగుదలలో అక్కడ కూడా తేడాలున్నాయి. పంజాబీలు, సింధ్‌లో భారత్ నుంచి వలసపోయిన మొహజిర్లు, స్థానిక సింధీలు, బెలూచీలు, సరిహద్దు ప్రాంతంలో పఠాన్లు రాజకీయ ప్రాబల్యం కోసం పోరాడుతున్నారు. జనాభా లెక్కలు వాస్తవాలను వెలికి తీస్తే దేశం అంతర్యుద్ధంలో చిక్కుకుంటుందనే భయంతో పాకిస్తాన్ పాలకులు ప్రతి పదేళ్ళకు జరగవలసిన జనాభా లెక్కలను ఎంతో కాలం నుంచి వాయిదా వేస్తున్నారు! మన వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా విశ్వసించదగ్గ జనాభా లెక్కలు ప్రతి పదేళ్ళకీ అందుతున్నాయి. అంతటితో తృప్తి పడకుండా యుద్ధ ప్రాతిపదికన జనాభాను అదుపు చేసే చర్యలు చేపట్టటం జాతి మనుగడకు ప్రజల సంక్షేమానికి అత్యవసరం.

* * *

# కొత్త రాష్ట్రాలు ప్రజల కోసమా, పదవుల కోసమా?

**నవంబరు 6, 2000**

ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాంచల్ పేరిట మరో రాష్ట్రం రూపుదాల్చింది. ఈ నెల ఒకటో తేదీన మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గడ్ రాష్ట్రం అవతరించింది. పదిహేనో తేదీన బీహార్ నుంచి వనాంచల్ (జార్ఖండ్) విడివడి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటవుతుంది. చాలా ఏళ్ల తరవాత ఒక్కసారిగా మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పడటంతో దేశంలో పలు ప్రాంతాలలో మరిన్ని కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే వాదన ఊపందుకుంది. ఉత్తరప్రదేశ్ నుంచి బుందేల్‌ఖండ్, పూర్వాంచల్, హరితప్రదేశ్‌లు; బీహార్ నుంచి మిథిలాంచల్, మధ్యప్రదేశ్ నుంచి వింధ్యాచల్‌లు ఏర్పాటు చేయాలని వివిధ వర్గాల నుండి డిమాండ్ వినవస్తోంది. అలాగే అస్సాం నుంచి బోడో రాష్ట్రం, మహారాష్ట్ర నుంచి విదర్భ, కొంకణ్; గుజరాత్ నుంచి కచ్, సౌరాష్ట్ర; కర్ణాటక నుంచి కొడగు, ఉత్తర కర్ణాటక; పశ్చిమబెంగాల్ నుంచి గుర్ఖాలాండ్ వేరుపడి ప్రత్యేక రాష్ట్రాలు కావాలని కొందరు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణ కావాలని, అది జరిగితే రాయలసీమ కూడా విడిపడాలన్న వాదనలూ ఉన్నాయి. జమ్మూ, లడక్ ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రాలుగా విడగొట్టాలనే మరో వాదన కాశ్మీర్ సమస్య పరిష్కారంతో ముడిపడి ఉంది. ఇలా మూడు కొత్త రాష్ట్రాల ఏర్పాటు ఒక రకంగా దేశంలో కందిరీగల తుట్టెను కదిలించినట్లయింది.

## విచిత్రమయిన ఫెడరల్ వ్యవస్థ

భారత ఫెడరల్ వ్యవస్థ చాలా విచిత్రమయింది. రాజ్యాంగంలో మూడో అధికరణ ప్రకారం పార్లమెంటు కేవలం ఓ సాధారణ చట్టం ద్వారా కొత్త రాష్ట్రాలను ఏర్పరచవచ్చు. ఉన్న రాష్ట్రాలను కలపవచ్చు; పేర్లు మార్చవచ్చు; కొన్ని ప్రాంతాలను విడగొట్టవచ్చు; రాష్ట్రాల పేర్లను, స్వరూప స్వభావాలను సమూలంగా మార్చవచ్చు! రాష్ట్రాలను మార్చేటప్పుడు పార్లమెంటుకున్న ఒకే ఒక్క పరిమితి ఏమంటే మార్పులకు గురయ్యే రాష్ట్రాల శాసనసభల అభిప్రాయాలను తీసుకోవాలి. అయితే ఆ రాష్ట్రాల శాసనసభల భావాలను ఆమోదించనక్కరలేదు. ప్రపంచంలో మరెక్కడా ఇలా రాష్ట్రాల ఉనికినే సమూలంగా మార్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదు! ఇదివరకటి

సోవియట్ యూనియన్‌లోని రాజ్యాంగంలోనైతే రాష్ట్రాలకు దేశం నుంచి విడిపోయే హక్కు కూడా ఉంది. చివరకు ఆ విధంగానే 1991లో సోవియట్ యూనియన్ 15 ముక్కలుగా విడిపోయింది. బానిసత్వ నిర్మూలన సమస్యపైన విభేదాలు వచ్చినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు అలాగే విడిపోవాలని తీర్మానించుకోవటం వల్ల అమెరికాలో 1861-65 మధ్య అంతర్యుద్ధం జరిగి మొత్తం జనాభాలో పదిశాతం మరణించారు. చివరకు ఫెడరల్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు గెలిచాయి. దక్షిణాది రాష్ట్రాల కూటమి (కాన్‌ఫెడరేట్ రాష్ట్రాలు) లొంగిపోవటంతో అమెరికా చరిత్రలో నూతనాధ్యాయం మొదలయింది. కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి ఇతర ఫెడరల్ దేశాలలో కూడా రాష్ట్రాలను మార్చాలన్నా, వాటి ఉనికికి భంగం కలిగించాలన్నా చాలా కష్టం. ఒక్క భారత్‌లో మాత్రమే ఇంత సులభంగా రాష్ట్రాల ఉనికిలో మార్పులు తేవచ్చు.

రాజ్యాంగం ప్రకారం కొత్త రాష్ట్రాల ఏర్పాటు చాలా సులభమయినప్పటికీ ఇటీవలి వరకు మనదేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఈ విషయంలో ఎంతో సంయమనంతో, బాధ్యతతో వ్యవహరించాయి. స్థానికంగా కొంత ఇబ్బంది ఎదురైనా వాటిని తట్టుకుని ప్రధాన పార్టీలు నిలబడగలిగాయి. ఒక ప్రాంతంలో తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే దేశంలో ఇతర ప్రాంతాలలో పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుందనే భయం జాతీయ పార్టీలను అదుపులో ఉంచింది. అందునా నాలుగు దశాబ్దాలకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల విభజన అంశాన్ని చాలా తీవ్రంగా పరిగణించింది. ఈశాన్య ప్రాంతంలో ప్రత్యేక కారణాల వల్ల కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయటం మినహాయించి, మిగిలిన అన్ని ప్రాంతాలలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకే కాంగ్రెస్ కట్టుబడి ఉండటంతో దేశ రాజకీయ వ్యవస్థలో కొంత స్థిరత్వం సాధ్యమయింది. అయితే బి.జె.పి. నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఎ.) మూడు కొత్త రాష్ట్రాల ఏర్పాటును ప్రతిపాదించటం, ప్రధాన ప్రతిపక్షమయిన కాంగ్రెస్ అందుకు అంగీకరించి రాజ్యసభలో సహకరించటం వల్ల ఇప్పుడీ పరిస్థితి మారింది. ఈ కారణంగానే మరిన్ని రాష్ట్రాలు కావాలనే వాదనలు వినవస్తున్నాయి. కొంతమేరకు దేశ రాజకీయ ముఖచిత్రం అనిశ్చిత పరిస్థితికి లోనయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. కొత్త రాష్ట్రాలు ఇలా ఏర్పరచటం అవసరమా? అందువల్ల ప్రజలకు ప్రత్యేక ప్రయోజనాలు సమకూరతాయా? దేశ సమగ్రతకు,

ఐక్యతకు భంగం కలగకుండా ఏమైనా ఏర్పాట్లుండాలా? రాష్ట్రాల ఎల్లల వల్ల పౌరుల స్వేచ్ఛకు, దేశప్రగతికి ఆటంకం కలగకుండా ఏం చర్యలు తీసుకోవాలి? – ఈ ప్రశ్నలకు నిర్దిష్టమయిన సమాధానాలు రాబట్టటం అవసరం. అలాకాక కొత్త రాష్ట్రాలు కేవలం మరిన్ని ప్రభుత్వాల ఏర్పాటుకు, పదవుల పందేరానికి, రాజకీయ వ్యూహాలకు సంబంధించిన అంశంగా మారితే అది ప్రజాప్రయోజనాలను మంటగలుపుతుంది.

ఉన్న రాష్ట్రాలు శాశ్వతంగా అలాగే కొనసాగాలని, ఏ మార్పులూ ఉండరాదని కోరటం అసంబద్ధం. అలాగే చీటికీమాటికీ స్థానిక రాజకీయాల కారణంగా తాత్కాలిక లబ్ధి కోసం రాష్ట్రాల విభజన చేపట్టడం బాధ్యతారాహిత్యమవుతుంది. జనాభా, వనరుల రీత్యా ఒక కొత్త రాష్ట్రం ఏర్పాటు సబబైనప్పుడు, అక్కడి జనాభాలో కొత్త రాష్ట్రం కావాలనే కోరిక బలంగా ఉన్నప్పుడు, పరిపాలన సౌలభ్యం కోసం కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. అయితే దాన్ని ఆషామాషీ వ్యవహారంగా భావించటం ప్రమాదకరం. ఎంతో విచక్షణతో, విజ్ఞతతో, దూరదృష్టితో, ఆచితూచి అడుగెయ్యటం అవసరం. కొత్త రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియను మరింత ప్రజాస్వామ్యబద్ధంగాను, పక్షపాత రాజకీయాలకు అతీతంగాను చేయవచ్చు. ఉదాహరణకు, తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకుండా రెండు వేర్వేరు శాసనసభ సమావేశాలు ఐదు సంవత్సరాలలోగా రెండుసార్లు తీర్మానిస్తేనే రాష్ట్రం ఏర్పాటయ్యేలా సంప్రదాయాన్ని పాటించవచ్చు. దాంతోపాటు ప్రజాభిప్రాయ సేకరణకు అవకాశం కల్పించవచ్చు. ఇలా కొన్ని ప్రజాస్వామ్య పద్ధతులను, దీర్ఘకాలిక ప్రక్రియను, సంప్రదాయాలను ప్రవేశపెడితే రోజుకో కొత్త రాష్ట్రం వస్తుందనే భయంకాని, రాష్ట్రాల ఏర్పాటు పేరుతో తాత్కాలికంగా రాజకీయ పబ్బం కోసం హడావుడి చేస్తారనే శంకగానీ ఉండవు. పంజాబ్, హర్యానా, హిమాచల్ రాష్ట్రాల చరిత్రను, మహారాష్ట్ర, గుజరాత్‌ల అనుభవాన్ని పరిశీలిస్తే చిన్న రాష్ట్రాల వల్ల అభివృద్ధి మరింత త్వరగా జరిగే అవకాశముంటుందని రుజువవుతుంది. ప్రజాభిప్రాయం అనుకూలించినప్పుడు, తగిన జనాభా, వనరులు, ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉన్నప్పుడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయటంలో తప్పు లేదు. అయితే ఇలాంటి నిర్ణయాలను నిష్పాక్షికంగా, నింపాదిగా చేసే ఏర్పాట్లు ఉండటం అవసరం.

రాష్ట్రాల ఏర్పాటు గురించి చర్చించేటప్పుడు మనదేశంలో ఓ మౌలికమయిన అంశాన్ని విస్మరిస్తున్నాం. మన రాజ్యాంగం ప్రకారం దేశమంతటా ఒకే పౌరసత్వం అమలులో ఉంది. దేశ ప్రజలు ఎక్కడ జన్మించినా, ఎక్కడ నివసించినా అందరూ

భారత పౌరులే గానీ ఆయా రాష్ట్రాల పౌరులు కాదు. రాష్ట్రాల ఏర్పాటు కారణంగా ఈ పౌరహక్కులకు, రాజ్యాంగం ద్వారా మనకు మనం ప్రసాదించుకున్న స్వేచ్ఛలకు ఏ రకంగాను భంగం కలగరాదు. దేశంలో ఎక్కడ జన్మించినా, దేశ పౌరులందరికీ ఎక్కడయినా నివసించే హక్కు ఉంది. అలాగే దేశంలో ఎక్కడైనా విద్యనార్జించే హక్కు, ఉపాధి పొందే హక్కు, ఇష్టం వచ్చిన వృత్తిని, వ్యాపారాన్ని చేపట్టే హక్కు, చట్టబద్ధంగా ఆస్తిని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉండాలి. జాతులతో, కులాలతో, పుట్టుకతో రాష్ట్రాల విభజనను కలిపి చూస్తే దేశంలో హింస చెలరేగటం ఖాయం; దేశం ముక్కచెక్కలవటం తథ్యం. అమెరికాలో 50 రాష్ట్రాలున్నాయి. రాజధాని వాషింగ్టన్ నగరం కేంద్రపాలిత ప్రాంతం. అమెరికాలో ఎక్కడ పుట్టినా దేశంలోని ప్రతి రాష్ట్రంలోను నివసించే హక్కు, విద్య, ఉపాది అవకాశాలు, అన్ని స్వేచ్ఛలు అందరు పౌరులకు సమానంగా ఉన్నాయి. ఈ పౌర హక్కులను గుర్తించి, గౌరవించి, రక్షించినప్పుడే దేశం ఒకటిగా కలకాలం మనగలుగుతుంది. భాషపరంగా పాలన సౌలభ్యం కోసం ఉద్యోగాలలో కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉండవచ్చు. ఉదాహరణకు– ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వోద్యోగం కావాలంటే తెలుగు, కర్ణాటకలో కావాలంటే కన్నడం విధిగా తెలిసి ఉండాలని నిబంధన విధించటం సబబైనదే.

దేశ ప్రయోజనాలు కాపాడాలంటే మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. భాష విషయంలో అల్పసంఖ్యాక వర్గాల రక్షణకు కొన్ని ప్రత్యేక చర్యలు అవసరం. ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా చేపట్టాలి. ఉదాహరణకు– బంగారప్ప ముఖ్యమంత్రిగా ఉండగా 1992లో కర్ణాటకలో కావేరీ జలాల వివాదం సందర్భంలో తమిళులపైన తీవ్రంగా దాడులు జరిగాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం ఉందని, అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని అందరికీ తెలుసు. అయినా కేంద్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్లు వ్యవహరించింది. ఇలా అల్పసంఖ్యాక వర్గాల వారిని అణచివేస్తారనే భయం ఉంటే దేశం కలిసి ఉండటం అసాధ్యం. అలాగే దేశమంతటా పెట్టుబడులు, వ్యాపారం, వాణిజ్యం విషయాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉమ్మడి ఆర్థిక వ్యవస్థగా ఉండాలి. అప్పుడే ప్రజలకు ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు అందుతాయి. సహజ వనరులు– ముఖ్యంగా అంతర్‌రాష్ట్ర జలవనరుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తేవాలి. అలాకాక ప్రతి సహజ వనరును ఆయా ప్రాంతాలవారు తమకు మాత్రమే చెందినదిగా భావిస్తే దేశ ఐక్యతకు, సమగ్రతకు

అర్థమే లేదు. దేశ సమగ్రతను, భద్రతను దెబ్బతీసే కొన్ని నేరాలను జాతీయ స్థాయిలో నేరాలుగా పరిగణించి నేర విచారణను చేపట్టాలి. ఇందుకు అన్ని రాష్ట్రాలూ ముందుకు రావాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనను చాలా రాష్ట్రాలు అసంబద్ధంగా వ్యతిరేకించాయి. ప్రతి అంశాన్నీ అధికారంతో ముడిపెట్టి జాతీయ ప్రయోజనాలను విస్మరించటం ప్రజాస్వేచ్ఛకు, జాతి భద్రతకు ముప్పుగా పరిణమిస్తుంది.

## పరిష్కారం ఇదొక్కటేనా?

కేవలం కొత్త రాష్ట్రాలు ఏర్పడినంత మాత్రాన ప్రజలకేదో జరుగుతుందనుకుంటే పొరపాటు. రాష్ట్రాల ఏర్పాటు కొందరు రాజకీయ నాయకులకు పదవుల పంపకాలకు, అధికారుల బదిలీలకు, నియామకాలకు ఉపయోగపడవచ్చు కాని పౌరులకు జరిగేది చాలా తక్కువ. రాష్ట్రాలు చిన్నవయితే మంచిదే కాని, అంతమాత్రం చేత మంచి పాలన అందుతుందన్న హామీ ఏమీలేదు. అధికారాన్ని వికేంద్రీకరించి పౌరుడికి చేరువగా తేవటం; ఎన్నికలలో సంస్కరణలు చేపట్టి మంచి మనుషులు నిజాయితీగా అధికారంలో మనగలిగే పరిస్థితిని కల్పించటం; పాలన సంస్కృతిని మార్చటం; ప్రజల పేరుతో ఎన్నికయిన నేతలు, ఎంపికయిన ఉద్యోగులు ప్రజల సేవకులుగా, ప్రజలకు అందుబాటులో వ్యవహరించేలా ఏర్పాటు చేయటం ముఖ్యం. మన రాష్ట్రాన్ని చూస్తే 30 లక్షల జనాభా ఉన్న ఓ జిల్లా ప్రజల పేరుతో ప్రభుత్వాలు ఏటా రూ. 2000 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. కానీ ప్రజలకు నిజంగా అందేది కనీసం రూ. 200 కోట్లు కూడా లేదు! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం డబ్బు దేశ రక్షణకు, పెద్ద ప్రాజెక్టులకు ఖర్చు చేసినా, మిగిలిన వెయ్యి కోట్లు జిల్లాలోనే స్థానిక ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే వినియోగమయ్యేలా ఏర్పాటు చేసినప్పుడే ప్రజలకు నిజంగా న్యాయం చేకూరుతుంది, ప్రజాధనం సద్వినియోగమవుతుంది. అధికారం కేంద్రీకృతమై, కొద్దిమంది చేతుల్లోనే ఉన్నంతకాలం రాష్ట్రాలు చిన్నవయినా, పెద్దవయినా ప్రజలకు లాభం ఉండదు. అందుకే అధికార వికేంద్రీకరణ కోసం, ఎన్నికల సంస్కరణల కోసం, పాలన సమాచార హక్కు కోసం, అవినీతి నిర్మూలన కోసం ప్రజలు పోరాడాలి. అందలాలెక్కి పౌరులను విస్మరించే ప్రభుత్వాలు ఎక్కడుంటే మాత్రం ప్రజలకేం లాభం? రాజకీయాన్ని సరిదిద్దనంత వరకూ రాజధాని దగ్గరయినంత మాత్రాన ప్రజలకు ఒరిగేదేమీ లేదు.

* * *

# పరిణతి చెందుతున్న ఫెడరల్ వ్యవస్థ

**మే 19, 2003**

ఉపప్రధానమంత్రి ఎల్.కె. అద్వానీ అధ్యక్షతన ఈ నెల 13వ తేదీన కీలకమైన అంతర్‌రాష్ట్ర మండలి స్థాయీ సంఘం సమావేశం జరిగింది. కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమీక్షించటానికి 1980లలో ఏర్పాటు చేసిన సర్కారియా కమిషన్ ప్రతిపాదించిన 17 అంశాల మీద ఆ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు వార్తలొచ్చాయి. కొన్ని అంశాల మీద ఏకాభిప్రాయం వ్యక్తం కాగా, మరికొన్ని అంశాల మీద విభేదాలు ప్రస్ఫుటమయ్యాయి. ఇలా సంస్థాగతంగా కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమీక్షించటానికి, వివాదాలను సామరస్యంగా పరిష్కరించటానికి ప్రయత్నాలు జరగడం శుభసూచకం. గత ఐదు దశాబ్దాల కాలంలో భారత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య అవగాహన మెరుగయింది. ఒక రకంగా సమాఖ్య బాగా పరిణతి చెందిందని చెప్పవచ్చు. రాజ్యాంగం ప్రకారం భారత్ రాష్ట్రాల సమాఖ్యగా ఏర్పడింది. అమెరికాలాంటి దేశంలో మొదట రాష్ట్రాలు ఉండి, ఆ తరువాత వలస పాలనపైన పోరాడటం కోసం, ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసం అవి సమాఖ్యగా ఏర్పడ్డాయి. అందుకే అమెరికా సంయుక్త రాష్ట్రాలలో జాతీయస్థాయి ప్రభుత్వానికి రాష్ట్రాలపై అధికారాలు తక్కువ. ఆ దేశంలో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగంలో పేర్కొనని కొత్త అంశాలు (రెసిడ్యుయల్ సబ్జెక్టు) రాష్ట్రాల పరిధిలోకి వస్తాయి. మునుపటి సోవియట్ యూనియన్ 15 స్వతంత్ర రాష్ట్రాల సమాఖ్య. వాస్తవానికి కమ్యూనిస్టు పాలనలో, కేంద్రీకృత నియంతృత్వంలో ఆ దేశం మగ్గినప్పటికీ, రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలన్నింటికి స్వతంత్ర అధికారాలు ఉండేవి. చివరికి సమాఖ్య నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా అవతరించే హక్కు కూడా సోవియట్ సమాఖ్యలో రాష్ట్రాలకు ఉండేది. 1991లో కమ్యూనిజం అంతరించినప్పుడు సోవియట్ యూనియన్‌లో జరిగిందదే. ఆనాటి వరకు సమాఖ్యలో భాగంగా ఉన్న 15 రాష్ట్రాలు స్వతంత్ర దేశాలుగా శాంతియుతంగా విడిపోయాయి. భారతరాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం చాలా బలమైనది. రాష్ట్రాలు కలిసి కూటమిగా ఏర్పడటంకాక, మన దేశాన్ని రాష్ట్రాలుగా విభజించటం జరిగింది. నిజానికి ఓ కొత్త రాష్ట్రాన్ని ఏర్పరచాలన్నా, ఉన్న రాష్ట్రాన్ని మరో రాష్ట్రంతో మిళితం చేయాలన్నా, విభజించాలన్నా, రాష్ట్రాల సరిహద్దులను మార్చాలన్నా సాధారణ మెజారిటీతో నిర్ణయాలు చేసే పూర్తి

అధికారాలు భారత పార్లమెంటుకు ఉన్నాయి. అయితే అలాంటి చట్టం చేసే ముందు ఆ రాష్ట్రాల చట్టసభల అభిప్రాయాన్ని తెలుసుకోవలసిన అవసరముంది. అంతే తప్ప రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాల అనుమతి అక్కరలేదు.

## మూడు కీలక పరిణామాలు

పాలన మొత్తాన్ని చాలా వరకు జాతీయ స్థాయిలో కేంద్రీకరించటం వల్ల దేశానికి జరిగిన నష్టం మనందరికీ తెలుసు. కానీ గత 15 ఏళ్లలో దేశంలో చాలా మార్పులు వచ్చాయి. రాష్ట్రాలలో కేంద్రం జోక్యం చేసుకోవటం తగ్గిపోయింది. మన ఫెడరల్ వ్యవస్థలో చాలా పరిణతి వచ్చింది. ఈ పరి ణామాల వెనుక మూడు కీలకమయిన కారణాలున్నాయి.

మొదటిది: రాజకీయాల్లో వచ్చిన పెనుమార్పులు. స్వతంత్రం వచ్చాక కొన్ని దశాబ్దాల కాలంపాటు జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిరాటంకంగా కొనసాగింది. దాంతో రాష్ట్రాల మీద పెత్తనం చెలాయించటం, రాష్ట్ర ప్రభుత్వాలను వేధించటానికి తాను నియమించిన గవర్నర్లను వినియోగించటం, 356వ అధికరణాన్ని దుర్వినియోగపరచి ప్రభుత్వాలను రద్దు చేయటం, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి అస్థిరత్వాన్ని పెంచటం – ఇవన్నీ కాంగ్రెస్ రాజకీయాల్లో అంతర్భాగమయ్యాయి. 1989 నుంచి దేశ రాజకీయాల్లో కీలక మార్పులు వచ్చాయి. నాటి నుంచి జరిగిన అయిదు సాధారణ ఎన్నికలలో కేవలం 1991లో మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. అదీ మైనారిటీ ప్రభుత్వంగా ఏర్పడింది. ఎన్నో రాష్ట్రాలలో వివిధ పార్టీలు ప్రభుత్వాలనేర్పాటు చేశాయి. జాతీయస్థాయిలో 1989లో, 1996, 98, 99లలో సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యమయ్యాయి. జాతీయపార్టీలకు సొంతంగా మెజారిటీ లభించటం అసాధ్యమయింది. ఎన్నో రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర వహిస్తున్నాయి. నిజానికి రెండు ప్రధాన జాతీయపార్టీలు అధికారం కోసం ప్రత్యక్షంగా తలపడుతున్న పెద్ద రాష్ట్రాలు కేవలం మూడు మాత్రమే – అవి: మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్. ఈ పరిస్థితుల్లో కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాల మీద పెత్తనం చేయటం ఆగిపోయింది. అన్ని పార్టీలకు దేశంలో ఎక్కడో ఓ చోట అధికారంలో వాటా ఉండటంతో సంయమనం పెరిగింది. జాతీయ స్థాయిలో ప్రభుత్వ స్థిరత్వం కోసం పార్టీల మధ్య ఏకాభిప్రాయం అవసరమయింది. ప్రజలలో రాజకీయాల పట్ల అవగాహన పెరిగింది. కాబట్టి కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య సయోధ్య అవసరమైంది. గతంలో మాదిరే కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను

దుర్వినియోగం చేసి రాష్ట్రాల మీద పెత్తనం చేయబూనితే, ఆ ప్రభుత్వం వెంటనే పతనమవుతుంది. ఈ రాజకీయ మార్పులు మన ఫెడరల్ వ్యవస్థను మరింత బలపరిచి, రాష్ట్రాల పాత్రను పెంచాయి. బలమైన కేంద్రం, బలమైన రాష్ట్రాలు – రెండూ దేశ ఐక్యతకు, ప్రగతికి అవసరమని పార్టీలు గుర్తిస్తున్నాయి.

మన ఫెడరల్ వ్యవస్థ పరిణతి వెనకనున్న రెండో ముఖ్య కారణం దేశంలో వస్తున్న ఆర్థిక మార్పులు, 1991లో ముదిరిన ఆర్థిక సంక్షోభంతో ఆర్థిక సంస్కరణలు అనివార్యమయ్యాయి. కేంద్రీకరించిన ఆర్థిక వ్యవస్థవల్ల జాతి చాలా నష్టపోయింది. గత 12 ఏళ్ల నుంచి మూడు కీలకమైన ఆర్థిక పరిణామాలు సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేశాయి. మొదటిది లైసెన్సు, పర్మిట్ రాజ్యం కాలక్రమేణా అంతర్ధానం కావటం. దాంతో ఆర్థిక వ్యవస్థ వికేంద్రీకరణ జరిగింది. పెట్టుబడులపై నిర్ణయాధికారాలు పారిశ్రామికవేత్తల చేతుల్లోకి వెళ్లాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాక, లాభ నష్టాల ప్రాతిపదికపైన, పారిశ్రామికీకరణ అవకాశాలనుబట్టి కొత్త పరిశ్రమలు వస్తున్నాయి. రెండోది, ప్రభుత్వరంగంలో కొత్త పెట్టుబడులు తగ్గిపోయాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలలో పెట్టుబడులను పూర్తిగా పక్షపాత ధోరణితో నిర్ణయించేది. ప్రభుత్వరంగం పేరుతో రాజకీయంగా తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పటం, తమను వ్యతిరేకించిన ప్రాంతాలను ఎండగట్టడం ఆనవాయితీగా ఉండేది. ఇప్పుడు ఈ నిర్ణయాలు చాలామేరకు ప్రభుత్వ పరిధిలో నుంచి బయటపడ్డాయి. దాంతో రాష్ట్రాల మధ్య రాజకీయ వివక్షకు అవకాశం లేకుండా పోయింది. మూడవది, కేంద్రం నుంచి రాష్ట్రాలకు వనరుల పంపిణీలో మరింత పారదర్శకత, నిష్పాక్షికత చోటు చేసుకున్నాయి. నిజానికి స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఆర్థిక సంఘం ద్వారాను, ప్రణాళికా సంఘం ద్వారాను జరిగే నిధుల కేటాయింపు మొత్తం మీద నిష్పాక్షికంగా ఉండేది. సరిహద్దుల్లో, పర్వత ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక కేటాయింపులను మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాలన్నింటికీ వనరుల్ని అందరూ అంగీకరించిన సూత్రాల ప్రకారం పంపిణీ చేసేవారు. 10వ ఆర్థిక సంఘం నివేదికను ఆమోదించాక ఈ వనరుల పంపిణీ మరింత మెరుగుపడింది. కేంద్రానికి వచ్చే పన్నుల ఆదాయం మొత్తంలో ఓ నిర్దిష్ట శాతాన్ని (29 శాతం) రాష్ట్రాలకు పంపిణీ చేసేలా 10వ ఆర్థిక సంఘం నిర్ణయించింది. గతంలో ఒక్కో పన్నులో ఒక్కో వాటా ఉండేది. అలాగే కొన్ని పన్నులలో రాష్ట్రాలకు వాటా ఉండేది కాదు. ఇదికాక, ఇతర కేటాయింపులతో కలిపి రాష్ట్రాలకు కేంద్ర పన్నుల ఆదాయంలో దాదాపు 43 శాతం అందుతోంది. దీంతో కేంద్ర – రాష్ట్రాల ఆర్థిక సంబంధాలు

బాగా మెరుగుపడ్డాయి. ఇక ఫెడరల్ వ్యవస్థ పరిణతికి వెనకనున్న మూడవ, అతికీలక కారణం 356 అధికరణం అమలులో వచ్చిన మార్పులు. గతంలో వలసపాలన కాలంలో – ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను అదుపుచేయటం కోసం వాటిని రద్దు చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి కట్టబెట్టారు. దాన్నే 356వ అధికరణం పేరుతో మన రాజ్యాంగంలో కొనసాగించి నూరు పర్యాయాలకు పైగా రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దు చేశారు. అందులో నూటికి 95 పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగాను, మిగిలిన పార్టీలకు వ్యతిరేకంగాను నిర్ణయాలు జరిగాయి. బొమ్మై కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో రెండు కీలకమైన మార్పులు వచ్చాయి. రాష్ట్రపతి పాలన విధించిన ప్రతి సందర్భంలోను పార్లమెంటు ఉభయ సభల అనుమతిని పొందాలని, ఒక వేళ రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకంగా ఓ రాష్ట్ర ప్రభుత్వాన్ని శాసన సభను రద్దు చేస్తే ఆ నిర్ణయాన్ని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉందని సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా పేర్కొంది. దాంతో 356వ అధికరణం ఏనాటికీ అమలుకాని మృతాక్షరంగా నిలిచిపోవాలని బాబా సాహెబ్ అంబేద్కర్ వ్యక్తం చేసిన ఆకాంక్ష నేటికి వాస్తవమయింది. ఇక పక్షపాత ధోరణితో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయటం కేంద్ర ప్రభుత్వానికి అసాధ్యం.

## ముందున్న సవాళ్లు

గత 55 ఏళ్ల ప్రజాస్వామ్యంలో ఇలా సమాఖ్య పరిణతి చెందటం స్వతంత్ర భారతంలో మనం సాధించిన గొప్ప విజయం. మన ప్రజాస్వామ్య చరిత్రలో ఎంత సేపటికీ వైఫల్యాలపైనే మనం దృష్టిని సారిస్తున్నాం తప్ప విజయాలను స్మరించుకోవటం లేదు. ప్రపంచంలో అతికొద్ది దేశాలు ఫెడరల్ వ్యవస్థ నిర్మాణంలో విజయం సాధించాయి. అందులో భారత్ ఒకటి. అయితే ఇంకా సమస్యలు లేవని కాదు. గవర్నర్ల నియామకాలు, వారి పక్షపాత ధోరణులు, అఖిల భారత సర్వీసులు, దేశ ఐక్యతకు సంబంధించిన విషయాలలో సమాఖ్యస్ఫూర్తి కొరవడింది. ఈ సమస్యలను ఎదుర్కొని సులువుగా పరిష్కరించే శక్తి మన ఫెడరల్ వ్యవస్థకు ఉంది. అలాగే దేశంలో వివిధ ప్రాంతాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలు జాతి భవిష్యత్తు పట్ల ఆందోళనను కలిగిస్తున్నాయి. గత 50 ఏళ్లలో కేంద్ర – రాష్ట్రాల మధ్య అధికారం కోసం, పక్షపాత ధోరణితో పోరాటాలు జరిగాయి. వచ్చే దశాబ్దాలలో దేశ ఐక్యతను పెంచటం కోసం, ప్రాంతీయ అసమానతలను తొలగించటం కోసం, శీఘ్ర ఆర్థికాభివృద్ధిని సాధించటం కోసం సామరస్యంతో ప్రయత్నించటం అవసరం.

* * *

# పరిమాణం కుదించినంత మాత్రాన పద్ధతులు మారవు

మే 12, 2003

**మంత్రుల సంఖ్యను కుదించినంత మాత్రాన అవినీతి తగ్గుతుందని, దుబారా ఉండదని, ఆశిస్తే అది అమాయకత్వం. చట్టసభల దయాదాక్షిణ్యాల మీద ప్రభుత్వాలు ఆధారపడినంతకాలం రాజకీయాల్లో నిజాయితీ నెలకొనడం అసాధ్యం. అసలు సమస్యను పక్కనపెట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితాలు రావు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకున్నప్పుడే మన ప్రజాస్వామ్యాన్ని సంస్కరించగలం.**

మంత్రివర్గ సంఖ్యను చట్టసభ సభ్యులలో పది శాతానికి మించకుండా ఉండేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. ఈ సవరణను రాష్ట్రాలకు కూడా వర్తింపజేయాలని ప్రతిపాదించారు. పోను పోనూ మంత్రుల సంఖ్య పెరుగుతోందని చాలా మంది విమర్శిస్తున్నారు. స్వతంత్రం వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే మంత్రుల సంఖ్య బాగా పెరుగుతున్న మాట వాస్తవం. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో కేవలం ఆరుగురు మంత్రులు మాత్రమే ఉన్నారట. అంజయ్య మంత్రివర్గంలో 60 మందికి పైగా ఉండేవారు! ఏ పనీ లేని శాఖలకు మంత్రులను నియమించడం, ఒకే శాఖను రెండు మూడు మంత్రిత్వ విభాగాలుగా విడదీయటం ఆనవాయితీ అయ్యాయి. మంత్రి పదవి అంటే విధాన నిర్ణయాలు తీసుకోవటం, సమష్టి బాధ్యత వహించటం అనే అర్థాలు చాలా వరకు అంతర్ధానమయిపోయాయి. చాలా మంది మంత్రుల విషయంలో పదవి అంటే కారు, ఆ కారుమీద పెద్ద లైటు, ఓ ఇల్లు, ఫోన్లు, బంట్రోతులు, సిబ్బంది, అట్టహాసం, బదిలీలలో చట్టబద్ధంగా జోక్యం చేసుకునే అవకాశం – ఇవి తప్ప మరేమీ కాదు.

## పదవుల కోసం పైరవీలు

జాతీయస్థాయిలోగాని, రాష్ట్రాలలో గాని మంత్రిపదవికున్న గిరాకీ ఇంతంత కాదు. ఎన్నికయిన ప్రతి శాసన సభ్యుడు ఏదో ఒక విధంగా మంత్రిపదవి దక్కకపోతుందా అని ఎదురుచూడటం, ఆశపడటం మామూలే. ప్రభుత్వం పరిస్థితి బలహీనంగా ఉంటే మంత్రుల సంఖ్య పెరిగిపోతుంది. 1947 నుంచి 1967 వరకు ప్రభుత్వాలు స్థిరంగా ఉండేవి. దాదాపు దేశమంతటా కాంగ్రెస్ అధికారంలో

ఉండేది. పార్టీలను చీల్చటం, వేరే పార్టీలలోకి మారడం, ఎంతో ప్రతిష్ఠ ఉన్న నాయకులను ఎదిరించటం – ఇవన్నీ ఆనాడు ఊహకు కూడా అందేవి కావు. కాలక్రమేణా చట్టసభ సభ్యుల మద్దతు మీద ప్రభుత్వం మనుగడ ఆధారపడి ఉందనే సత్యం అందరికీ బోధపడింది. అందుకే కులం పేరుతోనో, ఓ చిన్న ముఠా పేరుతోనో ప్రతి శాసనసభ్యుడు మంత్రి పదవిని ఆశించటంతో – పరిపాలన సామర్థ్యం, నిజాయితీ, రాజకీయ సమతుల్యంకాక, ఎలాగోలా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఆరాటమే మంత్రి పదవుల పంపకాలకు ఆధారమయింది. శాసనసభ్యుల సంఖ్యలో పది శాతం మించకుండా మంత్రులుండాలని రాజ్యాంగబద్ధంగా పరిమితి విధిస్తే చాలా రాష్ట్రాలలో మంత్రులను తొలగించాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలలో 4502 మంది శాసనసభ్యులున్నారు. 10 శాతం లెక్కన 450 మంది మంత్రులు ఉండవచ్చు. వాస్తవానికి దేశంలో మొత్తం రాష్ట్రాలలో ప్రస్తుతం 915 మంది మంత్రులున్నారు. అంటే మొత్తం శాసన సభ్యుల సంఖ్యలో 23 శాతం మంత్రులే ఉన్నారు. మంత్రి హోదా ఉన్న ఇతర పదవులలో ఎంత మంది ఉన్నారో తెలియదు. దేశం మొత్తంలో ఒక్క గుజరాత్‌లో మాత్రమే పది శాతంలోపు మంత్రులున్నారు. ఆ రాష్ట్రంలో 182 మంది శాసన సభ్యులుండగా, 15 మంది శాసన సభ్యులకు మాత్రమే మంత్రి పదవులు దక్కాయి. బాగా ఎక్కువ శాతం శాసన సభ్యులు మంత్రులుగా ఉన్న అపఖ్యాతి అరుణాచల్ ప్రదేశ్‌కు దక్కింది. కేవలం 11 లక్షల లోపు జనాభా ఉన్న ఆ రాష్ట్రంలో 60 మంది శాసన సభ్యులుండగా వారిలో 40 మందికి మంత్రి పదవులిచ్చారు! ప్రభుత్వం ఏర్పాటు ఉపాధికల్పన కార్యక్రమంగా మారిందనటానికి అరుణాచల్ ప్రదేశ్ ఓ ఉదాహరణ!

గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలను మినహాయిస్తే అన్ని రాష్ట్రాలలోనూ మంత్రుల సంఖ్య పదిశాతం దాటింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో 79 మంది మంత్రులున్నారు. 1997లో ఆ రాష్ట్రంలో కళ్యాణ్‌సింగ్ 93 మంది సభ్యులతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారు. బి.ఎస్.పి., కాంగ్రెస్ పార్టీలను చీల్చి, పార్టీలు ఫిరాయించిన ప్రతి ఒక్కరికీ, మద్దతుపలికిన స్వతంత్ర సభ్యులందరికీ మంత్రి పదవులనిచ్చారు. ఇక ప్రస్తుత కేంద్ర మంత్రివర్గం కూడా చిన్నదేమీ కాదు. పార్లమెంటు ఉభయసభలలో కలిపి 790 మంది సభ్యులుండగా, మొత్తం 78 మంది మంత్రులున్నారు. వామపక్షాలు అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో కూడా 45 మందికి మంత్రి పదవులు ఇవ్వాల్సి వచ్చిందంటే పదవుల కోసం పైరవీలెలా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మంత్రివర్గంలో సభ్యులు ఎక్కువ కావటం

వల్ల ఇబ్బందులున్న మాట వాస్తవం. చాలా మందికి సరైన కార్యాలయం కూడా ఉండదు. సామర్థ్యంతో నిమిత్తం లేకుండా మంత్రులవుతున్నారు. మంది ఎక్కువవటంతో కలిసి పని చేయటం కష్టమవుతోంది. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం లోపించి, సమష్టి బాధ్యత కాగితాలకే పరిమితమవుతోంది. పెద్దగా పనిలేని మంత్రివర్యులు చాలా మంది ఉండటంతో పైరవీలు పెరిగిపోతున్నాయి. చాలా మంది మంత్రులు తమ నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో... రాజ్యాంగబద్ధంగా మంత్రుల సంఖ్యకు పరిమితులు విధించినంత మాత్రాన పాలన చక్కబడదు. మంత్రి పదవులు లేకపోతే అదే హోదా, సౌకర్యాలు ఉన్న వేరే పదవులను సృష్టిస్తారు. అదీ చాలకపోతే శాసనసభ్యులకు నియోజకవర్గ నిధుల పేరుతో డబ్బు మంజూరు చేస్తారు. ఇంకా అవసరమైతే శాసనసభ్యుడిని  ఆ నియోజకవర్గానికి మకుటంలేని మహారాజుగా ప్రకటిస్తారు. కేవలం మంత్రుల సంఖ్యను తగ్గించినంత మాత్రాన ఈ పరిస్థితి మారదు. ఈ సమస్యకు మూలకారణం ప్రభుత్వాల మనుగడ చట్టసభ సభ్యుల మీద ఆధారపడి ఉండటం. అందుకే ఏదో ఒక విధంగా ఎక్కువ స్థానాలు పొందేందుకు బాగా డబ్బు పెట్టుబడి పెట్టగలిగినవాళ్లను, తిమ్మిని బమ్మిని చేసి గెలిచే శక్తిగలవాళ్లను పార్టీలు ఎంపిక చేస్తున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున కోటి రూపాయలపైన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చుపెడుతున్నారు.  అలాంటప్పుడు పెట్టిన 'పెట్టుబడి' మీద ప్రతిఫలం రావాలి. ఆ పైన, కుటుంబానికి తరాలపాటు తిన్నా తరగని ఆస్తిని సంపాదించి పెట్టాలి. ఆశ్రితులకు ఆదాయం కావాలి. వచ్చే ఎన్నికలలో ఖర్చుపెట్టడానికి అవసరమైన వనరులు సమకూర్చుకోవాలి. ఇలా కోటి ఖర్చుపెడితే పదికోట్ల ఆదాయం రావాలి. అలా ఆదాయం కావాలంటే ప్రత్యక్షంగా అధికారమున్న మంత్రి పదవి కావాలి.

ఎన్నికలలో ఇంతేసి ఖర్చులు ఎందుకు పెడుతున్నారు? నిజానికి ఎలాంటి సొంత అధికారంలేని శాసనసభ, పార్లమెంటు సభ్యుల స్థానాలకు ఇంతగా ఎందుకు పోటీ పడుతున్నారు? ప్రత్యక్షంగా అధికారం లేకపోయినా చట్టసభ సభ్యుల మద్దతు లేకపోతే ప్రభుత్వం ఒక్కరోజు కూడా మనుగడ సాగించలేదని అందరికీ తెలుసు కాబట్టి! ఒకసారి ఏదో ఒకరకంగా శాసనసభ్యుడయితే చక్రం తిప్పవచ్చు. మంత్రి పదవి వస్తే సరేసరి లేకపోయినా పరోక్షంగా రాజ్యాధికారాన్ని చలాయించవచ్చు. ప్రభుత్వం నిలబడాలంటే చట్ట సభ సభ్యుల మాట చెల్లాల్సిందే. చట్టసభలో చర్చలు, చట్టాలు, విధానాలు – వీటిపట్ల అత్యధిక సభ్యులకు ఎటువంటి ఆసక్తీలేదని అందరికీ తెలుసు. నిజానికి చాలా మందికి కావలసింది సభ బయట పైరవీలు మాత్రమే. ఈ పద్ధతిని మార్చటం ఎలా? చట్టసభ నుంచి ప్రభుత్వం ఏర్పడినంతకాలం ఎన్నికలలో నిజాయితీ పెరగదు. శాసనసభ్యుల మద్దతు కోల్పోగానే ప్రభుత్వాలు కూలినంత

కాలం పాలనలో నీతి బతకదు. పరోక్ష రాజ్యాధికారం ఉన్నంత కాలం పైరవీలు తప్పవు. ప్రజాసంక్షేమం ఎవరికీ పట్టదు. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడి, నిర్దిష్టకాలం మనుగడ సాగించేలా ఏర్పాటుండాలి. అంటే ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. చట్టసభను వేరుగా ఎన్నుకోవాలి. చట్టసభను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉండరాదు. తమకు పదవులు రాలేదనో, డబ్బు సంచులు పంచలేదనో ప్రభుత్వాన్ని కూల్చే అవకాశం చట్టసభకు ఉండకూడదు. చట్టాలు చేసేందుకు, ప్రభుత్వం పైన నిఘా వేసేందుకు, విధానాలను సమీక్షించేందుకు, ప్రజాకార్యక్రమాలకు ప్రజాధనాన్ని మంజూరు చేసేందుకు చట్టసభ ఉంది. రోజువారీ పాలన నడిపేందుకు, విధానాలను రూపొందించేందుకు, చట్టాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఉంది. ఒకరి విధి నిర్వహణలో మరొకరి జోక్యం ఉండకూడదు. అధికారాల విభజన నిర్దిష్టంగా ఉండాలి.

## ప్రత్యక్ష ఎన్నికలే శరణ్యం

ప్రభుత్వాన్ని అదుపులో ఉంచటం, చట్టాలు చేయటం బడ్జెట్‌ను ఆమోదించటం – ఇవన్నీ చాలా కీలకమయిన, అత్యంత క్లిష్టమయిన కార్యక్రమాలు. చాలా ప్రజాస్వామ్య సమాజాలలో చట్ట సభలే ఈ పనులన్నీ నిర్వర్తించే పరిస్థితి లేదు. సభా సంఘాలకు విశేషమయిన అధికారాలనిచ్చి, ఆ సంఘాల ద్వారా చట్ట సభలు పని చేస్తాయి. పాలనలో ఏ లొసుగులున్నా ఆ సభా సంఘాలు పట్టించుకుంటాయి. చివరికి ఉన్నతాధికారుల నియామకాలపైన, ప్రభుత్వ విధానాలపైన సభా సంఘాలకు పట్టు ఉంటుంది. అలాంటి ఏర్పాట్లు మన చట్టసభలలో కూడా అన్ని స్థాయులలో ఉండటం అవసరం. కార్యకర్తలకు నిజాయతీగా స్థానిక ప్రభుత్వాలలో అవకాశాలివ్వాలి. స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలను, వనరులను కట్టబెడితే.. పార్టీ కార్యకర్తలూ రాజకీయాలలో సక్రమంగా ఎదుగుతారు. తమ సామర్థ్యాన్ని కనబరచి పాలనను మెరుగు పరుస్తారు. ఆ విధంగా అన్ని స్థాయులలోనూ ప్రజాస్వామ్యం బలపడుతుంది. పాత నీరు పోగానే కొత్త నీరు వచ్చి చేరుతుంటుంది. అన్ని స్థాయులలోను జవాబు దారీతనం చోటు చేసుకుంటుంది. మంత్రుల సంఖ్యను కుదించినంత మాత్రాన అవినీతి తగ్గుతుందని, దుబారా ఉండదని ఆశిస్తే అది అమాయకత్వం. చట్ట సభల దయాదాక్షిణ్యాల మీద ప్రభుత్వాలు ఆధారపడినంతకాలం రాజకీయాల్లో నిజాయితీ నెలకొనడం అసాధ్యం. అసలు సమస్యను పక్కనపెట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితాలు రావు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకున్నప్పుడే మన ప్రజాస్వామ్యాన్ని సంస్కరించగలం.

* * *

# అనర్హతకు ఇవీ గీటురాళ్లు

మార్చి 20, 2006

లాభదాయక పదవిలో కొనసాగుతున్నందుకు రాజ్యసభ సభ్యత్వానికి జయా బచ్చన్ అనర్హురాలని రాష్ట్రపతి ప్రకటించడంతో- అసలు అనర్హత ఎవరెవరికి, ఏ పరిస్థితుల్లో వర్తిస్తుందని చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో రాజ్యాంగ నిబంధనలు ఏమంటున్నాయనేది కీలకం. పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయించే అధికారం పార్లమెంటుకే తప్ప రాష్ట్ర శాసనసభకు లేదు. ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఆమోదించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్ర వేసి ఉంటే జయా బచ్చన్‌పై అనర్హత వేటు పడేది కాదన్న వాదనలో వాస్తవం లేదంటున్న వ్యాసమిది.

జయా బచ్చన్ రాజ్యసభ సభ్యత్వాన్ని రాష్ట్రపతి రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి మండలి అధ్యక్షురాలిగా 2004 జూలై14 నుంచి లాభదాయక పదవిలో కొనసాగుతున్నందున ఆమె రాజ్యసభ సభ్యత్వానికి అనర్హురాలని రాష్ట్రపతి ప్రకటించారు. పార్లమెంటు సభ్యులొకర్ని ఈ విధంగా అనర్హతకు గురిచేయటం ఇదే మొదటిసారి. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అమర్‌సింగ్‌పై కూడా  ఇదే విధమైన చర్య తీసుకోబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో కొన్ని పదవుల్లో ఉన్న పార్లమెంటు సభ్యులను అనర్హత ప్రమాదం నుంచి తప్పిస్తూ ఉత్తరప్రదేశ్ శాసనసభ ఒక బిల్లును ఆమోదించింది. కానీ దానిని గవర్నర్ సమ్మతి లభించలేదు. అనర్హత అంశం రానున్న కాలంలో పెనురాజకీయ వివాదంగా మారేది ఖాయం. ఈ నేపథ్యంలో-చట్టసభల సభ్యత్వం విషయంలో రాజ్యాంగం, చట్టం ఏం చెబుతున్నాయో ప్రజలు అవగాహన చేసుకోవడం  ముఖ్యం.

### నిబంధనల్లో ఏముంది?

రాజ్యాంగంలోని 102వ అధికరణ కింద జయాబచ్చన్‌ను అనర్హురాలిగా ప్రకటించారు. అనర్హత పరిధిలోకి రావని పార్లమెంటు ప్రకటించిన పదవులను మినహాయించి- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఇతర లాభదాయక పదవికి ఎంపికైన, నిర్వహిస్తున్న పార్లమెంటు ఉభయ సభల సభ్యుల్లో ఎవరినైనా అనర్హుడిగా ప్రకటించ వచ్చునని 102(1)(ఎ) అధికరణ స్పష్టం చేస్తోంది. ఒక వ్యక్తి కేంద్రంలోనో, రాష్ట్రంలోనో మంత్రిగా ఉన్నంత మాత్రాన లాభదాయక పదవిని ఆశించరాదని రాజ్యాంగం కూడా

స్పష్టం చేసింది. అనర్హతకు సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు, ఆ అంశాన్ని రాష్ట్రపతికి నివేదించాలని, ఆయనదే తుది నిర్ణయమని 103వ అధికరణ పేర్కొంటోంది. రాష్ట్రపతి నిర్ణయం తీసుకొనే ముందు ఎన్నికల కమిషన్ అభిప్రాయాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. దాన్ని అనుసరించి చర్య తీసుకోవలసి ఉంటుంది. ఎన్నికల కమిషన్ అభిప్రాయానికి అనుగుణంగా రాష్ట్రపతి నడచుకోక తప్పని పరిస్థితిని రాజ్యాంగ నిబంధనలు కల్పిస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని ఉపయోగించే అవకాశమే లేదు. ఒక విధంగా ఎన్నికల కమిషన్‌దే తుది నిర్ణయమన్నమాట. ఒక సభ్యుడి అనర్హతపై నిర్ణయం తీసుకోవడం వంటి కీలకాంశంలో పక్షపాతానికి తావులేకుండా చూసే ఉద్దేశంతో ఈ నిబంధనను రాజ్యాంగంలో పొందుపరిచారు.

రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సభ్యత్వం విషయానికి వస్తే- 191,192 అధికరణల్లో ఇలాంటి నిబంధనలే ఉన్నాయి. అనర్హత పరిధిలోకి రాదంటూ రాష్ట్ర శాసనసభ ప్రకటించిన పదవిలో ఉన్న శాసనసభ్యుణ్ని అనర్హత నుంచి మినహాయిస్తారు. ఎన్నికల కమిషన్ అభిప్రాయం ప్రాతిపదికగా అనర్హతపై గవర్నర్ నిర్ణయం తీసుకొంటారు.

ఈ నిబంధనలనుబట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. ఫలానా పదవుల్లో ఉంటే పార్లమెంటు సభ్యత్వానికి అనర్హులు కారు అంటూ 102వ అధికరణ ప్రకారం ఒక్క పార్లమెంటు మాత్రమే ప్రకటన చేయగలుగుతుంది. పార్లమెంటు సభ్యులు అనర్హతకు గురికాకుండా ఆయా పదవులకు మినహాయింపు ఇచ్చే అధికారం రాష్ట్ర శాసనసభకు లేదు. అందువల్ల, పార్లమెంటు సభ్యుల అనర్హతపై నిర్ణయానికి సంబంధించి ఉత్తరప్రదేశ్ శాసనసభ చేసిన శాసనానికి ఎలాంటి విలువ లేదు. ఉత్తరప్రదేశ్ శాసనసభ ఆమోదించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ టి.వి. రాజేశ్వర్ రాజముద్ర వేసి ఉంటే జయా బచ్చన్‌పై అనర్హత వేటు పడేది కాదంటూ ప్రసార సాధనాల్లో పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఉత్తర ప్రదేశ్ శాసనసభ చేసే అలాంటి చట్టమేదీ 102 అధికరణకింద చెల్లుబాటు కాదు. గవర్నర్ ఆ బిల్లుకు ఆమోదముద్ర వేయకపోవడం సరైనదే. ఒక పార్లమెంటు సభ్యుణ్ని అనర్హత వేటు నుంచి కాపాడేది పార్లమెంటే.

పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయిస్తున్న తీరు అనేక సందేహాలకు

తావిస్తోంది. కొన్ని లాభదాయక పదవులను చేపట్టే పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయిస్తూ పార్లమెంటు 1959 ఒక చట్టం చేసింది. (1959 నాటి పదో చట్టం) ఎప్పటికప్పుడు లాభదాయక పదవులను మినహాయిస్తూ ఆ చట్టానికి సవరణలు చేశారు. ఉదాహరణకు– పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, పార్లమెంటులోని గుర్తింపు పొందిన పార్టీల లేదా వర్గాల నాయకులు, విప్‌లతోపాటు మైనారిటీల కమిషన్; ఎస్.సి, ఎస్.సి కమిషన్; మహిళా కమిషన్ అధ్యక్షులను కూడా అనర్హత నుంచి మినహాయించారు. అంటే పార్లమెంటు సభ్యులు ఈ పదవుల్లో కొనసాగినా– వారి సభ్యత్వానికి ఎలాంటి ఢోకా ఉండదన్నామాట.

లాభదాయక పదవుల్లో ఉంటూ, అనర్హతకు గురి అయ్యే అవకాశం ఉన్న పార్లమెంటు సభ్యుల సంఖ్య 44 వరకు ఉందని వార్తలు తెలుపుతున్నాయి. ఏ పరిస్థితుల్లో అనర్హత వర్తించదో 1959నాటి చట్టం 3వ సెక్షన్‌లోని (హెచ్) (ఐ) ఉపసెక్షన్లు స్పష్టం చేస్తున్నాయి. సెక్షన్ 3 (హెచ్) ప్రకారం– ప్రజా ప్రాధాన్యం కలిగిన ఏదైనా అంశంపై ప్రభుత్వానికి లేదా ఏదైనా సంస్థకు సలహా ఇవ్వడానికి లేదా దర్యాప్తు చేయడానికి తాత్కాలికంగా ఏర్పాటైన కమిటీకి అధ్యక్షుడిగానో, సభ్యుడిగానో ఉంటూ– గౌరవభృతి తప్ప ఎలాంటి పారితోషికం పొందని పార్లమెంటు సభ్యుణ్ని అనర్హత నుంచి మినహాయించారు. గైరవ భృతి అంటే దినభత్యం. (ఎంపీ దినభత్యాన్ని అది మించరాదు.) దారి ఖర్చులు, ఇంటి అద్దె, ప్రయాణాలకు ఖర్చుల రూపేణా భృతి చెల్లించాలి. చట్టబద్ధమైన లేదా చట్టబద్ధంకాని సంస్థ అధ్యక్షుడిగానో, డైరెక్టర్‌గానో, సభ్యుడిగానో ఉంటూ, గౌరవ భృతి మినహా ఎలాంటి ఇతర పారితోషికం పొందని వారిని కూడా అనర్హత ప్రమాదం నుంచి సెక్షన్3(ఐ) మినహాయించింది. పారితోషికం పొందే పదవిలో ఉంటే, అందుకు చట్టపరమైన మినహాయింపు లేకపోతే, ఆ సభ్యుడు సభ్యత్వానికి అనర్హుడు అవుతాడని చట్టం స్పష్టం చేస్తోంది. లంబర్దార్, పటేల్, దేశ్‌ముఖ్, కరణాల వంటి రెవెన్యూ అధికారులు పోలీసు (పోలీసు పటేల్) విధులు నిర్వహించకుండా ఉంటే– వారినీ అనర్హత నుంచి మినహాయించాలని సెక్షన్3 (ఐ) పేర్కొంది.

ప్రభుత్వ రంగంలోని అనేక సంస్థలను అనర్హత నుంచి పార్లమెంటు మినహాయించింది. అంటే– ఆ సంస్థల్లో వివిధ హోదాల్లో ఉండే పార్లమెంటు సభ్యులపై అనర్హత వేటు పడదన్నమాట. ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంస్థలు మినహాయింపు

పొందాయి. అవి: వ్యవసాయ అభివృద్ధి నిధి సంఘం; సహకార వ్యవసాయ, మార్కెటింగ్ అభివృద్ధి నిధి సంఘం; పశుగణ కొనుగోళ్ల కమిటీ.

దీన్నిబట్టి పార్లమెంటు సభ్యుల అనర్హతకు సంబంధించి ఎలాంటి నియమ నిబంధనలు వర్తిస్తున్నట్లు? మొదటి– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే పదవుల విషయంలోనే అనర్హత వర్తిస్తుంది. వివిధ సొసైటీలు; సహకార సంఘాలు, ట్రస్టుల వంటి ప్రైవేటు సంస్థలు; వాణిజ్య సంస్థల్లో పదవులు కలిగి ఉండేవారికి అనర్హత వర్తించదు.

రెండోది– పార్లమెంటు సభ్యులకు అనర్హత నుంచి మినహాయింపులు ఇవ్వాల్సింది పార్లమెంటే కానీ, రాష్ట్ర శాసనసభ కాదు. రాష్ట్ర శాసనసభ, శాసనసభ్యులను మాత్రమే అనర్హత నుంచి మినహాయించగలుగుతుంది.

మూడోది– ఫలానా పదవికి మినహాయింపు ఇవ్వాలని చట్టం నిర్దిష్టంగా పేర్కొనకపోతే– తాత్కాలిక కమిటీ లేదా ఇతర సంస్థకు సేవలు అందజేస్తూ గౌరవ భృతి కాకుండా ఇతరత్రా పారితోషికం పొందే వ్యక్తికి సాధారణంగా అనర్హత నిబంధనను వర్తింపజేస్తుంటారు. ఆ వ్యక్తి పారితోషికం పొందకపోయినప్పటికీ, అది పారితోషికం పొందగలిగిన పదవి అయితే చాలు – అనర్హత వేటు వేస్తారు.

## బ్రిటిష్ విధానం మార్గదర్శకం

చట్టసభ సభ్యుడిని అనర్హతకు గురిచేయడమన్నది రాజకీయంగా ఎంతో ప్రభావం చూపుతుంది. వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనాయకుల విషయంలో ఇది తీవ్ర పర్యవసానాలకు దారి తీస్తుంది. అందువల్ల అనర్హత విషయంలో ఎంతో జాగ్రత్తతో, ఆచి తూచి వ్యవహరించాలి. సభ్యులు ఏదైనా పదవిని స్వీకరించడానికి ముందే అనర్హత నియమాల గురించి అధికారికంగా తెలియజేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అమాయకంగా, తెలిసీ తెలియక నిర్ణయాలు తీసుకొనే సభ్యులపై అనర్హత వేటు వేసే బాధ తప్పుతుంది. ఇలాంటి విషయాల్లో సభ్యులకు సలహాలు ఇవ్వడానికి బ్రిటిష్ పార్లమెంటులో ఎథిక్స్ కమిషనర్ ఉంటారు. భారతీయ చట్టసభలూ అలాంటి పద్ధతిని అనుసరించాల్సిన తరుణమిదే.

* * *

# అసంఘటిత కార్మికులను ఆదుకొనేదెలా?

**ఏప్రిల్ 11, 1998**

ప్రస్తుతం మనదేశంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో అసంఘటిత రంగంలోని కార్మికులను ఆదుకోవడం ఎలా అన్నది ఒకటి. నేషనల్ శాంపుల్ సర్వే అంచనా ప్రకారం 1999-2000 సంవత్సరంలో అసంఘటిత రంగంలో ఉన్న మొత్తం కార్మికుల సంఖ్య 37కోట్లు. వీరిలో 24కోట్ల మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి రైతులుగాను, దినసరి కూలీలుగాను జీవన సాగిస్తున్నారు. మిగిలిన 13 కోట్ల మందిలో నాలుగు కోట్ల మంది వస్తూత్పత్తి రంగంలోనూ, 3.7కోట్ల మంది వాణిజ్యం, ఇతర రంగాలలోనూ, మిగిలినవారు భవన నిర్మాణ రంగంలోనూ కొనసాగుతున్నారు. భారత్‌లో అసంఘటిత రంగం క్రమేపీ విస్తరిస్తోంది. 1971 నాటికి దేశంలోని మొత్తం కార్మికులలో 89శాతం మంది ఈ రంగంలో ఉంటే 2000నాటికి అది 93శాతానికి పెరిగింది. ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగంలో పాత్ర తగ్గి, వస్తూత్పత్తి, సేవల రంగాల వంతు పెరగడంతో వ్యవసాయేతర రంగాలలో ఎక్కువ మంది కార్మికులు ఉండటం సహజం. పారిశ్రామిక, సేవల రంగాలు రాను రాను ఆధునికతను సంతరించుకుంటున్నందున పోటీ మార్కెట్‌లో అధికోత్పత్తి ద్వారా ఎక్కువ లాభాలు సాధించుకునే ధోరణి ప్రబలింది. ఈ కోణంలోని చూస్తే, ఎక్కువ మంది కార్మికులు మెరుగైన వేతనంతో,చక్కటి ఉద్యోగ భద్రతతో సంఘటిత రంగంలో కొనసాగుతూ ఉండాలి. కానీ, భారత్‌లో ధోరణులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. దీనికి మూడు అంశాలను కారణాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది- మున్నెప్పుడూ లేనతంగా మహిళలు శ్రామికరంగంలో చేరుతున్నారు. వీరిలో చాలా మందికి సంఘటిత రంగంలో చోటు లభించడం లేదు. రెండవది నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నంత వేగంగా సంఘటిత రంగంలో ఉద్యోగావకాశాలు పెరగకపోవడం అంతకంతకూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య ఇందుకు కొంతవరకూ కారణమైనప్పటికీ సంపదవృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కావలసిన ఉద్యోగనైపుణ్యం యువతలో కొరవడటాన్ని అసలు కారణంగా చెప్పుకోవాలి. మాధ్యమిక

విద్య ఆపై స్థాయి చదువులు పూర్తి చేసిన వారిలో పట్టణప్రాంత నిరుద్యోగిత రేటు 1999-2000లో 18.3శాతం ఉండగా, సాంకేతిక విద్య అభ్యసించిన వారి నిరుద్యోగిత రేటు మరింత ఎక్కువగా... 24.5శాతం ఉండటం గమనార్హం. నిరుద్యోగులను వయసుల వారీగా విభజించి చూపినప్పుడు అందులో పిన్న వయస్కులలోనే నిరుద్యోగిత ఎక్కువగా కనబడుతోంది. 1999-2000లో పట్టణ ప్రాంత నిరుద్యోగిత రేట్లు- 15-19 వయోవర్గంలో 19శాతం, 20-24 వయోవర్గంలో 18.7శాతం, 25-29 వయోవర్గం వారిలో 10.9శాతంగా ఉన్నాయి. నిరుద్యోగంతో బాధపడుతున్న యువతరం గత్యంతరం లేని పరిస్థితుల్లో సంఘటిత, అసంఘటిత రంగాలలో తక్కువ వేతనాలపై లభించే తాత్కాలిక ఉద్యోగాలతోనైనా సరిపెట్టుకోవలసిన దుస్థితి దాపురించింది.

కార్మికుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సదుద్దేశంతో విధానాలు రూపొందించినప్పటికీ అవి సవ్యంగా అమలు కానితీరు అసంఘటిత రంగం అంతకంతకూ విస్తరించడానికి మరో కారణం. ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నది తెలిసిన విషయమే. ఏడు శాతం వృద్ధి రేటుతో మన ఆర్థిక వ్యవస్థ ప్రగతి పట్టాలపై సవ్యంగానే పయనిస్తోంది. అయితే, అధిక ఆంక్షలతో కూడిన మార్కెట్ విధానాలవల్ల ఉద్యోగావకాశాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. గడచిన రెండు దశాబ్దాలలో వస్తూత్పత్తి సేవల రంగాలు అపారమైన ప్రగతి సాధించాయి. అయినప్పటికీ సంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య పెరిగిన దాఖలాలు అంతగా లేవు. యాజమాన్యాలు తమ వ్యాపారాలను గణనీయంగా విస్తరిస్తున్నా, కొత్తగా కార్మికులను పనిలోకి తీసుకోవడానికి మాత్రం విముఖత వ్యక్తం చేస్తున్నాయి. లైసెన్స్ పర్మిట్‌రాజ్ ద్వారా వ్యాపారులకు సంక్రమించిన గుత్తాధిపత్యానికి తెరపడిన తరువాత చోటు చేసుకున్న పరిణామమిది. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో వ్యాపార సంస్థలు నిలదొక్కుకోవడమనేది కత్తిమీద సాములా మారింది. వాణిజ్యానికి గల అడ్డంకులు తొలగిపోయి విశ్వవిపణికి ద్వారాలు తెరచుకున్న నేపథ్యంలో నాణ్యమైన ఉత్పత్తి, సరసమైన ధర, మార్కెటింగ్ సామర్థ్యం- ఈ మూడు అంశాలే వ్యాపార సంస్థల మనుగడకు కొలమానాలుగా మారాయి. క్షణక్షణానికీ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, వినియోగదారుడికి అభిరుచులలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ఇవాళ అద్భుతంగా ఉందనుకున్న పరిశ్రమ రేపు కుప్ప కూలిపోయే ప్రమాదం ఎలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో... కావాలంటే ఉత్పత్తిని పెంచుకోవడం

లేదా తగ్గించుకోవడం మరీ అవసరమైతే ఇంకో వ్యాపారానికి మళ్లడం వంటి వెసులుబాట్లను యాజమాన్యాలు కోరుకోవడం, అందుకు తగ్గట్టుగా పని చేసే కార్మికులను కావాలనుకోవడం సహజం. సంస్థ బాగా నడుస్తున్నప్పుడు ఉద్యోగంలో చేరిన కార్మికుడు, సదరు సంస్థ నష్టాల్లో పడినపుడు యజమానికి భారంగా మారతాడు. అలాంటప్పుడు నష్టాలను తగ్గించుకునేందుకు యాజమాన్యం కసరత్తు మొదలు పెడుతుంది.

## సంక్లిష్ట విధానాలు

మన విధానకర్తలు ఎన్నో ఏళ్లుగా ఉదాత్తమైన ఆశయాలకు కట్టుబడి పనిచేస్తున్నారు. అయితే చాలా సందర్భాలలో వారు సదుద్దేశంతో రూపొందించిన విధానాలు మొదటికే మోసం తెచ్చేలా తయారు కావడమే విచారించదగ్గ విషయం. ఉద్యోగ నియామకాలలో మితిమీరిన ఆంక్షలు, భారీ వేతనాలు, అక్రమాలకు పాల్పడే కార్మికులను తొలగించాలన్నా వీల్లేని విధంగా రూపొందిన చట్టాలు, నష్టాలను భరించలేక సంస్థను మూసివేయాల్సిన పరిస్తితి దాపురించినప్పుడు కార్మికులను తొలగించేందుకు భారీ వ్యయాలను భరించవలసి రావడం వంటివన్నీ యాజమాన్యాలను కలవరానికి గురి చేస్తున్నాయి. దాంతో వీలైనంత వరకూ కార్మికులను నియమించుకోకుండా ఉండేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. అందువల్ల, కార్మికులను తొలగించే విధానంలో సరళమైన ప్రక్రియ రూపలక్పనపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. అలాగే యాజమాన్యాలకు తమ పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వడం కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను నియమించుకోవడం వంటి వెసులుబాట్లు కల్పించే విషయాన్నీ ప్రభుత్వాలు పరిశీలనలోకి తీసుకోవాలి.

అమెరికాలో కార్మిక విధానాలు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నియమ నిబంధనలు ఎంతో సరళంగా ఉంటాయి. దీనివల్ల అధిక శాతం కార్మికులకు ఉద్యోగాలు లభించడమే కాదు. ఎక్కువ పని గంటలు సమకూరుతున్నాయి. అధికోత్పత్తి సాధ్యమవుతోంది. ఐరోపాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అక్కడి అనేక దేశాల్లో ఉద్యోగ భద్రత నియామకాలను సంబంధించిన నియమ నిబంధనలు ఎక్కువ. కానీ అమెరికాతో పోలిస్తే అక్కడ నిరుద్యోగిత రేటు దాదాపు రెట్టింపు అధికం. జర్మనీ,ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో నిరుద్యోగిత రేటు పదిశాతం కంటే ఎక్కువ. “ఉద్యోగులకు రక్షణ” కల్పించేందుకు ప్రభుత్వాలు రూపొందిస్తున్న సంక్లిష్టమైన

నియమనిబంధనలు నిరుద్యోగుల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. గత ఐదేళ్లుగా ఐరోపాలోని అనేక దేశాల్లో నెలకొన్న పరిస్థితే ఇందుకు నిదర్శనం అంటూ 'ఎకానమిస్టు' పత్రిక మార్చి 19వ తేదీ సంచికలో చేసిన వ్యాఖ్యలు తాజా పరిస్థితికి అద్దం పడతాయి. ఐరోపా దేశాల్లో నెలకొన్న ఈ పరిస్థితిని మన విధానకర్తలు గుణపాఠంగా తీసుకోవడం లేదు. యాజమాన్యాలు తాత్కాలిక పద్ధతిపై కార్మికులను పనిలోకి తీసుకోవడానికి లేదా ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ ఇవ్వడానికీ ఇదే కారణం. వాస్తవానికి యాజమాన్యాలు అవలంబిస్తున్న ఈ వైఖరి వల్ల నిరుపేద కార్మికులకు అధిక వేతనాలు లభించకపోయినా, ఉద్యోగ భద్రత అంతగా లేకపోయినా అసంఘటిత రంగంలో ఉద్యోగ భద్రత అంతగా లేకపోయినా అసంఘటిత రంగంలో ఉన్న కొద్దిపాటి కార్మికులకు కల్పిస్తున్న మితిమీరిన రక్షణ ఎంతో మంది నిరుద్యోగలకు ఉపాధి లేకుండా చేస్తోందన్న మాట కాదనలేని నిజం. ఈ పరిస్థితి వారిని మరింతగా పేదరికంలోకి నెడుతోంది. మన దేశంలోని పట్టణ ప్రాంతాల్లో అసంఘటిత రంగంలో 14కోట్ల కార్మికులు ఉంటే సంఘటిత రంగంలో ఉన్న కార్మికుల సంఖ్య కేవలం 2.9 కోట్లు. అందులోనూ కోటి మంది ప్రైవేటు రంగంలోనే కొనసాగుతుండటం గమనార్హం. కార్మికులకు 'రక్షణ' కల్పించే పేరిట మన శాసనకర్తలు హ్రస్వదృష్టితో రూపొందించిన సంక్లిష్టమైన కార్మిక విధానాలవల్ల పేదలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టమే జరుగుతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అయినప్పటికీ, కార్మిక రంగంలో సంస్కరణలు తీసుకురావాలన్న ఆలోచన ఎవరికీ కలగడం లేదు.

## ప్రయోజనం లేని పథకాలు

అ సంఘటిత రంగంలోని కార్మికులకు కొంతమేరకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. అయితే అవి అసమగ్రంగానూ, అవకతవకలతో కూడినవిగానూ ఉన్నాయి. ఇటీవల రూపుదిద్దుకున్న అసంఘటిత రంగ కార్మికుల ముసాయిదా బిల్లు 2004ను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. కార్మిక సంక్షేమం కోసం రూపొందిన ఈ బిల్లు అధికార గణానికి పెద్దపీట వేసేదిలా ఉంది. అసంఖ్యాకంగా ఉన్న అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్రస్థాయిలో ఓ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రాల స్థాయిలోనూ ఇలాంటి బోర్డుల్ని ఏర్పాటు చేయనున్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను, యాజమాన్యాలను గుర్తించి నమోదు చేసేందుకు కార్మిక కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. పనిలోపనిగా కార్మికులకు

'మార్గదర్శకత్వం' నెరపేందుకు, వారికి అవసరమైన 'శిక్షణ' ఇచ్చేందుకూ ఈ కేంద్రాలు అక్కరకు వస్తాయని పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల సంక్షేమంకోసం, వారి సామాజిక భద్రతకోసం ప్రభుత్వం కొన్ని పథకాలను రూపొందించి, అమలు చేస్తుందట. ఇందులో భాగంగా ఓ సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తారు. కార్మికులు, యాజమాన్యాలు వేతనాలలో చెరో ఐదుశాతం మొత్తాన్ని ఈ నిధికి జమచేస్తే, కేంద్ర ప్రభుత్వం తన వంతుగా 2.5 శాతం మొత్తాన్ని అందజేస్తుంది. యాజమాన్యాలను గుర్తించడం సాధ్యపడని సందర్భాలలో అవి చెల్లించవలసిన మొత్తాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. అలా సమకూరిన సంక్షేమ నిధిని అవసరమైనప్పుడు కార్మికుల కోసం వినియోగిస్తారు. అంటే– భవిష్యత్తులో తమకు ప్రయోజనాలు ఒనగూడతాయన్న ఆశతో కార్మికులు, యాజమాన్యాలు భారీ మొత్తంలో డబ్బులను ముందే అధికారగణం చేతుల్లో పోయాలన్నమాట. పౌరుల సంక్షేమం కోసంవారి డబ్బుతో రూపొందించిన పథకంలో పౌరులకు ప్రత్యక్ష ప్రమేయం కల్పించకపోవడం ఎంతవరకూ సమంజసం?

ప్రభుత్వ అధీనంలో నడిచే సంక్షేమ పథకాల వల్ల కార్మికులకు ఒనగూడే ప్రయోజనాలు స్వల్పం. అవినీతి, అసమర్థత, నిర్లక్ష్యం, నాసిరకమైన సేవలు– ఇవన్నీ ప్రభుత్వ పథకాలను నీరుగారుస్తున్నాయి. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం వంటి వాటిలో తాము వెచ్చించిన మొత్తాలతో పోలిస్తే, తమకు లభించిన ప్రతిఫలం తక్కువేనన్నది కార్మికులకు అనుభవమైన వైద్యమే. అయినప్పటికీ ఇలాంటి పథకాల వల్ల అంతోఇంతో ప్రయోజనాలు నెరవేరుతుండటానికి కారణం ఇవి సంఘటిత రంగంలోని కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించినవి కావడం. ఈ రంగంలోని కార్మికులు సంక్షేమ పథకాలకు చెల్లించవలసిన మొత్తాలను నెలనెలా నేరుగా వారి జీతాలనుంచి మినహాయించుకునే వెసులుబాటు ఉంది. అసంఘటిత రంగంలో దినసరి వేతనంపై పనిచేసే నిరుపేద కార్మికులకు రోజు గడవడమే కష్టం. అలాంటప్పుడు సంఘటిత రంగంలోని కార్మికుల మాదిరిగా వారు తమ వేతనం లోంచి నెలనెలా కొంత మొత్తాన్ని కేటాయించగలరనుకోవడం పొరపాటు.

అసంఘటిత రంగ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడవలసిందే. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సరైన అవకాశాలనూ అందించవలసిన అవసరం ఉంది. అయితే అందుకోసం ఉద్దేశించిన ముసాయిదా బిల్లు మాత్రం వారి

ప్రయోజనాలకు అద్దం పట్టేదిగా లేదు. కార్మికుల సంక్షేమార్థం సమర్థమైన విధంగా భద్రతా ప్రమాణాలను రూపొందించాలి. వారి సామాజిక భద్రతకోసం ఉద్దేశించిన పథకాలకు సంబంధించిన చెల్లింపులు, పోస్టాఫీసులు వంటి సంస్థల ద్వారా జరగాలి. వారికి అధునాతనమైన వైద్యసేవలు అందేలా పథకాల రూపకల్పన జరగాలి. కార్మికులకు ఉద్దేశించిన శిక్షణ కార్యక్రమాలు అధికోత్పత్తికి దోహదపడేవిగా ఉండాలి. అసంఘటిత రంగ కార్మికులకు గృహ వసతి కల్పించేందుకు అవసరమైన పథకాలను రూపొందించాలి. ఇవన్నీ చేపట్టినప్పుడే కార్మికుల జీవితాలలో వెలుగులు విరజిమ్ముతాయి. కేవలం సదుద్దేశాలు ఉన్నంత మాత్రాన చాలదు. వాటిని వాస్తవిక దృక్పథంతో, సరళమైన విదానాల ద్వారా అమలు చేసినప్పుడే ప్రయోజనం సిద్ధిస్తుంది.

* * *

# నేతల చేతుల్లో రాజ్యాంగమూ రాజకీయ పాచికే!

సెప్టెంబర్ 25, 2000

పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఆరు నెలల గడువు ఉన్నప్పటికీ ఇప్పటికే రాజకీయ వేడి రాజుకుంది. ఒక వంక– 23 సంవత్సరాలపాటు నిరాటంకంగా ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజకీయ భీష్మాచార్యుడు జ్యోతిబసు వయోభారం వల్ల పదవీ విరమణ చేస్తున్నారు. అంతటి వ్యక్తిత్వం, చరిత్ర, చాతుర్యం ఉన్న నాయకుడు తెరమరుగయితే కొన్ని రాజకీయ ప్రకంపనలు సహజం, అదీకాక ఇంతకాలం అధికారంలో ఉన్నాక కొంతమేరకు మార్క్సిస్టు కూటమికి వ్యతిరేక పవనాలు వీయటం కూడా సహజమే. మరోవంక– రైల్వే మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ జనాకర్షణ కోసం ఎంతకైనా తెగించే వ్యక్తి. జంకూ గొంకూ లేకుండా రాజకీయ పోరాటంచేసే నాయకురాలు. ఇన్ని సంవత్సరాలుగా క్యాడరు భుజబలం వల్లే మార్క్సిస్టులు ఎన్నికలలో నెగ్గుతున్నారని, పాలన యంత్రాంగాన్ని పార్టీ గుప్పిట్లో పెట్టుకున్నారని, క్రమపద్ధతిలో రిగ్గింగుకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి.

### ఎక్కడ చూసినా.. ఎన్నికలలో అక్రమాలే

బెంగాల్‌లో మాత్రమే ప్రత్యేకంగా ఎన్నికలలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న వాదనను అంగీకరించటం కష్టం. దేశంలో అన్ని ప్రాంతాలలోను ఎన్నికలలో ధన ప్రభావం, గూండాల బలం అధికార దుర్వినియోగం చోటు చేసుకుంటున్నాయి. ఇందులో అధికార పక్షం, ప్రతిపక్షాలు అనే తేడా కూడా అంతగాలేదు. అధికార పక్షానికి పాలన యంత్రాంగం మీద పట్టుకారణంగా కొన్ని ప్రత్యేక అవకాశాలు కలిసిరావచ్చు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో దాదాపు 600 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారనేది బహిరంగ రహస్యం. అలాగే కొన్ని నెలల క్రితం జరిగిన మున్సిపాలిటీల ఎన్నికలలోనే 100కోట్ల రూపాయలు ఖర్చుచేశారు. డబ్బును విచ్చలవిడిగా పంచటంతో పాటు కొన్ని కొత్త పద్ధతులను మన రాష్ట్రంలో కనిపెట్టారు. పచ్చనోట్లతో పాటు రెండు

మద్యం కూపన్లను కూడా పంచారు. నెమ్మదిమీద ఓటరు ఆ కూపన్లను బ్రాందీ షాపులలో ఇచ్చి తనకు కావసిన మందు సీసాలు తీసుకోవచ్చన్నమాట! దొంగ ఓట్లకు లెక్కేలేదు. హైదరాబాద్ నగరంలో ఓటర్ల జాబితాలలో 40 శాతం వరకు తప్పుల తడకలున్నాయని 'లోక్‌సత్తా' సర్వేలు రుజువు చేశాయి. అర్హుల ఓట్లు నమోదు కాలేదు. అనర్హుల పేర్లు నమోదయ్యాయి! ఓట్లు వేసినట్లు నమోదయిన వారిలో 22శాతం మంది ఓటు వేయలేదని– ఎన్నికలు జరిగాక నిర్వహించిన సర్వేలలో తేలింది! రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలలో 18శాతం వరకు ఓటర్ల జాబితాలలో అవకతవకలున్నాయని తేలింది. ఇవన్నీ ప్రజాస్వామ్య ప్రపంచంలో ఏరకంగానూ ఆమోదయోగ్యంకాని లోపాలు. మన ఎన్నికల వ్యవస్థలోని లొసుగులవల్ల అక్రమాలు విపరీతంగా చోటు చేసుకుంటున్నాయి. అన్ని ప్రధాన పార్టీలూ వీటిని ఉపయోగించుకుంటున్నాయి. అన్ని ప్రధాన పార్టీలూ వీటిని ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. తమ తమ స్థానబలాన్ని బట్టి, వీలునుబట్టి ఎన్నికలలో రిగ్గింగుకు, ఓట్ల కొనుగోలుకు, గూండాల ప్రయోగానికి పాల్పడని పార్టీ లేదు. క్యాడర్ల బలం బాగా ఉంది కాబట్టి, పశ్చిమబెంగాల్‌లో మార్క్సిస్టులు మిగిలిన వారికంటే నాలుగడుగులు ముందుకు వేసి ఉండవచ్చు. అంతమాత్రంచేత ఆ రాష్ట్రంలో ప్రభుత్వమే రిగ్గింగుకు పాల్పడుతోందనీగాని, ప్రజాభిప్రాయాన్ని ఎన్నికల ఫలితాలు ఏ మాత్రం ప్రతిబింబించటం లేదనీగాని నిర్ధారించటానికి ఆధారాలు లేవు. పన్స్కురాలో తృణమూల్ కాంగ్రెస్ విజయం, కలకత్తా కార్పొరేషన్‌లో మార్క్సిస్టులకు ఎదురుదెబ్బ ఇవన్నీ అధికార పార్టీ భయంకరమైన రిగ్గింగుకు పాల్పడుతోందనే వాదనను బలపరచవు. అసలు సమస్య అక్కడ ప్రతిపక్షాలలో ఐక్యత లేకపోవటం. కాంగ్రెస్ చీలికతో మార్క్సిస్టు వ్యతిరేక ఓటును సంఘటితం చేయటం సాధ్యం కావటంలేదు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలనే బలమైన కోరిక ఉన్న మమతాబెనర్జీకి గణనీయంగా ప్రజాదరణ ఉండటంతో అక్కడ పోటీ రసవత్తరంగా ఉండే అవకాశం ఉంది. చీలిపోగా మిగిలిన కాంగ్రెస్ బలహీనపడినప్పటికీ ఇంకా దానికి దాదాపు 10 శాతం పైగా ఓట్లున్నాయి. బి.జె.పికి మిత్రపక్షం కావడంతో గణనీయంగా ఉన్న ముస్లిం ఓటర్లు మమతను వ్యతిరేకించే అవకాశం ఉంది. వీటిని తట్టుకోవాలంటే బెంగాలీ ప్రజలను ఆకట్టుకుని తాను ఆ రాష్ట్రం కోసం ఎంతో తపిస్తున్నాననే భావం కలిగించాలి. అందుకే కేంద్రమంత్రిగా ఉన్నా కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే మమత పోరాడుతున్నారు. దాంతో పాటు క్యాడర్లకు, ఇంకా కాంగ్రెస్‌లో మిగిలిన రాజకీయనేతలకు తనది గెలుపు గుర్రమనే విశ్వాసం కలిగించి చేరదీయాలి. రాష్ట్రంలో

ఓటర్లు కేవలం మార్క్సిస్టు లేదా తృణమూల్ కాంగ్రెస్ కూటములలో ఏదో ఒక దాన్ని ఎంచుకునే పరిస్థితిని కల్పించాలి. ఈ రాజకీయ వ్యూహం నేపథ్యంలో మిద్నపూర్, బంకూరా, హుగ్లీ, బీర్భం, బుర్ద్వాన్ జిల్లాలలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆ కారణంగా ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని రాష్ట్రపతి పాలన విధించాలని వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అది సాధ్యం కాకపోతే బాగా హింసాత్మక సంఘటనలకు గురయిన ఐదు జిల్లాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి కేంద్ర పోలీసు బలగాలను పంపాలనే మరో వాదన ఉంది. ఈ పరిస్థితులలో రాష్ట్రపతి పాలన డిమాండును రాబోయే ఎన్నికల నుంచి విడదీసి చూడటం అసాధ్యం. రాజకీయ వ్యూహాలను అటుంచి 356వ అధికరణాన్ని ప్రయోగించాలనే వాదనలోని సత్యాసత్యాలను పరిశీలిద్దాం.

మన ఫెడరల్ రాజ్యాంగంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను అసాధారణ పరిస్థితులలో రద్దుచేసి ప్రత్యక్షంగా అధికారాన్ని చేపట్టే అవకాశాన్ని 356వ అధికరణంలో పొందుపరిచారు. 1935 భారత ప్రభుత్వ చట్టంలోని అంశాలకు ఇది నకలు. 356వ అధికారణాన్ని ఏనాడూ ఉపయోగించే అవసరం రాదని ఆనాడు అంబేద్కర్ ఆశించారు. వాస్తవానికి జరిగింది అందుకు పూర్తిగా విరుద్ధం. అయితే ఈ అధికరణ ప్రతిసారీ దుర్వినియోగమయిందని చెప్పలేం. మన రాష్ట్రంలోనే 1973లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ఉధృతంగా ఉండి పరిపాలన స్తంభించిన నేపథ్యంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన తెచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తన పార్టీకే చెందిన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసిన అతికొద్ది సందర్భాలలో ఇదొకటి. ఆనాటి రాష్ట్రపతి పాలనలో గవర్నరు సలహాదారు హెచ్.సి. శరిన్, వి.కె.రావులు మంచి పాలననందించారని చాలామంది అభిప్రాయం. ఆ రాష్ట్రపతి పాలన రాష్ట్రంలో పరిస్థితి కుదుటపడటానికి, సామరస్యంగా సమస్యకు పరిష్కారాన్ని అన్వేషించటానికి కావలిసిన వ్యవధినిచ్చింది. ఆ తరవాత ఏర్పడ్డ వెంగళరావు ప్రభుత్వం నిస్సందేహంగా మన రాష్ట్ర చరిత్రలో అత్యంత సమర్థమైన ప్రభుత్వంగా, దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించిన ప్రభుత్వంగా పేరుపొందింది. ప్రజాస్వామ్యంలో మంచిపాలన స్వపరిపాలనకు ప్రత్యామ్నాయం కాదు. తెల్లవాళ్లు స్వాతంత్రోద్యమ నాయకులు స్వపరిపాలనకు పనికి రారని, తాము వైదొలగితే మంచి పాలన ఉండదని వాదించినప్పుడు మన నాయకులు ఆ మాటే చెప్పారు. ప్రజాస్వామ్యంలోని లోపాలకు సరైన మందు మరింత ఎక్కువ ప్రజాస్వామ్యం, మరింత

మంచి ఏర్పాట్లున్న ప్రజాస్వామ్యం– అంతేగాని ప్రజల అభీష్టాన్ని కాలరాయటంకాదు. పౌర సార్వభౌమత్వాన్ని ధిక్కరించటం కాదు. తలనొప్పికి మందు తల తీసివేయటం కాజాలదు. దేశ ఐకమత్యం కోసమో, రాజకీయ అస్థిరత ఏర్పడినప్పుడో విశేషాధికారాలు కావాలంటే అందుకు రాజ్యాంగంలో వేరేరకంగా అనువయిన ఏర్పాట్లు చేసుకోవచ్చు. అత్యధిక సందర్భాలలో రాష్ట్రపతిపాలన వల్ల సత్ఫలితాలేమీ రాలేదు. ఎన్నికయిన ప్రభుత్వాలలో కనిపించిన అసమర్థత, అవినీతి, పక్షపాతం రాష్ట్రపతి పాలనలో కూడా చాలా సందర్భాలలో కనిపించాయి. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పు తరవాత 356వ అధికరణ వినియోగాన్ని కోర్టులలో ప్రశ్నించవచ్చు. కాబట్టి దుర్వినియోగానికి అవకాశం చాలా మేరకు తగ్గింది. అదీగాక పార్లమెంటు ఉభయ సభలలో దీనికి ఆమోదం కావాలి కాబట్టి, కాంగ్రెసేతర ప్రభుత్వాలకు ఇది చాలా కష్టంగా పరిణమించింది. కాంగ్రెస్ పార్టీ సహకారం లేకుండా రాష్ట్రపతి పాలన విధించటం అసాధ్యమయింది. బీహార్‌లో రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దుచేసినప్పుడు ఈ కారణంగానే ఎన్నికయిన ప్రభుత్వాన్ని పునరుద్ధరించవలసి వచ్చింది. రాజ్యాంగం, చట్టాలు అధికారంలో ఉన్నవారు స్వప్రయోజనాల కోసం వాడుకునే పనిముట్లు కాదు. గద్దెమీద కూర్చుంటే ప్రత్యర్థులను హింసించటం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం, పదవిపోగానే రోడ్లకెక్కి హింసాత్మక ఆందోళనలకు దిగటం, కక్షసాధిస్తున్నారని గుండెలు బాదుకోవటం – ఇదే రాజకీయ చాతుర్యానికి నిదర్శనలుగా మన దేశంలో చెలామణీ అవుతున్నాయి. అధికారం అతి పవిత్రమైన కర్తవ్యమని, కేవలం ప్రజల సేవకులుగా తాము ఎంపికయ్యాయని, రాజ్యాంగ స్ఫూర్తి శిరోధార్యమని రాజకీయవాదులు భావించటం లేదు. ఇదంతా కేవలం అధికార క్రీడగాను, ఆధునిక రాచరికంగాను గద్దెనెక్కి దోచుకోవటానికి ఏమార్గం అనుసరించినా ఫరవాలేదని, రాజ్యం వీరభోజ్యమని నమ్ముతున్నారు. ప్రజలు ఉవ్వెత్తున లేచి ఎన్నికలను సమూలంగా ప్రక్షాళన చేసి రాజకీయాలను సరైన మార్గంలో పెట్టేవరకు ఈ తంటాలు తప్పవు. బెంగాల్‌లో కొన్ని జిల్లాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి కేంద్ర బలగాలను పంపాలనటం కూడా ఆచరణ సాధ్యం కాని ఆలోచన. టెర్రరిస్టు ముఠాలనో, దేశ భద్రతకే భంగం కలిగించే సందర్భం ఉన్నప్పుడో అలాంటి చర్యలను చేపట్టవచ్చు కాని కేవలం రాజకీయ కారణంగాగాని, ఘర్షణలు చెలరేగుతున్నాయనికాని ఇలాంటి ప్రయత్నాలు చేయటం కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన తయారవుతుంది. అసలు సమస్య ఇదికాదు. పోలీసు యంత్రాంగం అధికార పక్షాల చెప్పుచేతలలో ఉండి

ఏలిన వారికి అపరిమితమైన స్వామిభక్తిని ప్రదర్శించటం చాలా రాష్ట్రాలలో రివాజు. అందుకు మూల కారణాలు ఎన్నికయిన ప్రభుత్వం నేర పరిశోధనలో పూర్తిగా జోక్యం చేసుకునే అవకాశం ఉండటం; పోలీసు సిబ్బంది నియామకాలు, బదిలీలు రాజకీయ నాయకుల ఇష్టారాజ్యంగా మారటం. నేర పరిశోధనలో రాజకీయ ప్రమేయం లేకుండా పోలీసులు స్వతంత్రంగా వ్యవహరించే ఏర్పాట్లు చేసి ఆ యంత్రాంగాన్ని ఓ స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాసిక్యూషన్ కమిషన్‌లాంటి సంస్థకు జవాబు దారీగా చేస్తే పార్టీలు పోలీసులను కక్షసాధింపులకు వాడుకునే అవకాశం తగ్గుతుంది. అలాంటి సంస్థాగత ఏర్పాట్లను గురించి ఆలోచించకుండా, వాళ్లు తప్పుచేశారు కాబట్టి ఆ స్థానంలో మమ్మల్ని కూర్చోబెట్టి, మేం తప్పు చేసే అవకాశం ఇవ్వండని కోరటం మన రాజకీయంలో ఆనవాయితీ అయిపోయింది. మనదేశంలో ఎన్నో పార్టీలు పోరాటం చేసేది అధికార దుర్వినియోగం ప్రత్యర్థులు కాకుండా తాము చేసే అవకాశం కావాలని మాత్రమే. ప్రజలకు అందుకనే రాజకీయాలంటే రోత అనిపిస్తుంది.

## అధికారమే పరమావధి

అసలు ఈ వివాదం మొత్తానికి వెనక ఉన్నది ఎన్నికల వ్యూహం. మార్క్సిస్టు పాలనలో ఎన్నికలు జరిగితే ఏదోవిధంగా అక్రమాలకు పాల్పడి వాళ్లే మళ్లీ గెలుస్తారనే భయం కావచ్చు. లేదా రాష్ట్రపతి పాలన పేరుతో తామే చక్రం తిప్పితే పాలన యంత్రాంగం తమ గుప్పిట్లోకి వచ్చి తాము గెలిచే అవకాశం ఉంటుందనే ఆశ కావచ్చు. ఇక్కడ కూడా “గద్దెమీద ఎవరుంటే పాలన వ్యవస్థ వారి సొంతం” అనే భావం ఉంది. అలాంటప్పుడు ఎవరు అధికారంలో ఉన్నా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. దీనికి పరిష్కారం ఎన్నికల సంస్కరణలలో ఉంది కాని ప్రభుత్వాలని రద్దు చేయటంలో లేదు. వెనువెంటనే ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేసి, ప్రజలకు ఓటర్ల నమోదు అందుబాటులో ఉండేలా సులభం చేయాలి. విధిగా ఓటర్ల గుర్తింపు కార్డులను వినియోగించేలా ఏర్పాటు చేయాలి. ఈ కనీస చర్యలను పకడ్బందీగా చేపట్టి, నేర రాజకీయాన్ని అంతం చేయటానికి, ఎన్నికలలో ధనబలం ప్రభావం తగ్గటానికి కావాలసిన చట్టబద్ధమైన సంస్కరణలు తెస్తే ఎన్నికలు చాలామేరకు బాగుపడతాయి. మమతా బెనర్జీలాంటి వాళ్లు తమ రాజకీయ పరపతిని, ఆవేశాన్ని, ప్రజాబలాన్ని ఎన్నికల సంస్కరణల కోసం ఉపయోగిస్తే దేశానికి మేలు చేకూరుతుంది. లేదంటే అది రాజకీయ దుస్సాహసమై బెడిసికొట్టే ప్రమాదముంది.

* * *

# లోసుగు లేని జనస్వామ్యం ఏదీ? ఎక్కడ?

**నవంబర్ 13, 2000**

అమెరికా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు అసాధారణమయిన మలుపు తిరిగాయి. దేశంలో మొత్తంలో పోలయిన ఓట్లలో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి, ఉపాధ్యక్షుడు ఆల్‌గోర్‌కు దాదాపు రెండు లక్షల ఓట్ల ఆధిక్యం వచ్చింది. అమెరికాలో అధ్యక్ష పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరిగినప్పటికి, గెలుపు, ఓటములు కేవలం అభ్యర్థులకు దేశవ్యాప్తంగా పడ్డ ఓట్లనుబట్టి నిర్ణయం కావు. సాధారణంగా దేశవ్యాప్తంగా అత్యధిక ఓట్లు వచ్చిన అభ్యర్థికే ఎలెక్టొరల్ కాలేజి ఓట్లలో అధిక్యం ఉంటుంది. కాని ఇప్పటికి వరకు మూడు ఎన్నికలలో ఎక్కువ ఓట్లు పడిన అభ్యర్థి అధ్యక్షుడు కాలేకపోయారు. 1824వ సంవత్సరంలో ఆండ్రూ జాక్సన్‌కు ఎక్కువ వోట్లు, ఎక్కువ ఎలక్టొరల్ కాలేజి ఓట్లు వచ్చాయి. కాని 50శాతం దాటి ఎలక్టొరల్ ఓట్లు ఎవరికీ రాకపోవటంతో అమెరికన్ కాంగ్రెస్ రెండోస్థానంలో ఉన్న జాన్‌క్విన్సీ ఆడమ్స్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఆయన అమెరికా రెండో అధ్యక్షుడు జాన్ ఆడమ్స్ కుమారుడు. అధ్యక్ష పదవి నుంచి వైదొలిగాక జాన్‌క్విన్సీ ఆడమ్స్ అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశిష్ట సేవలందించారు. అలాగే 1876లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి శామ్యూల్ టిల్డన్‌కి దేశవ్యాప్తంగా ఎక్కువ ఓట్లు వచ్చినా ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి రూథర్‌ఫర్డ్ హెూస్ ఎలెక్టొరల్ కాలేజి ఓట్లలో ఆధిక్యం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1988లో మరోసారి డెమొక్రాటిక్ పార్టీకి చెందిన గ్రోవర్‌లాండ్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినా ఎలెక్టొరల్ కాలేజీలో ఆధిక్యం పొందిన రిపబ్లికన్ అభ్యర్థి బెంజిమిన్ హారిసన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1892 ఎన్నికలలో క్లీవ్‌లాండ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1888 నుండి నేటి వరకు ఎక్కువ జనాదరణ పొందిన అభ్యర్థికే ఎలెక్టొరల్ కాలేజిలో ఆధిక్యం కూడా రావటంతో ఈ ఎన్నికల విధానంలోని లోపాలను గురించి పెద్దగా చర్చ జరగలేదు. 1960లో జాన్ కెనడీకి ఎలెక్టొరల్ కాలేజిలో పెద్ద మెజారిటీ లభించినా దేశవ్యాప్తంగా పోలైన ఓట్లలో కేవలం లక్ష ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది.

## లోపాలు-తికమకలు

అమెరికా ఎన్నికల చరిత్రలో 112 సంవత్సరాల తరవాత ఇపుడు ఆల్‌గోర్‌కు దేశవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల ఓట్ల ఆధిక్యం లభించినా, ఎలెక్టొరల్ కాలేజీలో స్వల్పంగా వెనకబడటంతో ఓడిపోయే పరిస్థితి వచ్చింది. ఫ్లోరిడా రాష్ట్రానికి ఉన్న 25 ఎలక్టొరల్ కాలేజి ఓట్లు ఎవరికి వస్తే ఆ అభ్యర్థి గెలిచే పరిస్థితి ఏర్పడింది. ఇంతకు ముందెన్నడూ ఒక్క రాష్ట్రంలో జయాపజయాలు ఇంత ప్రాముఖ్యాన్ని సంతరించుకోలేదు. విదేశాల నుంచి వచ్చే పోస్టల్ బ్యాలెట్టే ఫలితాన్ని నిర్ణయించడంలో కీలకమయ్యాయి. ఇవన్నీ లెక్కించాకే అధికారికంగా ఆ రాష్ట్రంలో ఎవరు గెలిచారో నిర్ధారించగలరు. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్ కౌంటీలో బ్యాలెట్ పత్రాలను సరిగా ముద్రించకపోవటం వల్ల ఆల్‌గోర్‌కు పడవలసిన ఓట్లు దాదాపు మూడువేల వరకు రిఫామ్ పార్టీ అభ్యర్థి పాట్ జుకనన్‌కు పడ్డాయి; లేదా ఓట్లు చెల్లకుండాపోయాయని వార్తలొచ్చాయి. ఈ ఓట్లు గోర్‌కు పడితే ఆయన గెలిచి అధ్యక్షుడు కావటం ఖాయం. ఆ బ్యాలెట్ పత్రాన్ని అలా ముద్రించటం చట్ట విరుద్ధమని, అలా ఆల్‌గోర్‌కు పడకుండాపోయిన ఓట్లను కలిపితే తమ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు వస్తాయని, ఆ విధంగా ఫ్లోరిడా రాష్ట్రంలో 25 ఎలెక్టొరల్ ఓట్లను ఆల్‌గోర్ గెలుచుకుని అధ్యక్షుడిగా ఎన్నికవుతారని డెమోక్రాట్ల వాదన. పామ్‌బీచ్‌లో మళ్లీ పోలింగ్ జరిపితే ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉంది. ఇవన్నీ అలా ఉండగా అధ్యక్ష పదవికి అధికారికంగా జనవరిలో జరిగే ఎన్నికలో ఎలెక్టొరల్ కాలేజి సభ్యులు తమతమ రాష్ట్రాలలో ప్రజలు చేసిన నిర్ణయానికి బద్ధులై అదేవిధంగా ఓట్లు వేయాలన్న నియమమేమీ లేదు. సాధారణంగా ప్రజాభిప్రాయం ప్రకారం, ఇప్పుడు జరిగిన ఎన్నికల ఫలితాల ప్రకారం ఎలెక్టొరల్ కాలేజి సభ్యులు ఓటు వేస్తారు. అందుకే ఆ ఎన్నిక నామమాత్రమయిపోయింది. కాని సగం రాష్ట్రాలలో చట్టపరంగా ఎలాంటి నిబంధనలు లేవు. ఇంత ఉత్కంఠతో జరిగిన ఎన్నికల తరవాత కొద్దిమంది ఎలెక్టొరల్ కాలేజి సభ్యులు పార్టీ ఫిరాయించి ప్రత్యర్థికి ఓటువేస్తే ఓడిన వ్యక్తి గెలిచే అవకాశం ఉంది! ఆ విధంగా రాజ్యాంగ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. అమెరికాలో ప్రజాస్వామ్యం ప్రపంచానికే తలమానికంగా వర్ధిల్లుతోంది. ప్రపంచమంతటా ప్రజాస్వామ్యం ఎలా నడవాలో, ఎన్నికలు ఎలా జరుపుకోవాలో అమెరికా పాఠాలు చెబుతోంది. అలాంటి దేశంలోనే ఎన్నికల తీరు ఇంత గందరగోళం కావటం చాలా విచిత్రం. అంతటి ప్రజాస్వామ్య దేశంలోనే ఇలాంటి అసాధారణమయిన సందర్భాలలో ఎన్నికల

హేతుబద్ధతను ప్రశ్నించే పరిస్థితి వచ్చింది. ప్రజలలో ఈ పరిస్థితిపట్ల పెద్దగా ఆందోళనకాని, ఆవేశం కాని కానరావటం లేదు. ఫ్లోరిడాలో ఎన్నికల ఫలితాలకు ఇంత ప్రాముఖ్యం ఉన్నా పోలీసుల మోహరింపుగాని, శాంతిభద్రతలకు ముప్పుగాని ఎక్కడా లేవు. ఎక్కడికక్కడ స్థానిక ప్రభుత్వ (కౌంటీ) స్థాయిలో అధికారులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దేశాధ్యక్షుడికిగాని, జాతీయస్థాయిలో అధికారులకుగాని ఇందులో పాత్రలేదు. రాష్ట్ర చట్టాన్ననుసరించి నిర్ణయాలు అలవోకకగా జరుగుతాయి. అంతా టెలివిజన్ కెమెరాల ముందు బహిరంగంగా సాగుతోంది. నాయకులు ఎంతో సంయమనంతో, హుందాగా, రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య సంప్రదాయాల ప్రకారం వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఈ అంశం కోర్టులకెక్కినా దానికి పరిష్కారాన్ని త్వరలో అన్వేషించి రాజ్యాంగ బద్ధంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఎన్నికయిన నాయకుడు ఎవరయినా ఉభయ పార్టీల మధ్య సామరస్యం కోసం, దేశంలో ఐకమత్యం కోసం కృషి చేస్తారు. ఇంత గందరగోళం తరవాత ఎన్నికల తీరులో, బ్యాలెట్ పత్రాల ముద్రణలో, ఎలెక్టొరల్ కాలేజి పద్ధతిలో కొన్ని మార్పుల కోసం గట్టి ప్రయత్నాలు జరుగుతాయి. రాజ్యాంగంలో మార్పులు కష్టమయినా నిబంధనలలో మార్పులను తెస్తారు. ఆ విధంగా ప్రజాస్వామ్యం మరింత పటిష్టమవుతుంది. వ్యవస్థ బలపడుతుంది. ఒకప్పుడు అమెరికాలో ఎన్నికలలో ఎన్నో అవకతవకలు చోటు చేసుకునేవి. కాని కాలక్రమేణా ఉద్యమాలు వచ్చాయి. ఎన్నికల సంస్కరణల కోసం, పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కోసం ప్రజాభిప్రాయాన్ని ఆ విధంగా సంస్కరణవాదులు కూడగట్టగలిగారు. అలా చట్టాలను ఎన్నికల పద్ధతులను మార్చి ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేశారు.

అమెరికాలో ఈ ఎన్నికలకు దాదాపు రెండు బిలియన్ డార్ల వరకు ఖర్చయినట్లు అంచనా. పెరుగుతున్న ఎన్నికల వ్యయాన్ని అదుపు చేయాలని చాలాకాలంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల వ్యయం కోసం అభ్యర్థులు, పార్టీలు, ఇతర సంస్థలు వసూలుచే ప్రతి డాలరును చట్టబద్ధంగా, దాపరికం లేకుండా సేకరిస్తారు. ఎన్నికల ఖర్చంతా నిజాయతీగా ప్రచారానికి మాత్రమే వినియోగమవుతోంది. ఓట్లను కొనటంగాని, పోలింగ్‌బూత్‌లను ఆక్రమించుకోవటంగాని, నేర చరితులు అభ్యర్థులు కావటంగాని, సిబ్బందికి లంచాలిచ్చి ఎన్నికలలో అక్రమాలకు పాల్పడటంగాని అమెరికాలో అసాధ్యం. వాటిని నిరోధించడానికి పకడ్బందీ చట్టాలున్నాయి. వేయి కళ్లతో కాపువేసే పత్రికలు, ప్రసార సాధనాలు ఉన్నాయి; పౌరుల నిరంతర నిఘా ఉంది. నిజానికి

ఎన్నికల ఖర్చులో దాదాపు 80-90 శాతం టెలివిజన్‌లో ప్రకటనల కోసమే ఖర్చవుతుంది. అన్నింటినీ మించి అమెరికాలో పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం చాలా బలంగా ఉంది. ఏ పార్టీ నాయకుడయినా స్వయంగా ఆ పార్టీ అభ్యర్థులను నిర్ణయించలేరు. ఆ అధికారం కేవలం పార్టీ సభ్యులకు మాత్రమే ఉంది. అందుకోసం పార్టీ లోపల బహిరంగంగా ప్రైమరీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలలో పోటీచేసే సంకల్పం ఉన్న ఎవరయినా బరిలోకి దిగవచ్చు. ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోగలిగితే ఏ పౌరుడైనా అభ్యర్థి కావచ్చు. ఎలాంటి ఉన్నత పదవినయినా పొందవచ్చు. పార్టీలకు అధిష్ఠానవర్గాలు లేవు; అధినాయకుల ప్రాపకం కోసం పాకులాడనవసరం లేదు; 'పై' వాళ్ల మెప్పుకోసం తహతహలాడనక్కరలేదు. ఇంతాచేసి అత్యున్నతమయిన దేశాధ్యక్ష పదవికి ఎంపికయినా, అధికారాలు పరిమితమే. ఏ చట్టం కావాలన్నా అది అధ్యక్షుడి చేతుల్లో లేదు. అమెరికన్ కాంగ్రెస్‌లో ఉభయ సభల నిర్ణయం మేరకే చట్టాలు తయారవుతాయి. అధ్యక్షుడు ఏ పార్టీకి చెందినా ఆయన మాట చట్టసభల్లో చెల్లుతుందనే హామీ ఏమీలేదు. ఎన్నికయిన ప్రభుత్వానికి చట్టసభల మీద ఆధిపత్యం లేదు. ఒకరినొకరు అదుపులో ఉంచి సహజీవనం చేస్తారు. అధ్యక్షుడి నిజమయిన అధికారం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం, విధానాలను రూపొందించటం, సంక్షోభ సమయాలలో సమర్థ నాయకత్వాన్నివ్వటంలో మాత్రమే ఉంది. అంతే కాని అవధులు లేని అధికారానికి అక్కడ చోటులేదు. అమెరికన్ వ్యవస్థలో ఎన్నికలలో ఓటమి వల్ల కొంప మునిగిందేమీ లేదు. నిజానికి ఎన్నికయితేనే ఆదాయం తగ్గుతుంది; వ్యక్తిగత జీవనంలో ఎన్నో ఒడుదొడుకులు వస్తాయి; సొంత పని కుంటుపడుతుంది. పదవులలో చేరి అక్రమ సంపాదన చేయటం అమెరికాలాంటి ప్రజాస్వామ్యాలలో ఊహకైనా సాధ్యం కాదు. ఎందరో సమర్థులు కేవలం దేశభక్తితోనో, కొన్ని బలమయిన భావాలుండటంతోనో, పరిస్థితులపట్ల ఆగ్రహంతోనో తమ వృత్తినో, వ్యాపారాన్నో అవతలపెట్టి కొంతకాలం రాజకీయానికి కేటాయిస్తారు. రాజకీయంలోకి వచ్చి పదవులలో ఉన్నవాళ్లు చాలామంది అవకాశం చిక్కగానే మళ్లీ సొంత వృత్తిలోకి, వ్యాపారంలోకి వెళ్లి సంపాదనలో పడతారు. అంటే రాజకీయం ఎప్పుడూ ఆర్థికంగా నష్టమే కాని లాభాన్ని ఆర్జించదు. అందుకే పదవిపోయినా, ఎన్నికలలో ఓడిపోయినా తమ భావాలు, విధానాలు వెనక్కుమళ్లాయనే ఆవేదన తప్ప, వ్యక్తిగతంగా నష్టమేమీ ఉండదు. ఓడినవాళ్లు హుందాగా సాధారణ పౌరులు మాదిరిగానే జీవిస్తారు. అలాగే పదవిలో ఉంటే అదే పనిగా ఎత్తిన పెట్టుకుని పూజించటం, వందిమాగధులు అదేపనిగా

పొగడటం, ప్రభుత్వ సదుపాయాలను విచ్చలవిడిగా అనుభవించటం, అధికారాన్ని సొంత లాభం కోసం దుర్వినియోగం చేయటం మచ్చుకు కూడా కానరావు.

## సంస్కరణలే శరణ్యం

అమెరికన్ ఎన్నికలలో అనిశ్చితి ప్రజాస్వామ్య దేశాలన్నింటికీ ఓ మంచి గుణపాఠం అంత పరిపక్వమయిన ప్రజాస్వామ్య దేశాలలో కూడా ఆడపాదడపా ఇలాంటి ఇబ్బందులు ఎదురయినప్పుడు కొన్ని మార్పులు, సంస్కరణలు అవసరమవుతాయి. ఎన్నికలలో పెద్దఎత్తున అక్రమాలు, ఓటర్ల జాబితాలలో లొసుగులు, రిగ్గింగు, ధనబలం, సారాయి ప్రవాహం, దౌర్జన్యం, నేరగాళ్ల స్వైరవిహారం విశృంఖలంగా చోటుచేసుకునే మనదేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో బోధపడుతుంది. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణం. ఓ వ్యక్తి అధికారినికి, ఓ ప్రభుత్వ ధర్మబద్ధతకు మూలం ఎన్నికలు జరిగే తీరు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో కూర్చునే అర్హత ఓ వ్యక్తి కులం, డబ్బు,తెలివి తేటలు, మంచితనం, కండబలాన్నిబట్టో రాదు. ప్రజలు స్వేచ్ఛగా ఓట్ల రూపంలో ఇచ్చే మద్దతునుబట్టి అధికారం ఆధారపడుతుంది. అలాంటి ఎన్నికలే లోపభూయిష్ఠమయితే ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుంది. మన దేశంలో జరుగుతన్నది అదే. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం చట్టబద్ధంగా అమలయితేనే పెత్తందార్లనుంచి అధిష్ఠానవర్గాల నుంచి మన రాజకీయానికి విముక్తి కలుగుతుంది. ఎన్నికలలో అక్రమాలు తొలగించే సంస్కరణల్ని చేపడితేనే ప్రజాస్వామ్యం పునీతమవుతుంది. కొన్ని కోట్ల రూపాయల అక్రమ ఖర్చును అదుపు చేసినప్పుడే అవినీతి అంతరించి, రాజకీయం వ్యాపారంగాను, రాష్ట్ర స్థాయిలలోనయినా నాయకత్వాన్ని ప్రత్యక్షంగా ఎన్నుకున్నప్పుడే ఫిరాయింపులు, పాలనలో అక్రమ జోక్యాలు, బెదిరింపులు, అవకతవకలు అంతమవుతాయి. కొంతమేరకయినా దామాషా పద్ధతి ఎన్నిక వచ్చినప్పుడే రాజకీయాలలో స్వచ్ఛత, విధానాలకు ప్రాధాన్యం, జనాభిప్రాయానికి విలువ చేకూరతాయి. పరిపాలన బాగుపడాలన్నా ప్రజాధనం సద్వినియోగం కావాలన్నా, స్వేచ్ఛ నిజంగా వర్ధిల్లాలన్నా శీఘ్ర ఆర్థిక ప్రగతి కావాలన్నా వెనువెంటనే భారతీయులు ఎన్నికల సంస్కరణల కోసం పోరాడాలి.

* * *

# కేంద్రం తాబేదార్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లు

**ఏప్రియల్ 13, 1998**

భారతదేశంలో ఇటీవల రాజకీయంలో గవర్నర్ల పాత్ర చర్చనీయాంశమయింది. చాలాకాలం నుంచి ఎందరో గవర్నర్లు రాజకీయంలో తలదూర్చి భారత ప్రజాస్వామ్యానికి తీరని చేటు చేశారు. కొన్ని సందర్భాలలో వాళ్లు కూడా అభాసుపాలయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 1984లో రామ్‌లాల్ నిర్వాకం గురించి అందరికీ తెలుసు. అలాగే అంతకంటేముందు హర్యానాలో తపసే అనే గవర్నరు, ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో భండారీ– వీళ్లంతా ప్రజలకు రోతపుట్టేలాగా నీచంగా ప్రవర్తించారు. అసలీ గవర్నర్ల పాత్రను కొంత వివరంగా చర్చిద్దాం.

## రాచరిక సంప్రదాయమిది

భారతదేశ చరిత్రలో వేల సంవత్సరాల క్రితం నుంచి చక్రవర్తి తన అనుయాయుల్ని, లేదా రాచకుటుంబంలోని వాళ్లను తన సామ్రాజ్యంలోని వివిధ రాజ్యాలకు గవర్నర్లుగా పంపే ఆనవాయితీ వుంది. ఉదాహరణకు అశోకుడు గవర్నరుగా పనిచేశాడు. ఇంత పెద్ద దేశంలో అందునా ఆ కాలంలో దేశ రాజధాని నుంచి పాలనను సమర్థవంతంగా నిర్వహించటం సాధ్యం కాదు. కాబట్టి రాజప్రతినిధులు వివిధ రాజ్యాలకు, లేదా ప్రాంతాలకు వెళ్లి పరిపాలించటం అవసరమయింది. చోళుల కాలంలో వివిధ రాజ్యాలను మండలాలని, వాటిని పాలించే రాజప్రతినిధులను మండలాధీశులని పిలిచేవాళ్లు. అలాగే ఢిల్లీ సుల్తానుల కాలంలో కూడా సుల్తాను ప్రతినిధులు వివిధ ప్రాంతాలలో రాజ్యం చేసేవాళ్లు. ఆ సుల్తాను బలహీనుడయితే అడపాదడపా గవర్నర్లు స్వతంత్రం ప్రకటించుకునేవాళ్లు. లేదా సుల్తాను మీదే దండెత్తి అతడిని వధించి పదవిలో కూర్చునే ప్రయత్నం చేసేవాళ్లు. ఉదాహరణకు ఢిల్లీ సింహాసనన్నా అధిష్ఠించిన ఏకైక మహిళ రజియా సుల్తానాపై తిరుగుబాటులో అప్పటి సర్హింద్ గవర్నరు ఆల్తూనియా ప్రముఖపాత్ర వహించాడు. అయితే రజియా అతణ్ణే పెళ్లాడి సింహాసనాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసింది. కాని ఆ ఇద్దర్నీ చంపి రజియా సోదరుడు ముజ్జుద్దీన్ బహరామ్ సుల్తానయ్యాడు.

కొందరు అదను చూసుకుని శత్రురాజులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మీద దాడిచేసే వాళ్లు ఉదాహరణకు ఢిల్లీ సుల్తానుల్లో ఆఖరివాడైన ఇబ్రహీంలోధి బాబరు చేతుల్లో ఓడిపోవటానికి ప్రధాన కారణం అప్పటి పంజాబు గవర్నరు దౌలత్ఖాన్లోధి బాబరుతో చేతులు కలపటం, మొఘల్ చక్రవర్తుల కాలంలో ఈ రాజ్యాలను 'సుబాలు' అని పిలిచేవారు. ఈ సుబాల గవర్నర్లను సుబేదారులుగా వ్యవహరించేవారు. అక్బరు కాలంలో 15 సుబాలుండేవి. స్థానికంగా ఎవరైనా సామ్రాజ్యానికి ఇబ్బంది కలిగిస్తే వెంటనే సుబేదారును పంపి తిరుగుబాటు అణచివేసేవాళ్లు. ఉదాహరణకు శివాజీగెరిల్లా యుద్ధాల ద్వారా మొగల్ సామ్రాజ్యాన్ని చికాకు పెట్టాడు. వెంటనే శాయిస్తాఖాను అనే దక్కను సుబేదారును పంపి అతణ్ణి లొంగదీయవలసిందిగా ఔరంగజేబు ఆజ్ఞాపించాడు. అయితే శివాజీ అర్ధరాత్రి అతడిపై దాడిచేసి పారద్రోలాడు. ఆ తరువాత శివాజీ సూరత్ సుబేదారు ఇనాయత్ఖాన్ను ఓడించి సూరత్ను దోచుకున్నాడు. చివరికి మొగల్ సేనాపతి రాజా జైసింగ్ శివాజీని ఓడించి బందీగా చక్రవర్తి దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ తరువాత శివాజీ జైల్లోనుంచి చాకచక్యంగా తప్పించుకోవటం; ఛత్రపతిగా ప్రకటించుకోవటం వేరే కథ. బ్రిటీషువారి కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారి గవర్నర్ జనరల్ కలకత్తాలో ఉండేవాడు. మద్రాసు, బొంబాయిలలో వారి ప్రోవిన్సులు ఉండేవి. వాటికి గవర్నర్లను నియమించి పాలన బాధ్యతను వాళ్ళ చేతుల్లో పెట్టారు. వారిలో చాలామంది మంచిపేరు తెచ్చుకున్నారు. ఉదాహరణకు మద్రాసు ప్రోవిన్సులో థామస్ రో తన రైతువారీ సెటిల్మెంటు విధానాల ద్వారా ప్రజల మన్నన పొందాడు. 1857 తరువాత ప్రత్యక్షంగా బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశ పాలన బాధ్యతను స్వీకరించింది. వైస్రాయిని బ్రిటిషు ప్రభుత్వం నియమించగా, ప్రోవిన్సులకోసం గవర్నర్ల వ్యవస్థ యథాతథంగా కొనసాగింది. 1911లో దేశరాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి తరలించారు. బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రోవిన్సులకు గవర్నర్లు కొనసాగారు. ఇలా భారతదేశంలో గవర్నర్ల వ్యవస్థకు బోలెడంత చరిత్ర ఉంది. సామ్రాజ్యంలోనుంచి ఏ ప్రాంతమూ జారిపోకుండా ఉండటం కోసం దేశం రాజధానినుంచి గవర్నర్లను పంపి వారి ఆధిపత్యంలో పాలనను కొనసాగించే సంప్రదాయం రాచరికంలోను, మధ్యయుగాలలోను, వలస కాలంలోను స్థిరపడింది. అందుకే గవర్నరును ఎప్పుడు కేంద్ర ప్రభుత్వమే నియమించటం, ఆయన కేంద్రానికి ప్రతినిధిగా ఉండటం జరిగేది. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పాలన పద్ధతిగా ఎంచుకున్నాం. స్వపరిపాలన వ్యవస్థలో ప్రజలే ప్రభువులు. అధికారంలో

ఎవరుండాలో, వాళ్లు ఏమీ చేయాలో నిర్ణయించాల్సింది ప్రజలు. ప్రజాస్వామ్యంలో పాలకులు సేవకులు మాత్రమే. అందునా ఎన్నో భాషలు, ప్రాంతాలు, మతాలు, కులాలు, మరెన్నో వైవిధ్యాలు ఉన్న భారతదేశంలో రాజ్యాంగరీత్యా జాతీయస్థాయిలో ఒక ప్రభుత్వం ఉండగా, రాష్ట్రాలలో వేరే ప్రభుత్వాలు ఉంటాయి. రాజ్యాంగంలోని 246వ అధికరణం ప్రకారం 7వ షెడ్యూలులో జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో చట్టసభల అధికారాలను స్పష్టంగా నిర్వచించారు. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం తన ప్రతినిధులను రాష్ట్రాలకు గవర్నర్లుగా పంపటం, ఆ గవర్నర్లు రాష్ట్రాల అధిపతులుగా ఉండటం, అవకాశం వచ్చినప్పుడల్లా రాజకీయాలలో వేళ్లుపెట్టి గందరగోళం సృష్టించటం, అందునా రాష్ట్రంలో అధికార పార్టీ కేంద్రంలో ప్రతిపక్షమయినప్పుడు అర్థరాత్రి మంతనాలతోను కుట్రలతోను ప్రభుత్వాలను మార్చే ప్రయత్నం చేయటం– ఇవన్నీ పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత పెద్ద మద్దతుతో అధికారాన్ని చేపట్టినా గవర్నరు ఎప్పుడు ఏ ఇబ్బంది కలిగిస్తాడో అన్న ఆందోళనకు గురికాక తప్పదు. రాజ్యాంగరీత్యా రాష్ట్రానికి అధిపతి గవర్నరు. అన్ని నిర్ణయాలు ఆయన పేరుతో జరుగుతాయి. అన్ని చట్టాలు ఆయన ఆమోదముద్రతో మాత్రమే అమలవుతాయి. ముఖ్యమంత్రిని, మంత్రివర్గాన్ని నియమించాల్సింది గవర్నరు. 356వ అధికరణం కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేయవలసిందని, రాష్ట్రపతి పాలన పేరుతో తన పాలనను విధించాలని సిఫారసు చేసేది గవర్నరు. రాష్ట్ర శాసనసభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలకు ఆదేశించేది గవర్నరు. అందువల్ల క్యాబినెట్ పరిపాలనలో చూడటానికి గవర్నరు. పాత్ర నామమాత్రమే అయినప్పటికీ, వాస్తవానికి దానిలో చాలా రాజకీయం ఇమిడి వుంది. ప్రసూతి వైద్యాన్ని గురించి ఒక నానుడి ఉంది. **బిడ్డ పుట్టుక చాలా వరకు ప్రకృతి చూసుకుంటుంది. అందువల్ల మంచి ప్రసూతి వైద్యుడి పాత్ర 'జాగరూకతతో గర్భస్త స్త్రీని కనిపెట్టుకుని ఉండటం; ఏమీ అనవసర జోక్యం చేసుకోకుండా ప్రకృతి ముందు తలవంచటం మాత్రమే'**నని మా వైద్యంలో చెప్పేవారు. ఒకరకంగా గవర్నరు పాత్ర కూడా క్యాబినెట్ పరిపాలనలో అలాగే వుండాలి. కాని 356వ అధికరణం దుర్వినియోగాన్ని పరిశీలిస్తే గవర్నర్లు రాజకీయ మాయాజూదంలో పాచికలుగా ఎలా ఉపయోగపడ్డారో తెలుస్తుంది. గత 48 సంవత్సరాలలో ఇప్పటికీ నూరుసార్లు పైగా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసి రాష్ట్రపతి పాలన పేరుతో గవర్నరు ద్వారా కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ పాలన ప్రవేశపెట్టారు. అందులో అత్యధిక పర్యాయాలు కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలే

వేటుకు గురయ్యాయి. ఈ ఒక్క అంశం చాలు గవర్నర్లను 'శిఖండులు'గా ఎలా ఉపయోగించుకుంటున్నారో తెలపటానికి. 1980ల ప్రారంభంలో తపాసే హర్యానాలో గవర్నరుగా ఉన్నాడు. అప్పుడు భజన్‌లాల్ ముఖ్యమంత్రి. అదివరకు జనతాపార్టీ తరపున ఎన్నికై, ఆ పార్టీ ముఖ్యమంత్రిగా ఉన్న భజన్‌లాల్ ఏకంగా తన రాష్ట్రంలో ఉన్న జనతా శాసనసభ్యులందరితో కలిసి పార్టీ ఫిరాయించి ఇందిరా కాంగ్రెస్‌లో చేరి తన పదవిని కాపాడుకున్నాడు. ఆ తరువాత 1982లో వచ్చిన శాసనసభ ఎన్నికల సందర్భంలో ఆయనొక సంచలన ప్రకటన చేశాడు.– "ఎన్నికలలో ఏ పార్టీ గెలిచినా నేను గనుక నా సీటును గెలిచి శాసనసభ్యుడినయితే మళ్లీ ముఖ్యమంత్రిని నేనే!" – అని ఆయన ప్రకటించుకున్నాడు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయి దేవీలాల్ నాయకత్వంలోని జనతాపార్టీ ఎక్కువ సీట్లు సంపాదించింది. కానీ గవర్నర్ తపాసే మళ్లీ భజన్‌లాల్‌నే ముఖ్యమంత్రిగా నియమించాడు. కొద్ది గంటలలోనే భజన్‌లాల్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి మెజారిటీ మద్దతు సంపాదించాడు. ఆ విధంగా ఆ గవర్నరు పుణ్యమా అని ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పునకు, ఏర్పడిన ప్రభుత్వానికి ఏమీ సంబంధం లేకుండాపోయి, ప్రజాస్వామ్యం తీవ్రంగా భంగపడింది.

## 'భండారీలు' ప్రజాస్వామ్యానికి కళంకం

1984లో రామ్‌లాల్ మెజారిటీ మద్ధతు, ప్రజాభిమానం ఉన్న యన్.టి.ఆర్. ప్రభుత్వాన్ని గద్దె దించిన వైనం, పైన బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమం, మళ్లీ యన్.టి.ఆర్‌ను ముఖ్యమంత్రిగా నియమించటం, ఆ తరువాత ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికలలో సానుభూతి పవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించక పోవటం, తెలుగుదేశం పార్టీ ఆ ఎన్నికలలో గెలవటం అందరికీ గుర్తే. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే ఆనాటి దారుణాన్ని నిలువరించటం సాధ్యమయ్యేది కాదు. కేంద్రంలో పాలకపక్షం మాట విని కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టటం లేదని 1984లో గవర్నరు బి.కె నెహ్రూను బదిలీ చేసి, ఆ స్థానంలో జగ్‌మోహన్‌ను నియమించారు. ఆయన మెజారిటీ ప్రభుత్వాన్ని కూలదోసి, ఫిరాయింపుల్ని ప్రోత్సహించి– ఫరూక్ అబ్దుల్లా బావమరిది జి.యం. షా నాయకత్వంలో (పార్టీ ఫిరాయించిన మొత్తం మంది మంత్రులుగా) కొత్త ప్రభుత్వాన్ని ప్రమాణ స్వీకారం చేయించాడు. కాంగ్రెస్ పార్టీ బయటినుంచి మద్ధతిచ్చింది. ఆనాడు కాశ్మీర్‌లో ఉంటున్న రావణకాష్ఠం నేటికీ చల్లారకుండా మండుతూనే వున్నది. జాతి తీవ్రంగా నష్టపోయింది. 1991లో

చంద్రశేఖర్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ ఒత్తిడితో తమిళనాడులో కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్ర పరిపాలన విధించాలని నిర్ణయించుకుంది. కానీ అప్పటి గవర్నరు, నేటి కేంద్ర మంత్రి సుర్జీత్‌సింగ్ బర్నాలా అందుకు అంగీకరించలేదు. ఆయనను అడ్డు ఆయనను అడ్డు తొలగించాలని బదిలీచేస్తే అందుకు నిరసనగా ఆయన రాజీనామా చేశారు. వెంటనే తమకు కావాలిసిన భీష్మనారాయణ్‌సింగ్‌ను గవర్నరుగా నియమించి, ఆయనతో ఒక నివేదిక తెప్పించుకుని డి.యం.కె ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతిపాలన విధించారు. ఇక ఇటీవల భండారీ మరో నాలుగడుగులు ముందుకు వేశారు. ఎన్నికలయాక అసలు ప్రభుత్వమే ఏర్పడకుండా నిరోధించిన దిట్ట ఆయన. ఆ తరువాత ప్రభుత్వం ఏర్పడినా మెజారిటీ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపాలన విధించే ప్రయత్నం చేసిన ఘనుడు భండారీ! ఆ తర్వాత రాత్రికి రాత్రి ఉన్న మంత్రివర్గాన్ని తొలగించి ఆకస్మాత్తుగా కొత్త ముఖ్యమంత్రిని, ఇతరులను ప్రమాణ స్వీకారం చేయించి ఘనాపాఠి ఆయన. అంత దారుణాలు చేసి కూడా ఇంకా నిర్లజ్జగా రాజ్యాంగాన్ని వల్లిస్తూ, కేంద్రంలో ప్రభుత్వం తొలిగిస్తుందని నిర్ధారణ అయ్యేవరకు పదవిని అంటిపెట్టుకుని వేళ్లాడిన ఘనత ఆయనకే దక్కింది. ఇలా ఎందరో గవర్నర్లు కేంద్రంలో తాత్కాలికంగా అధికారంలో ఉన్న పార్టీకి, ప్రభుత్వానికి తాబేదార్లుగా పనిచేయటంలో సిద్ధహస్తులయ్యారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరల్ స్ఫూర్తిని, రాష్ట్రాల హక్కులను రాజ్యాంగ పవిత్రతను కళంకితం చేశారు. సామ్రాజ్యవాదానికి వలస తత్వానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ గవర్నర్ల వ్యవస్థను సమూలంగా మార్పు చేయవలసి ఉంది. కేంద్రం నామినేషన్లతో కాక ప్రజలు కాని, శాసనసభ కాని రాజ్యాధినేతలు ఎన్నుకునే ఏర్పాటు చేయాలి. అప్పుడుగాని భారతదేశంలో అధికార వికేంద్రీకరణ, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సాధ్యంకావు.

* * *

# జాతి భవితవ్యాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**మార్చి 1, 1999**

యశ్వంత్‌సిన్హా వరసగా రెండో ఏడాది బడ్జెట్‌ను సమర్పిస్తారని ఎక్కువమంది విశ్వసించలేదు. దినదిన గండం నూరేళ్లాయుష్షుగా గడుస్తున్న ప్రభుత్వం ఎట్టకేలకు అతికష్టంమీద రెండో సంవత్సరంలోకి ప్రవేశించింది. సాధారణంగా, బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఎంతో ఉత్కంఠ ఆవహిస్తుంది. ఎన్నో ఊహాగానాలు, భయాందోళనలు, ఎంతో ఆసక్తి బడ్జెట్ సీజనులో చోటు చేసుకుంటాయి. బడ్జెట్ అంటే ప్రభుత్వం జమా ఖర్చుల ప్రకటన పూర్తవుతున్న ఆర్థిక సంవత్సరం - అంటే 1998-99 సంవత్సరానికి సవరించిన పద్దులు, గత సంవత్సరం - అంటే 1997- అంటే 1999-2000 సంవత్సరానికి అంచనాలు, పన్నులు, రాయితీల ప్రతిపాదనలు- ఇవి జమా ఖర్చుల లెక్కలలో చోటు చేసుకున్నవి. ఈ సంవత్సరం బడ్జెట్ ఎలా ఉంటుందోననే ఉత్కంఠ కానరాలేదు. ఈ సంవత్సరం ఆర్థికాభివృద్ధి బాగా మందగించింది. 1996 నుంచి క్రమక్రమంగా ప్రతి సంవత్సరం ఆర్థిక ప్రగతి రేటు తగ్గుముఖం పడుతోంది. ఇందుకు కారణం రాజకీయ అస్థిరత్వం అని చాలా మంది అపోహపడవచ్చు. అది వాస్తవం కాదు. మనుగడ కష్టమయినప్పుడు ప్రభుత్వాలు దీర్ఘకాలిక నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేవు. ప్రస్తుత ఆర్థిక మాంద్యం ఏవో రోజువారీ ప్రభుత్వ నిర్ణయాలతో అంతమయ్యేదీ కాదు.

## లైసెన్సు- కంట్రోలు- పర్మిటు రాజ్యం

1991 వరకు దేశంలో ఏ చిన్న పని చెయ్యాలన్నా ప్రభుత్వ ఆదేశం లేదా అధికారుల లైసెన్సులు, పర్మిట్లు లేకుండా సాధ్యమయ్యేది కాదు. ఆ కారణంగా ప్రజల చొరవకు అవకాశం లేకుండా, ఆర్థిక రంగంలో ప్రతి కార్యక్రమమూ పై వాళ్ళ దయవల్ల, అధికారుల చలవ వల్ల మాత్రమే సాధ్యమయింది. ప్రభుత్వం ఆర్థిక రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుని ఆ అధికారాన్ని డబ్బుగా, పలుకుబడిగా, ఆశ్రితపక్షపాతంగా ఇష్టంలేని వాళ్లపై కక్ష సాధింపుగా మలుచుకుంది. శివుడాజ్ఞలేనిదే చీమ కుట్టదన్నట్లుగా ప్రతి చిన్న పనికి ప్రభుత్వ జోక్యం అవసరం

కావటంతో ప్రజలలో చొరవ నశించింది. ప్రభుత్వ గుత్తాధిపత్యం అన్ని రంగాల్లో విస్తరించటంతో పోటీ లేకుండా పోయింది. ప్రమాణాలు, నాణ్యతలు పడిపోయాయి. అవినీతి విశృంఖలంగా విస్తరించింది. ప్రభుత్వం చేయవలసిన పనులను అశ్రద్ధ చేయటంతో పాలన కుంటుపడింది. బలవంతంగా ప్రజల స్వేచ్ఛను అడ్డుకోవటంతో ఆర్థిక ప్రగతి చాలా మందకొడిగా జరిగేది. 1952 నుంచి 1991 వరకు దేశంలో ఆర్థిక ప్రగతి సగటున ఏటా 2.5 నుంచి 3.5శాతం మాత్రమే ఉంది. ఎదుగూబొదుగూ లేకుండా గొర్రెతోక బెత్తెడుగా ఉన్న ఆర్థిక ప్రగతి రేటును రాజ్‌కృష్ణలాంటి ఆర్థికవేత్తలు "హిందూ ప్రగతి రేటు" అని ఈసడించారు. భారతీయ వస్తువుల నాణ్యత తక్కువగాను, ధరలు ఎక్కువగాను ఉండటంతో ప్రపంచ మార్కెటులో పోటీకి తట్టుకోవటం అసాధ్యమయింది. 1950లో ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటా 2శాతం కాగా, 1990 నాటికి అది 0.48 శాతానికి తగ్గిపోయింది. 1950లో జాతీయాదాయం ప్రపంచ ఆదాయంలో 2శాతం ఉండగా 1990నాటికి అది 1శాతానికి పడిపోయింది. ప్రతి పంచవర్ష ప్రణాళికలోను పేదరికం నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలన, ఆర్థిక స్వావలంబన, నిరక్షరాస్యత నిర్మూలన - ఇలా సమున్నత లక్ష్యాలు మళ్లీ మళ్లీ ప్రకటితమవుతున్నాయి. ఆ లక్ష్యాలలో ఏవీ అనుకున్న రీతిలో నెరవేరలేదు. చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్ర సామగ్రి, ఎరువులవంటి వస్తువుల దిగుమతి పెరగ్గా, ఎగుమతులు మాత్రం తగినంతగా పెరగలేదు. ప్రగతి మందగించడంతో పన్నుల ద్వారా చేకూరే ఆదాయం పడిపోయింది. పన్నుల రేటు పెంచినా అది ఆర్థిక ప్రగతిని మాత్రం అదుపులేకుండా పోయింది. ఒక వంక ప్రభుత్వ ఖజానాలో లోటు, మరో వంక విదేశీ వాణిజ్యంలో లోటు- ఇవి ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాయి. వీటన్నింటి పర్యవసానమే 1991లో అప్పటికప్పుడు చేపట్టిన ఆర్థిక సంస్కరణలు. 1991 నుంచి పరిశ్రమల మీద ప్రభుత్వ నియంత్రణ చాలా వరకు తగ్గింది. లైసెన్సుల అవసరం లేకుండా చేయడంతో ప్రజల చొరవకు శృంఖలాలు తొలగాయి. ఆర్థిక ప్రగతికి అవరోధాలు కొంత మేరకు తొలగటంతో 1991 నుంచి 1997 వరకు గణనీయంగా ఆర్థిక ప్రగతి సాధ్యమయింది. అదివరకు బొటాబొటిగా 3శాతం ఉన్న ఆర్థిక ప్రగతి 8శాతానికి చేరుకుంది. మళ్లీ గత రెండేళ్ల నుండి పరిస్థితులు జటిలమయ్యాయి. ఆర్థిక ప్రగతి కుంటుపడుతోంది. ఈ ఏడాది 4.8-5 శాతాన్ని మించదని అంచనా. పరిశ్రమలలో ఉత్పత్తి మందగించింది. చేసిన ఉత్పత్తులకు గిరాకీ లేకుండాపోయింది. సిమెంటు, ఉక్కు మోటారు. వాహనాలు, మరెన్నో

పరిశ్రమలలో గిరాకీ లేక ధరలు పడిపోయాయి. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, మళ్లీ మళ్లీ కొనే రోజువారీ వాడకం వస్తువులు, కొన్ని రకాల మందులు – వీటిని మినహాయిస్తే దాదాపు మిగిలిన అన్ని రంగాలలోను గిరాకీ తగ్గిపోయింది. కొత్త పెట్టుబడులు దాదాపు ఆగిపోయాయి. ఎక్కడా కొత్త పరిశ్రమలు రావటం లేదు. ఎగుమతులు బాగా మందగించాయి. నిజానికి చాలా రంగాలలో ఎగుమతులు పెరగకపోగా తగ్గిపోతున్నాయి. పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయి చేరటం లేదు. వీటన్నింటి ఫలితంగా ప్రభుత్వ ఖజానా గందరగోళంలో పడింది.

## మళ్లీ ఆర్థిక సంక్షోభం!

స్థూలంగా చెప్పాలంటే ప్రభుత్వానికి ఆదాయం మందగించింది. ఖర్చు అదుపు తప్పింది. ప్రభుత్వ ద్రవ్యలోటు – అంటే పన్నుల ఆదాయం కంటే పెరిగిన ఖర్చు– పూర్తిగా అదుపు తప్పింది. పన్నుల వసూళ్లు పెరుగుతూనే ఉన్నా, ఆర్థిక ప్రగతి తగ్గటంతో వసూళ్లు ఇంకా పెరిగే అవకాశం తక్కువ. అదే సమయంలో ఖర్చులు మాత్రం అదుపు లేకుండాపోయాయి. ప్రధానంగా మూడు రకాల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మొదటిది జీతభత్యాలు. ఒకపక్క ప్రజలకు ప్రభుత్వ సేవలు సరిగ్గా అందటం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి పెరిగి, ప్రతి చిన్న విషయానికి వేధింపు, సాధింపు అవమానం, ఆలస్యం పెరిగాయి. అందునా ఐదవ వేతన సంఘం తరువాత ఈ భారం బాగా పెరిగింది. యంత్రాంగానికి చెల్లించే జీతభత్యాలకు, ప్రతి ఫలంగా అందే సేవలకు ఏ మాత్రం సంబంధం లేకుండాపోయింది. రెండో పెద్ద ఖర్చు వడ్డీలు, ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీకలసి లక్ష కోట్లరూపాయలు పైగా కొత్తగా అప్పులు తెస్తున్నాయి. ఆ డబ్బు పైన చెల్లించే వడ్డీలు విపరీతంగా పెరిగాయి. ఈ డబ్బులో అధిక భాగం రోజువారి ఖర్చుకు (అంటే ప్రభుత్వ నిర్వహణకు), రెవెన్యూ బడ్జెటులో లోటు పూడ్చటానికి ఖర్చు పెడుతున్నారు. కొద్ది మొత్తం మాత్రమే ప్రజల భవిష్యత్తుకు పనికి వచ్చే పెట్టుబడుల రూపంలో వెళుతోంది. అందులోనూ చాలా భాగం అవినీతికి, దుబారాకు అంకితమైపోతోంది. ఖజానాపై మూడో పెద్ద భారం సబ్సిడీలు. ప్రభుత్వాలు అయినదానికి కానిదానికి సబ్సిడీలు ఇచ్చి, ప్రజల్ని మభ్యపెట్టి తాత్కాలికంగా తమ పబ్బం గడుపుకొంటున్నాయి. సబ్సిడీలు కొన్ని రంగాలలో అవసరమే. ఆ సబ్సిడీలు దుర్భర దారిద్ర్యంలో ఉన్న వారికి ఊతమిచ్చేవిగాను; లేదా ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచి ప్రజల్ని తమ కాళ్లమీద తాము నిలబడేట్టు చేసేవిగాను ఉండాలి. ఒక చైనీస్ సామెతలో చెప్పినట్లుగా, ఆకలిగా

ఉన్న మనిషికి చేపల్ని వండిపెడితే ఆ రోజుకు కడుపు నిండుతుంది. అదే చేపల్ని పట్టుకునే గాలాన్ని, దానితోపాటు ఎరని ఇచ్చి చేపలు పట్టటం నేర్పితే జీవితాంతం అతనికి భుక్తి ఏర్పాటవుతుంది. ప్రభుత్వాలు దుబారా సబ్సిడీలను ఇవ్వటం వల్ల అవినీతి పెరిగింది. ప్రజలకు అందేది చాలా కొంచెంకాగా, ప్రజల పేరు చెప్పుకొని నాయకులు, ఉద్యోగులు భోంచేసేది చాలా ఎక్కువయింది. వీటన్నింటితోపాటు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఆసియాలో చాలా దేశాలలో కరెన్సీ విలువ తగ్గి, ప్రపంచ మార్కెటులో ఆ దేశాల ఉత్పత్తుల ధరలు పడిపోయాయి. అందువల్ల ఆ వస్తువులకు గిరాకీ పెరిగింది. వాటితో భారతీయ ఉత్పత్తులు పోటీ పడలేకపోతున్నాయి. ఎగుమతుల్ని పెంచడానికి భారత్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం నామమాత్రంగానే ఉంటోంది. ఒక్క వజ్రాల విషయంలో తప్ప, సంప్రదాయంగా ఎగుమతులు చేసే ఎన్నో రంగాలలో ఆసియాలోని ఇతర దేశాల పోటీని ఇండియా తట్టుకోలేకపోతోంది. అదునా 1978 నుంచి మార్కెట్ వ్యవస్థను అనుసరిస్తూ బాగా బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందిన చైనాతో పోటీవల్ల భారత్ తయారు చేసిన వస్తువులకు గిరాకీ తగ్గుతోంది.

## జటిలమవుతున్న విషవలయం

ఈ పరిస్థితుల్లో ఆదాయమన్నా పెరుగాలి, ఖర్చన్నా తగ్గించాలి. ఆదాయం పెంచాలంటే సాధ్యం కాదు. ఇప్పటికే పన్నుల భారం ఎక్కువయింది. ఇంకా పన్నులు పెంచితే జనం నడ్డివిరుగుతుంది; పన్నులు ఎగవేత పెరుగుతుంది. వాస్తవానికి పన్నులు న్యాయంగా ఉంటేనే వసూళ్లు పెరుగుతాయిగాని, ఇష్టం వచ్చినట్లు పెంచితే ఆదాయం పెరగదు. ఉదాహరణకు 1960ల చివరలో, 1970లలో ఆదాయం పన్ను చాలా ఎక్కువగా ఉండేది. దానివల్ల పన్నుల వసూళ్లు పెరగకపోగా చాలామంది ఏదో ఒక విధంగా ఎగగొట్టడంతో నల్లడబ్బు పెరిగింది. అదే ఆదాయం పన్ను తగ్గించాక వసూళ్ళు పెరిగాయి. ఇక ఖర్చు దగ్గరికి వస్తే వడ్డీలు కట్టక తప్పదు. అప్పులు తీసుకున్నాక వడ్డీలు కట్టకపోతే దేశం పరువు, పరపతి– రెండూ పోతాయి! మళ్లీ కావాలన్నా అప్పులు పుట్టవు. జీతభత్యాలను తగ్గించటం అటుంచి, 1997 చివరలో గుజ్రాల్ ప్రభుత్వం ఐదో వేతన సంఘం సూచించిన ఇతర ప్రతిపాదనల్ని– ప్రభుత్వ యంత్రాంగాన్ని కాలక్రమేణా తగ్గించటం; సెలవు రోజులు తగ్గించటం; పనికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు నిర్వచించి అమలు చేయటం– వీటన్నింటిని తోసిపుచ్చింది. పర్యవసానం– ప్రభుత్వ సేవలు ఏ మాత్రం మెరుగడక పోగా ఖర్చుమాత్రం విపరీతం కావడం! ప్రస్తుత పరిస్థితులలో సబ్సిడీలు ఒక్కసారిగా తగ్గించటం సాధ్యం కాదు.

కాలక్రమేణా సబ్సిడీలను తగ్గించాల్సిందేగాని, పాలకుల అసమర్థతకు, అవినీతికి బాధ్యతను తమ మీదకు నెట్టే ప్రయత్నం చేస్తే ప్రజలు సహించరు. ఏతావతా తేలేదేమంటే, దేశం పాలనపరంగా, ఆర్థికపరంగా ఒక విష వలయంలో చిక్కుకుంది. పెళ్లి చేస్తేగాని, పిచ్చికుదరదు; పిచ్చి తగ్గితేగాని పెళ్లికుదరదు!

## సమూల సంస్కరణలు అత్యవసరం

ఇప్పుడు ప్రజలకు కావలసింది మభ్యపెట్టే మాటలు, మోసపుచ్చే లెక్కలు, అంకెల గారడీలు, కంటి తుడుపు చర్యలు కాదు! దేశ ఆర్థిక వ్యవస్థను, పాలనా వ్యవస్థను సమూలంగా సంస్కరించే దీర్ఘకాలిక చర్యలు కావాలిప్పుడు. ఎంతో కాలం పాలకులు ఆత్మవంచనకు, ప్రజాద్రోహానికి పాల్పడ్డారు. పాలించడం మరచి జనం నెత్తిన మోదటమే కార్యక్రమంగా పెట్టుకున్నారు. రాజ్యాంగబద్ధ దోపిడీకి పాల్పడ్డారు. చట్టబద్ధ చౌర్యాన్ని అవిశ్రాంతంగాకొనసాగించారు. దేశం ఇప్పటి ఆర్థిక దుస్థితి నుంచి బయట పడటం అసాధ్యమేమీ కాదు. అందుకు దేశభక్తి, చిత్తశుద్ధి, దృఢ సంకల్పం, సత్య సంధత, దీర్ఘకాలిక దృష్టి ఉండాలి. అవి ఉన్న దాఖలాలేమీ నేడు కానరావటం లేదు. ఆర్థిక రంగంలో నేడు చేసే తప్పిదాల మూల్యాన్ని చెల్లించవలసింది. వేరెవరో కాదు– మన బిడ్డలు. ఒక కుటుంబం అయినా, ఒక సంస్థ అయినా, ఒక జాతి అయినా రేపన్నది లేనట్లు ప్రవర్తిస్తే అందుకు ప్రతిఫలాన్ని చెల్లించాల్సిందే. ఆరుద్ర అన్నట్లు–

కూరుచుండిన కొమ్మ
నరకుకొను వాజమ్మ
హితము చెప్పిన వినదుకదమ్మ
ఓ కూనలమ్మా!

ఆకలిగొన్న మనిషి తన శరీర మాంసాన్ని తానే కొరుక్కు తింటే ఆకలి తీరదు సరికదా; అతడు మృత్యువాతపడతాడు. నేతల స్వార్థపూరిత చర్యల వల్ల జాతి భవితవ్యం ప్రమాదంలో పడింది. ఈ పరిస్థితిని సమూలంగా మార్చటం అత్యవసరం.

* * *

# సుపరిపాలన కోసం రెండో స్వాతంత్ర్య పోరాటం

**ఆగస్టు 11, 1997**

1947 ఆగస్టు 14రాత్రి భారతదేశం తెల్లదొరలను సాగనంపి స్వపరిపాలనాధికారాన్ని పొందింది. కోట్లాది భారతీయుల ఆశయాలు, ఆశలు ఫలించి స్వతంత్రం లభించింది. ప్రపంచంలో ఏ దేశానికి తీసిపోని మహోన్నత నాయకత్వం మనకు లభించింది. ఐదు దశాబ్దాలు గడచి, స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంలో గతానుభవాన్ని నెమరువేసుకొని, మన విజయాలను, వైఫల్యాలను బేరీజు వేసుకోవడం అవసరం. తద్వారా భవిష్యత్ కార్యాచరణకు మార్గం సుగమమవుతుంది.

## విజయాలు-వైఫల్యాలు

1947 పూర్వం ఐదువేల సంవత్సరాల సుదీర్ఘ అవిచ్ఛిన్న చరిత్రలో, భారతదేశం ఏనాడూ పూర్తిగా రాజకీయంగా ఏకం కాలేదు. అలాంటిది 50 సంవత్సరాల పాటు అన్ని భాషలు, కుల, మత, ప్రాంతీయ వైరుధ్యాలతో కూడిన, ఏ నిర్వచనానికి లొంగని సంక్లిష్ట భారతదేశం సమైక్యంగా, అదీ వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చే ప్రజాస్వామ్య దేశంగా మనగలగటం గొప్ప విజయం. దేశవిభజన నేపథ్యంలో జరిగిన ఘోరకలిని తలుచుకున్నప్పుడు, ఈ విజయం అసాధారణమని చెప్పక తప్పదు. అలాగే ఆనాటితో పోలిస్తే ఆర్థికంగా వివిధ రంగాలో ప్రగతిని సాధించాం. అహారోత్పత్తిలో స్వయం సమృద్ధమయ్యాం. తలసరి జీవన కాలం 32 సంవత్సరాల నుండి దాదాపు రెట్టింపయింది. కొంత వరకు మౌలిక సదుపాయాలు కల్పించుకున్నాం. ఇది నాణానికి ఒకవైపు మరో వైపున– నేటికి ప్రపంచం మొత్తంలో సగం మంది నిరక్షరాస్యులు మన దేశంలో ఉన్నారు. నివారించదగ్గ అంటు వ్యాధులతో మనదే ప్రథమస్దానం. జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. 32కోట్ల జనాభాతో ప్రారంభమైన దేశం నేటికి సుమారు 100కోట్లకు చేరుకుంది. మానవాభివృద్ధి గణాంకాలలో ప్రపంచంలో అట్టడుగున ఉన్న దేశాలలో మనది ప్రముఖ స్థానం. ఉత్పత్తితో కూడిన ఉపాధి కల్పన జరగకపోవడంతో నిరుద్యోగం తాండవిస్తోంది. లక్షలాది యువతీ యువకులు

నిరాశకు, నిస్పృహకు లోనవుతున్నారు. మౌలిక సదుపాయాలు సరిగా కల్పించలేక పోవడంతో ఆర్థిక వ్యవస్థ అటుపోట్లకు గురవుతున్నది. విద్యుత్తు కొరత, చాలని రోడ్లు, రవాణా సౌకర్యాలు, ఓడ రేవులు– అన్నీ దేశ ప్రజల ఉత్పాదక శక్తిని దెబ్బతీస్తున్నాయి. అన్నిటినీ మించి గత అయిదు దశాబ్దాల కాలంలో పాలన వైఫల్యం మనల్ని వెక్కిరిస్తోంది. ఈనాడు వెనుతిరిగి చూస్తే– మహత్వ పూర్ణమైన ఆ శుభదినాన అధికారం తెల్లదొరల నుండి నల్ల దొరలకు బదిలీ అయిందని దొరతనం మాత్రం పోలేదని, ప్రజలపాత్ర నేటికి నామమాత్రమేనని కంటబడే కఠోర సత్యాలు దిగ్భ్రమ కలిగిస్తాయి. పాలకులు మారినా పాలన వ్యవస్థ మాత్రం అలాగే అప్రతిహతంగా కొనసాగుతోంది. అధికారంలో ఉన్నవాళ్ళు స్వప్రయోజనాలకు మాత్రమే పాలన ఉపకరిస్తోంది. అధికారాన్ని అందించిన ప్రజలకు మిగిలింది రిక్తహస్తాలు, హృదయవేదనలే. నిజమైన ప్రజాస్వామ్యం నెలకొల్పి ప్రజలే ప్రభువులు కావటానికి అవసరమైన మౌలిక సంస్కరణలు చేపట్టే మహదావకాశాన్ని 50ఏళ్ల క్రితం జారవిడుచుకున్నాం. ఒక వంక అధికారం మార్పిడీ జరిగిన ఆరోజున సంబరాలలో, అధికార కార్యక్రమాలలో నేతలు మునిగి తేలుతుండగా, మరోవంక, నిజమైన స్వరాజ్యాన్ని కాంక్షించి, అందుకు తన జీవితాన్ని బలిదానం చేసిన మహాత్ముడు దేశ రాజధానికి సుదూరంలో 'నవఖాలిలో' ఎంతో ఆవేదనతో, ఆర్తితో శాంతి స్థాపన కోసం ఉదాత్తమైన పోరాటం చేయటం, స్వతంత్ర వేడుకలలో పాలుపంచుకోకపోవటం ఒక రకంగా జాతి భవిష్యత్తుకి, అసంపూర్ణ స్వతంత్రానికి సంకేతమని చెప్పవచ్చు. భారత రాజ్యాంగం మానవ విలువల్ని ఉదాత్త ఆశయాల్ని ప్రతిబింబిస్తున్నా, రాజ్య నిర్మాణం మాత్రం ఏ మార్పు లేకుండా అలాగే కొనసాగింది. మన రాజ్యాంగంలో దాదాపు 80 శాతం వరకు తెల్లదొరలు పరాయిపాలనలో లండన్ నగరంలో బ్రిటీష్ పార్లమెంటులో 1935లో చేసిన భారత ప్రభుత్వ చట్టం నుంచి అరువు తెచ్చుకున్నదేనన్న వాస్తవం ఈ పరిణామానికి అద్దం పడుతుంది.

## ఏ రాయైతేనేం..!

స్వతంత్ర పోరాటకాలంలో కన్న కలలకు, నేటి అనుభవానికి మధ్యనున్న అంతరం ప్రజల్ని నిరంతరం వెక్కిరిస్తోంది. గత వైఫల్యాల ఫలితంగా నిరాశ, నిస్పృహ ప్రజల్ని కుంగదీస్తున్నాయి. పౌరులుగా జనం చేతుల్లో ఉన్న ఏకైక ఆయుధం అయిన ఓటు హక్కుని మంచిగానే వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వాలను మళ్లీమళ్లీ పడగొట్టారు. క్రొత్త వాళ్లకు అందలాలెక్కించారు. కాని, ఏ రాయైతేనేమి పళ్లూడగొట్టుకోవడానికి

అన్నట్లుగా – ఎన్నికలలో ఎవరు గెలిచినా, పౌరులు మాత్రం మళ్లీ మళ్లీ ఓటమిని చవిచూస్తున్నారు. పాలన వ్యవస్థ స్వరూప స్వభావాలు మాత్రం మారలేదు. నేటికీ అధికారంలో ఉన్నవాడు ప్రభువుగా ప్రవర్తిస్తుండగా, ప్రజలు అర్భకులుగా, యాచకులుగా, బానిసలుగా కొనసాగుతున్నారు. అందుకే నేటి స్వతంత్ర స్వర్ణోత్సవాల సమయంలో ఎటుచూసినా ఆనందహేల కన్న విషాద ఛాయలే ఎక్కువగా గోచరిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, ప్రభుత్వం ప్రజల సేవకోసం ఉన్నది. దేశాధినేత అయిన రాష్ట్రపతి నుండి స్థానిక ప్రభుత్వకార్యాలయంలో బంట్రోతు వరకు ప్రజలకు సేవకులు మాత్రమే. ప్రభుత్వ సంస్థలు ప్రజల అవసరాలు తీర్చటానికి ఏర్పడ్డాయి. అయితే, నిత్య జీవితంలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఏ చిన్న పనికి వెళ్లినా ఎదురయ్యే అవమానాలు, నిస్పృహా, జాప్యం, వేదన –ఇవన్నీ అందరికీ అనుభవమే. ఈ మధ్య ఒకాయన స్వానుభవం నాకు వివరించారు. ఐదారేళ్లుగా ఆయన ఇంటి పన్ను కట్టడంలో అశ్రద్ధ చేశారట ఇల్లమ్ముకుందామన్న ఆలోచనతో అన్నేళ్లుగా కట్టని బకాయిలు, దానిపై జరిమానాలతో సహా కట్టేద్దామని ఆయన సంకల్పం. అయితే మొత్తం ఎంత కట్టాలో నగర పాలక సంస్థవారు లెక్కకట్టి వసూలు చేసుకోవాలి. అందుకోసం ఆయన కార్పొరేషన్ ఆఫీసుకు 43సార్లు తిరగాల్సొచ్చింది! అప్పటికీ పని కాలేదు. మూడు సంవత్సరాల ఇంటి పన్నుకు సమానమైన మొత్తం 'లంచంగా' సమర్పించాక గాని ఇంటిపన్ను జమ చేసుకోలేదు ఆ "ప్రజాసేవకులు". పన్ను కట్టడానికే ఇంత బాధ పడాల్సొస్తే, ఇక మిగతా పనులకి ఎలాంటి యాతనలు పడాలో చెప్పనవసరం లేదు. పాలన వైఫల్యం కారణంగా అవినీతి సర్వాంతర్యామి అయిపోయింది. అన్ని స్థాయిలలోను 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు వ్యాపించింది. రాజకీయాల్లో నేర ప్రవృత్తి పెరిగి నాయకులకు, నేరస్థులకు మధ్య సంబంధం విడదీయరానంతగా గాఢమైపోయింది. పరిమితమైన కేంద్రీకరణ వల్ల పౌరుల పాత్ర నామమాత్రమై, ఉత్సాహం నీరు గారుతోంది. పాలన ప్రజలకు సుదూరం అయిపోయింది. అన్ని శాఖల వ్యవస్థ వ్యవహారాల్లోను, పాలనలోను సర్వత్రా కన్పించే దుర్లక్షణం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు, ప్రజల పేరుతో, ప్రజల సేవకులుగా, ప్రజల కోసం విధులను నిర్వహించవలసిన నేతలు, అధికారులు ప్రజల నుంచే నిరంతరం రహస్యాలు దాస్తున్నారు. అవినీతిని, అన్యాయాన్ని, అక్రమాన్ని పెంచుతున్నారు. ప్రజల ఓటుతో అందలం ఎక్కిన ప్రభుత్వాలు ప్రజల నుంచే పాలనకు చెందిన విషయాల్ని రహస్యంగా దాచిపెట్టడం! ఇదేనా ప్రజాస్వామ్యం? రాజకీయ

వ్యవస్థ నిజాయితీగా, ప్రజాస్వామ్యబద్ధంగా, మంచి నాయకత్వాన్నిస్తూ, ప్రజల సుఖసంతోషాలను పెంచేదిగా ఉండాలనే ఊహ గొంతెమ్మ కోరికేమీకాదు. ప్రజలకు పాలనలో నిజమైన భాగస్వామ్యం లభించి, పౌరులే ప్రభువులుగా ఉండాలని కోరటం దురాశ కానేకాదు. ప్రభుత్వాలు స్థిరంగా ఉండి, పాలకుల వ్యక్తిగత ప్రయోజనాలకు కాక, జాతి సంక్షేమానికి, బిడ్డల భవిష్యత్తుకి ప్రాధాన్యతనివ్వాలని ఆశించటం అసహజమేమీకాదు. పాలనకు చెందిన నిర్ణయాలు ప్రజలకు తెలిసే విధంగా ప్రభుత్వ కార్యకాలాపాలు దాపరికం లేకుండా జరగాలని కాంక్షించటం విడ్డూరమేమీ కాదు. సకాలంలో, సమర్థంగా న్యాయం అందాలని ఎదురుచూడడంలో అన్యాయం ఏమీలేదు. మంచిపాలన, ప్రజలకు జవాబుదారిగా ఉండే దోషరహిత ప్రభుత్వాలు పొందటం మన జన్మహక్కు ప్రజాస్వామ్యంలోని ఈ రుగ్మతలకు ఔషదం మరింత ఎక్కువ, మరింత మంచి, మరింత సమర్థ ప్రజాస్వామ్యం. అలాంటి ప్రజాస్వామ్యాన్ని సాధించటం మన ప్రథమ కర్తవ్యం. ప్రపంచమంతటా మౌలిక సంస్కకరణలు కోరుతూ ప్రజలు సంఘటితమైనప్పుడు బ్రహ్మాండమైన ఫలితాలు సాధించారు. 1958లో ఫ్రాన్సులో తరువాత ఫిలిప్పీన్స్ థాయిలాండ్ లాంటి దేశాలలో, ఇటీవల ఇటలీలో, గత దశాబ్దంలో ఎన్నో తూర్పు యూరపు దేశాలలో జన ప్రభంజనంతో దుష్పరిపాలన స్థానే పటిష్ఠ ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మరోవంక సకాలంలో సంస్కరణలు చేపట్టలేని ఒకప్పటి సోవియట్ యూనియన్, యుగోస్లేవియా వంటి దేశాలు పతనమై చిన్నాభిన్నమయిపోయాయి. నేటికీ అశాంతికి, అస్థిరత్వానికి, అంతర్యుద్ధానికి లోనవుతున్నాయి.

## ఎన్నో ఒంటరి పోరాటాలు

భారతజాతి కూడా చారిత్రాత్మకమైన మార్పునకు సన్నద్ధంగా ఉంది. మన సంక్షోభానికి పరిష్కారం మన చేతుల్లోనే, మనకు అందుబాటులోనే ఉంది. జాతి భవితవ్యం కోసం చేపట్టవలసిన సంస్కరణల అవసరాన్ని గుర్తించి వాటిని సాధించే దీశక్తి చిత్తశుద్ధి, ఆత్మస్థైర్యం పుష్కలంగా ఉన్న భరతమాత ముద్దుబిడ్డలెందరో మన కళ్ల ముందున్నారు. అపూర్వ స్ఫూర్తితో ఘన విజయాన్ని సాధించిన ప్రజా ఉద్యమాలు మన ముందు కోకొల్లలుగా ఉన్నాయి. డాక్టర్ కురియన్ నేతృత్వంలో విజయవంతమైన పాల సహకారోద్యం; మహారాష్ట్రలో జాంఖేడ్‌లో డాక్టర్ అరోలి చేపట్టిన వినూత్న సామాజిక ఆరోగ్య కార్యక్రమం; నవీనరుషి అన్నాహజారే సారథ్యంలో స్వయం

సమృద్ధమై నేటి అన్నా అవినీతి వ్యతిరేక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన రాలేగావ్‌సిద్ధి గ్రామం; సుందర్‌లాల్ బహుగుణ నేతృత్వంలో హిమాలయ పర్వత సానువుల్లో అటవీ పరిరక్షణ కోసం సాగిన 'చిప్కో' ఉద్యమం; రాజస్థాన్‌లో అరుణారాయ్ శ్రీకారం చుట్టిన సమాచార హక్కు కోసం ఉద్యమం; ఎక్స్‌నోరా పేరుతో నిర్మల్ సారథ్యంలో మద్రాసులో, ఇటీవల హైదరాబాదులో చేపట్టిన నగర పారిశుద్ధ్య ఉద్యమం; పెద్ద ప్రాజెక్టుల వల్ల నిరాశ్రయులైన వారికి తగిన పరిహారం లభించాలని మేధా పాట్కర్ చేపట్టిన ఉద్యమం... ఇలా ప్రజలు ఉద్యమించి పరిష్కారాల్ని సాధిస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కాని ఇవన్నీ ఒంటరి పోరాటాలుగా ఆయా ప్రాంతాలకి, రంగాలకి పరిమితమైపోతున్నాయి. అది చాలదు. ప్రస్తుతం ఉన్న దుష్పరిపాలన స్థానే స్వపరిపాలన పొందే అర్హత, శక్తి ఈ దేశ పౌరులకు ఉన్నాయి. లక్ష్యసాధనకు కావలసింది ప్రజల ఆవేదనని సమగ్ర సంస్కరణల కోసం సమష్టి కృషిగా మార్చే కార్యాచరణ. ప్రజలు ప్రభువులై రాజ్య వ్యవస్థలో పాలుపంచుకుని, సాధికారంతో, సగర్వంగా నడవాలి. జాతిమన్ననలు పొందిన విజ్ఞులు, సంస్కరణల్ని సాధించే శక్తిగల ధీరులు, జనహితాన్ని కోరే దేశభక్తులు ఒక గొడుగు కిందికి రావాలి. తమ ఉనికి కాపాడుకుంటూ, అందరూ ఆమోదించిన జాతి లక్ష్యాల కోసం, ప్రజాస్వామ్య సంస్కరణల కోసం కదం తొక్కాలి. ఈ జాతీయోద్యమ శాఖల్ని దేశమంతటా, దశ దిశలా వ్యాప్తి చేసి అచేతనులుగా ఉన్న జనసామాన్యానికి తేవాలి. అప్పుడు నేడు అయోమయంతో నిశ్చేష్టులై, మూగవేదనకు గురవుతున్న కోట్లాది భారతీయులు తమ ఆవేదనకి కార్యరూపం ఇస్తారు. తమ ఆవేశానికి పోరాట రూపం ఇస్తారు. ప్రజల కలల్ని సఫలం చేయటం కోసం రెండవ స్వతంత్ర పోరాటం రూపు దిద్దుకుంటుంది. ఈ ఆవేశాన్ని, ఆర్తిని, పోరాటపటిమని లక్ష్యసాధన కోసం సక్రమ మార్గం పట్టించేది ప్రజల ప్రత్యక్ష తీర్పు– రిఫరెండమ్ జన హృదయాలలో ఉన్న ఘోషని పక్షపాత రాజకీయాలకి, అధికార లాలసకి అతీతంగా ప్రకటించటానికి సరైన మార్గం ఈ రిఫరెండమ్. కృత్రిమమైన అడ్డుగోడల్ని ఛేదించి, మార్పును ఆహ్వానిస్తున్న జాతిమొత్తాన్ని ఏకం చేసి, గమ్యాన్ని చేర్చే అద్భుతమైన ఆయుధం రిఫరెండమ్– భరతజాతి పునరుజ్జీవానికి ధర్మబద్ధమైన సోపానం రిఫరెండమ్. ప్రజాస్వామ్యానికి నిజమైన తార్కాణం – మౌలిక సంస్కరణల కోసం ప్రజల ప్రత్యక్ష తీర్పు అవకాశం రావాలే గాని, దుష్పరిపాలనతో విసిగి వేసారిన భారత ప్రజలు ఒక్కుమ్మడిగా ఉద్యమించి, నినదించి, నిజమైన ప్రజాస్వామ్య ఆవిర్భాం కోసం, పూర్తి స్వరాజ్యం కోసం ఈ

ప్రత్యక్ష తీర్పునిస్తారు.

## పాలన వ్యవస్థ సమూల ప్రక్షాళన

సుసంఘటితంగా, నిర్దిష్ట లక్ష్యాల కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమిస్తే, స్వతంత్ర స్వర్ణోత్సవాలలో ప్రారంభించి, ఈ శతాబ్ది అంతానికి, భారత రిపబ్లిక్ స్వర్ణోత్సవ సంవత్సరానికి ఈ రిఫరెండమ్‌ను సాధించుకోగలం – మార్పునాహ్వానిస్తూ తిరుగులేని తీర్పు నివ్వగలం. పూర్ణస్వరాజ్యాన్ని నిర్మించుకోగలం. ఇది కేవలం పాలకుల మార్పు కోసం జరిగే తతంగం కాదు; పాలనా వ్యవస్థ సమూల ప్రక్షాళన కోసం జరిగే మహాయజ్ఞం. భారత జాతి సంక్షోభం అధిగమించడానికి వీల్లేనిదేమీకాదు. మానవ శక్తికి, ప్రజల విజ్ఞతకు అతీతమైనదేమీ లేదు. గతానుభవసారాన్ని ఒంటపట్టించుకుని, సర్వశక్తులూ ఒడ్డి ఉద్యమిస్తే, ప్రతిపౌరుడూ తన వ్యక్తిగత జీవితాన్ని గడుపుతూ, అదనంగా ఉన్న శక్తి సామర్థ్యాలని ససంఘటితంగా, నిర్దిష్ట లక్ష్యాల కోసం కేటాయిస్తే మౌలిక సంస్కణలు సాధించటం చిటికెలో పని. భరతమాత ముద్దుబిడ్డల సుందర భవిష్యత్తు కోసం జరిగే ఈ ధర్మపోరాటంలో, ఈ రెండవ స్వతంత్ర పోరాటంలో విజయం తథ్యం.

"మోహరించిన సైన్యాలనైనా ఎదిరించవచ్చు కాని...
ముహూర్తం ఆసన్నమయిన భావాలను అడ్డుకోలేం"

* * *